RNI No. APTEL/2003/12253

# భావవీణ

సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Literary, Culture & Language Study

Vol : 17 Issue No. 1(1) Monthly January 2020 ISSN No. : 2456-4702 Rs. : 15/-

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC CARE - Journal
Arts & Humanities
Sl.No. : 35



## సావిత్రి భాయి ఫూలే




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

**Journal of Literary, Culture & Language Study**

(సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)



Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.



**Vol. 17 - Issue. 1(1) - January 2020 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



## EDITORIAL BOARD

*Chief Editor*

**PITTA SANTHI**

***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***

**C/o. Dr. Busi Venkataswamy**

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil
   (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Govt. Degree College, Puttur, Chittor Dist.

## ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# భారతీయ సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే

భారతదేశ తొలి మహిళా సంఘసంస్కారిణి సావిత్రిబాయి పూలే. సమాజంలోని కులతత్వం, పురుషాధిక్యత ధోరణులు కలిగిన చాలామంది పండిత మేధావులందరికీ కూడా సావిత్రిబాయి కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసు. కాని సావిత్రిబాయి ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం శ్రమించిన నాయకి, గొప్ప రచయిత్రి. మంచి వక్త, కులం, పితృస్వామ్యంపై కలం యుద్ధం నడిపిన కవయిత్రి.

1831 జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా నమ్‌గాంవ్‌లో సావిత్రిబాయి జన్మించింది. తొమ్మిదేండ్ల వయస్సులో జ్యోతీరావుపూలేను వివాహమాడింది. నిరక్షరాస్యురాలిగా ఉన్న సావిత్రిబాయికి భర్త జ్యోతీరావు పూలే మొదటి గురువు. విద్యాజ్ఞానం నేర్పి సామాజికోపాధ్యాయిరాలిగా తీర్చిదిద్దారు. 1847 నాటికి భర్తతో కలిసి శూద్రకులాల బాలికల కోసం పూనేలో మొదటి పాఠశాల ప్రారంభించారు. ఈ పాఠశాల నడిపే సమయంలో సమాజంలోని అనేకమంది నుండి వేధింపులకు, భౌతికదాడులకు గురయ్యింది. ఎన్ని చీత్కారాలు కలిగినా ఎప్పుడూ వెనుకడుగేయలేదు. ఎవరైనా అడిగితే 'నా విధిని నేను నిర్వహిస్తున్నాను' అని చెప్పేది. పట్టువదలక వారు సాగించిన విద్యా ఉద్యమానికి తక్కువ కాలంలోనే సహకారం గుర్తింపు లభించాయి.

పిల్లల్ని కనాలనే కోరికని త్యజించి ప్రపంచమే ఇల్లుగా చేసుకొని అనాథల్ని, అక్రమ సంతానంగా పుట్టి రోడ్లపాలైన బిడ్డల్ని తన బిడ్డలుగా చేసుకొంది. నాటి సామాజికోద్యమాలలో నాయకత్వం స్థానాల్లో నిలిచిన ఏకైక మహిళ సావిత్రిబాయి. 19వ శతాబ్దంలో కులవ్యతిరేక ఉద్యమాల్లో స్త్రీ హక్కుల పోరాటంలో సావిత్రిబాయి నిర్వహించిన పాత్ర మరువలేనిది. 1873లోనే సత్యశోధక్ సమాజ మహిళా విభాగం పేరిట కులాంతర వివాహాలు అనేకం జరిపించారు.

సావిత్రిబాయి ప్రపంచ చరిత్రలోనే భర్తతోపాటు ఉద్యమ జీవితంలో నడచిన ఆదర్శ సహచారిని ఆమె నిలిచిపోయారు. తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి విద్యాబోధనకు, బాలికలకు అంకితమైంది. స్త్రీ పురుషులు కులమతాలకతీతంగా విద్యనభ్యసించడం సహజమైన హక్కు అని, అందుకే అందరూ చదవాలి.. సమానంగా బ్రతకాలి.. అని ఆమె అనునిత్యం తపించిన సామాజిక విప్లవమూర్తి సావిత్రీబాయి. అందుకే ఆమె జన్మదినాన్ని ప్రపంచ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటూ ఆమెను గౌరవించడం మమల్ని మనం గౌరవించుకున్నట్లే. ఈ సందర్భంగా భావవీణ సాహితీ మాసపత్రిక మహిళా ఉపాధ్యాయురాళ్ళకు శుభాకాంక్షలు తెలియజేస్తుంది.

\- సంపాదకవర్గం

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | కాళోజి యుద్ధ కవిత్వం | - అగపాటి రాజకుమార్ | 6 |
| 2. | దేవరాజు మహారాజు "మనిషి కథలు" విశ్లేషణ | - ధీరావత్ లక్ష్మణ్ | 8 |
| 3. | అన్నాబాపూసాఠే కథలు - దళిత జీవితం | - డా॥ ఏటూరు జ్యోతి | 10 |
| 4. | సామాజిక చైతన్యపాటలు - బతుకమ్మ పాటలు | - డా॥ బి.ఉపేంద్ర | 15 |
| 5. | ఎమ్వీయల్ నవలలు - ఒక పరిచయం | - డాక్టర్ చాట్ల కిశోర్ | 18 |
| 6. | సినారె కవిత్వ వీక్షణం | - డాక్టర్ చవ్వా వెంకటరెడ్డి | 24 |
| 7. | ధూర్జటి కవితా దృక్పథం | - డాక్టర్ ఇ.వాసు | 28 |
| 8. | అసమర్థుడు | - డాక్టర్ జి. వెంకటరమణ | 31 |
| 9. | ఆవిష్కరణ పరిధిలో సృజన, పరిశోధన, విమర్శ! | - డా॥పి.ఎ.సత్యనారాయణ | 40 |
| 10. | మనుచరిత్రము సామాజిక స్పృహ - చారిత్రక నైపథ్యము | - జె. శ్యామలాదేవి | 43 |
| 11. | అంతులేని వ్యథలెన్నో 'అబలా' కవిత్వంలో | - డా॥ వి. శివనాగార్జున రెడ్డి | 47 |
| 12. | జీవనానుభూతుల కలబోత - అంతరంగ తరంగాలు | - డాక్టర్ వై. శ్రీలత | 50 |
| 13. | జానపద సాహిత్యంలో స్త్రీ | - దుండె రాజేశ్వరి | 53 |
| 14. | వట్టికోట జైలు లోపల కథలు - ప్రజా రాజకీయాలు | - కల్లెబోయిన కుమారస్వామి | 56 |
| 15. | ఆదూరి సత్యవతీ దేవి కవిత్వంలోని మధుర భక్తి | - మార్కాపురపు నిర్మల కుమారి | 60 |
| 16. | రాయలసీమ ఆధునిక కావ్యాలు - పరిశీలన | - ఎమ్. రంగస్వామి & డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి | 61 |
| 17. | అడిగోపుల వెంకట రత్నం వచన కవిత్వం - మిథోపాయిల చిత్రణ | - ఎన్. వి. పద్మకుమారి | 69 |
| 18. | అన్నమయ్య సంకీర్తనలు - సమకాలీన సమాజం | - డా॥. ఎస్. యజ్ఞశేఖర్ | 73 |
| 19. | 19 వ శతాబ్ది తెలంగాణాలోని సాంఘిక సాంస్కృతిక పరిస్థితులు | - డా॥. జి. కిషన్ ప్రసాద్ | 77 |
| 20. | 'స్త్రీ' విద్యను కాంక్షించిన నవయుగ కవిచక్రవర్తి జాషువ | - డా॥ సంగుల సునీల్ కుమార్ | 81 |
| 21. | కవిత్వంలో జీవిత విలువలు | - కె. వెంకట రమణ | 84 |
| 22. | గాంధీమార్గం - ఖద్దరు ధారణ | - డా॥. వై.వి.సిహెచ్. లీల పద్మజ | 88 |
| 23. | జానపద కళలు - మాతంగి సాంప్రదాయం | - పి. ఉషారాణి | 92 |
| 24. | సాంస్కృతిక వైతాళికుడు - కందుకూరి | - ఆచార్య ఎం. రామనాథంనాయుడు | 95 |
| 25. | విశ్వనాథ నవలల్లో 'యోగం - సామాజిక స్పృహ' | - ఆతుకూరి వేంకటేశ్వర్లు (యోగి) | 100 |
| 26. | ఆంధ్రమహాభారతంలో ధర్మవ్యాధుని ధర్మోపదేశం | - డా॥ నూనావత్ రాంబాబు & డా॥ లింగాల మంగమ్మ | 102 |
| 27. | నేను తోలు మల్లయ్య కొడుకుని కథ ... ఒక పరిశీలన | - నోముల రాజు | 109 |
| 28. | చిత్తూరు జిల్లా కథా సాహిత్యం - పీడిత కులదోపిడి | - యం. రాజేష్‌బాబు | 114 |
| 29. | తెలంగాణ దళిత జనబాంధవుడు - భాగ్యరెడ్డి వర్మ | - మరపతి మాంతయ్య | 118 |

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# కాళోజి యుద్ధ కవిత్వం

- ఆగపాటి రాజకుమార్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

అన్యాయమే అధికారమైతే ప్రశ్నించే గొంతుదే గొడవ. ఆధిపత్యమే నిర్బంధమైతే ఎదరించే కలానిదే తిరుగుబాటు. ధిక్కారమే ఉద్యమమైనప్పుడు ప్రతిధ్వనించే నినాధమే కాళోజీ ఫిరంగి, లాంటి మాటలు నిప్పు కణికల లాంటి కవితలతో కవిత్వాన్ని కాలాతీతం చేసిన అక్షరనది కాళన్న చివరి శ్వాస వరకు జనం కోసమే ఉద్యమించిన కవిసింహం కాళోజీ అసలు పేరు రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరావ రాంరాజా కాళోజీ. 1914 సెప్టెంబర్ 9న కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా రట్టెహళిలో రంగారావు - రమబాయి దంపతులకు రెండవ సంతానంగా జన్మించాడు. కాళన్న పుట్టిన తర్వాత ఆయన కుటుంబం వరంగల్ జిల్లా మడికొండకు వలస వచ్చింది. ప్రాథమిక విద్య తర్వాత హైదరాబాద్ పాతబస్తీ చౌమహల్లా స్కూల్లో కొన్ని రోజులు చదివి హనుమకొండ కాలేజియేట్ హైస్కూల్లో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. 1939లో హైకోర్టు అనుబంధ లా-కళాశాల నుండి న్యాయశాస్త్రంలో పట్టా పొందాడు. 1940లో రుక్మిణి బాయిని పెళ్లి చేసుకున్నాడు. పోరుగల్లు ఓరుగల్లులో ప్రజల పక్షాన నిలబడి కాళోజీ ఎన్నో పోరాటాలు చేశాడు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఉండాలని కాళన్న కోరుకున్నాడు. అందుకే 1939 నుంచే గ్రంథాలయోద్యమంలో పాల్గొన్నాడు. ఆర్యసమాజ్ వందేమాతరం ఉద్యమం, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆంధ్ర మహాసభ కార్యకలాపాల్లో కీలకంగా పనిచేశాడు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, జమలపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణరావు, పి.వి.నరసింహారావులతో కలిసి కాళోజీ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. నిజాం నిరంకుశత్వాన్ని ఎదురించి విద్యార్థిగా ఉన్నప్పుడే వరంగల్‌లో గణేష్ ఉత్సవాలు నిర్వహించాడు.

తెలంగాణలో అక్షరజ్యోతిని స్థాపింపచేయాలనే తపనతో ఆంధ్రసారస్వత పరిషత్ స్థాపనలో ముఖ్యపాత్ర పోషించాడు. తెలంగాణ గోసను ప్రత్యక్షంగా చూసి కన్నీరు పెట్టిన కాళోజీ ఆ దుఃఖాన్ని అక్షరాల్లో నింపాడు. అన్యాయాన్ని ఎదురించటమే తన జీవిత ఆదర్శంగా ప్రకటించడమే కాదు 7 దశాబ్దాలకు పైగా ఆచరించి చూపించాడు కాళోజీ.

కాళోజీ సామాన్యుడు, కాళోజీ మాన్యుడు, కాళోజీ మానవుడు, కాళోజీ ప్రపంచ మానవుడు. తన తెలంగాణ ప్రాంత ప్రజల కోసమే కాదు దేశ ప్రజల స్వాతంత్రం కోసం పోరాడి జైలు శిక్షననుభవించిన సమరయోధుడు. ప్రపంచంలో ఏ ప్రాంతంలోని ప్రజల ప్రజాస్వామిక హక్కులక భంగం కలిగినా ధిక్కరిస్తూ వారు చేసిన పోరాటానికి మద్దతు పలికిన మానవతావాది అని ఆయన రాసిన బంగ్లాదేశ్ కవితల నిరూపిస్తాయి.

1948లో భారతదేశాన్నుంచి పాకిస్తాన్ వేరుపడ్డప్పుడు బంగ్లాదేశ్, తూర్పు పాకిస్తాన్‌గా పిలువబడింది. రాజ్యం, రాజ్యాధికారం పశ్చిమ పాకిస్తాన్ చేతిలోనే వుండేది. వారి పెత్తనాన్ని సహించలేక స్వేచ్ఛను కోరుతూ తూర్పు పాకిస్తాన్ ప్రజలు తిరుగుబాటు చేశారు. పాకిస్తాన్ ఆ తిరుగుబాటును అణచివేయడానికి వికృత చర్యలకు పాల్పడుతుంది. అమెరికా దానికి మద్దతు తెల్పడమే గాక సైనిక సహాయాన్నందిస్తుంది. 90లక్షల మంది తూర్పు పాకిస్తాన్ ముస్లిం జనాభా భారతదేశంలోకి శరణార్థులుగా వచ్చి తలదాచుకుంటారు.

తూర్పు పాకిస్తాన్ ప్రజలు (బంగ్లా ప్రజలు) చేసిన ఆ తిరుగుబాటుకు నాయకత్వం వహించింది. "షేక్ మజీబ్ రహమాన్" బంగ్లాదేశ్ ప్రజలంతా మజీబ్ నాయకత్వాన్ని సమర్థించడమే కాక అత్యధిక ఓట్లతో ఆయనను గెలిపించారు.

దేశభక్తిని జీర్ణించుకన్న కాళోజీ భారతదేశం తూర్పు పాకిస్తాన్ ప్రజలకిస్తున్న మద్దతును సమర్థించారు. బంగ్లాదేశ్ ఆవిర్భావానికి ముందు ప్రజాపోరాటానికి జేజేలు ఈ సమయంలోనే బంగ్లాదేశ్‌పై కాళోజీ కవితలు రాశారు. "బంగ్లా తిరుగుబాటు" అనే కవితలో ప్రపంచంలోని ఏ

దేశంలోనైనా ప్రజలు హింసకు గురి అయితే వారిని ఆదుకోవడం అన్ని దేశాల బాధ్యత అని ప్రపంచ దేశాలకు తమ కర్తవ్యం ఏమిటో తెలియజెప్పాడు.

సైన్యాలు ప్రజల బట్టి సంహారం చేస్తుంటే ఏమైతది?
హిరణ్యకశిపుడు కొడుకును హంసకు గురిచేస్తుంటే ఏమైతది?
పశ్చిమ పాకిస్థానము బంగ్లాన దోస్తుంటే ఏమైతది?
బంగ్లా బంధువు మజీబు బందీ
ఓట్ల జయాన్ని కాదని షాట్ల ప్రయోగం చేస్తే ఏమైతది?
అధికృత హింసాకాండకు హద్దు పద్దు లేకుంటే ఏమైతది?
పాలనాధికారమంతా పీడనాధికారమైతే ఏమైతది?
ప్రజారణ పొందే ప్రభుత్వ బంధూకులు చేబడితే ఏమైతది?

అంటూ తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం బంగ్లాదేశ్ ప్రజల తిరుగుబాటును ''ఏమైతది'' అని ప్రశ్నిస్తూ సమర్థించారు.

ఆత్మబలము రగిలించి నిరుపేదల నెత్తురును
విశ్వాసపుటరణి పట్టి కసితో మసలగ జేయము
ఎగిరిడేగ తలను దన్న పిచ్చుకా గుండెను రేపుము

అని కాళోజీ ప్రజల పోరాట కాంక్షను జ్వలింపజేసే విధంగా ముగించారు. పిచ్చుకలనే బ్రహ్మాస్త్రాలు చేయాలనే సమర సందేశమిది.

''ఉగ్ర నరసింహవిను'' అనే కవితలో లోకంలో వివిధ ప్రాంతాలలో జరుగుతున్న దోపిడీ దౌర్జన్యాలను తుద ముట్టించడానికి మళ్ళీ దేవుడ ఉగ్రనరసింహుడై అవతరించి రావాలని పిలుపునిచ్చాడీ కవితలో.

ఉగ్ర నరసింహ విను
మరోసారి నా కోరిక
ఇది వరకే ఇచ్చుటనే
చెప్పితి కథ నా గొడవ
అభిప్రాయ బేధానికి
ఆస్కారము లేదనుట
ఏకీభవించనోని
పీకా నొక్కి పారవేయుట
అధికృత హింసాకాండతో
విర్రవీగు అధినేతల
ఏకీభవించనోని
పీకనొక్కు అతిశూరులు
ఆ ప్రళయ భీకరాకారము
చూపవయా మరోసారి
రా! నన పూనగ రా
ఉగ్ర నరసింహారా!

యాదగిరి లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ కవిత రాసినప్పటికి ఆనాటి బంగ్లాదేశ్ విముక్తి పోరాటాన్ని ఇందులో అద్భుతంగా చిత్రణ చేశారు. భూమిపై జరుగుతున్న దురాక్రమణలను, దోపిడిని అంతం చేయడానికి ఉగ్రనరసింహున్ని మళ్ళీ రమ్మని ఆహ్వానించారు. సామాన్య పౌరులపై జరుగుతున్న హింసాత్మక దాడులను చూసి తట్టుకోలేక కాళోజీ ఒక కంట అశ్రువులు కురిపిస్తూ మరోకంట అగ్నిని కురిపించాడు. ఏకంగా నరసింహస్వామిని ఆహ్వానించాడంటే అన్యాయం, ఆక్రమణ పట్ల ఎంత ఆవేదన చెందాడో అనడానికి ఈ కవితే ప్రతిరూపం.

'అన్ని సభ్యదేశాలే ఎన్నుకున్న తత్వాలే
భవ్య దివ్య స్వప్నాలే ప్రజొద్ధరణ లక్ష్యాలే
ద్యాసలో మాత్రం ఎప్పుడూ తత్వాతీత రహస్యం
ఎవరికి వారికి నిత్యం స్వార్థం స్వార్థం
సింహళములో గోల నణచగ సిద్ధము సహాయం
బంగ్లాదేశము రేపటి బయఫరా నిజం నిజం

అంటూ పాకిస్తాన్ దారుణంగా చేస్తున్న బంగ్లాదేశ్ దురాక్రమణను గూర్చి చర్చించక అదివాళ్ళ అంతరంగిక సమస్యంటూ ప్రపంచ సభ్యదేశాలు తప్పుకోజాడటాన్ని కాళోజీ తప్పుపట్టారు. మానవతా లేని ఆ వైఖరిని ఏహ్యంగా చూసాడు. ప్రపంచంలో ఎక్కడైన ప్రజలకు వారి హక్కులకు భంగం కలిగినా ప్రతిస్పందించిన కాళోజిని ప్రపంచ మానవుడు అని బంగ్లాదేశ్ కవితలు తెలియజేస్తాయి. హిపోక్రసిన గుర్తించడమే కాళోజీ తత్వం. సరైన సమయంలో ప్రభుత్వాలను హెచ్చరించడం అవసరం. అదే కాళోజీ నేర్పిన పాఠం.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# దేవరాజు మహారాజు "మనిషి కథలు" విశ్లేషణ

– ధీరావత్ లక్ష్మణ్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైద్రాబాద్ విశ్వవిద్యాలయం, హైద్రాబాద్, తెలంగాణ.

ప్రఖ్యాత కవి, కథా రచయిత, నాటక కర్త, హేతువాది, అనువాదకుడు అన్నిటినీ మించి పాపులర్ సైన్స్ రచయిత, కవిగా అర్థశతాబ్ది (1960-2010) పూర్తిచేసుకున్న నిత్యకృషీవలుడు డా॥దేవరాజు మహారాజు.

దేవరాజు మహారాజు 21 ఫిబ్రవరి 1951న వరంగల్లు జిల్లా కోడూరు గ్రామంలో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి 1975లో యం.యస్‌సి., 1979లో పిహెచ్.డి తీసుకొని, వృక్ష పరాన్నజీవులపై పరిశోధనలు చేస్తూ, చేయిస్తూ పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, పరిశోధక విద్యార్థులకు జువాలజి ప్రొఫెసర్‌గా ముప్పయేళ్ళు మార్గదర్శనం చేశారు.

సాహిత్యం, సమాజ చైతన్యం, అధ్యాపకత్వం, శాస్త్రీయ దృక్పథం ఇలా ఏ రంగంలో చూసినా బహుముఖ సృజనశీలి. విషయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పగలిగే ప్రతిభాశాలి. అధ్యాపక వృత్తిరీత్యా జీవశాస్త్రవేత్త, ప్రవృత్తి రీత్యా సాహిత్యవేత్త. రెండింటికి సమన్వయం చేసుకుంటూ శాస్త్రీయ దృక్పథాన్ని అక్షరాల్లో ఒంపి సమాజంలో ఆలోచనల్ని పంచుతున్న మానవతా సృజనకారుడు దేవరాజు మహారాజు. ఎప్పుడు ఫ్రెంచి గడ్డంతో విలక్షణంగా కనిపించడం ఈయన ప్రత్యేకత.

సామాజిక స్వరూపాన్ని శాస్త్రీయ దృక్పథంలో విశ్లేషించి తెలంగాణ మాండలిక జీవద్భాషతో కదం తొక్కిస్తూ, కవితా పద స్పందనల్ని మన ముందుంచిన బాధ్యతెరిగిన కవి, వాస్తవికతావాది.

"దేవరాజు మహారాజు కథా సంపుటి"లోని మనిషి కథలను విశ్లేషించడం ఈ వ్యాసరచన ఉద్దేశం.

విభిన్న ప్రక్రియలలో రచనలు చేసి సాహితీ స్వర్ణోత్సవం జరుపుకున్న దేవరాజు మహారాజు గారి రచనల్లో విభిన్నత రాజసంలా కనిపిస్తుంది. భిన్నమైన ఆలోచనలతో రచించిన కథల సంపుటే "మనిషి కథలు". మనిషిలోని భిన్న కోణాలను, ఆలోచనలను, సామాజిక సమస్యలను సరికొత్తరీతిలో అందించారు. సమస్యలతో పాటు దాన్ని చెప్పే క్రమంలో హాస్యాన్ని, వ్యంగ్యాన్ని జోడించారు.

మనిషి కథలు అన్నింటికి శతకపద్యానికి మకుటంలా ఓ ముగింపు వాక్యం వుంటుంది. "మనిషి దేనికోసమో అన్వేషిస్తూ, దేనికోసమో బతుకుతున్నాడు". అయితే ఈ మకుటానికి, ఆ మకుటానికి తేడా ఏమిటంటే, శతక మకుటము సంబోధన వరకే పరిమితం అయితే, ఇది కథకు ప్రతిపాదకంగా నిలుస్తుంది. మనిషి కథలన్నీ మానవ స్వభావాల చిత్రణలుగా రూపొందిన కథలు.

మనిషి కథలలో ఒక స్పష్టమైన ప్రత్యేకత కనిపిస్తుంది. శతక పద్యాలకు ఒక మకుటం వున్నట్లు, కథలను కూడా మకుటం లాంటి వాక్యంలో ముగించడం వీటిలో కనిపించే కొత్త గుణం. కథను కొంత వ్యంగ్యం, మరికొంత హాస్యం, ఇంకొంత కార్టూనిజం అన్నీ కలిపి వచన పాకాన్ని కథా మకుటంతో వడ్డించారు. ఈ కథల నాయకుడు ఎవరో ఒక పాత్రకాదు. సాధారణీకరించబడ్డ మనిషి. అందుకే మనిషి కథలు అని పేరు పెట్టారు.

మనిషి కథలుగా పేర్కొన్న కథలు గల్పికలు లాంటి రచనలు. కింగ్‌మేకర్, శుభోదయం, చర్వితచరణం, మార్నింగ్‌వాక్, లేతగడ్డి, కిస్సాకాపిక, తోసెయ్‌తోసెయ్, సయోధ్య రాముడేడి మొదలైన కథలు ఈ సంపుటిలో కలవు. "శుభోదయం" కథలో ఇల్లు ఒక అద్భుతమైతే, కిటికి పరమాద్భుతం, అది తెరిస్తే కన్ను తెరిచినట్టు ప్రపంచమంతా కళ్ళ ముందు సాక్షాత్కరిస్తుంది అంటారు. నిజమే! కిటికి రేపటి ఆశల్ని, సందేహాల్ని, సమస్యల్ని, ఆలోచనల్ని, ఆనందాన్ని మనసులో కలిగించేలా చేసే చిన్న ద్వారం లాంటిది. ఉదయం లేచింది మొదలు ఆఫీసుకు వెళ్ళేలోపు జరిగిన, మెదిలిన ఆలోచనలకు మేళవింపు ఈ కథ. ఇందులో బ్రష్ చేసుకోవడానికి బాత్‌రూమ్‌కి వెళ్లి, వాడుకుంటున్న నీళ్ళను చూసి ఎక్కడో వుండే నీళ్ళు మన అవసరాలకు పంపులోకి రావడం వంటి

సౌకర్యాల గురించి, కొడుకు రిమోట్‌తో టి.వి. ఆన్ చేయడం, రేడియోలో షహనాలు వింటూ అనుభూతిని కొలిచే సాధనం లేదనడం వంటి వాటి గురించి ఆసక్తికర అంశాలు క్లుప్తతలోనే విస్తృత సందేహాలను కలిగించి సమాధానమిస్తారు. ఇవి మనిషికి ఉపయోగపడుతున్న వైనాన్ని చెబుతూ, మనిషి కథల్లో ఎన్నో మలుపులు, విజయాలు అంటూ ముగిస్తారు.

"చర్విత‌చరణం" కథలో భార్యాభర్తల మధ్య ఉన్న అనుబంధాన్ని తెలియజేశారు. పెండ్లినాడు ఆ జంట గురించి పెద్దలన్న మాటలకు భర్తలోని మరో మనిషి బయటకు వస్తాడు. అది భార్యపై ఆధిపత్యం ప్రదర్శిస్తూనే ఉంది. ఆఫీసు మొదలు అన్నింటా బయటమాటలు, అవమానాలు, ఏమీచేయలేని భర్తలోని మరో మనిషి భార్యపై ప్రతాపం చూపిస్తారు. ఫలితం పెండ్లి నాడు "అమ్మాయి చక్కగా ఉంటుంది, చిదిమి దీపం పెట్టుకోవచ్చు" అన్న పెద్దల మాటలే నిజమౌతాయి. దీపమే మిగులుతుంది. ఈ చిరుకథలో భార్యాభర్తల మధ్య అనుబంధాన్ని చెబుతారు. ఎదుట మనిషిని అంటూ ఆనందించే మనుషులను చూపుతారు.

పర్యావరణాన్ని నాశనం చేసుకుంటే, భవిష్యత్తు ఎలా ఉంటుందో చూపుతారు "మార్నింగ్‌వాక్" కథలో. ఇది రేపటి కథ. విదేశాల నుంచి హైదరాబాదుకు వచ్చిన మనవడు తాత, బామ్మలతో మార్నింగ్‌వాక్ చేస్తుంటాడు. నాటిరోజులను తలచుకుంటూ, ట్యాంక్‌బండ్ మీద కూర్చొని, నీళ్ళలోకి చూస్తూ మాట్లాడుకునే వారి మాటలకు మనవడు ట్యాంక్‌బండ్ ఎక్కడ అని అంటాడు, కనిపిస్తున్న ప్లే గ్రౌండ్‌ను చూస్తూ. దాన్ని మేమే పూడ్చేశాములే. వినాయక విగ్రహాలు వేసివేసి, హుస్సేన్ సాగర్‌ను పూడ్చేసి, వినాయకసాగర్ చేశామని వ్యంగ్యంగా మాట్లాడిన, నేడు సరైన నిర్ణయం తీసుకోకపోతే భవిష్యత్తులో జరిగేది అదేనని సుతారంగా హెచ్చరిస్తారు ఈ కథలో. అంతేకాదు, మనవడు వాకింగ్ గ్రౌండ్స్‌లో సిటీ అపార్ట్‌మెంట్స్ కడితే, హాట్‌కేక్స్‌లా అమ్ముడుపోతాయి అంటూ తన ఐడియా కూడా చెబుతాడు. నేడు మనిషి వ్యాపార ధోరణి కొంతైనా వదిలి, పర్యావరణం, కుటుంబం, సామాజిక భద్రత, బాధ్యతల గురించి ఆలోచిస్తే, రేపటి తరంలో పర్యావరణ పరంగా, పిల్లల పరంగా మంచి చేసినవారమౌతామని చిన్న హెచ్చరిక చేస్తారు.

"లేతగడ్డి" కథలో పెద్ద తలకాయను చూసి, చిన్న తలకాయ గడ్డి కరవడం మొదలుపెడుతుంది. అంటే మనిషి ఎప్పుడూ దేనినో అనుకరిస్తూనే ఉన్నాడన్న సామాజిక వాస్తవాన్ని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో పరిశోధకుల నుండి పరీక్షలు రాసే విద్యార్థుల దాకా కాపీలు కొట్టడం మామూలైపోయింది. విద్యా విధానం కుళ్లిపోతూ, వస్తున్న మార్పులను వివరించే కథ "కిస్సా కాపిక". సంక్షోభం నుంచి సంక్షోభానికి సాగుతున్న రష్యా ప్రస్థానంలో అక్కడి ప్రభుత్వం కుప్పకూలిన నేపథ్యం లోంచి రాసిన కథ "తోసెయ్‌తోసెయ్".

"దేవుడి పేరు మీద ఒకరినొకరు పొడుచుకోవడం కొనసాగింది. శివాలయం కూలి మసీదైంది. మసీదు కూలి రామాలయమైంది. కరసేవలు, పాదసేవలు, అర్చనలు, భజనలు, ప్రేయర్లు, గుళ్ళో లేని దేవుడ్ని నిలబెట్టడానికి లక్షన్నర ఉపాయాలు! మనిషి తనను తానే కూలకొట్టుగొనే యత్నాలు!" అంటూ భారతదేశం తలవంచుకునే విధంగా 1992 డిశంబర్ 6 నాటి సంఘటన నుండి "సయోధ్య రాముడేడి" అనే కథకు రూపకల్పన చేశారు దేవరాజు మహారాజు. ఇలా సమకాలీన సమస్యలకు స్పందించిన తీరు మనిషి కథలులో స్పష్టంగా కనిపిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. దేవరాజు మహారాజు, "ఆవరణం", జీవన ప్రచురణలు, హైదరాబాద్, 2011.
2. దేవరాజు మహారాజు, "దేవరాజు మహారాజు కథలు",జీవన ప్రచురణలు, హైదరాబాద్, 1992.
3. విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, 03, ఏప్రిల్, 2016.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# అన్నాభాఊసాఠే కథలు - దళిత జీవితం

- డా॥ ఏటూరు జ్యోతి, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

మరాఠీ సాహిత్యంలో అగ్రశ్రేణి సాహితీవేత్తగా, అట్టడుగు వర్గాల నుంచి వచ్చి జీవితంలోని ప్రతిబంధకాలను ఎదురించి తట్టుకొని ఎదురీదిన గొప్ప కళాసాహితీ, సాంస్కృతిక, రాజనీతి యోధుడు అన్నా భావు సాఠే కవిగా, రచయితగా, నాటకకర్తగా నటుడిగా, విమర్శకుడిగా వీరిది మరాఠీ దళిత సాహిత్యంలో ప్రత్యేక ముద్ర.

అగ్నిదివ్య, ఆల్‌గారాజ్, అహంకార్,అగ్ని, కురేప్, గులాం, చందన్, తారా, ఫకీర్, సీతాకోకచిలుక, మంగళా, మయూరా, మాస్తర్, మూర్తీ, రూపా మొదలగు నవలలు, అమృత, ఆభీ, కుల్‌వాజీ, నవతి, ఘరీరట, లాడీ, ప్రాతినిధ్యం కథ, బానామతి, స్వప్న సుందరి రాక్‌వేలి రామ- రావణయుద్ధం లాంటి ప్రముఖ కథాసాహిత్యాన్ని సృష్టించాడు. అన్నాభావ్ సుమారు 16 నాటకాలు వీధి ప్రదర్శనలు, నృత్యరూపకాలు రచించారు. అకలే చీగోష్టి 1945, దేశభక్తి ఘోటాలా, చట్టవిరుద్ధం, నాముంబాయి ఎవరిది? మేక ఊరేగింపు, క్షేమదుస్థితి, నాయకుడు దొరికిండు, లోకమంత్రుల పర్యటన, క్రొత్త తమాషా, ఎన్నికల ఘోరాలా, మొదలగునవి పోవడా (ఒగ్గుకథ), లావ్‌నీ (జానపద నృత్యకళ, చక్కడ్‌లు ముఖ్యమైనవి. అన్నాభావ్ అంతర్జాతీయ దృక్పథం, దేశీయ సామాజిక, ఆర్థిఖ, సాంస్కృతిక, రాజకీయ దృక్పథం, తెలుస్తుంది. 1942లో స్టాలిన్‌గ్రాడ్ ఒగ్గుకథ రెండవప్రపంచ యుద్ధంలో రష్యా వీరోచిత పాత్రను వర్ణించి శ్రోతలను ఉత్తేజపరిచేది. మహారాష్ట్ర పరంపర, నల్లబజారు ఒగ్గుకథ, అమరవీరుల గాథానృత్యరూపాలు, తెలంగాణా సంగ్రామం (1947) ప్రసిద్ధి చెందినది. తెలంగాణ సాయుధ పోరాటం ఆవశ్యకతను వివరిస్తూ నాటి నైజాం రజాకార్ల అత్యాచారాలను, అణిచివేతలను వ్యతిరేకిస్తూ ప్రజలు నిర్వహించిన సాయుధ పోరాటాన్ని సమర్థించాడు కుల, వర్గరహిత, సమాజం కోసం విప్లవ పోరాటం వాటి త్యాగాన్ని గేయాలతో, సంభాషణలు, నృత్య ప్రదర్శన ద్వారా ఈ ఒగ్గు కథను ఆకాలంలోనే అన్నాభావు ముంబాయి వీధుల్లో, మహారాష్ట్ర అంతటా విస్తృతంగా ప్రచారం చేసాడు. తెలుగునాట నుండే కాక, ఇతర రాష్ట్రాల నుండి తెలంగాణ సాయుధ పోరాటం పట్ల ఉత్తేజితుడైనాడు.

అన్నాబావు కవితలలో ముఖ్యమైనవి ముంబాయి కథ, ముంబాయి లావ్‌నీ, ప్రకృతి దృశ్యాలపై రాసిన కవితలు. తూర్పు ఉదయించింది, రవి ఉదయించాడు, చీకటి జారుకున్నది. భాగ్యవంతుల వైభవం, జాగరణ కోసం, ప్రపంచ సంపద అంతా ముఖ్యమైనవి.

దళిత జీవితం దళిత సాహిత్యం గురించి అన్నాభావ్ సాఠే "ఈ జగత్తు పృథ్వి, శేషుని మస్తకం మీద కాకుండా దళితుని అరచేతిలో ఉంది. దళితుని జీవనం కష్టాల్ని కాచి వడబోసినట్లుంటుంది. మీరతని దగ్గరికి వెళ్ళి చూడండి, తరువాత రాయండి" అంటారు. దళితుని విషయమై రచన చేయాలంటే మొదటగా అతను నిబద్ధత కలవాడై ఉండాలి. దళిత జీవితాన్ని చిత్రించడానికి ఆప్రజలతో మమేకమై ఉండాలి. అని అంటారు.

"వల", కథ గ్రామాల్లో దళితుల వాస్తవిక జీవిత దృశ్యానికి దర్పణంగా పనిచేస్తుంది. గ్రామాల్లో అగ్రవర్ణాల దోపిడీ తీరును తెలుపుతుంది. సమాజంలోని అట్టడుగు వర్గాల వారైన దళితులకు అగ్రవర్ణ భూస్వాములు, వారి ఆర్థిక ప్రయోజనాల కోసం దళితులను ఉపయోగించుకున్న తీరు కనిపిస్తుంది. గ్రామీణ వ్యవస్థలో కుల వృత్తులు, ఆర్థిక, సామాజిక రాజకీయ సంబంధాలు మానవ సంబంధాలను ఎలాప్రభావితం చేస్తాయో తెలుపుతుంది ఈ కథ తరాలుగా అణిచివేతకు గురై, మౌనంగా అన్ని భరిస్తూ నిస్సహాయులుగా ఉన్న దళితులు తమ ఆత్మగౌరవం దెబ్బతినే సందర్భంలో ఎదురుతిరిగి అనాదిగా భరించే దౌర్జన్యాల నుండి విముక్తుడు కావాలనుకోవడం, దళితుల ఆత్మ చైతన్యాన్ని చెప్పినకథ ఈ కథలో దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధానం అగ్రవర్ణాలను దళితుల

జీవితం అంటే ఎంత చిన్న చూపుగా ఉంటుందో, దళితులు మనుషులే కారు అన్న భావనతో దళితులను ఏకాకులను చేసిన అగ్రవర్ణాల వారి ఆధిపత్యాన్ని మూకుమ్మడిగా దళితులు ఎదిరించిన తీరును ఈ కథలో చూస్తారు.

ఈ కథలో భూస్వాములను ఎదురించే విధంగా దళితులు ఏకమైన విధానాన్ని చిత్రించారు.

సామాజిక, సాంస్కృతిక ఆర్థిక విషయాలలో తీవ్ర అసమానతలు ఎదుర్కొంటున్న దళితుల జీవితాల్లో కొంత చైతన్యం నింపిన పరిస్థితులు కథలో కనిపిస్తాయి. మాదిగల వృత్తి, మాదిగలే చేయాలి అనే సంప్రదాయాన్ని శాసనంగా చేసింది గ్రామ రాజకీయం. చచ్చిపోయిన ఎద్దును తీసివేసే బాధ్యత అంతా మాదిగలదే, ఆ కట్టుబాటును ఎదిరిస్తే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి అని తెలిసినప్పటికి, ఆ గ్రామ పెద్ద మాదిగ హరీబా, గ్రామంలోని దళితులకు ప్రతినిధిగా ఉంటూ గ్రామంలోని ధనికవర్గ, అగ్రకుల దౌర్జన్యాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తారు. మాదిగ కులంలో వచ్చిన చైతన్యానికి మచ్చుతునకగా ఈ కథ కనిపిస్తుంది. దళిత ప్రజల్లో తెగింపు, గుండెధైర్యం కనిపిస్తుంది. ఏదీ ఏమైనా, తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటారు. గ్రామపెద్ద దేశ్‌ముఖ్‌గారి ఇంట్లో ఎద్దు చనిపోతే, ఆ ఎద్దును తీసివేయమని గట్టిగా వాదిస్తారు మాదిగల కులస్తులు ఎందుకు తీసివేయరు? నీచ జాతి వారికి ఇంత అహంకారమా? మాదిగగూడెంను మొత్తం నాశనం చేయాలని అనుకుంటారు గ్రామ పెద్దలు. కుక్కలు, పిల్లులూ, పక్షులూ, పశువులూ, మాలలూ, మాదిగలూ మనుషులే కారని వీళ్ళ భావన.

కథలో మాదిగ వాళ్ళకి పేర్లుండవు. ఉన్నా వారిని పేరుతో పిలువరూ? "ఏం మాదిగలూ? అని పిలువడమే గ్రామస్తులకు సాటి మనిషికి ఇచ్చే గౌరవం !

వ్యవసాయానికి ఎద్దులు ఉపయోగించినపుడు ఎవరికి ఫలితం ఇస్తాయో, ఎవరు వానిని పోషించుకుంటారో వారే, పశువు చనిపోయినపుడు కూడా ఆ పశువుల యజమానే చూసుకోవాలి. (ఫలితం అనుభవించేది ఒకరు అయితే) అని వాదిస్తాడు. మాదిగపెద్ద.

"చచ్చిన జంతువులను మోయడం కోసం మాదిగ వాడుగా పుట్టించాడు" అంటారు గ్రామస్థులు.

ఎంతవాదోపవాదనలు జరిగినా మాదిగలు మాత్రం దేశ్‌ముఖ్ ఇంట్లోని ఎద్దును తీసెయ్యం అని ఖండితంగా చెప్పేసి వెళ్ళిపోతారు.

మాదిగల్ని అంటుకోరు ఇతర కులస్థులు, ఎందుకంటే వారు అపవిత్రమైన పనులు చేస్తారని.

ఏ సమాజంలో అయినా మార్పు, చైతన్యం తప్పనిసరి. ఆ చైతన్యాన్ని పెంచుకున్న మాదిగలు ఇప్పటి నుండి ఆ అపవిత్రమైన పనులు చేయం అని తెగేసి చెప్పి వెళ్తారు.

మాదిగవారి నుండి వచ్చిన ఈ వ్యతిరేకతను గ్రామస్థులు జీర్ణించుకోలేరు. గ్రామస్థుల హక్కులను హరించినట్లుగా భావిస్తారు.

మాదిగ ప్రజలపై క్రూరమైన నిబంధనలతో, వారిని లొంగదీయాలని మాదిగలను అన్ని పనుల నుండి బహిష్కరిస్తారు. పొలాల్లోకి అడుగుపెట్ట నివ్వరు. ఊళ్ళోకి రానివ్వరు. దుకాణాలకు రానివ్వకుండా గ్రామస్థులంతా కలిసి దళితులను గ్రామబహిష్కరణ చేస్తారు.

అయినా దళితులు తమ నిర్ణయానికి కట్టుబడి పశువులను మోసుకెళ్ళే కాడిని, తాడిని తగులబెడ్తారు. ఆ రోజు నుండి చచ్చిన పశువులను తీయొద్దని గట్టిగా నిర్ణయించుకుంటారు. గ్రామస్థులకు మాదిగలకు సంబంధాలు తెగిపోయాయి. ఎక్కడ అణగదొక్కాలి అని ఎదురు చూస్తున్నారు గ్రామస్థులు. దళితులు కూడా అంతే జాగ్రత్తగా పనులు చేసుకుంటుపోతున్నారు. మాదిగల మేకలు, గొర్రెలను, పశువులను దొరికిన వానిని దొరికినట్లుగా బందెల దొడ్డికి తోలుకుపోతున్నారు. గ్రామస్థులకు, మాదిగలకు సంఘర్షణ పెరుగుతుంది. గ్రామస్థులతో గ్రామంతో సంబంధం లేకపోయేసరికి మాదిగల బ్రతుకు రోజు రోజుకు భారంగా తయారవుతుంది. పశువులు ఆకలితో మాడిపోతున్నాయి.

ఇలాంటి సందర్భంలో కూడ మాదిగలు మొండి ధైర్యంతో ఇంట్లో ఉన్న మేకలు, పశువులూ, గొర్రెలు అమ్మి వేయాలని నిర్ణయించుకున్నారు.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


మాదిగ పెద్ద హరీబా తాలుకా ఆఫీసుకు బయలు దేరాడు. ఆ గ్రామస్థుల మీద ఫిర్యాదు చేయడానికి తొలుతా ఆఫీసుకెళ్ళాడు హరిబా. అక్కడ తమ వైపు వాదించే సమర్థవంతమైన వకీలు కోసం తిరుగుతాడు.

అనుకోకుండా వీరి గ్రామానికి చెందిన మోదుగాకు వ్యాపారులు మోదుగుల చుట్టు వేలం పాట జరుగు తుంది. ప్రభుత్వ గుమాస్తా పాట పాడుతున్నాడు. హరీబాకు మెరుపులాంటి ఆలోచన వచ్చింది. తను ఆ పాట పాడి 500 రూపాయలకు వేలం చేజిక్కించు కున్నాడు.

మాదిగలు సంతోషించారు. ఇంట్లోని పశువులను అమ్మాలన్న నిర్ణయానికి స్వస్తి చెప్పారు. మాదిగల పశు వులను మోదుగు చట్టు వద్ద మేపుతున్నారు. గ్రామస్థులు అంతకు ముందు మోదుగచెట్టు దగ్గరకు మాదిగలను రానిచ్చేవారు కాదు. మాదిగలకు ఏ ఆధారం లేకుండా చేద్దామనుకున్న గ్రామస్థులకు వేలం విషయం తెలిసి బాధపడ్డారు. ఆ చట్టువైపు గ్రామస్థులు పశువులు రాకుండా చూస్తున్నారు. వచ్చిన వానిని బందెలదొడ్డికి తరలిస్తున్నారు. పటేల్ గారి 12 పశువులు చట్టా దగ్గర మేయడానికి వచ్చాయి. పటేల్ పశువులని చూడగానే హరిబాకు సంతోషం కలిగింది. పశువులను బందెలదొడ్డికి పంపారు. పటేల్ ఆశ్చర్యపోతాడు. అనేక మంది గ్రామస్థులకు పశువులను బందెలదొడ్డికి పంపి డబ్బులు గుంజిన పటేల్‌కు ఏం చేయాలో అర్థం కాలేదు. ఎందుకిలా చేస్తున్నావు మన తగాదాలతో ప్రభుత్వం ట్రేజరీ నింపు తావా? అన్నాడు పటేల్. పటేల్, హరీబాకు మధ్య సంభా షణ జరిగింది. పటేల్ తన పశువులు బందెల దొడ్డిలో వుండడం అతనికి కష్టం అన్పించింది. పటేల్ మాట మార్చాడు గ్రామం, గూడెంలోని గ్రామస్తులు తల్లి బిడ్డల్లాగా వుండాలి అంటాడు. ఇప్పటి నుంచి కపటం లేకుండా సరళ స్వభావంతో వ్యవహరిస్తాం అంటాడు. అది విని హరీబా ఓ చల్లని నిట్టూర్పు విడిచాడు ఆని ట్టూర్పులో ఎన్నో అర్థాలు ...

పాత్రలన్నియు మనుష్యులకు సజీవ చిత్రాలు సంఘ టనలు, సంభాషణలు, సుఖదుఃఖాలు పాఠకుని మనస్సును కలత చెందిస్తాయి. గ్రామ జీవితంలోని అస్పృశ్యతా కోణాన్ని బలంగా చిత్రించారు. దళితులు తమ హక్కుల కోసం, కలిసి కట్టుగా ఎదిరిస్తూ, సాధించు కోవాలని, దళితుల జీవితాలు బాగుపడాలనే తపన, ఆవేదన, ఈ కథలో కనిపిస్తుంది. అంటరానివాడు, అధమ కులస్తుడు, చైతన్యవంతుడు కావడాన్ని ఎవరు సహిస్తారు? దళితుల్లో వచ్చిన ఆత్మగౌరవ చైతన్యంను గ్రామస్తులు, ఎట్లా తీసుకుంటారు? వారి ప్రతిఘటన ఎట్లా ఉంటుంది? అనేది ఈ కథలో చూడవచ్చు. కులవైరుధ్యం, ఆధిపత్య భావజాలంను ఎదుర్కోవాలంటే దళితులు ఒక వర్గం గానూ, సంఘటిత శక్తిగానూ మారి పోరాట దృక్పథంతో ముందుకు నడవాలని చెప్పే కథ. విభిన్న వర్గాల పాత్రల మనస్తత్వానికీ, సమకాలీన సామాజిక భావ జాలానికీ ఉన్న సంబంధం చూస్తాం.

పోరాటం, తిరుగుబాటు నిరాకరణ ఈ మూడు స్థాయిలలో సాహిత్యేతరమైన ఉద్యమాలు పుట్టాయి. అంబేద్కర్ నాయకత్వాన అంటరానివాళ్ళకు సమాజంలో సమానత్వం కోసం జరిగిన పోరాటం ఇటువైపు సాహిత్యంలో దళిత సాహిత్యంగా ప్రతిస్పందించింది. ఈ దళిత సాహిత్య ఉద్యమం సాంఘిక పోరాటం నుంచి రావడం వల్ల అందులో అంతర్గత వైరుధ్యాలన్నీ కనపడ తాయి.

పాలకవర్గం, అధికారవర్గం, రాజ్యం దళితుల జీవితా లను చిన్నాభిన్నం చేస్తాయి. దళితుల జీవితాల్లో ధిక్కార స్వరం ఉండకూడదు. అధికార స్వరం వినిపించకూడదు.

సాతే, దళితుల్లో ఆత్మవిశ్వాసాన్ని, తిరగబడే చైతన్యాన్ని, పోరాట స్పృహను తమ రచనల్లో పలికించారు.

## స్మశానంలో బంగారం :

కథలో "భీమ" ప్రధాననాయకుడు. కథానాయకుడు. మిగతా పాత్రలన్ని పోషక పాత్రలే. 'భీమ' దళిత జీవితానికి ప్రతీకగా, ప్రాతినిధ్య పాత్రగా కనిపిస్తాడు ఈ కథలో.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కష్టించి పనిచేసే సామర్థ్యం ఉన్న 'భీమ' పనులు లేక సొంత గ్రామాన్ని వదిలిపోతాడు. ముంబాయిలో పొట్టకూటి కోసం పనికోసం కోటి ఆశలతో బయలు దేరుతాడు. మంచి పని దొరుకుతుంది. భార్యను బాగా చూసుకోవచ్చు అని కలలుకంటాడు. ఆ కలలు నెరవేర లేదు. బొంబాయి మహానగరంలో పనిదొరకలేదు నగరం వదిలి అడవికి వస్తాడు. అక్కడ క్వారీలో పనిదొరుకు తుంది. సంతృప్తితో జీవిస్తాడు భీమా కష్టానికి తగిన ఫలితం లభిస్తుంది. కొద్ది రోజుల తర్వాత గని మూతపడింది. భీమాలో మళ్ళీ నిరాశా, నిస్పృహలు ఆవరించాయి. తనపై ఆధారపడిన భార్యా, పిల్లలు మదిలో మెదిలే సరికి జీవితం నిస్సారంగా అనిపించింది. ఏదో ఒక పని చేయా లని ఆలోచించాడు. భీమా జీవితంలో సంఘర్షణ మొద లయ్యింది. సంఘర్షణ, సంక్లిష్టత, నిరాశ భీమా జీవితాన్ని నిస్తేజంగా మార్చింది. ఇలా ఆలోచిస్తూ భీమా పనికి వేసుకెళ్ళిన బట్టల్ని వదిలేసి చెరువులో స్నానం చేసి ఇంటిదారి పట్టాడు. చెరువు గట్టు వెంబడి నడుస్తూ వుంటే పక్కనే ఉన్న బూడిద కుప్పవైపు దృష్టి మరల్చాడు. అంతే ఆ బూడిదకుప్ప ఛితాభస్మంలో తళుక్కుమన్న మెరుపు కనిపించింది. బూడిద తొలిగించి చూశాడు. తులం బంగారం, భీమా మనస్సు ఆనందంతో ఉప్పొంగి పోయింది. తన జీవితానికి ఒక మార్గం దొరికిందని ఆనందపడ్డాడు.

కాని ఆ ఆనందంలో జీవితాన్ని ఇంకా కష్టాలపాలు చేసుకుంటున్నాడు. రాత్రంతా శవాల బూడిద కుప్పలు వెతికి వెతికి బంగారపు రేణువులు దొరికించుకోవడం, వాటిని వెదకడం కష్టసాధ్యమే. కాని అదే తన జీవితానికి ఆలంభనగా ఆ రోజు నుంచి నిర్భయంగా శవాల కుప్ప లను జల్లెడ పట్టి బంగారాన్ని వెతుకుతాడు. అతని జీవితం కాలిపోతున్న శవాల బూడిదకుప్పలు తడి ఆరని సమాధు లను పెకిలించడమే. దానితో చావుకు, పుట్టుకకు తేడా కనిపించట్లేదు. చనిపోయే వాళ్ళంతా డబ్బున్నవాళ్ళు అయితే, ధనవంతులే కావాలి అని, పేదవాళ్ళు పుట్టడం, మరణించడం అనవసరం అనుకున్నాడు. బతుకడానికి ఆధారం లేకపోవడం అతనిని కోపిష్టిగా మారుస్తుంది. రాత్రి, పగలు మండుతున్న చితులే అతని జీవితానికి ఆధారం. ఇట్లా భీమా జీవితంలో అనేక మార్పులు రాసాగాయి.

ఒకరోజు నదికి వరదలు వచ్చిన సమయంలో ఒక స్త్రీ శవం స్మశానంలో నుండి నదిలోకి కొట్టుకువచ్చింది. దీనితో స్మశానంలో శవాలను తవ్వితీస్తున్నారని సందేహంతో పోలీసులు విచారణ ప్రారంభిస్తారు.

భీమా భార్య నర్మద భర్తను ప్రాధేయపడుతుంది. శ్మశానానికి వెళ్ళవద్దని అంటుంది. జనానికంతా తెలిసి పోయిందని బతిమాలుతుంది. అపుడు భీమ సమాజంపై చిరాకుపడతాడు. నా కడుపు మండినపుడు మాట్లాడని సమాజం, ఇప్పుడు మాట్లాడితే పట్టించుకోను అంటాడు. ముంబాయి పని ఇవ్వలేదు. రాళ్ళు పగలగొడితే 2 రూపా యలే వచ్చాయి. కానీ ఇప్పుడు బూడిద తేలికగా 10 రూపాయలిస్తోంది''. అని సంతృప్తి పడతాడు.

చాలా రోజుల నుండి భార్య కోరిక తీర్చాలని భీమ ఒక చీర, రవికె తేవాలని కోరికగా ఉన్నాడు. తన కోరిక తీరే సమయం అసన్నమయిందని సంబరపడ్డాడు.

ఆ రోజు రాత్రి భీమా చాలా ఉత్సాహంగా బయలు దేరాడు. ఆ రోజు ధనవంతుడైన షావుకారు మరణం భీమకు సంతోషాన్ని కలిగించింది. స్మశానంలో అడుగు పెట్టాడు. ఆకాశంలో మేఘాలు దట్టం అయ్యాయి. ఆకస్మాత్తుగా మెరుపులు, వానపడేట్లుంది. గాలి వేగంగా వీస్తుంది. అర్థరాత్రి వరకు స్మశాన మంతా వెతుకు తున్నాడు. వాతావరణ స్థితి భయంకరంగా ఉంది. ఆ సమయంలో ఎవరో మట్టిని తవ్వుతున్న శబ్దం వినిపిం చింది. దాంతో భీమ నిలువెల్లా వణికిపోయాడు. ఆ ధీరుడ్ని మొదటిసారి భయం ఆవహించింది. మళ్ళీ ధైర్యంతో ముందుకు సాగాడు. తన కంటే ముందే తోడేళ్ళ గుంపు సమాధిని తవ్వి తీస్తున్నాయి. భీమా కోపంతో ఊగిపోయాడు. తన హక్కు ఎవరో హరించివేస్తున్నట్లు భావించాడు. వానితో తలపడ్డాడు. తోడేళ్ళ గుంపంతా భీమాపై దాడికి దిగాయి. చచ్చిన శవం కోసం జంతువు

లకు, మనిషికి మధ్య జరుగుతున్న జీవిత సంఘర్షణ, బతుకు సంఘర్షణ, ఆకలి సంఘర్షణ స్మశానంలో బంగారం కోసం భీమ, మృతదేహం కోసం తోడేళ్ళు మధ్య ఘర్షణ జరుగుతుంది. తోడేళ్ళను తరిమివేయడంతో పూర్తి శవాన్ని తీయగలిగాడు. శవం పిడికిలిలో బంగారు ఉంగరం, చెవుల కర్ణాభరిణిలు దొరికాయి. శవం నోటిలో బంగారం ఉంటుందని ఊహించాడు. శవం నోటిని, పళ్ళకు మధ్య గునపం గుచ్చి, చెయ్యితో శవం నోరంతా వెతికి ఒక ఉంగరం తీసుకుని జేబులో వేసుకున్నాడు. ఇంక ఏమైనా దొరుకుతాయని ఎడమ చేతి వేళ్ళతో నోరంతా గాలించి, నోటిలోంచి వేళ్ళు బయటకు తీయ కుండానే పళ్ళ మధ్య గుచ్చిన గునపం లాగేశాడు. శవం పళ్ళ మధ్య భీమ వేళ్ళు ఇరుక్కుపోయి భయంకర బాధను అనుభవిస్తుంటే తోడేళ్ళు మళ్ళీ వచ్చాయి. తోడేళ్ళ బారి నుండి తనను తాను కాపాడుకునే దశలో, తోడేళ్ళు అరుపులు విని గ్రామస్తులు వారిని తరమడానికి వస్తున్న శబ్దం విని భీమాకోపంతో శవం తలపై గునపం మీద బలమైన దెబ్బవేస్తాడు. శవం పళ్ళ నుండి తెగిపోయిన వేళ్ళు చర్మానికి వేలాడుతుండగా, ఆ బాధను అనుభవిస్తూ గ్రామస్తులకు చిక్కకుండా ఇంటికి చేరుకున్నాడు. భీమ రెండు వేళ్ళను తొలగించారు డాక్టరు. శారీరక బాధను అనుభవిస్తున్న భీమాకు పిడుగులాంటి వార్త చెవిన పడింది. క్వారీని మళ్ళీ తెరుస్తున్నారని రాళ్ళను పిండిచేసే తన రెండు వేళ్ళను స్మశనానికి అర్పించి భీమ కుమిలి కుమిలి ఏడవడంతో కథ ముగుస్తుంది. మళ్ళీ ఈ జీవిత ప్రయాణం ఎలా మొదలవుతుందో ....

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# సామాజిక చైతన్యపాటలు - బతుకమ్మ పాటలు

- డా॥ బి.ఉపేంద్ర, గెస్ట్ లెక్చరర్, తెలుగు విభాగం, ట్రిపుల్ ఐ.టి., ఇడుపులపాయ, కడప జిల్లా.

ఆదిమానవుడే పాటకు ఆద్యుడని చెప్పవచ్చు. అరణ్యాలలో నివసించిన ఆదిమానవుడు తనకు సంతోషం, దుఃఖం వంటి భావనలు కలిగినపుడు వెంటనే స్పందించి ఉంటాడు. ఆ స్పందన మాట రూపాన్ని దాటి పాటగా మారి ఉంటుంది. కాలాంతరంలో ఆ పాట ఎన్నో మార్పులు చేర్పులకు లోనై ఉంటుంది. నేడు పాటకు సంగీతం తోడయ్యింది. ఆదిమానవుల పాటలే కాల క్రమంలో జానపదపాటలుగా పరిణమించాయని ఖచ్చితంగా చెప్పవచ్చు.

జానపదులు పాటకు ఒక ప్రత్యేక స్థానాన్ని సృజించారు. నిద్రలేచింది మొదలు నిద్రపోయేవరకు ప్రతిసన్నివేశం, సంఘటనకు, పాటను సృజించారు. వారి పాటలు ఎదుటి వారి ఆనందాన్ని రెట్టింపు చేస్తాయి, దుఃఖాన్ని ఉపశమింపజేస్తాయి. ఈ పాట కాలక్రమంలో ప్రజల జన జీవితంలోకి ప్రవేశించింది. అది క్రమేణ సంస్కృతిలో భాగమైంది.

జానపదులు వ్యవసాయ పనుల్లో, ఇంటిపనుల్లో, ఆటపాటల్లో, వివాహాది శుభకార్యాల్లో, ఆందోళనల్లో, యుద్ధసమయాల్లో పాటప్రక్రియను విరివిగా వినియోగించుకున్నారు. ఈ పరంపర నేటికీ కొనసాగుతూనే ఉంది. ఈ పాటకు భావం ఉంది, భాగ్యం ఉంది. మానసికోల్లాసం కలిగించే చైతన్యసృజన బీజాలున్నాయి. అందువల్లే పాటకు ప్రజల జీవితాలకు విడదీయరాని సంబంధం ఏర్పడింది. ఈ పాట కొంతకాలం తర్వాత శిష్టరూపం కూడా సంతరించుకున్నది. అది ఆ తర్వాత సినిమా రంగంలోకి ప్రవేశించింది. ప్రతి సనిమా పాటల మూలంగానే విజయవంతమైందనుటలో అతిశయోక్తి లేదనవచ్చు. మావోయిస్టుల ఉద్యమం నేటికీ సజీవంగా ఉండడానికి ప్రధాన హేతువు పాటేనని చెప్పవచ్చు. అదేవిధంగా అన్ని ప్రజాఉద్యమాలు పాట ద్వారానే విజయవంతమవుతున్నాయి.

తెలంగాణ ప్రజలకు పాటకు అవినాభావ సంబంధం ఉందని రూఢిగా చెప్పవచ్చు. 'అచట పుట్టిన చిగురు కొమ్మైన చేవ' అన్నట్లు తెలంగాణ గడ్డపై పుట్టిన ప్రతి ఒక్కరూ పాటలు సృజిస్తారు, పాడతారు. ఈ క్రమంలో విరాజిల్లుతున్నవి బతుకమ్మ పాటలు.

బతుకమ్మ అనగానే... మట్టి, చెట్టు, పూలు, ఏరు, నీరు సమస్త ప్రకృతీ గుర్తుకొస్తుంది. కారణం బతుకమ్మ ప్రకృతి పండగ! బతుకమ్మనగానే... అన్న, చెల్లె, వదిన, అమ్మగారిల్లు, అత్తగారిల్లు సకల బంధాలు తలపున కొస్తాయి. కారణం, బతుకమ్మ అనుబంధాల పండగ!

బతుకమ్మ అనగానే... సాయుధ పోరాటం, నక్సల్బరీ ఉద్యమం, రైతాంగ పోరు, మలిదశ హోరు ఒకదాని వెనుక ఒకటి కవాతు సాగిస్తాయి. కారణం బతుకమ్మ ఆత్మాభిమానాల పండగ!

అభిమానం ఉన్నచోటే ఆవేశం ఉంటుంది. ఆవేశంలోంచే పాట పొంగుకొస్తుంది. ఆ పదం... ధూపం పెట్టినట్టు నలుదిక్కులకు పాకుతుంది. బాణం వదలినట్టు గుండెల్ని తాకుతుంది. మంత్రం వేసినట్టు మనసులు మారుస్తుంది. మార్పులు తెస్తుంది. ఆ ప్రభావం అపారం! జనం-చేతి సంకెళ్లు తెగిపోతాయి. జమీన్-చేతి సంకెళ్లు తెగిపోతాయి. జమీన్ - బక్కరైతుల్ని అక్కున చేర్చుకుంటుంది. జంగిల్ - విజయగర్వంతో విప్లవ గీతాలు అందుకుంటుంది. కాబట్టే, బతుకమ్మ పాటలకు వీర తెలంగాణ పోరాట గాథలూ ఇతివృత్తాలు అయ్యాయి.

నైజాము తాలూకా ఉయ్యాలో...
నల్లగొండ జిల్లా ఉయ్యాలో...
పేరుకు నకిరేకల్లు ఉయ్యాల్లో...
ఊళ్ళకే వచ్చెనే ఉయ్యాలో...
ఇసునూరు దొరవారు ఉయ్యాలో!
ఏ వాడకేనె ఉయ్యాలో!

దొరవచ్చెనే ఉయ్యాలో...
ఓయినీ సెంద్రమ్మ ఉయ్యాలో!

... ఇలా సాగిపోయే ఓ బతుకమ్మ పాట దొరతనపు దౌర్జన్యాన్ని గొంతెత్తి గర్జిస్తుంది. నల్గొండ జిల్లాలోని విసునూరు గ్రామానికి పెద్ద దొర ... రామచంద్రారెడ్డి. లక్ష ఎకరాల యజమాని. అప్పుల నెపంతో మిగిలిన భూమల్నీ లాక్కున్నాడు. ఆ దురాగతాలు అక్కడితో ఆగలేదు. బాలింతల పాటలతో, పాపాయిల ఆకలితో ఆడుకున్నాడు. పొలంలో పనికొచ్చిన పచ్చి బాలింత రాళ్ళను బిడ్డలకు చనుబాలివ్వడానికి కూడా అనుమతించ లేదు. దొప్పెలు తెప్పించి, వాటిలో పాలు పిండించి అవ మానించాడు. కూలీ మేస్త్రీ చంద్రమ్మ... దొరకు వంత పాడింది. తల్లులంతా గూడు చేరుకునే సరిగి పిల్లలు ఆకలితో ప్రాణాలు విడిచారు. అంతా కలసి చంద్రమ్మకు తగిన శాస్తి చేశారు. ఆ తల్లుల శాపాలూ వృథా కాలేదు. కొంతకాలానికి, దొరకతనమూ కూలిపోయింది. సామాన్యుల పోరాటం మాత్రం పాటగా... జనం గొంతుకల్లో బతికే ఉంది. ఉద్యమస్ఫూర్తిని బతికిస్తోంది.

జన్నారెడ్డి ప్రతాపరెడ్డి కూడా అంతే దుర్మార్గుడు. గుమాస్తాలు... సూరి, మల్లి దొర అరాచకాలకు వంతపాడే వాడు. చిలుపకుంట్ల గజ్జల నర్సయ్య సంఘంలో లీడరు. ధైర్యానికి మారుపేరు. ఆ వీరుడి ధిక్కార స్వరాన్ని సహించ లేకపోయాడు ప్రతాపరెడ్డి. అతన్ని తుదముట్టించాలను కున్నాడు. రజాకార్లనూ, పోలీసులనూ ఆశ్రయించాడు. ఆ సర్కారు తొత్తులు ప్రజలను నానాహింసలు పెట్ట సాగారు. దీంతో సంఘం సభ్యులు రంగంలోకి దిగారు. ప్రతాపరెడ్డి భూమిని జప్తు చేసుకున్నారు. గడీని కూల గొట్టారు. పొలంలో ఎర్రజెండాలు పాతారు. ఆ పోరాట గాథా ఓ బతుకమ్మ పైట...

రైతులందరిని ఉయ్యాలో...
రచ్చకీడ్చిరమ్మ ఉయ్యాలో!
కాలుకాలూ కట్టి ఉయ్యాలో...
కీలుకీలూ కొట్టిరి ఉయ్యాలో

... పోలీసుల కర్కశత్వాన్ని కళ్లకు కట్టింది. అంతిమంగా ప్రజలే గెలిచారు. పాట ఆ సంఘటనకు కూడా సాక్ష్య మైంది.

వాడి గడీనంత ఉయ్యాలో...
కూలగొట్టీరమ్మ ఉయ్యాలో
రామరామరామ ఉయ్యాలో...
శ్రీరామరామ ఉయ్యాలో

సూర్యనారాయణ కృష్ణాజిల్లాకు చెందిన కమ్యూనిస్టు నాయకుడు. 1937లో ఆంధ్రప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీని నిషేధించినప్పుడు... నాయకులంతా తెలంగాణ చేరుకున్నారు. తెలంగాణాలో నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆంధ్రమహాసభకు వీరి ప్రమేయంతోనే సంఘం అనే మారుపేరు వచ్చింది. ఆ సంఘం హైదరాబాద్ రాష్ట్రంలో దొరలు, పట్వారీలు, పటేళ్ళ దోపిడిని కుట్రలను ఎదుర్కొనేందుకు సిద్ధమైంది. ఆ కోపంతోనే, గొందిగూడం వద్ద సంఘం ప్రచార కార్యక్రమంలో ఉన్నప్పుడు... అవకాశం చూసుకుని, సూర్యనారాయణ మీద దాడి చేశారు. ఇతర కమ్యూనిస్టు నాయకుల ఉనికి చెప్పాలంటూ నిర్బంధించారు. అయినా సూర్యనారాయణ తొణకలేదు. తుపాకీ గురిపెట్టినా తలవంచలేదు. ఉద్యమ ఆకాంక్షల్ని నినదిస్తూనే... అమరుడయ్యాడు. ఆ త్యాగాల్ని స్మరిస్తూ... తెలుగు ప్రజలందరిని ఉయ్యాలో ఆత్మలో దలిచాడు ఉయ్యాలో మన సూర్యనారాయణ ఉయ్యాలో కన్నుమూసినాడు ఉయ్యాలో... అని కన్నీళ్లు పెట్టుకున్నారు జానపదులు.

ఎట్టి చాకల్దమ్మ ఉయ్యాలో
ఎత్తైన మనిషమ్మ ఉయ్యాలో
పెద్ద పైసంతైన ఉయ్యాలో
పెద్దా బొట్టును ఉయ్యాలో

అంటూ... చాకలి ఐలమ్మ ఉగ్రరూపాన్నీ, ఉద్యమాల తెగువనూ బతుకమ్మ పాట రూపంలో బతికించుకున్నారు. మల్లంపల్లి మఖ్తేదారు పొలాన్ని ఐలమ్మ కౌలు చేసుకునేది. చదువులేకపోతేనేం, చైతన్యం ఉన్న మనిషి ఆమె కాబట్టే.

సంఘం సమావేశాలకు హాజరయ్యేది. ఆమె భర్తా, ఇద్దరు కొడుకులూ సంఘం సభ్యులే. ఆ మంటతో దొరలు ఆమె పేరిట ఉన్న కౌలు భూమిని రాయించుకున్నారు. ఆ సమయంలో సంఘం ఐలమ్మకు అండగా ఉంది. దీంతో దొర మనుషులు ఐలమ్మ ఇంటిపై దాడి చేశారు. బీభత్సం సృష్టించారు. ఐలమ్మ బెదరలేదు. సంఘం సభ్యులకు ఆశ్రయమిచ్చింది. కలోగంజో ఆహారంగా సమకూర్చింది. అదీ లేనినాడు నాలుగు ఇళ్లలో అడిగితెచ్చి మరీ ఆకలి తీర్చింది. గూండాల దాడిలో భర్త చెయ్యి పడిపోయింది. అయినా గుండె నిబ్బరాన్ని కోల్పోలేదా తల్లి. ఆ సాయుధ యోధురాలికి బతుకమ్మ పాట... జేజేలు పలికింది.

మొత్తానికి నిజాం తలవంచాడు. భారత ప్రభుత్వానికి లొంగిపోయాడు. సాయుధ పోరాటాన్ని అణచివేయడానికి మిలిటరీ దళాలు రంగంలో దిగాయి. ఆసమయంలోనే కొందరు ముష్కరులు నక్క అండాలమ్మ అనే అమాయక మహిళపై లైంగిక దాడి చేశారు. ఆ కృత్యాన్ని జానపదులు తమదైన శైలిలో నిరసించారు.

పంద్రాగస్టనీ ఉయ్యాలో...
పండగొచ్చింది ఉయ్యాలో
స్వాతంత్ర్య దినమనీ ఉయ్యాలో...
సంతోషించె తాను ఉయ్యాలో
అన్నాలు కూరలు ఉయ్యాలో
ఆనందముగ ఒండి ఉయ్యాలో
తరువాత ఇంటిని ఉయ్యాలో...
పరుశుభ్రము చేసి ఉయ్యాలో...

..... అలా ఇంటి పనులన్నీ ముగించుకుని పేడ కోసం తూర్పు వైపునకు వెళ్లిన ఆ యువతి బతుకు... పశ్చిమాన సూర్యుడు కుండే సమాయనికి... చీకటి మయమై పోయింది. కోర్టుల్లో ఆమెకు న్యాయం జరగకపోతేనేం, జానపదులు మాత్రం... ఆ అన్యాయాన్ని ఎలుగెత్తారు. బాధను తామూ పంచుకున్నారు.

మలితరం తెలంగాణ పోరాటంలోనూ, ఆ తర్వాతా జనం లోంచి అనేక బతుకమ్మ పాటలు పుట్టుకొచ్చాయి. కొన్నయితే 'గ్లోబల్' తెలంగాణా ఆవిష్కరించాయి. ఇంగ్లండు బతుకమ్మ పాట అలాంటిదే..

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో
తెలంగాణాలో పుట్టింది ఉయ్యాలో
ఇంగ్లండుకొచ్చింది ఉయ్యాలో
తెల్లోళ్ల దేశంలో ఉయ్యాలో
తంగేడు పూలేని ఉయ్యాలో
గునుగు పూలు లేక ఉయ్యాలో
గౌరమ్మ కోసమే ఉయ్యాలో
తోటలేని పూలన్నీ ఉయ్యాలో
బతుకమ్మ పేర్చితిమి ఉయ్యాలో!

కులమత ప్రాంత వర్గ వర్ణలింగ స్థాయీ భేదం లేకుండా తెలంగాణలో ఆబాలగోపాలం ఆనందంగా తన్మయంగా పాడకునే సాంస్కృతిక పాటలు బతుకమ్మ పాటలు. ఈ పాటల్లో ఎంతో సామాజిక చైతన్యం ఉంది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. ఏపూరిసోమన్న పాటలు
2. గద్దర్ పాటలు
3. విమలక్క పాటలు
4. తెలంగాణ ఉద్యమ పాటలు
5. రసమయి బాలకిషన్ పాటలు
6. మధుప్రియ పాటలు
7. యూ ట్యూబ్‌లోని పాటలు
8. గోరటి ఎంకన్న పాటలు

# ఎమ్వీయల్ నవలలు - ఒక పరిచయం

- డాక్టర్ చొట్ల కిశోర్, తెలుగు విభాగాధిపతి, కె.వి.ఆర్. కళాశాల, నందిగామ.

ఎమ్వీయల్‌గా పేర్గాంచిన మద్దాలి లక్ష్మీ నరసింహా రావు సెప్టెంబరు 21, 1944 లో బందరు తాలూకా గూడూరులో సీతారామమ్మ, వేంకటేశ్వరరావు దంపతులకు జన్మించారు. ఎస్సెల్సీ వరకు గూడూరులో, తర్వాత పియూసి బందరులో పూర్తి చేశారు. బందరులోనే 1964లో బి.ఎ. పూర్తిచేశారు. ఆతర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు ఎం.ఎ చదివారు. 1966 లో నూజివీడులో ధర్మా అప్పారావు కళాశాలలో తెలుగు శాఖాధిపతిగా చేరి కడవరకు అక్కడే జీవించారు. ఎమ్వీయల్ బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగు సినిమా నిర్మాతగా ముత్యాలముగ్గు నిర్మించారు. అందాల రాముడు, మనవూరి పాండవులు, గోరంతదీపం సినిమాలతో కూడా సంబంధం ఉంది. స్నేహం, తూర్పు వెళ్ళే రైలు సినిమాలకు సంభాషణలు రాశారు. స్వయంగా కొన్ని సినిమాల్లో నటించారు కూడా. ది. 23-01-1986న సాహితీ లోకాన్ని శోక సముద్రంలో ముంచుతూ నూజివీడులో అకాల మరణం చెందారు.

తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేశారు ఎమ్వీయల్. నవలలు, నాటకాలు, వ్యాసాలు, కథలు అనేకం రాశారు. నవలా సాహితీలోకానికి ఆయన అందించిన నవలల్లో రెండు మాత్రమే ఇప్పుడు, లభిస్తున్నాయి. అవి మలుపు మెరుపు, నిన్న స్వప్నం నేడు సత్యం.

## మలుపు :

రచనాకాలం 1970 ప్రాంతం. ప్రథమ ముద్రణ జనవరి 1971. కథాస్థలం బెజవాడ. ప్రేమకథల నవలా రచయిత్రులు తెలుగు నవలా సాహిత్యాన్ని రాజ్యమేలుతున్న కాలంలో రాసిన నవల ఇది.

"ఒక ప్రక్కకు వంగిపోయిన త్రాసు న్యాయాన్ని తూచలేదు, అన్యాయం వైపు మొగ్గు చూపిన వైపు నడుం విరగ్గొడితే గాని దేశంలో నవ సమాజ నిర్మాణం జరగదు. ఇది 'మలుపు' నవలకు నేపథ్యం ఎమ్వీయల్‌లోని అభ్యుదయ కాంక్షకు తార్కాణం ఈ 'మలుపు' నవల. ఇది రాంబాబు అనే అభ్యుదయ భావాలున్న యువకుడి జీవన ప్రస్థానం. న్యాయాన్నే నమ్ముకున్నవాడు, నిజాయితీగా వ్యవహరించే వాడు దేనికీ, ఎవరికీ భయపడాల్సిన అవసరం ఉండదనే సందేశంతో కూడిన ఇతివృత్తం ఇది. ఈ నవల కథా కథనాలు చాలా సహజంగా సాగుతాయి. కృత్రిమ సంభాషణలు కాని, సంఘటనలు కాని కానరావు. నవలా రచయితగా ఎమ్వీయల్ సాధించిన విజయం ఇది. పరిమితమైన పాత్రలు, సహజ సంభాషణలు, సముచితమైన సన్నివేశాలు, అంతర్గతంగా ధ్వనించే ఉపదేశంతో నవల సాగుతుంది. రాంబాబు, జగన్నాథం, లక్ష్మీపతి, రవి, సుందరం జానకమ్మ, మాధవరావు, కృష్ణవేణి, విజయ చంద్రం, వెంకటరావు ఈ నవలలో కన్పించే ప్రముఖ పాత్రలు. ఒకటి రెండు పాత్రలు తప్ప మిగతా అన్నీ ఆదర్శవంతంగా సాగే పాత్రలే.

బెజవాడలో లక్ష్మీపతి పేరున్న కోటేశ్వరుడు, వ్యాపారస్తుడు, ఆయన ఆదాయం ఎన్ని వైపుల్నించి వస్తుందో లెక్కకట్టడం కష్టం. దాదాపు అన్ని వ్యాపారాల్లోనూ అత్యంత భాగస్వామ్యం ఉంది. అతనికి పెద్ద పెద్ద మేడలు ఉంటాయి. ఆ మేడల్లో చీకటి వ్యాపారాలు జరుగుతుంటాయి. అతని ఏకైక కుమారుడు రవికి ఇవన్నీ నచ్చవు. అతని అక్రమార్జనని తిరస్కరిస్తూ ఆ ప్రయత్నంలోనే ప్రాణాలు కోల్పోతాడు. అతను ప్రేమించి పెళ్ళిచేసికోవాలనుకునే అమ్మాయి కృష్ణవేణి. రవి మద్రాస్‌లో చదువుకొనే రోజుల్లో పరిచయం అవుతుంది. అతను హఠాత్తుగా మరణించాక బెజవాడలో గర్ల్స్ స్కూల్లో టీచరుగా చేరి రాంబాబు కుటుంబానికి దగ్గరౌతుంది. రాంబాబు కృష్ణవేణిని తన సొంత అక్కలా భావిస్తాడు. రాంబాబుకి మేనమామ జగన్నాథం. ఇతను లక్ష్మీపతికి కుడిభుజం. అతని అక్రమ వ్యాపారాలకు వత్తాసు పలుకుతుంటాడు.

అది గిట్టని రాంబాబు అతనితో ఎప్పుడు వాగ్వివాదానికి దిగుతుంటాడు. జగన్నాథం కూతురు విజయ. జగన్నాథం మేనల్లుడికి తన కుమార్తెనివ్వాలని నిశ్చయించుకుంటాడు. రాంబాబు మిత్రుడు సుందరం. సుందరం రవికి, కృష్ణ వేణికి కూడా మిత్రుడే. ముఖ్యంగా రవి తాను మరణించే ముందు సుందరానికి కృష్ణవేణి బాధ్యతను అప్పగిస్తాడు. ఈ విషయం కృష్ణవేణికి తెలియదు. కృష్ణవేణి లక్ష్మీపతి కోడలన్న విషయం రాంబాబు కుటుంబానికి తెలియదు. రాంబాబు చంద్రం దగ్గర తెలుగు దిన పత్రికలో చేరి త్వరలోనే వారపత్రిక తెలుగునాడు కు ఎడిటర్‌గా ఎదుగు తాడు. తెలుగునాడు పత్రికలో లక్ష్మీపతి అక్రమ వ్యాపారాలను గురించి అవినీతి గురించి వ్యాసాలు రాసి అతని వ్యాపారం మీద దెబ్బతీస్తాడు. లక్ష్మీపతి చంద్రాన్ని కొట్టించి ఆ నెపం రాంబాబు మీదకి మళ్ళించి అతన్ని అరెస్టు చేయిస్తాడు. అయితే చంద్రంకి స్పృహ వచ్చింతర్వాత పోలీసులకు నిజం తెలుస్తుంది. రాంబాబుని విడిపించమని అడగటానికి వెళ్ళిన కృష్ణవేణిని చూసి లక్ష్మీపతికి గతం గుర్తొస్తుంది. ముఖ్యంగా తన కుమారుడు రవి తన అక్రమాలను, దుర్మార్గాలను గురించి ప్రశ్నిస్తున్నట్టుగా భావిస్తాడు. పశ్చాత్తాపపడతాడు. చివరికి ఆ బాధతోనే కన్ను మూస్తాడు.

స్థూలంగా నవలలో ఉన్న కథ ఇది. ఇందులో ఎమ్వీయల్ సన్నివేశ కల్పనగాని, సంభాషణ చాతుర్యంగాని రసపోషణ గాని పాఠకుల్ని విశేషంగా ఆకట్టుకొంటుంది.

మెరుపు : రచయిత ఎమ్వీయల్. ప్రథమ ముద్రణ 1971. కళాశాల అధ్యాపకుని స్వగతంలాంటి కథ. "కట్నం పుచ్చుకోవడం దోషమన్నమాట నిజమే కాని, ఇచ్చేవాడు బలవంతం చేస్తుంటే, కాదనడం మర్యాదకాదు. ఇవ్వ గలిగిన వాడి దగ్గర ముక్కుపిండి మరీ వసూలు చెయ్యడం కూడా ఒక రకం సోషలిజమే" అనే అభిప్రాయం లెక్చరర్ గారిది. అతని తమ్ముని వివాహ నేపథ్యం నుండి సాగుతుందీ నవల. లోకంలో సహజంగా సంస్కర్తలుగా కన్పించే వారి స్వగతం వేరుగా ఉంటుంది. అటువంటి వ్యక్తుల కథ ఇది. కథకుడికి ఒక తమ్ముడు, బాబాయి గారి అబ్బాయి మూర్తి, భార్య వరలక్ష్మీ, బాబాయి ఉంటారు. కథాస్థలం నూజివీడు బందరుల మధ్య జరుగుతుంది. తమ్ముడు మూర్తి హైదరాబాద్ సెక్రటేరియట్‌లో పని చేస్తున్నాడు. తన తమ్ముడికి యాభైవేల కట్నం ఆశిస్తాడు లెక్చరర్. పైకి మాత్రం లెక్చర్లిస్తా ఉంటాడు అటువంటి తమ్ముడు ప్రేమ వివాహానికి సిద్ధపడటం - దీనికి తీవ్రంగా వ్యతిరేకిస్తాడనుకున్న బాబాయి ఆశ్చర్యంగా ఒప్పుకోవడం - లెక్చరర్ ఆశ్చర్యం - కథ సుఖాంతం - ఒక సాధారణ కథను రసవంతమైన సన్నివేశాలతో అద్భుతంగా మలిచారు రచయిత. ముఖ్యంగా భార్యా భర్తల సన్నివేశాలు సరసవంతంగా, సరదాగా, చమత్కారపు సంభాషణలతో సాగిపోతాయి. ఎంతో బరువైన విషయాలను కూడా సరదా సంభాషణలతో తేలిగ్గా సాగిపోయేలా రచన చేయడం రచయిత రచనా పటిమకు నిదర్శనం. లెక్చరర్ పూర్వాశ్రమంలో ఒకమ్మాయిని ప్రేమిస్తాడు - కట్నం విషయంలో లెక్కతేలకపోవడం మూలంగా తర్వాత వరలక్ష్మిని వివాహం చేసికొంటాడు- ఇవన్నీ వరలక్ష్మికి తెలిసికూడా లెక్చరర్‌తో హాయిగా సంసారం సాగిస్తుంది. అయితే వరలక్ష్మితో వివాహం తర్వాత రజనీని మన స్ఫూర్తిగా మరిచిపోతాడు లెక్చరర్. భార్య సరదాగా అప్పుడప్పుడు అతన్ని దెప్పిపొడుస్తుంది కూడా. చివరికి లెక్చరర్ కూడా తన తమ్ముడి ప్రేమ వివాహానికి సుముఖత వ్యక్తం చేయటంతో కథ సుఖాంతం అవుతుంది. మధ్య మధ్యలో తెలుగు లెక్చరర్ ఉద్యోగం మీద బోలెడన్ని హాస్యాల జల్లును చిలకరిస్తాడు. అలాగే అతనికే సొంతమైన సాహిత్యపు పరిజ్ఞానానికి గర్వపడతాడు. "సాహిత్యాభిరుచి ఉన్నవాళ్ళు ఎక్కడున్నా ఒకటే అవుతారు. ఎటొచ్చీ నగల మీద, చీరలమీద, సినిమాల మీద మోజున్న వాళ్ళు ఎవరికి వాళ్ళుగానే ఉంటారు - అన్న లెక్చరర్ మాటలు ఎంతో నిజమనిపిస్తాయి. (పుట 160)

మంచి సంభాషణా రచయితగా పేరున్న ఎమ్వీయల్ సంభాషణ నైపుణ్యం ఈ నవల్లో కన్పిస్తుంది. ముఖ్యంగా పాత్రోచిత సంభాషణలు, సన్నివేశానికి తగిన సంభాషణలు, హాస్యం అలరిస్తాయి. 'లోకంలో డబ్బు కంటే

విలువైనవి, డబ్బుతో కొనలేనివి చాలా ఉన్నాయి - అని, డబ్బుంటే భోజనం దొరకదని, కేవలం శ్రమ పడితేనే అది లభిస్తుందని లక్ష్మీపతి స్వగతం ద్వారా రచయిత చెప్పించడం ద్వారా, రచయిత ఆలోచనా విధానం అర్థ మౌతుంది. నవల్లో రవి పాత్ర ప్రత్యక్షంగా ఎక్కడా కన్పించదు కాని దాదాపుగా సగం పాత్రలు అతని భావజాలంతోనే నడుస్తాయి.

''ఆకలందరికెందుకుండును, అన్నమందరికెందుకుండదు'', అనే ప్రశ్నలు ఎప్పుడూ రవి బుర్రలో తిరుగుతాయని రచయిత చెబుతాడు. ''ఎక్కడో ఏదో మార్పు రావాలి, ఏదో లోపం ఉంది. ఇంత దగా, మోసం, నాన్న ఎందుకు చెయ్యాలి'', ఇవన్నీ రవి ఆలోచనలు అంటాడు. లోకంలో ఎవరూ సుఖపడటం లేదు. తన కళ్ళెదురుగా కన్పించే గుమాస్తా, తోటవాడు, పనిమనిషి ఎవరూ సుఖపడటం లేదు. ఎందుకిలా జరుగుతుంది. ఇవి రవి ప్రశ్నలు. అందుకే నవల చివర్లో లక్ష్మీపతి సుఖపడాలంటే డబ్బొక్కటే చాలదని తెలిసికొంటాడు. తన చుట్టూ తిరుగుతున్న చాలా మందికి డబ్బే ముఖ్యం కాదని తెలిసికొంటాడు. లక్ష్మీపతి నిద్ర మెలుకువ కాని స్థితిలో మాట్లాడే అతని మాటలే ఈ నవల రాయడంలో గల ఆంతర్యం.

''పాతికేళ్ళు పెంచిన రవిగాడికి అవసరమైందా ఆస్తి, కాలదన్ని పోయాడు. అప్పుల్లో మునిగినా, జీవితంలో ఏ ఆశా దగ్గర్లో లేకపోయినా, చివరికి ప్రేమించిన విజయ దూరమౌతుందని చెప్పినా రాంబాబుకి అవసరమైందా డబ్బు. షేర్లన్నింటికీ నీళ్ళొదులు కోవాలని గట్టిగా చెప్పనా స్నేహం కోసం నన్నూ ఆస్తిని దులపరించుకుపోయాడే వాడు, ఆ సుందరానికి అవసరమైందా? చివరికి నేను చేసిన వెధవ పన్లన్నింటికి ఆసరాగా నిలబడిన జగన్నాథం ''నా కూతురు నా అల్లుడు'' అని నన్నే కాదు పొమ్మన్నాడు.

''మీకెవ్వరికీ అక్కర్లేదమ్మా డబ్బు, నాకొక్కడికే కావాలి ఎందుకో తెలుసా? మీరు అనురాగాలతో ఒకరినొకరు పెనవేసికొని బతుకుతున్నారు. నేను అనురాగాన్ని తుంచుకుని అంధకారంలో నాలో నేను కుంగిపోయి నా అవసరం నాకు కూడా లేకుండా బతుకుతున్నాను. రెండు కన్నీటి చుక్కలకీ పిడికెడు సానుభూతికీ నోచుకోని వాణ్ణి'' అంటాడు. ఈ మాటలే రచయిత ఈ సమాజానికిచ్చిన సందేశం. (పుట 121)

## నిన్న స్వప్నం నేడు సత్యం :

రచయిత ఎమ్వీయల్. తొలి ముద్రణ 1971 డిశంబరు. పది అధ్యాయాలున్న ఈ నవల 1970ల నాటి కళాశాల వాతావరణానికి, నాటి గ్రామీణ ప్రాంత ప్రజల జీవితానికి వాస్తవంగా చిత్రించింది. కళాశాలలో ఎన్నికల గొడవలు, అర్థంలేని ఆవేశాలు, చైతన్యంతోతొణికిసలాడే విద్యార్థులు, అన్నదమ్ముల మధ్య బేదాభిప్రాయాలు, కుటుంట సభ్యుల మధ్య నిజమైన ప్రేమసంబంధాలు కళాశాలలకూ గుంటనక్కల లాంటి అధ్యాపకులు, వారి వలన ఇబ్బందులు, మూర్ఖవిద్యార్థులు వారి వలన కళాశాలలో, సమాజానికి జరిగిన నష్టాలు... ఇలా అన్ని అంశాలను తలకెత్తుకుని సాగిందీ నవల. రచయిత ఎమ్వీయల్ స్వయంగా కళాశాల అధ్యాపకులు కాబట్టి తనకున్న అపారమైన అనుభవంతో తన జీవితంలో ఎదురైన అనుభవాలు తాను చూస్తున్న వాస్తవ సంఘటనలు, తన కళాశాలలోని విద్యార్థుల పోకడలు... అన్నింటిని ఈ నవలలో పొందుపరచారు. 1970ల నాటి విద్యార్థుల జీవితాలను ఈ నవల ద్వారా ఒకరకంగా రికార్డ్ చేశారని చెప్పవచ్చు. ఇక కథ విషయానికి వస్తేరామారావు కళాశాలలో హిస్టరీ హెడ్. అతని భార్యపేరు సీత. రామారావు, ఒక పల్లెటూళ్ళో ఎలిమెంటరీ స్కూల్ టీచర్ అయిన వెంకట్రామయ్య గారి పెద్దబ్బాయి. చిన్నప్పటి నుండి కష్టపడి చదివేతత్త్వం. పై చదువులకు పంపేందుకు భయపడుతున్న సమయంలో ప్రభాకరం అనే పెద్ద మనిషి తాను చదివిస్తానని ముందు కొచ్చి వెంకట్రామయ్య దంపతులకు ఊరట కల్గిస్తాడు. ఆనాటి నుంచి ప్రభాకరం చెప్పుచేతుల్లో పెరిగిన రామారావు కళాశాల అధ్యాపకుని స్థాయికి ఎదిగాడు. ప్రభాకరం తాను కమిటీ సభ్యునిగా ఉన్న కళాశాలలోనే అతనికి లెక్చరర్‌గా ఉద్యోగం వేయించి, తన ఒక్కగానొక్క కుమార్తె సీతనిచ్చి, అల్లుణ్ణి చేసికొంటాడు. రామారావు తమ్ముడు రమణ. చదువులో మందబుద్ధి. అల్లరి చిల్లరగా తిరుగుతూ

తన అన్నఅదృష్టానికి అసూయ పడుతూ, అతనిపై అకారణ ద్వేషం పెంచుకుంటాడు. వెంకట్రామయ్య భార్య సుభద్రమ్మ. తల్లి మరణించిన తర్వాత రమణ బాధ్యతను రామారావుపై వేయడం వలన టౌనులో ఉంటున్న కళాశాలలో బి.ఎ.లో చేరి అన్న దగ్గర ఉంటాడు. అన్నదమ్ములిద్దరికీ అన్ని విషయాల్లో భేదాభిప్రాయాలే. అక్కడే ఉండి చదువుకునే మరో ఇద్దరు రాధ, రవి. ఇద్దరూ సీతా, రామారావులకు దూరపు బంధువులు. ఇది రామారావు కుటుంబం.

ఇక కళాశాలలో రమణ చదువుపై కంటే ఇతర విషయాలపై శ్రద్ధ చూపుతాడు. ఎన్నికలు, గొడవలు, నాటకాలు అంటూ చదువుపై నిర్లక్ష్యం వహిస్తుంటాడు. అది అన్న రామారావుకు నచ్చదు. పైగా యూనివర్శిటీ ప్రొఫెసర్ సుందరరావు కుమార్తె 'కమల'తో అతని సాన్నిహిత్యం కళాశాల గోడలపైకి చేరుతుంది.

కళాశాలలో రాజారావు రామారావు సహెూద్యోగి. రామారావుపై విపరీతమైన ద్వేషం పెంచుకుని ఎప్పుడూ అతని పరోక్షంలో అతన్ని నిందిస్తూ ఇతర అధ్యాపకుల్లో కూడా రామారావుపైద్వేషం కలిగేలా చేయాలని ప్రయత్నిస్తుంటాడు.

కొత్తగా చేరిన శంకరయ్య వంటి లెక్చరర్లను కూడా రామారావుపై ద్వేషం పెంచుకొనేలా చేస్తాడు. రామారావు చేసే ప్రతిపనీ రాజారావుకి కంట గింపుగా ఉంటుంది. చివరికి అతనిపై విద్యార్థులతో దాడి చేయించడానికి కూడా వెనుకాడడు. ముఖస్తుతి మాటలు, విపరీతమైన లౌక్యం, స్వార్థం, తోటి లెక్చరర్ల పట్లఅసూయ. ఇవన్నీ కలబోసిన రాజారావు లాంటి వారి వలన సమర్థులైన అధ్యాపకులు కూడా కళాశాలను వదిలేయాల్సిన పరిస్థితులు దాపురిస్తాయి. రామారావు తమ్ముడు రమణ చెడిపోవడానికి కూడా రాజారావే కారణమౌతాడు. ముఖ్యంగా కళాశాలలో జరిగే ప్రతి పనిలో అడ్డుపడతాడు. రచయిత లెక్చరర్ల జీవితాలకు అద్దం పట్టే విధంగా కొన్ని సన్నివేశాలను కూర్చాడు. యూనివర్సిటీ పరీక్షల సమయంలో అధ్యాపకుల సంభాషణలను యథాతథంగా చిత్రించాడు.

ఈ సందర్భంలో సంభాషణ చూస్తే రచయిత పరిశీలనాశక్తి అర్థమౌతుంది 'శఠగోపంగారూ! మీకెన్ని సార్లు పడింది యిన్విజిలేషన్ - అడిగాడు రాజారావు,

అబ్బే అసలు పడనే లేదు గదండీ,
మాష్టారూ! మీకు,
ఒకసారి
చూశారా నాకూ ఒకసారే,
శఠగోపం గారూ! రామారావు గారి కెన్నిసార్లు పడింది!
రోజూ వుంటూనే వుంది గదండి

ఎందుకనీ? ఎందుకే అంట" అన్నాడు రాజారావు ఆవేశంగా, రామారావు గారు పదో తారీఖు తరువాత వుండనని రాసిచ్చార్టండి, అందుకని ఈ లోగా ఆయన్ని వేసేస్తున్నారు.

"అయ్యా! ఎందుకొచ్చిన లాజిక్కిది? యూనివర్శిటీ ఇన్విజిలేషన్‌కి డబ్బులు వస్తాయి. కాబట్టి మా వాళ్ళనే వేసుకుంటాం, డబ్బులు రాలని గాడిద చాకిరీ వుందిగా, కాలేజీ పరీక్షలు, వాటికి మిమ్మల్ని వేస్తాం అని స్పష్టంగా చెప్పేస్తే పోలా, ఈ ముసుగులో గుద్దులాట ఎందుకు మధ్య" అంటాడు రాజారావు. (పుట 87)

అత్యంతసహజంగా ఉన్న ఈ సంభాషణలు, సంఘటనలు ప్రతి కళాశాలలోనూ ఇప్పటికీ అనుభవైక వేద్యమే. ఇటువంటి సమకాలీన విషయాలెన్నో ఈ నవలలో కన్పిస్తాయి.

రామారావు తమ్ముడు రమణది విపరీతమైన మనస్తత్వం. జీవితం పట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించే నాటి విద్యార్థులకు ప్రతినిధి రమణ. తన యోగక్షేమాలను వాంఛించే అన్న వదినలపై అతనికి అపేక్ష లేదు. గ్రామంలో ఉన్న తండ్రిపై మమకారం లేదు. కేవలం అన్నపై అసూయతో రగిలిపోతూ తన చుట్టూ ఉన్న ప్రపంచంపై నిర్లిప్తంగా ఉంటాడు. కమలని కేవలం తన జల్సాల కోసం మాత్రమే ఉపయోగించుకుంటాడు. ఒకానొక సమయంలో రాధతో కూడా అతి చనువుగా ఉండటానికి ప్రయత్నించి రాధ తిరస్కరించడంతో పగ పెంచుకుంటాడు. ఎన్నికలు, గొడవలు కళాశాల సమ్మెలు

వీటితోనే పొద్దు పుచ్చుతూ తన అన్న రామారావుకి తల నొప్పిగా తయారౌతాడు. బాల్యంలో జరిగిన సంఘటనలు అతణ్ణి అలా తయారుచేస్తాయి. తన అన్న డబ్బున్నవాడికి అల్లుడయ్యాడని, తమ కుటుంబాన్నిఅసలు పట్టించు కోలేదని అతని భావన. అరే అమ్మపోయింది యింట్లో వండి పెట్టేదెవరు? నాన్న పెద్దవాడే, ఈ వయసులో దూరంగా వదలిపెట్టకుండా తన దగ్గరే ఉంచుకోవాలనే జ్ఞానం, కనీసం తనపాటి జ్ఞానం వాడికి లేకపోయింది, డబ్బు! డబ్బు రాగానే కళ్ళకు పొరలు కమ్ముతాయి'' (పుట 77) అని రామారావుని ద్వేషించుకొనేవాడు తన మనసు లోనే.

రామారావు ఆలోచన కూడా ఇదే. తమ్ముడూ, తండ్రి తనతోనే ఉండాలని భావిస్తాడు. తనకో ఉద్యోగం వచ్చే వరకు ఎదురుచూసి, తర్వాత తమ్ముణ్ణి తెచ్చుకుంటాడు తన భార్య సీతను ఒప్పించి. సీత కూడా ఎప్పటికప్పుడు రమణ అవసరాలు గమనించి జాగ్రత్తగా కన్నబిడ్డలా చూసుకునేది. మరిదికి తన పట్ల గౌరవం, అభిమానం కలగాలని, అన్నతమ్ముళ్ళ మధ్య ఆత్మీయత పెరగాలని ఎంత ప్రయత్నించినా రమణ వారికి దూరంగానే ఉండే వాడు. ఇదీ రమణ పరిస్థితి. చివరికి తను చేసిన మోసం మూలంగా కమల గర్భవతియై తండ్రికి మొహం చూపించ లేక ఇల్లు వదిలి వెళ్ళిపోయినప్పుడు కూడా రమణ తన తప్పును తెలిసికోడు సరికదా సమాజాన్ని నిందించడం చిత్రంగాఉంటుంది. పైగా కమల తండ్రి సుందరరావుని నిందించడం విడ్డూరం గానూ ఉంటుంది.

''రమణ మూలంగా గర్భవతియై తను పెళ్ళికి నిరాక రించడం మూలంగా, తండ్రికి మొహం చూపించలేక కమల ఇల్లు వదిలి తండ్రికి గుండె కోత మిగిల్చి వెళ్ళి పోయింది. ఆ సందర్భంలో రమణ ''ఇప్పుడనుకొని ఏం లాభం, ముందుచూపుతో ఆలోచించి ఉండాల్సింది అని సుందరరావునే నిందిస్తాడు రమణ. తనకు మాట్లాడే అర్హత లేకపోయినా. ''పైగా పిల్లల్ని కనగానే సరికాదు. ఎలా పెంచుతున్నాం, ఎలా పెరుగుతున్నారు, ఎక్కడ సరి దిద్దాలి, ఏం చెప్పాలి అనీ, ముందే ఉండాల్సింది జాగ్రత్త. ఒక్కసారయినా కమలని అదిలించడం గాని, అలా తిరగడం తప్పని గాని చెప్పారా?'' (పుట 131) అని ప్రశ్నిస్తాడు. ''నిజమే మేం చేసిందిపొరపాటే, మా వయస్సు మమ్మల్ని ఆలోచించనివ్వలేదు. తొందరపడ్డాం. మీరేం చేశారు. గాలికి పెరుగుతున్న వాడిలా నన్ను వదిలేశాడు మా అన్నయ్య. ఇంటి సంగతీ పట్టించుకోలేదు మీరు. బాధ్యత గుర్తించలేని పెద్దవాళ్ళ పెంపకంలో పెరిగాం. మమ్మల్ని కాదు, ముందు మిమ్మల్ని అనాలి'' (పుట 131) అని మతి తప్పినవాడిలా కర్తవ్యం గోచరించని మూర్ఖుడిగా మాట్లాడతాడు.

''మమ్మల్ని అర్థం చేసికోవడానికి ప్రయత్నించరు. మా కోరికలు తీర్చడానికి ప్రయత్నించరు. మా సమస్యలకు పరిష్కారం చూపించరు. మీ హోదాలు, మీ గౌరవ ప్రతిష్ఠలు, మీ కులతత్వాలు, మీ పెద్దరికాలు నిలబెట్టు కోవడానికి, ఆ గాటకురాని వాళ్ళను బలవంతంగా లాగటానికి ఎత్తులు వేస్తారు. ఆ ఎత్తుల తోనే, ఆలోచన లతోనే, సరిపోతుంది మీకందరికీ మీరు వేసే చిక్కు ముళ్ళు విప్పుకోవడానికీ మీరు గీసే గిరుల్లోంచి తప్పు కోవడానికి సరిపోతుంది మాకు. ఎదుగుతున్న మనసుల్ని, పెరుగుతున్న మనుషుల్ని విస్తరిస్తున్న చైతన్యాన్ని గుర్తించ లేరు. గాలిని గుప్పెట్లో మూసి కొన్నితరాలుగా భ్రమలు పెంచుతూ వచ్చారు. గుప్పెళ్ళెప్పుడు మూసుకొని ఉంచ లేరు. అవి తెరవడానికి ఎంతో కాలం పట్టదు. ఆ భ్రమలు తొలిగిపోయిననాడు యువతరం మీమీద తిరుగుబాటు చేస్తుంది. మీ అశ్రద్ధ మీద, అశక్తత మీద, సంకుచితత్వం మీద చావుదెబ్బ కొడుతుంది. మీ లోపానికి మీరు శిక్షలను అనుభవిస్తారు. ఉరిశిక్షలనుభవిస్తారు. కాని... కాని మమ్మల్నే ఉరితాళ్ళుగా చేసుకుంటున్నారు. మాకే ఉచ్చులు బిగిస్తున్నారు. హాయిగా నిద్రపొండి మన బాధ్యతలు మనం నెరవేర్చాం అనుకుంటూ మగతగా పడుకొండి. పిల్లలెలా పోతేయేం గాలికి వదిలేయండి.'' (పుట 132)

ఈ మాటలు సూటిగా పెద్దల హృదయాల్లో దూసుకు పోయే విధంగా ఉంటాయి. ఎమ్వీయల్ అవగాహనకు సంభాషణా పటిమకు, వాక్య నిర్మాణ నైపుణ్యానికి పద

ప్రయోగ విన్యాసానికి ప్రతీకలుగా నిలుస్తాయి. యువతరం పట్ల ఎమ్వీయల్‌కు ఉన్న అభిప్రాయాలకు సాక్ష్యంగా నిలుస్తాయి. అయితే రమణ ముఖతః వీటిని ప్రయోగించడం పట్ల అభ్యంతరంగా ఉంటుంది. సహజసిద్ధమైన పాత్రలతో తన చుట్టూ ఉన్న సమాజాన్ని నవలీకరించారు ఎమ్వీయల్.

❁ ❁ ❁

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# సినారె కవిత్వ వీక్షణం

- డాక్టర్ చవ్వా వెంకటరెడ్డి, తెలుగు ఉపన్యాసకులు, హైదరాబాదు, తెలంగాణ.

1930-40ల మధ్యకాలంలో తెలుగు సాహిత్యావరణంలో వెలుగురేఖలుగా నిలిచిన ఎందరో మహనీయులు జన్మించారు. మంచి సాహిత్యమూ వచ్చింది. అలాంటి ముఖ్యఘటనల్లో శ్రీశ్రీ మహాప్రస్థానం రచన ఒకటైతే, మరొకటి సినారె జననం. సినారె గా విశ్వవిఖ్యాతు లైన సింగిరెడ్డి నారాయణరెడ్డి తెలుగు సాహిత్యకేదారంలో ఎన్నో ప్రయోగాలు చేశారు. వారి జీవితం, సాహిత్యం నాణానికి బొమ్మాబొరుసుగా అమరాయి.

సినారె కవిత్వాన్ని విశ్లేషిస్తూ డా॥రావిభారతి ఇలా అంటారు - "సి.నారాయణరెడ్డిగారి కవిత్వం ఒక సుక్షేత్రం వంటిది. విత్తితే చాలు మానవత ఫలాలను విరియ కాస్తుంది. వారి కవిత్వంలో వ్యక్తిగత విలువలుగా చెప్ప బడే స్నేహం, సౌజన్యం, సహనం, త్యాగం, నీతి, వీటితో బాటుగా సమిష్టి విలువలైన సమైక్యత, అహింస, శాంతి, సర్వమానవ సౌభ్రాతృత్వం వంటివి విశ్వజనీనంగా చోటు చేసుకుంటాయి"

పై భావాన్ని పరిశీలిస్తే సినారె కవిత్వంలో చోటు చేసుకున్న శాశ్వత లక్షణం, లక్ష్యం ప్రగతిశీల మానవత వాదమేనని స్పష్టమౌతుంది. మానవత, మానవుడు సినారె కవిత్వంలో ప్రధానకేంద్రాలు. విశ్వమానవ సంక్షేమ దృక్పథం వారి కవిత్వ దృష్టికోణంగా పేర్కొనవచ్చు. సందర్భం వచ్చినప్పుడల్లా వారు తమ కవిత్వంలో మానవత్వానికి, ప్రగతిశీల మానవతావాదానికి పెద్దపీట వేస్తూ వచ్చారు. ఒక సినీగేయంలో వారు సౌజన్యం గురించి ఇలా చెప్పారు -

సహనం నా శస్త్రం
శాంతం నా కవచం
అహింసయె మనజాతికి
అందిన పరమార్థం

ఇందులో వారి ఆకాంక్ష, అంతర్ముఖత్వం ప్రదర్శిత మౌతున్నాయి. వారి కవిత్వవేదిక విశ్వం. వారు ప్రపంచ సమాజ దృష్టితో కవిత్వాన్ని సృజించారు. వారి 'సమదర్శనం' కావ్యంలో ప్రపంచ సమాజం ఆరోగ్యవంతమైన చైతన్యానికి, మనుగడకు అవసరమయ్యే మూడు సూత్రాలను తమ కవిత లక్షణాలుగా, లక్ష్యాలుగా తెలియచేశారు. అవే సహనం, త్యాగం, అహింస. ఈ మూడింటిని ఇలా వివరించారు -

ఎట్టి వానికి వాని సహనము
బట్టి విలువలు రెమ్మవేయును
సహనమే సంస్కృతి యటన్న
వచస్సు అక్షరలక్ష సేయును[3]

సహనం వల్ల విలువలు పెరుగుతాయి. బాహ్యయుద్ధాలుండవు. మానసిక సంఘర్షణలుండవు. ఈ భావాన్ని వాల్మీకి తొలుత తన రామాయణ కావ్యంలో రామపాత్ర ద్వారా తెలియజేశాడు. ఈ భావానికి సినారె తమ 'సమదర్శనం' కావ్యంలో పూర్ణార్థాన్ని ఇచ్చారు.

ఈ కావ్యంలోనే మరొక సందర్భంలో త్యాగప్రస్తావన చేస్తూ -

కప్పురమునకు దైవసన్నిధి
కరిగిపోవుటలోనే ధన్యత

అంటూ కర్పూరాన్ని త్యాగానికి ప్రతీకగా చూపారు. తమ 'భూమిక' కావ్యంలో మానవసంస్కారం, అతగాడిని అంటిపెట్టుకున్న విలువలు కేవలం తనకోసం కాదు, అదంతా సామూహికం కావాలి అనే సందేశాన్ని అందిస్తూ ఇలా తెలియచేశారు-

నీతికొరకు నిజం కొరకు
నిలిచే వ్యక్తిని మంచిని
కొలిచే శక్తిని సంఘం

కోటి గొంతులెత్తి అభినుతిస్తుంది
కొండంత బలమును అందిస్తుంది

అని స్పష్టపరిచారు. ఇందులో పైకి తాత్పర్యం విశ్వసంబంధిగా కన్పించినా, అంతరార్థం మాత్రం కందుకూరి, గురజాడలను దృష్టిలో పెట్టుకుని రాసినట్లు తెలుస్తుంది.

తన కవిత్వస్వరానికి ఉపకరణాలను తెలిచేస్తూ 'భూమిక' కావ్యంలో ఇలా అంటారు -

నరభోక్తలు మానవతను
నంజుకు తింటున్నప్పుడు
పరశక్తులు స్వజాతిపై
విరుచుకు పడుతున్నప్పుడు
కత్తులతో పాటు పైకి
సుత్తెలెత్తి పట్టించె
అడుగులతో పాటు పదును
కొడవళ్ళను కదిలించే
నాగళ్ళను, రోకళ్ళను నడిపించే
నౌకర్లను, పాలేర్లను ఉరిమించే
తిరుగుబాటులో కవిత
స్వరముద్రికలున్నది

మానవత్వ పరిరక్షణాకాంక్ష, అణచివేతపై తిరుగుబాటు, ఒకనాటి తెలంగాణ సాయుధ పోరాట జ్ఞాపకాలను వ్యక్తం చేస్తూ 'తిరుగుబాటులో కవిత స్వరముద్రికలున్నాయి' అని చెప్పడం సినారే పాండితీశేముషికి, భావచిత్రణకు తార్కాణం. అంతేకాక ప్రగతిశీల కవిత రచనకు ముడిసరుకును అందించినట్లు అన్పిస్తుంది.

సినారెకి మార్క్స్‌పైన, ఆయన సిద్ధాంతాలపైన అచంచల విశ్వాసముంది. సంకుచిత భావాల ఊబి నుండి మనిషిని వెలికితీసి, వ్యక్తిలోని మానవత్వాన్ని మేల్కొల్పే మార్క్స్ ధ్యేయాన్ని అనేక సందర్భాలలో వారు తమ కవితలలో వ్యక్తపరిచారు. అందుకు ఉదాహరణ ఈ క్రింది కవిత-

కురిసె వానకు స్వార్థం లేదు
పండే పంటకు స్వార్థం లేదు
నింగికి నేలకు లేని స్వార్థం
మధ్యనున్న ఈ మనిషికెందుకు

ఇందులో సినారె నిస్వార్థాన్ని నిష్కామకర్మ అనే అర్థంలో వాడారు. అలాగే 'శ్రమజీవి చెమట బిందువులో ఆణిముత్యమూ ఉంది, అగ్నిగోళమూ ఉంది' అన్నారు. 'క్రమబద్ధమైన గతిని' నిరోధిస్తే ఆ గతి చితిగా మారుతుందని. ఆ అగ్నిగోళాలు బూర్జువా సమాజాన్ని ధ్వంసం చేస్తాయని ధిక్కారస్వరాన్ని వినిపించారు. దానినే మరో కోణంలో -

ఇది కుళ్ళిన సంఘం
వయసు మళ్ళిన సంఘం
దాని కాళ్ళు నరికివేయాలి
వేళ్ళు విరిచి వేయాలి
వెన్ను విరిచిపెట్టి గన్ను చేతపట్టి
పెత్తందారుల బద్దలు కొట్టాలి
పచ్చినెత్తురులో కొత్త జగతి పుట్టాలి"

అలాగే కవిత్వపు సామాజిక లక్ష్యాన్ని తెలియచేస్తూ, మానవతవాద కవితలో మహోద్యమ స్పృహ ఉన్నదంటారు. శాంతిప్రియత్వం, మానవత్వం రెండుకళ్ళుగా (తన కవిత్వానికి) సినారె భావించారు. తన 'అక్షరగవాక్షాలు' కావ్యంలో 'ఎవడాపును మానవతారవి రుక్కును, కవి వాక్కును' అని తన కవిత్వలక్ష్యాన్ని, కవిగా తన దృక్పథాన్ని స్పష్టం చేశారు.

సినారె ఆశావాది. దానికి ఉదాహరణ ఈ గేయ పంక్తులు -

శిశిరం నుంచి వసంతానికి
చీకటి నుంచి ప్రభాతానికి
నిరాశ నుంచి ఆశాశిఖరానికి

ఈ పంక్తుల్లో ప్రయోగించిన శిశిరం, చీకటి, నిరాశలు సంక్షోభానికి ప్రతీకలు. పాదాంతాల్లో ప్రయోగించిన వసంతం, ప్రభాతం, ఆశాశిఖరం సంతోష సంక్షేమాలకు ప్రతీకలు. ఈ ఆశావాదమే -

మనిషి నశించినా నశించదు మానవత్వం
అదే ఈ లోకానికి మణిసోపానం
అనంతం వైపు దాని ప్రస్థానం

అన్న పంక్తుల్లోనూ కనిపిస్తుంది. ఇందులోని భావం శాశ్వతత్వంతో పాటే సార్వజనీనతను, సార్వకాలీనతను కలిగి ఉండడం విశేషం.

సినారె కవిత్వం ప్రధానంగా రెండు అంశాలపై నిలబడింది. అవే సంప్రదాయం, ప్రయోగం. అవే వారి పరిశోధనకు కూడా భూమిక అయ్యాయి. ఇక సినారె కవిత్వమంతా ప్రయోగాల మయమే. దాని ప్రయోజనం సమాజ శ్రేయమే. అందుకే వారి దృష్టి అంత గణం మీద కంటే గుణం మీదనే నిల్చింది.

'విశ్వంభర' సినారె మానవతవాద కవితలో వెలువడిన మహాకావ్యం. ఈ కావ్యంలో మనిషిని వాస్తవికంగా పరిశీలించి, తాత్త్వికంగా వ్యాఖ్యానించారు. ఇదే ఈ కావ్యవస్తువు అని చెప్పవచ్చు. విశ్వంభర అంతరంగం మనిషి. ఆ మనిషి జీవితనాటకంలో మనసు ధరించే భూమిక వాస్తవం అన్న సత్యాన్ని స్పష్టం చేశారు సినారె. కవిత ఇజాలను కాక నిజాలను ప్రచారం చేయాలని విశ్వంభరలో ప్రకటించారు.

సినారె కవిత్వంలో అనుప్రాస గుబాళిస్తుంది. దీనికి కారణం వారి అనుప్రాసల ప్రీతి. అయితే వారి కవిత్వ నిర్మాణంలో అక్కడక్కడ వాక్యనిర్మాణంలో అంతర్గత వైవిధ్యాలు చోటుచేసుకుంటాయి. ఉదా: "మెట్లు అలసిపోవు, ఎక్కిదిగే అడుగులు అలసి పోతాయి" (సాక్షులు పుట.3) ఈ వాక్యాలలో ఎక్కి దిగేది అన్నది విశేషణం. ఇది అర్థపరంగా క్రియాత్మకమైన అడుగులకు సంబంధించిందే అయినా దాన్ని మెట్లకు కూడా అనువర్తించవచ్చు. నిర్మాణపరంగా అలసిపోవు, అలసిపోతాయి. వ్యతిరేకార్థంలో చెప్పినా, కవిత్వంలో నిర్మాణపరంగా వ్యతిరేకత కన్పించక ఒక నవ్యతగా కనిపిస్తుంది. అలాగే వీరి కవిత్వంలో అనేక ప్రశ్నార్థక వాక్యాలు కనిపిస్తాయి. ఉదా - బొద్దింకలు పాకే బుర్రల్లో బోధివృక్షాలు మొలుస్తాయా? (విశ్వంభర).

సినారె తన కవిత్వంలో క్రియారహిత వాక్యాలను సామంజస్యపూరితంగా ప్రయోగిస్తారు. ఉదా: ఉసూరనె మనిషికి, సాగరం ఓ దీర్ఘ విశ్వసం, ఆకాశం ఓ అశ్రు శోకం. ఇక సినారె కవిత్వం 'వాక్యలయకు' ఒక చక్కని ఉదాహరణ.

కవిగా సినారె ఎంత ప్రసిద్ధుడో, సినీగేయకర్తగా అంతే ప్రసిద్ధుడు. వారి సినీగేయాల్లో సందర్భాన్ని సోయగంతో నింపేవి కొన్నైతే, మరికొన్ని శబ్ద, అర్థమాధుర్యంతో ఓలలాడుతాయి. వారి గేయాల్లో నూతన పదప్రయోగాలు, దీర్ఘ సమాస ప్రయోగాలు కోకొల్లలు. అయితే ఇవి మాత్రా బద్ధంగా ఒదిగి వుంటాయి. అన్యదేశ్యాల ప్రయోగాలూ అక్కడక్కడా మెరుస్తాయి. సరళగ్రాంథిక రూపాలు కన్పిస్తాయి. గతిని అనుసరించి సరిగ్గా చక్కని విరుపులతో పడే పదాలు కనిపిస్తాయి. ప్రతి పాదంలో యతినో, ప్రాసనో, అంత్యప్రాసనో నియతంగా ఉంటుంది.

సినారె గేయరచనలో కనిపించే మరో లక్షణం క్లుప్తత, స్పష్టత. అలతి పదాలతోనే భావం మనసుకు హత్తుకుంటుంది. ఉదా. జీవనతరంగాలు చిత్రంలో 'పుట్టిన రోజు పండగే అందరికీ' అనే పల్లవితో వచ్చే పాటలో -

ప్రతి మనిషి తన జన్మకు
పరమార్థం తెలుసుకొని
తన కోసమే కాదు పరుల కొరకు బతకాలి
తానున్నా లేకున్నా తన పేరు మిగలాలి

అన్న భావం శ్రోతను ఆనందానుభూతిలో ఓలలాడిస్తుంది. ఇలాంటివే ఈ ఉదాహరణలూ -

'ఉన్నవాడికి తింటే అరగదు
లేనివాడికి తిండే దొరకదు
పరుపులున్నా పట్టదు నిదురా
కటికనేలపై గురకలు వినరా
హెచ్చుతగ్గులు తొలిగే రోజు
ఎపుడొస్తుందో ఏమో'

'నా వాదం సామ్యవాదం,
కవిత్వం నా మాతృభాష
ఇతివృత్తం మానవత్వం'

సినారె కవిత్వ ప్రస్థానంలో భావ, అభ్యుదయ, మానవతావాద కవిత్వదశలున్నాయని ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు అభిప్రాయపడ్డారు. ఇవి సినారె కవిత్వాన్ని సుసంపన్నం చేయడమే కాకుండా, శాశ్వతం చేశాయి. వారి కవిత్వంలో భావకవుల భావతీవ్రత, అభ్యుదయ కవుల సామాజిక స్పృహ, మానవతవాద కవుల సమత దృష్టి స్థిరపడి కనిపిస్తాయి.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 భావవీణ UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# ధూర్జటి కవితా దృక్పథం

– డాక్టర్ ఇ.వాసు, తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.ఎన్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), చిత్తూరు

శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన కవులలో అష్టదిగ్గజకవులలో ధూర్జటికి ఒక ప్రత్యేకత స్థానం వుంది. ఈయన రచనలు ప్రసిద్ధి చెందినవి.

1. కాళహస్తి మహాత్మ్యము
2. కాళహస్తీశ్వర శతకము

రెండూ శైవ కావ్యాలు. వైష్ణవ మత ప్రాచుర్యం అధికంగా ఉన్నకాలంలో శైవకావ్యాన్ని, శతకాల్ని రాయడం ధూర్జటి స్వతంత్రతాభావాన్ని వ్యక్తపరుస్తుంది. ధూర్జటి పౌత్రుడు వేంకటాచార్యుడు ధూర్జటి కవిత్వాన్ని గురించి ఈ విధంగా తెలియజేశారు.

'స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పలుకులకేల
గల్గెనో
యతులిత మాధురీ మహిమ'

ఇంతకంటె ధూర్జటి కవిత్వాన్ని గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ధూర్జటి స్వయంగా రాసుకున్న ఆశ్వాసాంత గద్యను బట్టి ఈయన తల్లి 'సింగమ' అనీ, తండ్రి జక్కయ కుమారడయిన నారాయణుడనీ తెలుస్తుంది. వివిధ రచనలను బట్టి ధూర్జటి ఆపస్తంబసూత్రుడనీ, భరద్వాజ గోత్రుడని వ్యక్తమవుతుంది.

ధూర్జటి శతకాన్ని ముందుగా బాలప్రాయంలోనే రచించినట్లు కనిపిస్తున్నది. ఈ శతకంలో రాజదూషణం అధికంగా కనిపిస్తుంది. బహుశా కృష్ణదేవరాయల ఆస్థానంలో చేరక ముందే రచించి ఉంటాడని కొందరి అభిప్రాయం. ఈయన రచించిన కాళహస్తీశ్వర శతకంలోని కొన్ని వాక్యాలను పరిశీలిస్తే ఈ విషయం అవగతమవుతుంది.

'రాజుల్మత్తులు వారిసేవ నరకప్రాయంబు'
'సులభుల్ మూర్ఖులన్నుత్త మోత్తముల రాజుల్'
'నృపాలా ధమున్ పాత్రంబంచు భజింపబోదురే'

రాయల ఆస్థానాన్ని వీడిన తర్వాత ఈ అభిప్రాయాలను తన శతకంలో వ్యక్తీకరించాడని కొందరి అభిప్రాయం.

ధూర్జటి రాజాశ్రయంలో ఉండి కూడా తన రచనలను నరాంకితం చేయలేదు. ఇందుకు ప్రధాన కారణం ఆయన స్వతంత్ర ప్రవృత్తి. దీంతోపాటుగా ఈశ్వరభక్తి, అద్వైత సాధన.

శ్రీకృష్ణదేవరాయలకు ధూర్జటి గౌరవ పాత్రుడై 'స్తుతమతి' అయినాడు. అట్టి స్తుతమతి పలుకులకు 'మాధురీ మహిమ' యేల గలిగెనని కృష్ణదేవరాయలే చమత్కరించాడు. మాధురీ మహిమలోని మాధురీ పదాన్ని అనేక రూపాలలో ధూర్జటి తన రచనలలో బహుళంగా ప్రయోగించారు.

'సాహిత్య స్ఫురన్మాధురీ చారు పౌఢిమ'
మధుర సుధాహారవిధి
అధర మధురిమ'

ఇలాంటి ప్రయోగాలు అనేకం చేశారు. ఏమాత్రం భయపడకుండా, నిజాన్ని అణుమాత్రం కూడా దాచకుండా చిత్తశుద్ధితో, మహోద్వేగంతో రాసిన శతకమే 'కాళహస్తీశ్వర శతకం'.

సమకాలీన రాజుల దుర్మార్గాలకు ధూర్జటి విసుగెత్తిపోయినట్లుగా కనిపిస్తుంది. బహుశా కృష్ణదేవరాయలు గతించిన తర్వాత కావచ్చు. కాగా ఉపమానాలతో, ఉత్ప్రేక్షలతో, ధ్వని, వ్యంగ్య, శబ్దాలంకార విశేష భాషలు మొదలయిన వాటిల్లో ధూర్జటి కడుతియ్యగా కవిత్వం చెప్పే నూత్న యవ్వనంలో రాయలు బ్రతికే ఉన్నట్లు తెలుస్తుంది.

ఏ కారణం వల్ల ధూర్జటి మానసికంగా దెబ్బతిన్నాడు. రాజ కీటకాలనతడు చీదరించుకున్నాడు. రాజులను ఆశ్రయించుకొనే తిట్టు కవులంటే అతనకి అసహ్యం. అందుకే ఇలా చెప్తాడు.

మ. చదువుల్ నేర్చిన పండితాధములు స్వేచ్ఛాభాషణ క్రీడలన్
వదరన్ సంశయ భీకరాటవుల ద్రోవల్దప్పి వర్తింపుగా
మదన క్రోధికి రాతులందు గని భీమ పొఢిచే దాకినం
జెదరుం జిత్తము చిత్తగింప గదవే శ్రీకాళహస్తీశ్వరా!

ధూర్జటి తన కవిత్వాన్ని ఎవ్వరికీ అంకితం ఇవ్వకూడదని నిశ్చయించుకున్నాడు. ఈశ్వరునికి మాత్రమే అంకితం చేస్తానన్నాడు.

శా. నీకుం గాని కవిత్వ మెవ్వరికి నేనీ నంచు మీదెత్తితిన్
చే కొంటెం బిరుదంబు కంకణము ముంజేగట్టితిన్ బట్టితిన్
లోకుల్ మెచ్చవ్రతంబు నాతనువుకిలున్ నేర్పులుంగావు చీ
చీ కాలంబుల రీతి దప్పదు జుమీ కాళహస్తీశ్వరా!

ఈ విధంగా ఆయన కాళహస్తీశ్వర శతకం స్వేచ్ఛా ప్రవృత్తితోనే రాశాడని చెప్పవచ్చు.

శ్రీ కాళహస్తీశ్వర మహాత్మ్యాన్ని శివునకే అంకితం చేశాడు. ఈ కావ్యాన్ని బహుశా శతకం కంటే ముందే రాసి ఉండవచ్చని పండితుల అభిప్రాయం. ఈ కావ్యంలో వసిష్ఠుడు, బ్రహ్మ, సాలెపురుగు, పాము. సామజము, ఆటవికుడయిన తిన్నడు, గోత్రాదేవుడు, నత్కీరుడు, వేశ్యాతనయలిద్దరు, యాదవాధిపుడు మొదలయిన పాత్రలు ప్రధానంగా కనిపిస్తాయి. ధూర్జటి సంప్రదాయాన్ని అనుసరించి తన రచన ప్రారంభంలోనే మంగళాచరణం, ఇష్టదేవతాస్తుతి, కృతినాయక వరణం, గురుప్రశంస, కృతినాయక వర్ణనం, షష్ఠ్యంతాలు ఉన్నాయి. ఈ మహాత్మ్యాన్ని ధూర్జటి 755 గద్య పద్యాలలో హృద్యంగా నాలుగు అశ్వాసాల కావ్యంగా రూపొందించాడు. తన కృతికి విద్యా పారంగతుడయిన వరునిగా కాళహస్తీశ్వరుని ఎన్నుకున్నాడు. ఆ దేవుడే ఈ విధంగా దీవించారట.

ఉ. 'ఈ శుభకావ్య రత్నమున కీసునధీశుని జేసినన్ మహా
దేశిక సార్వభౌముడు మదిం ప్రమదంబు వహించి ధూర్జటీ
నీ శివభక్తి కావ్యసరణింగడు ధన్యత పొంద నవ్యభా
షాశయతా నిగుంభ సరసస్థితి నొప్పు దవిర్ప జెప్పుమా'

ఈ కావ్య రచనలో ముందు జెప్పిన గుణాలన్నీ కనిపిస్తాయి. కాళహస్తిలోని కామినులు కూడ యోగి జనమే అని వర్ణించడంలో ఆ భక్తి తత్పరత ఎలాంటిదో వ్యక్తమవుతుంది.

అప్పురమున కామినీజనులు పొల్తురు యోగిజన
మంబుపోలికన్'

నారాయణవనం రాజుగారి పరిచారిక ఒక్కరై ఇటువంటి యోగినయే. ఈమె ఇంటికి శివుడు మిండ జంగం వేషంలో వచ్చినపుడు ఆయన సౌందర్యాన్ని చూసి కామశర తాపం చెందని కాంత మచ్చుకయినా లేదట. ఆమె ఈ విధంగా ఆహ్వానిస్తుంది.

సీ. బిజ మాడుదేవర నిజ కృపాదృష్టి, చె
న్నారు నాయిల్లు బిడారు మీకు
నాకు మీ పాదార్చనము చేయనీడ లింగ
మూర్తి చేకురెవచ్చి మూర్తమాడు
మొడయ చిత్తేశనాయునికిని మజ్జనం
బాడి శివార్చన మాడబేకు
విచ్చేయడు విభూతి వీడియం బందుకో
జంగమస్వామి నానదనమునకు
ఓ గిరంబులు మంచి మేలోగిరములు
ఆ వటించెద బదకు మీరారగింప
ప్రతి దినంబును జంగ మార్చనములేక
తనివు పడనొల్ల విజిత కందర్పయనురు'

ఈ పరిచారిక బహుశా కన్నడ వనిత కావచ్చు. అందుకే కన్నడ భాషా పదాలు ఇందులో ప్రయోగించబడ్డాయి. ధూర్జటి చెప్పిన కథలో అగస్త్యునకు సంబంధించిన కథ కూడ ఉన్నది. ఈయన ధర్మపత్నితో పాటుగా దక్షిణ దేశానికి వచ్చాడు. కాళహస్తీశ్వరునకు అభిషేకం చేయడానికి తగిన జలం లేదని తపస్సుచేసి శివుని జటాజూటంలోని ఆకాశగంగ పాయనుండి నీటిని క్రిందపడేట్లు శివుని అంగీకరింపజేశాడు. అదే సువర్ణముఖీ నది అయిందని ఈ కథలో కనిపిస్తుంది.

ధూర్జటి ఈ కావ్యంలోని పది కథలలో అష్టాదశ వర్ణనలనేకాక అనేక లౌకిక విషయాలను కూడా తెలియజేశాడు.

కాళహస్తి సమీపంలో గల చెంచుల ఆచార వ్యవహారాలను, ఆటపాటలను, జాతకలను ఈ కావ్యంలో కన్నులకు కనిపించేలా వర్ణించాడు. చెంచులకు సమబంధించిన తెర వేట, డేటవేట, ముంగివేట, సివంగివేట మొదలయిన వాటిని చక్కగా వర్ణించాడు.

చెంచులు తాగి తందాన లాడేవారు. అట్టివారి వర్ణన అద్భుతంగా కనిపిస్తుంది.

సీ. మాట లాడ దలంచి మరచి పోయెడువారు
నడవ బోవుచు దొట్రు పడెడువారు
ఊరుకుండెడమని యుండ నోపనివారు
లేచెదమని లేవలేని వారు
పని లేని పని బట్టబయలు దిట్టెడువారు
పాడనేరకయును పాడువారు
ఎదురైన వారికి నెల్ల మ్రొక్కెడు వారు
వ్రీడా విహీనులై యాడూ వారు

ఈ చెంచుపల్లిలో పుట్టినతిన్నడి కథే ఈ కావ్యంలో ప్రసిద్ధమైంది. నాగరిక భక్తుల కన్నా ఈ ముగ్ధభక్తుడే గొప్పవాడు. ఈ విషయాన్ని అందరికీ తెలియజేయడం కోసం శివుడు తనకంట రక్త భాష్పాలు కార్చాడు తిన్నడు భక్తితో అనేక విధాల చికిత్స చేశారు. కాని ఏమందూ పని చేయలేదు. అందుకని తిన్నడు తన కన్నుకే తీసి శివునకర్పించాడు. అయితే రెండవ కంటి నుండి కూడా రక్తం కారడం ఆరంభమయింది. తిన్నడు రెండవ కన్నును అర్పించబోయాడు. కానీ శివుడు దైవరూపంలో ప్రత్యక్షమై నివారించాడు. ముక్తి నిచ్చాడు. తిన్నని గొప్పతనాన్ని తెలుసుకున్న శివ బ్రాహ్మడు కూడ మోక్షాన్ని పొందాడు.

ఇదే విధంగా తమిళ సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధి గాంచిన నక్కీరుని కథను కూడా ధూర్జటి ఎంతో చక్కగా రాశాడు.

పాండ్యరాజు కొలువులో నక్కీరుడు గొప్పకవి. ఆ రాజ్యంలో క్షమం వచ్చింది. పేద అర్చకునకు శివుకు ఒక పద్యం రాసి ఇచ్చాడు. రాజ సత్కారం కోసం ఆ పద్యాన్ని సభలో అర్చకుడు చదివాడు. నక్కీరుడు అందులో తప్పులున్నాయన్నాడు. అందువల్ల అర్చకునకు సత్కారం జరగలేదు. ఈ విషయాన్ని తెలుసుఉన్న శివుడే సభకు స్వయంగా వచ్చి కావించాడు. అయినా నక్కీరుడు తప్పు తప్పేనన్నాడు దైవానికి కోపం వచ్చి నక్కీరుని శపించాడు నక్కీరుడు శ్రీకాళహస్తీశ్వరుని భక్తి శ్రద్ధలతో పూజించడం వల్ల విమోచనం వచ్చింది. ఈ సందర్భంగా ధూర్జటి తమిళ పదాలతో కూడాన ఒక పద్యాన్ని రాశాడు.

ఉణ్ణామల జగదంబిక - అణ్ణామల విశ్వనాథు నారాధించెన్
మణ్ణానము, పొణ్ణానము, పెణ్ణానము లేనివారి పెన్నిథు లగుటన్'

శివభక్తి విషయంలో, కథా కథనంలో శ్రీనాథునకు, ధూర్జటికి చాలా సామ్యాలు కనిపిస్తాయి. ధూర్జటి ప్రతి పద్యం హృద్యంగా ఉంటుంది. లక్షణం, అలంకారం, పదబంధం, రసం మొదలయినవ్నీ ఆయన కవితా స్రోతస్వినిలో తేలితేలి మనల్ని ఓలలాడిస్తాయి. ధూర్జటి కవిత్వంలో మాధుర్యం, సర్వజ్ఞత్వ,. బహుముఖ నిర్వహణ శక్తి, పరభాషల ప్రావీణ్యం, కమనీయ కవితా గరిమ సర్వత్రా కనిపిస్తాయి.

## ఆధార గ్రంథాలు :

1. ధూర్జటి - శ్రీకాళస్తిమహాత్మ్యము , ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ, కళాభవన్, సైఫాబాద్, హైదరాబాద్-04, ప్రథమ ముద్రణ జూలై -1998.
2. కుమార ధూర్జటి - కృష్ణరాయ విజయము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కళాభవన్, సైఫాబాదు, హైదరాబాద్-4, ప్రథమ ముద్రణ -1981.
3. మహాదేవశాస్త్రి, కోరాడ - ఆంధ్ర వాజ్మయ పరిచయము, సరస్వతీ ప్రచురణము, 60 సింగరాచారి వీథి, మద్రాసు -5,
4. సుబ్రమణ్యం, జి.వి. - సారస్వత వ్యాసములు, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ, కళాభవన్, సైఫాబాద్, హైదరాబాద్, ద్వితీయ ముద్రణ -1981.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# అసమర్థుని జీవయాత్ర - అసమర్థుడు

- డాక్టర్ జి. వెంకటరమణ, శాఖాధిపతి, తెలుగు విభాగం, అక్కినేని నాగేశ్వరరావు కళాశాల, గుడివాడ.

ఈ నవలలో ప్రధాన పాత్ర సీతారామారావు. సీతా రామారావు జీవితం విచిత్రమైంది. ఇతని జీవితం ఉన్నత శిఖరాగ్రం నుంచి స్వచ్ఛమైన జలంతో భూమి మీద పడి మలినాన్ని కలుపుకుని, మురికి కూపంలోకి ప్రవహించే సెలయేటిని జ్ఞప్తికి తెస్తుంది. సీతారామారావు తండ్రి, చావు మంచం మీద ఉండి "బాబూ మన వంశం పేరు నిలబెట్టు. అంతకంటే నే చెప్పేదేం లేదని" సలహా ఇస్తాడు. ఆస్థి సంగతి చెప్పలేదు, ఇంకేమి చెప్పలేదు, వంశం పేరు నిలబెట్టమన్నాడు చూశారా, 'ఆయన గొప్పతనం' అని అందరూ పొగుడుతారు.

వాళ్ళ ముత్తాత తాత ఊరికి చెరువు త్రవ్వించాడు. సత్రం కట్టించాడు. ఆయన బజార్న నడుస్తుంటే ఎవ్వరి కైనా కూర్చునే ప్రాప్తం ఉండేది కాదు మరి ఆడవాళ్ళు ఇళ్ళలోన పరుగెత్తేవారు. సీతారామారావు చిన్నతనం నుండి తన కుటుంబాన్ని గురించి గొప్పలు చెప్పటం వినేవాడు, అప్పుడతనికి రూఢీ అయ్యింది. 'డబ్బుదే ముంది? మనిషికి కావాల్సింది పేరు' అనీ అందుకే తన తండ్రికి పదివేలు ఖర్చు చేసి కర్మ చేయించాడు. ఆ పది రోజులు నిత్యాన్నదానం చేస్తాడు. అందర్నీ తృప్తి పరచి పంపిస్తాడు.

అతని మేనమామ అతనికి నలభైవేలివ్వాలి. ఒ రోజు మేనమామ పిలిచి, ఇంటికి తీసుకెళ్ళి మర్యాదలు చేస్తాడు. అతనికి అమితానందం కలుగుతుంది, మేనమామ కుంటుంభ పరిస్థితులు చెప్పి నేనంత ఇచ్చుకోలేను, పది ఎకరాల మాగాణి రాసిస్తాను అంటాడు. నువ్వు చదువు కున్నవాడివి మళ్ళీ సంపాదించుకోగల సమర్థుడివి అంటాడు. సంపాదించకపోతే నీకు సహాయం చెయ్యనా మావయ్యా? అంటాడు సీతారామారావు. ఆమె అత్తకి నలభైవేల అప్పు 10 ఎకరాలతో పోవడం సంతోషాన్ని కలిగి స్తుంది. సీతారామారావు తనకు రావల్సిన నలభైవేలకు గాను పది ఎకరాలు రాయించుకుని పరిష్కారం చేసు కుంటాడు.

ఆ రోజుల్లో, తండ్రి కోరిక నెరవేర్చాననే ఆనందం, వంశం పేరు నిలబెట్టాననే గర్వం అతనికుండేది. అతడు చిన్న తనంలో చాలా ఉన్నతమైన ఆశయాలు కలిగి ఉండేవాడు. మిగిలిన వాళ్ళు చిల్లర విషయాలలో పడితే ఇతను మాత్రం ఏదోటి చేస్తుండేవాడు.

పెళ్ళి చేస్కోటం, పిల్లల్ని కనటం, ఆరోగ్యం చెడగొట్టు కుని తిరగటం అతనికి నచ్చేవి కావు. ఎంత ఆలోచించినా ఈ మనుష్యులు ఏం సుఖం కోరి పెళ్ళిళ్ళు చేస్కుంటారు అని అనుకునేవాడు. స్నేహితులు కానీ, బంధువులు కానీ పెళ్ళి ప్రస్తావన తెస్తే నాకేమిటి పెళ్ళి? అనేవాడు. అందర్నీ చూచినట్టు తనని చూడటం తనకి కష్టంగా ఉండేది. అలాంటోడు పెళ్ళి చేసుకుంటానంటే అందరూ ఆశ్చర్య పోతారు. పెళ్ళి చేసుకుంటున్నావు నిజమేనా? అంటే అవును చేసుకుంటాను, నేను పెళ్ళికి నూతనార్థం కలిపి స్తాను. మీలాగ యంత్రాలకి బానిసను కాదు అంటాడు. రామారావు గురుకులంలో చదువుకుంటున్న సమయంలో ఇందిరను ప్రేమించి, పెళ్ళి చేసుకున్నాడు. ఆమె జీవితం ఆమెది, నాది నాదు అందులో ఆనంద డోలికలు అను కుంటాడు.

అతననుకున్నట్లు ఏం జరగలేదు. సంవత్సరం తిరిగే సరికి పాత్తిగుడ్డలు కరువైపోతాయి. భార్య బియ్యంలో రాళ్ళు ఏరడం మొదలుపెడుతుంది. ఆడ పిల్ల కు జన్మించింది. ఆనాడు భార్య నొప్పులు పడుతుంటే, 'ఈ హింసకు నేనే కారణం' మహాపాతకిని అని కన్నీరు కారుస్తా. కానీ ఏం లాభం ఐదు సంవత్సరాలు గడిచేసరికి ఇద్దరు పిల్లలు, మూడు గర్భస్రావాలు జరిగిపోతాయి.

అతడు జీవితం చేతిలో కీలుబొమ్మ అవుతాడు. మామ ఓ ఫారంలో గుమస్తాగా పని ఇప్పిస్తాడు. మామ సహాయం

తీసుకున్నందుకు కించపడతాడు. స్నేహితులు కొంటె నవ్వులు నవ్వుతారు. అతనికి మామ మీద కోపం వస్తుంది. అస్తమానం ఆయన గురించే ఆలోచించేవాడు. అతను లేపోతే కూతురుండేది కాదు, అప్పుడు పెళ్ళి ఉండేది కాదనీ బాధ పడేవాడు.

ఒక రోజు ఆఫీసులో ఎకౌంట్ పుస్తకంలో ఒక బొమ్మ గీసాడు. అది చూచి మేనేజరు మండిపడుతూ..... ఇదే మిటి? అనడుగుతాడు 'మామ' అని ఇకిలిస్తాడు, ఇహ్హి హ్హి అని నవ్వుతా. మేనేజరు ఉద్యోగం నుండి తొలగి స్తాడు. అయినా అతను బాదపడకుండా నవ్వి వెళ్ళి పోతాడు. తనకి ప్రపంచం మీద కసిగా ఉండేది. తనకు తెలిసిన వాళ్ళతో కూడా మాట్టాడే వాడు కాదు. తప్పుకుని తిరిగేవాడు.

ఇంట్లోకి కావాలిసిన అవసరాలు తీర్చేవాడు కాదు. బియ్యం లేవని భార్య అన్నా పట్టించుకునేవాడు కాదు. ఎవ్వరికైనా కనబడి 'ఏం చేస్తున్నారు? అంటే ఏముంది చేయ్యటానికి' అనేవాడు. ఈ ప్రపంచం అజ్ఞానుల కోసం చెయ్యబడ్డదే అవటం వల్ల వాళ్ళు సుఖపడుతున్నారు. హాయిగా జీవితం గడుపుతున్నారు అని అనుకునేవాడు.

'ఈ ప్రపంచం లో మనం చెయ్యదగింది ఏమీలేదు' అనేవాడు. ' ఆ సంగతి మాకు తెలుసు' అనేవాళ్ళు కొంత మంది కుర్రవాళ్ళు! 'తెలిస్తే మరి మీరేంటి చేసేది? అంటే 'మాకు ఏది సుఖమనిపిస్తే అది అనేవాళ్ళు'. సుఖం ఎక్కడుందీ? సుఖమంటే ఏంటి? అని ఆలోచిస్తే ఈ లోకంలో అజ్ఞానులే సుఖపడుతున్నారనీ వారికి ఆలో చనలు ఉండవనీ. తనకు అందని ఆదర్శాలతో హైరానా పడుతున్నారని అనుకున్నాడు.

రామయ్య తాత సీతారామారావుని పని చేయమంటే ఎందుకు ఇవన్నీ అందరూ ఎప్పుడోకప్పుడు చావల్సిందే అయినా తాపత్రయం ఏంటి? అనేవాడు. ఒకప్పుడు ఓ అభిప్రాయం మంచిది అనుకుంటాడు. మరుక్షణం దానికి వ్యతిరేకమైన అభిప్రాయం మంచిదిగా తోస్తుందతనికి. ఒక పని చేద్దాం అనుకుని, అనుకోకుండా దానికి వ్యతిరేక మైన పని మొదలు పెడతాడు. మధ్యలో ఆలోచించి పోనీ ఇదీ మంచిదేగా లేకపోతే ఎందుకు చెయ్యబుద్ధి అవుతుంది అనుకుంటాడు. అసలు ఏదో చెయ్యాలను కుంటాడు, ఏమీ చెయ్యకుండా కూర్చుంటాడు. అతని జీవితం ఆలోచనల పుట్ట అయ్యింది. కళ్ళు మూస్కుని పడుకుని బాహ్య ప్రపంచానికి దూరంగా ఆలోచిస్తాడు. ప్రస్తుతానికి పడుకుని ఆలోచించటమే అతని జీవితం.

**అసమర్థుని భార్య :**

సీతారామారావు భార్య గురించి చెప్పాలంటే, ఆమె పరిస్థితులను అర్థం చేసుకుని వాటికనుగుణంగా నడుచు కుంటూ ఉండేది. ఆమెకు తెల్లవారుజామునే కల్లాపి చల్లి ముగ్గేయటం అలవాటు. కానీ ఒకసారి సీతారామారావు మాసిన బట్టలతో ముగ్గేస్తుంటే నా పరువు తీస్తున్నావు అని ఆమె పై అరుస్తాడు. అప్పటి నుండి ఆమెకు అటు తొంగి చూడాలంటే నే భయం వేసేది. ఇంతలో పాల మనిషి వచ్చి 'అమ్మ ఇవ్వాళ్ళ పాల డబ్బులిస్తారా!' అని అడుగుతుంది. ఎంతంటే ఆమె 36 రూపాయలు అంటుంది. 'అంతా అమ్మో' అని మనసులో అనుకుం టుంది సీతారామారావు భార్య . నేను ప్రతి సారి అడగలేను కొంచెం మీరే ఇవ్వండమ్మా అంటుంది పాల ఆమె . సరే ఆయన లేవలేదు లేవగానే అడిగి తీసుకుని ఇస్తా అంటుంది రామారావు భార్య.

రామారావు ఇంట్లో బావిలోని నీళ్ళ కోసం అందరు జనాలందరు వస్తారు. ఆ ఊరిలో ఎవరింటిలో బావి లేదు. అందుకే అందరూ సీతారామారావు ఇంటికే వస్తారు. శీనయ్య కూడా నీళ్ళకు వస్తాడు. ఆమె శీనయ్యని ఇంట్లోకి కొంచెం నీళ్ళు పొయ్యమంటుంది. ఈ ఊరు ఎందుకు వచ్చావని శీనయ్యనంటే 'బ్రతకటానికి' వచ్చానంటాడు. బాగా డబ్బు సంపాదించి అతని గ్రామానికి తిరిగి వెళ్ళి పెళ్ళి చేసుకోవాలనేది అతని కోరిక.

బడికి వెళ్ళేముందు పిల్ల వాళ్ళమ్మతో చదువు చెప్పించు కోవటం అలవాటు. ఇవ్వాళ 'నాకు కుదరదు చదువుకో నువ్వే' అంటుంది అమ్మా. పిల్ల అంట్లు తోముతా అంటుంది. పిల్లని దగ్గరకి తీస్కుని 'నేనుండగా నీకెందు కమ్మా' అని బాధ పడుతుంది. కళ్లలో నీళ్ళు తిరుగు

తుంటాయి తల్లికి. బడికి వెళ్ళమ్మ అని నచ్చచెప్పితే లేదమ్మా నేను బడికి వెళ్తే మాష్టారు గారు జీతం అడుగుతారు. నాన్న ఏమో అడిగితే కోప్పడతారని అంటుంది. అందుకని తల్లి బలవంతం పెట్టలేకపోయింది.

శీనయ్య నీళ్ళు పోసి రాగా. కొంచెం బజారుకి వెళ్ళి కట్టెలు తేవాలంటుంది ఆమె. సరే అమ్మ డబ్బివ్వండి తెస్తానని అంటాడు. ఆమె లోపలికి వెళ్ళి కాంతమ్మని గోడ మీద నుండి పిలిచి 'అక్క ఓ ఐదు రూపాయలుంటే ఇవ్వవా...నా దగ్గర ఉన్న వాటి పెట్టి మొన్న జాకెట్టు కుంట్టించేశాను. ఆయనని అడగటానికి మనస్సు రావట్లేదు అని అంటుంది. సరేనమ్మ అని ఇస్తుంది. ఇంట్లో 5 రూపాయలు కూడా లేవంటే లోకువ అనీ, తన భర్త గౌరవానికి ఎక్కడలోపం వచ్చిపడుతుందో అని తప్పంతా తన మీదే పెట్టుకుని అడిగి శీనయ్యకిస్తుంది.

శీనయ్య కి డబ్బిచ్చి కట్టెలు, వెన్నపూస తెమ్మంటుంది. ఇంట్లో వెచ్చాలు కూడా ఐపోయాయి అని గుర్తొచ్చి పిల్లని పిలిచి సుబ్బయ్య కొట్టుకు వెళ్ళి వెచ్చాలు తెమ్మంటుంది. అది చిల్లర కొట్టు. అక్కడ వీళ్ళకి ఖాతా కూడా ఉంటుంది. పిల్ల ఏం కావాలో కాగితం పై రాయించుకుని అన్నీ తెస్తుంది. శీనయ్య వెన్నపూస కట్టెలు తేగా,. ఇంక ఈ రోజుకు కాపురం గట్టెక్కినట్లే అనుకుంటుంది ఆమె.

కానీ ఓ వైపు ఆమెకి బాధ తుమ్మితే ఊడే ముక్కుగా ఇట్లా కాపురం ఎన్నాళ్ళు జరుగుతుంది. ఎంత దూరం ఆలోచించి చూసినా ఒడ్డుకనపడట్లా. అలల తాకిడాకి ఈ ఓడ ఎప్పుడన్నా పుటుక్కుమన్నా అనొచ్చు అనుకుని తనలో తాను బాధ పడుతుంది.

'కాఫీకి పొయ్యి మీద నుండి పాలు దింపుతూ తన చేతులు చూసుకుంటే. అంట్లు తోమడం వల్ల గోళ్ళు అరిగినాయ్, ముంజేతులు మసితో నల్లబడి పోయాయి. మృదుత్వం లేదు. తన ఆకారం, స్వభావం అన్నీ మారి పోతున్నాయి. ఇంకా ఎక్కువ దూరం ఆలోచించ డానికి తనకు భయం వేస్తుంది. ఉదయమే 'నాన్న లేచారేమో చూడమ్మా అంటుంది పాపతో, 'లేవలేదు ఇంకా అన్నది. నేను లేపను బాబు కోప్పడతారు' అని అంటుంది పాప అది విని ఆమెకు చిన్నతనం గుర్తొస్తుంది.

ఆమె చిన్నతనం, తను చదువుకున్న రోజులులో ఆనాటి తన ఊహలు అన్నీ జ్ఞాపకం వస్తాయి. తను గురుకులంలో చదువుకున్న రోజులలో తన జీవితంలో కెల్లా మంచిరోజులనుకున్నది. ఎన్ని తియ్యని ఊహలు ఊహించుకున్నది. నిజంగా తన పెళ్ళి అయినప్పుడు అంతా తనను అదృష్టవంతురాలు అన్నారు. తనూ అలానే అనుకునేది. కానీ, అనుభూతికి వచ్చేటప్పటికి అంతా తారుమారు అయ్యింది. తప్పు ఎక్కడుందో తెలియడం లేదు అనుకుని నిరాశ పడుతుంది.

నాన్నని లేపమంటే కోప్పడతారు అంటావేంటి అమ్మ తను నీ నాన్న ఏమనడు అంటుంది. మొన్న కాఫీ ఆరి పోయిందని లేపడమే కష్టమా అన్నాడట. నిన్న కాఫీ కోసం లేపితే కోప్పడ్డారని లేపదు. తాను ఏం తప్పు చేశాను అనుకుంటూ మౌనంగా కూర్చుంటుంది.

వెంటనే తన చిన్నతనం జ్ఞాపకం వచ్చి. ఆడవాళ్ళకు ఎంత తెలివి ఉండి ఏం లాభం లే అది రాణింపుకు రాదు కదా? ఆ తెలివి బయట పడే అవకాశం భర్త ఇవ్వక పోతే అంతా బూడిదలో పోసిన పన్నీరు అవ్వాల్సిందే! అని అనుకుంటూ తన చిన్న నాటి జ్ఞాపకాలు తలపోసు కుంటుంది.

తన తండ్రిని నిద్ర లేపటానికి వెళ్లిన పాపను గురించి. 'ఈ పిల్ల జాతకం ఎట్లా ఉందో? అని అనుకుంటుంది'.

సీతారామారావు గ్లాసులో తప్ప కాఫీ తాగడు. అందు కనీ ప్రత్యేకంగా గాజు గ్లాసు తెప్పిస్తుంది. అది పిల్లలు ఎక్కడ పగలగొడతారో అనే భయంతో అతను కాఫీ తాగ్గానే అల్మారాలో దాస్తుంది అతని భార్య.

ఆ గాజు గ్లాసు కోసం నెమ్మదిగా లేచింది అతని భార్య నెమ్మదిగా లేచి అతనికి కాఫీ సిద్ధం చేయ్యడానికి వెళు తుంది.

## అసమర్ధుని ఆదర్శం :

సీతారామారావుకి కొద్ది రోజులు నుండి కలలు వస్తుం టాయి. తను చీమలు దూరని చిట్టడవిలో, కాకులు దూరని కారడవిలో తపస్సు చేసుకుంటున్నట్లు,. ఒక

నాగుపాము తన నెత్తి మీద పడగ విప్పి ఆడుతున్నట్లు, పూండ్లు గడిచిపోయినట్లు.....ఇలా వస్తుంటాయి కలలు.

తన చుట్లూ పుట్టలు మొలిచినట్లు, గోళ్ళు పెరిగి మెలితిరిగినట్లు, శరీరం శుష్కించి పోయి, ముఖంలో బ్రహ్మ తేజస్సు ఉట్టి పడుతున్నట్లన్నీ ఒకేసారి జరిగి పోతాయి. ఉండీ ఉండీ ఒక మెరుపు మెరుస్తుంది. ఆ మెరుపు తేజస్సుకి సింహాలు, పులులు అన్నీ మృగాలు నివ్వెరపోతాయి. రామారావు కన్నులు తెరచి చూడగా. పార్వతి పరమేశ్వరులు ప్రత్యక్షమవుతారు. వారిద్దరూ అర్ధ నారీశ్వర్లుగా ఉంటారు. వారు "సీతారామారావుని ఏం కావాలి" అని అడుగుతారు.

ఏం కావాలో కోరుకోమంటారు. అతను 'అన్నం' అన్నాడు. అందుకు శివుడు నీకు ఆకలి లేకుండా చేస్తాను అంటాడు. వద్దు దేవా 'నన్ను మోసం చెయ్యదలచితివా' అంటాడు సీతారామారావు. 'నాకు ఆకలి ఉండాలి - ఆకలి తీరే అన్నం ఉండాలి' అంటాడు. 'శివుడు తథాస్తు నీకు శుభం కలుగును గాక', అని శివుడు, పార్వతి మాయమైపోతారు.

ఆ వరం ఇచ్చిన తర్వాత సీతారామారావు రూపు రేఖలు మారిపోయి, గడ్డం ఊడిపోయి, . గోళ్ళు పెరిగి విచిత్రంగా మారతాడు. స్వర్గలోకం నుండి ఊర్వశీ, రంభా, తిలోత్తమ పంచభక్ష పరమాన్నాలు పళ్ళాలలో పెట్టుకుని ఆడుతూ, పాడుతూ తినిపిస్తుంటారు. ఇదంతా కల, నిజం కాదు.

కల చెదిరి, దురదృష్టవశాత్తు సీతారామారావు మంచం మీద కదిలి నిద్ర లేస్తాడు. దృశ్యం అదృశ్యం అవుతుంది. ఊహల తియ్యదనాన్నుండి ఒక్కసారి నిత్యజీవితం మీదకి దృష్టి మళ్ళేటప్పటికీ, అతనికి భరించలేని బాధ కలుగుతుంది. భార్యమీద కోపం వస్తుంది. ఎప్పుడూ పని పని... పొద్దున్న నాలుగింటికి లేచి రాత్రి పడుకునేదాకా ఏదోక పని చేస్తుంటుంది. తనకి ఆకస్మాత్తుగా జ్ఞాపకం వచ్చి తన భార్యకి తొమ్మిదో నెల అని కోపం ఎక్కువై పోతుంది. లేచినప్పట్నుంచి బియ్యం లేవు, పప్పులేదు. అనే మాటలు చెబుతూనే ఉంటుంది.

ఒకప్పుడు దీనిని ఎట్లా ప్రేమించానా అని ఆలోచిస్తూ కుళ్ళుకుంటా లేస్తాడు. ఆమె కాఫీ ఇస్తుంది. ముఖం కడుక్కుంటా అని, అంటే బెడ్ కాఫీ అలవాటైతే తప్పా... అని కోప్పడతాడు. అయినా ముఖం కడుక్కుంటే ఏంటి? కడుక్కోకపోతే ఏంటని లాక్కుని కాఫీ తాగేస్తాడు.

ఇంతమంది మేధావులున్నారు. వీళ్ళలో ఒక్కరు కూడా అన్నం తేలిగ్గా దొరికే పద్ధతి ఎందుకు కనిపెట్టరు? ఈ విప్లవాలు జరుగుతాయి. ఎప్పటికప్పుడు ఇంకా ఈ విధంగానే జరిగితే వర్గం లేకుండా అందరికీ సమానంగా ఎలా ఎప్పుడు అన్నం దొరుకుతుంది అని అనుకుంటాడు. ఇది అతనికేం నచ్చదు.

మన మహా ఋషులు ఈ సమస్యని పాశ్చాత్యుల మల్లే కాకుండా, సక్రమమైన దృష్టి తోనే చూశారు అను కునేవాడు. కానీ వెంటనే అతనికి మనం ఈ గడియ చచ్చినా చచ్చిపోవచ్చుగదా! యీ ఆరాటం ఎందుకు? అనిపించేది. ఈ లోగా ఏదోటి చెయ్యటానికి, ఏ సుఖం అనుభవించకుండా మరణిస్తే జీవితం వృధా అయి పోయినట్టేగా! అనుకునేవాడు. అతనికి పునర్జన్మ పై నమ్మకంలేదు.

ఎటు ఆలోచించినా, ఎంత లోతుకి పారజూచినా 'చచ్చేవరకు బ్రతకటం తప్పా ఈ ప్రపంచంలో చేసేది ఏమీలేదనే నిశ్చయం అతనికి రూఢీ అవుతుంది. అన్నం కోసం తాపత్రయపడటం నీచం అని తెలిసీ, తెలియనట్లు బ్రతకటం ఆత్మ వంచన అనీ ఈ రెండూ తనకు పనికి రావనీ అనుకుంటాడు.

తాను ప్రయత్నించడు. అన్నం దానంతట అదే వచ్చి పడాలి. సుఖాలు వాటంతట అవే వచ్చి తనకు ముసురు కోవాలి. ప్రయత్నించి సాధించడం గొప్పైనా? ఏ ప్రయత్నం లేకుండా జీవితం సాగాలి అని ఆలోచిస్తూ ఉంటాడు.

పాప వచ్చి తన నీ స్నేహితులు వచ్చారని చెప్పగా వాళ్ళలో వచ్చి కూర్చుంటాడు. ఒక వాళ్ళు సంభాషణ మొదలు పెడతారు ప్రాణం ఎలా వచ్చింది అని అడుగు తారు. ఎవరికి తోచింది వారు చెపుతున్నారు. మనం మరణిస్తే శరీరాలు నశిస్తాయని మట్టిలో కలిసి, అందులో

మరోరూపం పుట్టుకొస్తుందనీ, రక రకాల అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తుంటారు.

'నిర్నిమిత్తముగా పుట్టి, పరిణామం చెందే దాని ఫలితం మనకు విదితం. అసలు దానికే ప్రయోజనం లేనప్పుడు, మనకి ఆదర్శం ప్రయోజనం అనీ ఎక్కడనుండి వస్తుంది. నిర్నిమిత్తముగా పుట్టం' అని తేల్చేస్తాడు సీతారామారావు.

అందరూ ఏదోకటి చెయ్యాలని కాని, ఏం చెయ్యక్కర్లేదు అని కానీ ఎక్కడుంది అని అనుకుంటారు. అందరూ నిరాశ వెదజల్లుతున్నారు. ఆశా లేదు, నిరాశా లేదు, ఇంతకి తేలింది ఏమిటి అనగా తేలడానికేముంది? మనం నిర్నమిత్తంగా పుట్టాం. 'వీలుంటే బ్రతకటం లేదంటే చావటం' అని ముగిస్తాడు సీతారామారావు.

## అసమర్థుని మేనమామ :

ఉదయమే సీతారామారావు ఇంట్లో నుండి బయటకొచ్చేసరికి మేనమామ రాసిన ఉత్తరం ఉంటుంది. అంతకు ముందు వందరూపాయాలు కావాలని తను ఉత్తరం రాస్తే ఆయన జవాబివ్వలేదు. దాంతో ఇంకో ఉత్తరం రాసాడు. 'నాకు వందరూపాయలివ్వడం నీకు కష్టంగా ఉంది. ఒకప్పుడు నేను నీకు చేసిన సహాయం మరచి పోయినట్టున్నావు. నలభై వేల బాకీకి పది ఎకరాలు కట్టుకున్నాను. జ్ఞాపకం ఉందా? మళ్ళీ నాకు డబ్బు కావలిస్తే నిన్ను పొలం అమ్మమంటే ధరలు పడిపోయాయనీ వంక చెప్పి వెయ్యిరూపాయలకు కొనుకున్నావు. విశ్వాసం లేదు. ఒక వందరూపాయలు పంపలేక పోయావా? మా ఇంటికొచ్చిన కుక్క నయం. ఓ పూట అన్నం వేస్తే ప్రతిరోజు ఇంటికి కాపలా ఉంటుంది. అది విశ్వాసం గల జంతువు. నీకిచ్చిన డబ్బుకి ఎన్ని కుక్కలు వచ్చేవా అని ఆలోచిస్తున్నా"! అంటాడు.

ఇది మేన మామకి రాసిన ఉత్తరం సారాంశం అంటాడు. దానికి జవాబు ఈ కవరు. అది చూసి కుతుహలంలో చదవడం మొదలు పెట్టాడు.

"నాయనా నీ ఉత్తరం అందింది. వందరూపాయలకు రాసిన ఉత్తరం కూడా అందింది. మనసులో ఉద్దేశాలు బయటకొచ్చినందుకు సంతోషం, నీ తండ్రి, తాత విషయం కూడా నేను పూర్తిగా ఎరుగుదును. పదిమంది చేత పొగిడించుకోవాలనే ఆశ మీకు ఉంది. అది తీర్చుకోవడానికి మంచి, చెడు రెండు పనులు చేసింది నీ కుటుంబం. మీ దాతృత్వం వల్ల కొంత మంది లాభించినా, మీ స్వాతిశయం వల్ల కొంత మంది ఎంత బాధపడేవారో మీకు తెలియదు. నీ చిన్నతనంలో మీ తల్లి ఉన్నప్పుడు మీ ఇంట్లోనే ఉండేవాడ్ని. ఆస్తి పాస్తులు లెక్క చూసుకోవటం జమ ఖర్చులు, చూసుకోవటం, అజమాయిషీ కనుక్కోడం మీ నాన్నకి పనులుగా కనిపించేవి కావు. మేం ఈ పనికి బాగా పనికొస్తాం అని నమ్మకంతో పిలిపించి మేనేజిమెంటును ఒప్పచేసాడు.

మేము మీ ఇంట్లో అడుగు పెట్టినప్పటి నుండి పడిన బాధలు, అనుభవించిన కష్టాలు మీకు తెలియవు. కానీ నేను మీ ఇంట్లో పడిన సుఖం నా చెల్లికి అంటే మీ తల్లికి తెలుసు. నీ తండ్రి ఎప్పుడూ మమ్మల్ని ఆయనతో సమానంగా చూసేవాడుకాడు. ఎప్పుడూ పరాయివాళ్ళగానే, నౌకర్ల గా చూసేవాడు, నా వంశం అనే అహంకారం ఆయనలో జీర్ణించుకుపోయి తెలియకుండానే చేశాడు. మీ వాళ్ళు అన్నాలు ముగించే వరుకు మాకు తినే ప్రాప్తంలేదు. ఒకరోజు మీ అమ్మ ఎందుకో విస్తరిలో వడ్డించింది. అందుకు మీ నాన్న 'విస్తరి కావల్సి వచ్చిందే? అన్నాడు'. ఆ రోజు మీ అమ్మ ఎంత ఏడ్చిందో మనం 'వెళ్ళిపోదాం అన్నయ్య' అని కుళ్ళి కుళ్ళి ఏడ్చింది.

అది మీ ఇంట్లో ఏం సుఖపడింది? పేద కుటుంబం అయినా గొప్ప కోసం మీ నాన్న మా చెల్లిని చేసుకున్నాడు. ఏ రోజైనా పరిశుభ్రంగా ఉంటే మా ఇంటికొచ్చి ఎన్ని నేర్చుకున్నావే. అంది నీ మేనత్త. పుట్టుకతో నేర్చుకోవాలని అంది. మురికిగా ఉంటే శుభ్రంగా లేదని తిప్పేది. దాని ఇంట్లోనే అది పరాయిదిలా బ్రతికింది. నీ మేనత్త ఎలాంటిదో నీకేం తెలుసు? అయినా అది మీ కుటుంభంలోనే ఉంది ఆమె సంగతి గతి ఏమైంది. భర్తని విడచిపెట్టి అయినా మీ కుటుంభంలో మీ యింట్లోనే ఉండేది. చిన్నప్పుడే భర్తని వదిలి అసూయ ద్వేషంతో ఉండేది. ఇలా బ్రతికాం మీ యింట్లో. మళ్ళీ నువ్వు కడుపున పడ్డాక

మీ అమ్మ చాలా సంతోషించింది. కానీ నువ్వు పెరుగుతున్న కొద్దీ మళ్ళీ మీ అమ్మకి విచారం 'వాడు మనలాంటోడు కాదు అన్నయ్య' వాళ్ల నాన్న పోలికలే అని కన్నీరు పెట్టుకుంది.

ఆ మాటలు విని నిన్ను గమనిస్తే నీలో అన్నీ మీ నాన్న లక్షణాలే. ఇంట్లోకి వచ్చి మీ నాన్న లాగా అప్పులు చేస్తూ ఉండే వాడివి. పులి కడుపున పులే పుడుతుంది అని మీ నాన్న నిన్ను చూసి మీసం దువ్వేవాడు.

నేను అహర్నిశలు మీ పొలం మీద పనిచేశాను, చేయించాను. కానీ ఏం లాభం? నేను వసూలు చేస్తే మీ నాన్న ఖర్చుపెట్టేవాడు. నాకెందుకు వచ్చిన శ్రమ ఇది? అని, ఎవరికోసమని నా మనసు మారింది. నేను దూరంగా ఉన్నా.

నిన్ను పిల్చుకుని బాకీ పరిష్కారం చేసుకున్నా. నలభై వేల పొలం పదివేలకు కట్టుకుని నీ వంశ గౌరవం నిలబెట్టావు. నీ ఆనందానికి నన్ను ఉపయోగించుకుని 'నీ కోసం అని చేసా. విశ్వాసం లేదని నిందించడంలో అర్థం ఉందా?

ఈ మధ్య నీ మామా వచ్చాడు. నీ పరిస్థితి, నీ ప్రవర్తన విపులంగా చెప్పాడు. నీ దగ్గరుంటే పిల్లలు చెడిపోతారేమో అని, వెంట రమ్మని అంటే కూతురు ఒప్పుకోలేదంటు మంచి ఆడవాళ్ళు నీ లాంటి పురుషుల భార్యలే అవుతారు" ఇవీ ఆ ఉత్తరంలోని విషయాలు.

ఉత్తరం చదువుకునేప్పటికి సీతారామారావుకి అయోమయం కలుతుంది. ప్రతీ అక్షరం చాకై అతనికి హృదయంలో గుచ్చుకుని బాధపెడుతుంది. ఆ ప్రేమా, అభిమానం వొట్టి నటనేనా? అనుకుంటాడు. అతని కోసం తను త్యాగానికి సిద్ధపడితే ఎంత నీచంగా ఆలోచించాడు తన మేమ అని అనుకుంటాడు.

అతనికి ద్వేషం వస్తుంది. ప్రపంచంలో ప్రతీ ఒక్కడూ తనను మోసగిస్తూనే ఉన్నారు. చదువుకునే వాడికి, తెలివి తక్కువ వాడికీ, చవటకీ అందరికీ తనే లోకువే అనుకుంటాడు. తన మేనమామకి ఘాటైన ఉత్తరం రాయాలని కలం కాగితం తీసుకుంటాడు. కానీ ఏమని రాసేట్లు? ఆయన ఉత్తరానికి జవాబేమి ఉంది రాయడానికి.

తన మామ వెళ్ళి మేనమామతో మాట్లాడటం మరీ మంటగా ఉంది. అయితే తనేం చెయ్యగలడు. ఏమి తోచక మేనమామ అని బొమ్మ వేసుకుంటాడు హేళనగా.

**అసమర్థుని ప్రతాపం :**

మేనమామ ఉత్తరం సీతారామారావు హృదయాన్ని అగ్ని గుండంగా మారుస్తుంది. పొద్దునే లేచాక బయటికి వెళ్ళితే కాకి పొడుస్తుంది. అది కేవలం తననే మాత్రమే పొడుస్తుంది. ఈ లోపు పక్కింటి ఎరుకుల్ది వచ్చి, చూడండి బాబు! మా పిల్లని ఎలా బాదిందో! లేనోళ్ళం అని ఇలా చేస్తారా... మీ పిల్లని పిలవండి? అంది.

ఇలాంటి వాళ్ళతో చిక్కులు తెచ్చి పెడుతున్నందుకు కూతురు మీద కోపం వస్తుంది. 'ఎందుకు కొట్టావు? అని అడుగుతాడు. కూతురు ఏం మాట్లాడలేదు. గట్టిగా అడిగిన ఏం చెప్పలేదు. ఎరుకల్ది చూస్తూ నిలబడుతుంది. ఏం చెప్పాలో తెలియక కూతుర్ని బాదాడు. ఆమె తట్టుకోలేక తనే ముందు కొట్టిందని అంది. ఎరుకల్ది ఎన్ని అబద్ధాలు ఆడత్తావని తిడుతుంది. అతనికి భయం వేసింది. దాని నోటికి అడ్డూ ఆపు లేదా... అని బాధ పడ్డాడు. ఇక నుంచున్నావే కొట్టాగా అన్నాడు. ఎరుకల్ది వెళ్ళిపోతుంది.

కోపం తగ్గగానే పశ్చాతాపం కలిగి అతనికి గుండెలు చెదిరాయి. ఆ పిల్ల ఏం చెయ్యకుండా ఉంటే కొట్టినందుకు బాధపడుతుంది. ఆ పిల్లని దగ్గరికి పిలిచి "'ఏమ్మా అడగగానే ఎందుకు చెప్పలా?' అని అడిగాడు. నువ్వు కొడతావని భయం వేసిందని అంటుంది ఆ పిల్ల. సపోట పళ్ళు ఎత్తుకుపోతుంటే కొట్టానంటుంది. తన తప్పు లేకుండా కొట్టినందుకు బాధ పడతాడు. నాతో చెప్పక పోయావా అంటే 'మొన్న చెప్తే నువ్వే కొట్టు నాకెందుకు చెప్తావు అన్నారుగా' అని అంటుంది. ఎప్పుడేమి చేస్తాడో ఎలా ఉంటాడో ఎవరికీ అర్థం కాడు. చివరికి తన పిల్లకి కూడా.

నిజమే అతనికి పిల్లల కష్టాల్లో జోక్యం కలిగించుకోవటం చాలా అయిష్టం అతని కళ్ళలో నీళ్ళు తిరుగుతాయి.

అతనికి ఏం అర్థం కాదు. ఒక క్షణం ఒకటి మంచిదని ఇంకో సారి ఇంకొకటి మంచిదని అనిపిస్తుందతనికి. ఒక్కో క్షణం లో తాను చెప్పిందానికి మరుక్షణం విరుద్ధంగా ప్రవర్తిస్తూ ఉంటాడు. తనకి తానే అర్థం కాడు.

చూడమ్మా! ఆ... చిల్లర వాళ్ళు తగని వాళ్ళు, వాళ్ళ నోళ్ళు మంచివికావు. వాళ్ళతో తిరక్కు అంటాడు. తన భార్య చిల్లర వాళ్లతో తిరగొద్దంటే, తిరిగితే ఏంటి? వాళ్ళూ మనుషులు కాదా? అందరితో తిరిగి అన్నీ తెలుసు కోవాలంటాడు. ఇప్పుడు అదే తప్పనిపిస్తుందతనికి.

అతనికి ప్రపంచం ఏకమై తనను హింసిస్తున్నట్లు అని పిస్తుంది. ప్రపంచ భారమంతా తనొక్కడే మోస్తున్నట్లు అనిపిస్తుంది. తన భార్యతో తన ప్రవర్తనకు క్షమాపణ చెప్పుకోవాలనుకుంటాడు. 'నాకు బాగా బతకాలని ఉంది, నిన్ను సుఖపెట్టాలని ఉంది. కానీ చేత కావటం లేదు'. అని చెప్పుకోవాలనుకుంటాడు. తన హృదయం విప్పి తన ముందు పెడితే శాంతి లభిస్తుందనే ఆశ కలుగుతుంది.

భార్య మీద ప్రేమ బహిర్గతం చెయ్యాలనుకుంటాడు. కానీ ఎలా...? అన్నం పెడితే 'కొత్త కూర వండావా?' అంటాడు. ఆమె మాట్లాడదు. 'ఇవాళ ఇస్త్రీ చీర కట్టావా?' ఆమె మాట్లాడదు. 'ఒంట్లో బాలేదా?' అంటాడు. 'బాగా లేకేం బాగానే ఉంది'. అంటుంది. అతనికి కోపం వస్తుంది. మొదట్లో చెప్పిన మాట వినేది. ఇప్పుడు ఇలా తయారైంది. తనకు కోపం వస్తే భార్య వెళ్ళిపోతుంది. ఆమె అలా వెళ్ళిపోయేసరికి, తనకు నుంచోవటమే కష్టం అయ్యిందా! అని నేను తిననని పళ్ళెం నెట్టేసి వెళ్ళిపోతాడు.

ఎక్కడ జరిగిందో పొరపాటు? ఎవర్లో ఉంది తప్పు? అని ఆలోచిస్తూ పడుకుంటాడు మీరు తినకపోతే తినను అనేది. ఇప్పుడు తినటం లేదుగా అని అనుమానం వచ్చి, మంచి నీళ్ళకోసం అన్నట్లు వంట గదిలోకి వెళ్తాడు. వెళ్ళి మంచినీళ్ళు తాగి, మంచినీళ్ళు ఇవ్వటం కష్టంగా ఉందా. అని అరుస్తాడు. ఆమె మాట్లాడదు. తనకి ఆకలి వేస్తుంది. అయినా 'నేను తినను నే ఛస్తే నీకేంటి?' అని నువ్వు సుఖంగా ఉండి చావు అంటాడు, భార్యతో.

అక్కడ్నుంచి వచ్చి ఏంట్రా చేసింది? అని ప్రశ్నించు కుంటాడు. రొమ్ము మీద దబ దబ గుద్దుకోవటం మొదలు పెడతా, ఇంట్లో అలికిడి లేదని భార్య ఆత్మ హత్య చేసు కుందనే భయం కలిగి ఏం తెలియనట్టు బయటికి వెళ్ళి బావిలోకి తొంగి చూస్తాడు. బుడగలు కనిపిస్తాయి. అతని గుండె దడ దడ కొట్టుకుంది. వెనుక నుండి భార్య వస్తుంది. 'ఏం చేస్తున్నావక్కడ' అంటాడు. ఆమె మాట్లా డదు. చూస్తూ నిలబడుతుంది.

'ఏం కొడతావా' అంటాడు. 'నేనెందుకు కొడతాను' అంటుంది. అయితే నేను కొడతాను అంటాడు. చెంప మీద చెడేలు అని భార్యను కొడతాడు. పాప కెవ్వు మంటుంది. అతని శరీరం భయంతో వణకి పోతుంది. ఆయాసం ఎక్కువై వగర్రు పుడుతుంది. చుటూ ఉన్న వస్తువులు ఏమి కనిపించవు లేదతనికి; అంతా అయో మయం అవుతుంది. లోపల నరాలు చెటేలు చెముున తిరుగుతున్నట్లు అనిపించింది.

బజార్లో అందరూ నడుస్తూనే ఉన్నారు. ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటూనే ఉంటారు. ప్రపంచం యధా ప్రకారం నడుస్తూనే ఉంటుంది. సూర్యుడు పడమట అస్తమిస్తాడు. తూర్పున ఉదయిస్తాడు తను భార్యని కొట్టడంలో ఈ ప్రపంచానికి ఏమి సంబంధం లేదు

అతనికి గింగిర్లు ఎత్తినట్లు అనిపిస్తుంది. శరీరం అంతా సూదులు గుచ్చుతున్నట్లు ఉంటుంది. అక్కడ ఉండ లేకపోతాడు.

## అసమర్థుని అంతం :

సీతా రామారావుకి ఇంట్లో ఉన్న ప్రతీ వస్తువూ తనను ఎక్కిరిస్తునట్టూ ఉన్నట్లుంటుంది. గోడకు ఉన్న పెళ్ళినాటి ఫోటో చూస్తాడు. తర్వాత తన డైరీ తీసి చదవటం మొదలు పెడతాడు. తనకు మల్లే అనిపించదు. అతనికి. అప్పుడు అతనూ, తన భార్య సముద్రం దగ్గర కూర్చుని మాట్లాడుకుంటూ. 'నీవు నన్నంత ప్రేమిస్తున్నావు' అంటే ఆమె సిగ్గుపడుతుంది. 'చెప్పు ఎప్పట్నుండి?' అని ఆమె అనగానే చూసినప్పట్నుంచి అంటుంది ఇద్దరూ ఆప్యా యంగా కలిసి అంతా తిరుగుతారు. అప్పుడు తామిద్దరూ

ఉన్నత స్థాయిలో ఉన్నట్లు భావిస్తారు. ఇంక చదవలేక డైరీ మూసేస్తాడు రామారావు.

గబ గబా వెళ్ళి అద్దంలో ముఖం చూసుకుంటాడు. అతని గుండెలు పగిలిపోతాయి. సన్నని భయంకరమైన మూలుగు అతని కంఠం నుండి 'నేనెవర్ని? పిశాచినా? ఎవర్ని నేను' అనుకుంటాడు.

ఇంట్లో నుండి వచ్చేసి బజార్న నడుస్తూ ఆలోచిస్తూనే ఉంటాడు. అతను 'నానాటికి తీసి కట్టు నాగంబాట్లు'గా ఉండటానికి కారాణాలు పోగుచేసుకుంటాడు. ఈ విచిత్ర వ్యక్తిలో మరి విచిత్రం ఏంటంటే ఇతను ఆకలికి దాసుడు.

నేనిలా అవటానికి స్నేహితులే కారణం అను కుంటాడు. వాళ్ళ వల్లే చెడిపోయాననుకున్నాడు. మళ్ళీ ఒకరి వల్ల చెడటం ఏమిటి? అనుకుంటాడు

రోడ్డు మీద నడుస్తున్న సీతారామారావు బిగ్గరగా నవ్వుకుంటాడు. అతను వెళ్ళే ప్పటికి రామయ్య తాత మనవడితో 'గుర్రం ఆట ఆడుకుంటా ఉంటాడు. అది చూసి సీతారామారావు నవ్వి తాతతో 'ఈ జీవితం చూశావు.... పిచ్చివాడి రూపంలో ముడ్డి మీద తంత్రం ఉంది. కానీ కొంతమందికి బుద్ధి రాదా అంటాడు, రామయ్య తాత.

అతనికి అకస్మాత్తుగా తన భార్యను కొట్టినందుకు ఎత్తి పొడుస్తున్నట్లు చనిపోవాలనుకుంటాడు.. చావ దలచిన వాడుకి ముక్కు తడుపు చూడాలని ఉంది అంటాడు. చూసి చనిపోవాలనుంది అంటాడు. చావ దలచిన వాడుకి కోర్కెలు ఉండటం మంచిది కాదు. బబూ! అంటాడు తాత. అతనేదో విధంగా తగాదా పెట్టుకోవడానికి ప్రయత్నిస్తాడు. తన భార్యని కొట్టడంలో తప్పేముంది. పరిస్థితుల్ని బట్టి కొట్టానని అంటాడు. దేవుళ్ళు చేయలేదా? అంటాడు.

అందుకు తాత 'మూర్ఖుడా శారీరక తృప్తికోసం, పశు వాంఛ తీర్చుకోవడానికే నీ అసమర్ధతను కప్పిపుచ్చు కోవడానికిలా చేస్తున్నావు. అని వెళ్తావా నువ్వే బయటికి గెంటించుకుంటావా' అంటాడు. ఏంటి తాత అంటే వెళ్ళు అంటే వినలేదని కర్రతో వెనకాల పడతాడు.

సీతారామారావు బజార్న పడతాడు. ఎక్కడికి అని ఎవరో అడిగితే నాకేం తెలుసు నా కాళ్ళని అడుగు అని అంటాడు.

దూరంగా నాయకులంతా ఓ ప్రసంగం నడిపిస్తుం టారు. అందరూ గావుగా మాట్లాడుతుంటారు. అది విని సీతారామారావు అక్కడికి వెళ్ళి వేదిక ఎక్కి వారందరి గురించి వాస్తవాలు చెబుతారు. వారు చేసిన హత్యలు, మానభంగాలు గురించి వారెదుటే ప్రసంగిస్తాడు.

'వీడు పిచ్చి వాడు' అని అంటారు. వాళ్ళు. సీతా రామారావు అదేం వినకుండా ప్రసంగిస్తూనే ఉంటాడు. జనాలుకు కూడా బుద్ధి లేదా. అన్నీ తెలిసి ఇలా నిశ్శబ్దంగా ఉంటారని. అని నోరు పారేసుకుంటారు.

కొట్టండి వీడ్ని అని జనాలంతా వచ్చి పట్టుకుని కొడ తారు. రామయ్య తాత వచ్చి ఎలా ఉంది బాబు! అంటే పర్లేదు అంటాడు. తాత మీ మనవరాలికి నన్ను క్షమించ మని చెప్పు అంటాడు. అది నిన్ను ఎప్పుడు క్షమిస్తుంది అంటాడు. తాత. ఇద్దరూ అలా మాట్లాడుకుంటూ ఊరి చివర వంతెన దగ్గరకు చేరుకుని కూర్చుంటారు.

సీతారామారావు తాత మాట్లాడటం మొదలు పెడ తాడు. 'జ్ఞాన బండారం ఎప్పటికప్పుడు నింపుకుంటావు కానీ అది ఇతరులకి అభివృద్ధి చేసేదైతే ఉపయోగ పడుతుంది. నాయనా లేకపోతే జాతి నాశనం అవుతుంది. ఇప్పుడు నీ గతి కూడా ఇదే నీకున్న జ్ఞానం తో సమస్యల ఒత్తిడిలో నువ్వు కొత్త మార్గాన్ని వెతకగలవు నువ్విలా చేయలేదు. ఈ ప్రపంచంలో చేయడానికేం లేదన్నావు' అని తాత వివరంగా చెబుతాడు, అందుకు రామారావు 'నాకు జ్ఞానం ఉందని' అంగీకరించావు కదా తాత అంటాడు. జ్ఞానం ఒకటే మానవునికి సహాయపడదు. ఉపయోగపడేటట్టు చేసే మనస్తత్వం కావాలి. తాను జ్ఞానాన్ని సంపాదించాడు కానీ జీవితపు లోతుల అనుభవం లోకి రాలేకపోతాడు. మానవులు పది మంది కలిసి ఓ చోట చేరి భవిష్యత్తును నిర్ణయించి ఈ బాధలు లేని సంఘం ఎలా ఉంటుందో ఊహించుకుని దాని కోసం పాటు పడ్డారు. దీనినే మానవ పరిణామ దశలుగా వర్ణిస్తాం

అంటాడు తాత. అలా మొత్తం బోధిస్తాడు. రామయ్య తాత వెళ్దాం అంటే నేను కాసేపాగి వస్తా అని స్మశానం దగ్గరుకు వెళ్తాడు. అక్కడ చితిని చూస్తూ తన గుండెలో మనశ్శాంతి చేర్చుకున్నాడు.

అతనికి ఆలోచిస్తే సమాధి నుండి 'బాబు నువ్వు మారావు అని నేను సంతోషించా' అని అన్నట్లు అని పిస్తుంది. మా అమ్మని సంతోషపెట్టా అని కన్నీరు కారు స్తాడు. చీకటి పడుతుంది. అక్కడే ఎంతోసేపు ఏడుస్తూ ఉండిపోతాడు.

ఎదురుగా విషం కక్కుతూ ఓ ఆకారం, కళ్ళు జ్యోతుల్లా మండుతున్నాయి. ఆ ఆకారం తన మీదకి దూకింది. గుప్పిళ్ళు బిగబట్టి మోహం మీద గుద్దుతూ ఉంది. రక్తం, కండలు, ఎముకలు, పేగులు - స్మశానం అంతా భీబత్సం.

సీతారామారావు పళ్ళు బిగించి. పిడికిలి బిగబడతాడు. శక్తినంతా కేంద్రీకరించి దాని గొంతు పట్టుకుంటాడు. మెడ నులుముతాడు. తన కళ్ళు నెత్తురు గుడ్లుగా ఊడిపడ తాయి. తన మెడ కోడి మెడ విరిచినట్లు విరిగింది. ఒక సన్నని భయంకరం అయిన మూలుగుతో కూలబడతాడు. తనను హత్య చేసుకుంటాడు.

తెల్లారి స్మశానంలో ఎవ్వరో చచ్చిపడున్నారని ఊరంతా చెప్పుకుంటా ఉంటారు జనాలు వెళ్తారు. శవానికి కాళ్ళు లేవు వంటి నిండా దెబ్బలే, మెడ మెలితిరిగి వుంది.

'ఎవరో పొడిచి చంపారు' అనుకుంటా ఉంటారు.

రామయ్య తాత వచ్చి చెప్పే వరుకు ఆ శవం సీతా రామారావు దని బాగా ఎరిగిన వాళ్ళు కూడా గుర్తు పట్టలేక పోయారు. అలా సీతారామారావు చచ్చిపోతాడు.

జీవితంనికా పిరికితనం, సోమరితనం, అర్థంకాక పోవడం, వితర్క వాదాలు అన్నీ సీతారామారావుని అస మర్ధుని చేసి చంపేస్తాయి. జీవితం తనకి ఓ పట్టాన అర్థం కాదు. గొప్ప మానసిక సంఘర్షణను చిత్రించిన మనో విశ్లేషణాత్మక నవల ఇది. మనసు పొరల్లోని అంత:

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# ఆవిష్కరణ పరిధిలో సృజన, పరిశోధన, విమర్శ !

డా॥. పి. ఎ. సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, ప్రభుత్వ కళాశాల (అటానమస్), రాజమహేంద్రవరం.

**ముఖ్యాంశాలు :**

- అవసరాలు, ఆవిష్కరణ మూలాలు, ప్రక్రియ ప్రాతిపదికగా ఆవిష్కరణలకు ఆయా పేర్ల వ్యాప్తిలోకి రావడం.
- విమర్శ, పరిశోధన, సృజనల మౌలికతత్త్వం ఆవిష్కరణే అని సిద్ధాంతీకరించడం.
- 'ఆవిష్కరణల ప్రాతిపదిక'లే ఆవిష్కరణల విలువను నిర్ధారించడం.

## సృజన - స్రష్ట :

కవిత్వం ఎందుకు రాస్తారు? ఎందుకు చదువుతారు? అసలు నేనెందుకు రాస్తాను? ఎందుకు చదువుతాను? కవి ఊర్ధ్వ లోకాల్లోకెళ్ళి మార్మిక సత్యాలను విహంగంలా కనిపెట్టి తనదైన పనితనంతో ఆవిష్కరిస్తాడు. దానికి సామాజిక ప్రయోజనం ఉందని లేదని రాద్ధాంతాలు చేసుకుంటూ తన్నుకు చస్తారు విమర్శకులు. అందలాలు ఎక్కించాలా? వద్దా? అన్నది తేల్చే పనిలో వాళ్ళు మునిగి పోయి మహా పరిశోధకులయిపోతారు కవికి వీటితో పనిలేదు.

హైకూలను పులిహోర కవిత్వం అంటారు కొంతమంది ఎమినెంట్ స్కాలర్లు. దీనికి భిన్నంగా ఇస్మాయిల్; స్వేచ్ఛా కవిత్వాన్ని చదివి నియంతలు పంచెలు తడుపుకునే వాళ్ళని కవుల్ని జైల్లో పెట్టించేవారని అన్నాడు.

పులిహోర, ప్రోగ్రెసివ్, సబ్జెక్టివిటీ, ఆబ్జెక్టివిటీ, కాంప్లెక్సిటీ, ఏంబిగ్విటీ ఉత్తి స్వభావోక్తి లాంటి మాటల్ని పక్కనపెట్టి కవిత్వం గుండెను తాకిందా ? లేదా ? అన్నది గీటురాయి. కవిత్వం గుండెను తాకిందంటే చాలు అప్పుడు అన్ని ప్రయోజనాలు ఆల్ఇన్వన్లా వచ్చేస్తాయి.

సైంటిస్టుల కంటే కవులకు పెద్ద పీట వేయడం చాలా తరచుగా చూస్తాం. మెకానిక్ను మంచి కళాకారుడుకి సమాజం ఎక్కువ విలువ ఆస్వాదిస్తుంది. కిటుకు ఏంటంటే భౌతిక సౌకర్యాల కంటే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, సామరస్యాన్ని కోరతాడు మనిషి. ఈ భావ విప్లవాన్నే ఏదో రకంగా నినదిస్తుంది కవిత్వం.

అసలు పరిశోధకులంటే విమర్శకులు అని భ్రమపడుతున్నారు అకడమిషియన్లు. సృజనను ఆవిష్కరణ నుంచి వేరు చేసి చూట్టంలోనే ఈ పేచీ అంతా! అందాల భరిణలో ఆభరణాన్ని చూడలేక పోవటం వల్లనే ఇదంతా! కవి వెదికిపట్టుకున్న 'వస్తువే' ఆవిష్కరణ దాన్ని కనిపెట్టి వెలికి తీసి అందమైన 'అభివ్యక్తి'లో సృజిస్తాడు. ఈ అభివ్యక్తి ముడులు విప్పి కవి అమూల్య 'వస్తువు'ను పాఠకులకు బట్వాడా చేసేవాళ్ళే విమర్శకులు.

మామూలు జనానికి కనపడని దాన్ని వెదికి ఆవిష్కరించిన వాణ్ణికాదని కేవలం కవి సృజన తాలూకు అభివ్యక్తి ముడుల్ని విప్పినవాళ్ళను పరిశోధకులంటాం. అసలు శోధకుడు కవే అని సత్య ప్రకటన చేయాలి.

'రవిగాంచని చోట కవికాంచడం' ఎందుకు అంటే గాలి ఎందుకు వీస్తుంది ప్రాణాలను తెప్పరిల్లింప జేయడానికా? సృష్టికి చేతనత్వం ధారవోయడానికి కంకణం కట్టుకుందా? లేదు. దాని పని అది చేసుకుపోతుందంతే.

కవి కూడా అంతే ! కీర్తి కిరీటాల కోసం కాదు రాసేది. విశ్వశ్రేయం కావ్యం అంటే ప్రాచీనం - ఆధునికం, శైవం - వైదికం, దేశీ - గీర్వాణం లాంటి ద్వంద్వాలలో వైవిధ్యాన్ని చూడాలి కాని వైరుధ్యాన్ని కాదు. ఉచ్ఛనీచాలు ఆపాదించడం కాదు కావల్సింది. విభిన్నత, వినూత్నత ప్రత్యేకతల్ని గుర్తించడం. తరతమ భావాల్ని ఊడ్చిపారేసి కవిని కవిత్వాన్ని గౌరవించాలి. వాళ్ళు జగతికి శ్రేయాన్ని ప్రియాన్ని బహూకరిస్తారు కాబట్టి.

## విమర్శ - పరిశోధన :

విప్పి చెప్పేది విమర్శ కప్పి చెప్పేది కవిత్వం అనే మాట నానుడి కావటం అందరికీ తెలిసిందే. కప్పి చెప్పినా

విప్పి చెప్పినా 'చెప్పటం' మాత్రం రెంటిలోను సాధారణం అంశం.

చెప్పటం అంటే ఏమిటి 'చెప్పటం'లో ఏం చెబుతున్నామో ఎలా చెబుతున్నామో అన్న రెండు అంశాలు 'చెప్పటం'లో ఉంటాయి. ఏం చెబుతున్నామో అన్నప్పుడు వస్తువు అని, ఎలా చెబుతున్నామో అన్నప్పుడు అభివ్యక్తి అని స్ఫురణకొస్తాయి. ఈ వస్తు అభివ్యక్తులు రెండూ రకరకాల ప్రక్రియల్లో రకరకాలుగా ఆవిష్కృతమవుతాయి. ఈ ఆవిష్కరణ కోసమే ఏ రచయిత అయినా రచించేది! ఆవిష్కరణ వస్తుముఖంగాను, అభివ్యక్తి ముఖంగాను మనం పరిశీలిస్తే ఆయా లక్ష్యాలనుద్దేశించి ఆయా రచనలు రకరకాల ప్రక్రియల్లో ఆవిష్కృతమవుతాయని తెలుస్తుంది.

పరిశోధన, విమర్శ, సృజన రంగాలకు ఈ ఆవిష్కరణే ప్రధాన భూమిక. పరిశోధనలో పరిశోధకుడు ఆయా సృజనాత్మక రచనలలోంచి ఆయా సిద్ధాంతాలను నిర్మిస్తాడు.

విమర్శలో విమర్శకుడు ఆయా రచనల గుణ దోషాలను అలంకార శాస్త్ర సామగ్రి ఆధారంగా వివేచిస్తూ ; వస్తు, అభివ్యక్తుల పరంగా మరింత మెరుగైన రచనల కోసం బాటలు సిద్ధం చేస్తాడు.

స్రష్ట కావ్య పరమార్థాన్ని నిక్షిప్తం చేసి గూఢంగా లోకంలోని వస్తువును తనదైన పనితనంతో కావ్యంగా ఆవిష్కరిస్తాడు.

ఇక్కడ పరిశోధకుడు, విమర్శకుడు, స్రష్ట (కవి, రచయిత) ; ఈ ముగ్గురూ చేసేది ఆవిష్కరణే ! అయితే కవిలోకంలోంచి వస్తువును, లేదా వస్తు ధర్మాన్ని విశ్వ శ్రేయం కోసం సృజిస్తే ; పరిశోధకులు, విమర్శకులు సృజనలో ఏముందో, సృజన ఎలా ఉందో చెబుతారు. స్రష్ట కుముడి సరకు లోకంలోని వనరే. కాని సాహిత్య పరంగా పరిశోధకులకు, విమర్శకులకు కవి సృజనే వనరు.

వనరులు వేరైనా, అభివ్యక్తులు వేరైనా ఈ ముగ్గురి ఉద్దేశం ఒకటే ! అదే విశ్వశ్రేయం. లోకాన్ని ఉద్ధరించడానికి దాన్ని మరింత మెరుగుపరచడానికి తెరవెనుక శాసనకర్తల్లాగ వీళ్ళు పనిచేస్తారు. వస్తుపరంగా గుణ పరుస్తారు. అభివ్యక్తి పరంగా రంజింపజేస్తారు.

అయితే వీళ్ళు ఉద్దేశపరంగా, ఆవిష్కరణపరంగా, ఒకటే చేస్తున్నారు. ఈ సదుద్దేశంతో చేసే ఈ ఆవిష్కరణల తాలూకు అభివ్యక్తితోనే పేచీ అంతా !

ఏ భాషనైనా సాహిత్యరంగం, భాషారంగం అనే రెండు స్థూల ప్రత్యేక శాఖలుగా మనం అధ్యయనం చేస్తాం. సాహిత్యంలో రకరకాల ప్రక్రియలున్నట్టుగానే; భాషా రంగాన్ని భాషా చరిత్రగాను, వ్యాకరణంగాను, భాషా శాస్త్రంగాను అధ్యయనం చేస్తాం. జానపద సాహిత్యాన్ని కళ, రచన, విజ్ఞానం లాంటి దృక్కోణంలో విడిగా అధ్యయనం చేస్తాం.

ఇంగ్లీషు మీద మోజు ఉన్నట్టుగా; స్నాతకోత్తర స్థాయిలో జానపద సాహిత్యం, ప్రాచీన సాహిత్యం ఆధునిక సాహిత్యం, వ్యాకరణం, భాషాశాస్త్రం ఉత్తరోత్తర అధ్యయనాంశాలుగా అధికతర అదృశ్య వెయిటేజిని కలిగి ఉండటం బహిరంగ రహస్యం. బహుశా ఇది అవకాశాల పరంగానో, సంక్లిష్టత పరంగానో సిద్ధించి ఉండవచ్చు.

పై విధంగానే పరిశోధకుడికి, విమర్శకుడికి, స్రష్టకు ఉత్తరోత్తర అధికతర వెయిటేజి అనేది సాహిత్యరంగంలో ఉన్నది. వీటి ప్రాథమ్యం, ప్రాధాన్యం వాటి వల్ల కలిగే అవకాశాల వల్లనే అని చెప్పవచ్చు.

ఆవిష్కరణ సామాన్య విషయంగా కలిగి ఉన్నప్పటికీ, అధ్యయనరంగాన్ని బట్టి, రచనా రంగాన్ని బట్టి ప్రాథమ్యాలు, ప్రాధాన్యాలు మారిపోతూ ఉండటం ఇక్కడ గమనించాల్సిన విషయం.

అంతేకాదు విమర్శ, పరిశోధన, సృజనల మౌలిక తత్త్వం ఆవిష్కరణే అని చెప్పడం ఈ వ్యాస ప్రధానోద్దేశం. మౌలికతత్త్వం ఒకటిగా కలిగి ఉన్నప్పటికీ ఇవి వేరు వేరు పేర్లతో ఎందుకు పిలవబడు తున్నాయన్నది కూడా చర్చనీయాంశమే.

విశ్వవిద్యాలయంలో పి.హెచ్.డి. పట్టం కోసం సమర్పించే సిద్ధాంత వ్యాసాన్ని మనం పరిశోధన అంటున్నాం. ఆయా సృజనల మీద ఆచార్యులు చేసే విశ్లేషణలన్ని

విమర్శ అంటున్నాం. వస్తుపరంగా, అభివ్యక్తిపరంగా సృజనాత్మక రచనల్ని సృజన (కావ్యం, కథ మొ॥) అంటున్నాం.

మొత్తం మీద ఈ మూడింటిలోను ఆవిష్కరణ సామాన్యాంశం. అయినప్పటికీ ఆయా అవసరాలకను గుణంగా వాటి అభివ్యక్తుల ననుసరించి వాటికి ఆయా పేర్లు పెట్టుకున్నాం.

సృజనాత్మక రచనల్ని మినహాయిస్తే విమర్శ, పరిశోధన, రెండూ; వ్యాసరూపంలోనే ఉంటాయి. కాకపోతే మొదటిది మూడు పేజీలలోను రెండవది మూడొందల పేజీలలోను సాధారణంగా ఉంటుంది. నిడివి కూడా వాటిని విభాగించడానికి ఉపకరిస్తుంది.

ఆమాటకొస్తే సృజనలో చాలా ప్రక్రియలుంటాయి. వాటి నిడివి కూడా భిన్నంగా ఉంటుంది. వ్యాసాన్ని సృజనకు సంబంధించిన రచనా ప్రక్రియగా గుర్తించారు. అయినప్పటికీ సృజనాత్మక రచనలకంటే అది, విమర్శ పరిశోధనలకే వాహికగా ఉంటున్నది.

వచనం, ఆలంకారికత లేకుండా ఉండటం వివరణ, విశ్లేషణ వ్యాఖ్యానం లాంటి అంశాలు వ్యాసంలో ప్రధానంగా ఉంటాయి. వర్ణనాత్మక వ్యాసాలు ఉన్నప్పటికీ వర్ణన కవిత్వ కథానికాది ప్రక్రియలలో విరివిగా కనిపిస్తుంది.

వచనం ఆధునిక రచనా ప్రక్రియలన్నిటికీ ప్రధాన వాహిక అయినప్పటికీ ఆయా రచనా ప్రక్రియలకు ఆయా రచనా సామగ్రి అవసరమవుతుంది. అంటే ఆయా అవసరాలు ఆయా ఆవిష్కరణలకు ఆయా రచనా సామగ్రిని ఎంపిక చేస్తాయన్నమాట.

రచనా సామగ్రి రచనకు ఒక ప్రత్యేకమైన అభివ్యక్తిని ఇస్తుంది. ఆ అభివ్యక్తి ఆ రచనను ఒక భిన్నమైన ప్రక్రియగా నిలబెడుతుంది.

మొత్తం మీద ఆవిష్కరణ మూలం (సోర్స్), దాని అభివ్యక్తి దాని నిడివి ఆయా అవసరాలు, కలసి ప్రాతిపదికలుగా ఏర్పడి ఆవిష్కరణలకు అస్తిత్వాన్నిస్తున్నాయి.

నిజానికి ఆవిష్కరణ మూలంగా కలిగిన ప్రతిరచనా సృజన అయితీరాలి. కాని సృజన అన్నమాట కల్పనాత్మక రచనలకే పరిమితమయ్యింది. అంటే సృజన ఆవిష్కరణ వేరుకాదన్న మాట. అయితే కళారంగంలో స్రష్ట అని, శాస్త్ర సాంకేతిక రంగంలో ఆవిష్కర్తలని అనటం పరిపాటి. ఆవిష్కర్తల్ని పరిశోధకలని కూడా అంటారు. కాని కళా రంగంలో విమర్శకుల్ని స్రష్టలని మాత్రం చెప్పరు. రూఢికెక్కినా ఎక్కకపోయినా పరిశోధనలాగే విమర్శ కూడా సృజనే. ఎందుకంటే విమర్శలో 'వెలికితీత' ఉంటుంది కాబట్టి.

**కీలక పదాలు :**

ఆవిష్కరణ, ఆవిష్కరణ మూలం, ప్రక్రియ, సృజన, పరిశోధన, విమర్శ, ఆవిష్కరణల ప్రాతిపదికలు, ఆవిష్కర్త / స్రష్ట.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానా శాస్త్రి
2. చేరాతలు - ఆచార్య చేకూరి రామారావు

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# మనుచరిత్ర సామాజిక స్పృహ - చారిత్రక నైపథ్యం

- జె. శ్యామలాదేవి, తెలుగుశాఖాధిపతి, వి.ఆర్.యస్. & వై.ఆర్.యన్. కళాశాల, చీరాల.

లోకమునకు శ్రేయమును కలిగించునది కావ్యము. కాంతాసమ్మితత్వమయిన ఉపదేశముతో ధర్మనిష్ఠను, సామాజిక నీతి న్యాయములను తెలుపవలసిన విధి కావ్యమునకున్నది. ఏ కాలమునకు, ఏ సమాజమునకు సంబంధించిన ఇతివృత్తమైనను కవి వర్ణించుటలో తనకాలపు సామాజిక స్థితి గతులను అధిగమింపలేడు క్రాంతదర్శి అయిన కవి సార్వజనీనము, సార్వకాలికము అయిన ధర్మములను ప్రధానముగా గ్రహించి తన కావ్యము ద్వారా సమాజములో మానవుని ప్రవర్తనమును సూచించును, లోపలములను హెచ్చరించును, ఫలితములను స్పష్టీకరించును, ఆంధ్ర సాహిత్యములో స్వర్ణ యుగమనదగిన 16వ శతాబ్దియందు సాహితీసమరాంగణ సార్వభౌముడుగా పేరొందిన విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణ దేవరాయల ఆస్థానములోని ఆంధ్రకవితా పితామహ బిరుదాంకితుడైన అల్లసాని పెద్దన రచించిన స్వారోచిషమనుసంభవము లేదా మనుచరిత్రము కూడా దీనికి అపవాదము కాదు.

రాయలు పెద్దనను
హితుడవు చతురవచోనిధి
వతుల పురాణాగమేతిహాసకథార్థ
స్మృతి యుతుడ వాంధ్రకవితా
పితామహుడవెవ్వరీడు పేర్కొన నీకున్
(మనుచరిత్ర .పీఠిక. ప.15)

అని పొగడి, 'శిరీషకుసుమ పేశల సుధామయోక్తుల'తో కలిధ్వంసకము, రససమంచిత కథలతో విననింపుగొలుపు స్వారోచిషమనుసంభవమనుకృతిని రచింపుమన్నాడు.

శ్రీ కృష్ణదేవరాయలు విజయనగర సామ్రాజ్యమును క్రీ.శ.1509 నుండి క్రీ.శ.1530 వరకు పాలించినాడు అప్పటి వరకు ప్రక్కలో బల్లెముగా నున్న బహమనీ సుల్తానులను, కటకమును పాలించు గజపతులను జయించి దక్షిణభారతదేశమున ఎదురులేని మహా సామ్రాజ్యాధినేత అయినాడు. ఇట్టి మహావీరుడు మహా కవియై సంస్కృతమున "మదాలస చరిత్ర", సత్యావధూ ప్రీణనము మొదలగు కావ్యములనెన్నింటినోరచించినాడు. ఇట్టి రాజకవితనకు మిక్కిలి ఆప్తుడు, హితుడు, గురు తుల్యుడునగు పెద్దనను హితుడవు - అని పేర్కొనుటలో విశేషమున్నది. ఆనాటి రాజకీయ వ్యవహారములలో రాయలు అప్పాజితో మాత్రమే కాక ఆంతరంగికముగ పెద్దనతోను చర్చించుచుండెడివాడు. పెద్దన రాజ్యము సుస్థిరముగా నుండుటకు సాహిత్యపరముగా కూడా తనకు తోచిన సలహాలు చెప్పుచుండెడివాడు. సమాజములో కేవలము చట్టముల ద్వారా కట్టుబాట్లను నియమములను ప్రజలపై రుద్ది వారనుసరించునట్లు చేయలేరను విషయము వీరిరువురకును తెలియనిది కాదు. ఆనాడు అట్టి విధినిషేదములు ప్రజల మనస్సులకు హత్తుకొని పోవునట్లు చేయుగల మాధ్యమము (Medium)అవసరము. అట్టి మాధ్యమము ఆనాడు కావ్యమునకు గలదు. కావున కావ్యము ద్వారా సామాజిక సంస్కరణము చేయ వీరిరువురును సంకల్పించినారు.

సమర్ధవంతమును, సుస్థిరమును అయిన పరిపాలనము చేయుచున్నప్పుడు ప్రజలకు సుఖ సంతోషములు కలిగియుండును. అంతకు పూర్వము అనేక దండ యాత్రలతో విసిగి ధన ప్రాణములు పోగొట్టుకొని అలమటించు ప్రజలకు రాయల పరాక్రమము ఊపిరి పోసినట్లైనది. క్రీ.శ. 1509 నుండి క్రీ.శ. 1520 వరకు ఎత్తిన కత్తిని దించక మహా సామ్రాజ్య నిర్మాణము చేసి క్రీ.శ 1530 వరకు సమర్ధవంతమైన పాలననందించినాడు రాయలు. ప్రజలు సుఖశాంతులతో తృప్తిగ గుండెపై చేయి వేసికొని నిద్రించెడివారు. కాని అప్పటి వరకు ప్రజలకు గల ఏకైక లక్ష్యము సమర్ధవంతమైన పాలనము. ఆ

లక్ష్యము నెరవేరిన పిదప ప్రజలకు ప్రత్యేకముగా ఏ లక్ష్యమును లేకపోయినది. క్రమముగా వారు భోగలాలసత వైపు దృష్టిమరల్చినారు. An idle man's mind in Devils workshop' అన్నట్లు వారి కళారాధనము భోగములకు నిలయమై జాతి నిర్వీర్యమగు స్థితి వచ్చుచున్నది. యువత నిర్వీర్యమైనచో జాతియేపతన మగును గదా! అనేక స్త్రీలను వివాహమాడుట అనేక కాంతలను భోగినులుగా జేసికొనుట నాటి సంఘమున గౌరవము, దర్పముగా తోచుచుండెడిది. ఇది సాంఘిక దురాచారము కావున దీనిని మాన్పుటకు పెద్దన, రాయలు, కృషిచేసిరి. ఈ కృషి ఫలితమే మను చరిత్రము, ఆముక్తమాల్యదా కావ్యముల ఆవిర్భావము.

పెద్దన రాయల కోరికపై మార్కండేయ పురాణములోని మను చరిత్రను రచించుటకు పూనుకొనినాడు. ఈ సందర్భమున సమాజములో ఎంతటివారైనను లొంగిపోవు బలహీనతలైన కాంతాకనకముల విషయమును ప్రధానముగా గ్రహించినాడు. నాటి సమాజమున ఆ రెండు బలహీనతలేగదా విశృంఖల వృత్తి జరుగుచున్నవి. 'కలిధ్వం సకమని రాయలు చెప్పుటలో గూడ ఇట్టి విశేషమే గమనార్హము.

పెద్దన 'వివిధాధ్వర నిర్మల ధర్మకర్మదీక్షా పరతంత్రుడు', 'అలేఖ్యతనూవిలాసు'డైన ప్రవరుని ప్రధాన పాత్రగా గైకొనినాడు. శుద్ధ శ్రోత్రియ ధర్మములను నెరవేర్చుచు, తల్లిదండ్రుల సేవయు, శిష్యులకు వేదాధ్యయన మొనర్చుచు, రాజు ప్రతిగ్రహ దోషములేని సాల గ్రామమిచ్చినను దానముగా గ్రహింపక సంపన్నుడై, బాల్యమందే వివాహమాడిన సోమిదమ్మ తన ఆదర్శగృహస్థ ధర్మములు నెరవేర్చుటలో తోడు నీడయై యుండ కాలమును వెళ్ళ బుచ్చుచున్నాడు.

'వాని చక్కదనము వైరాగ్యమున జేసి
కాంక్షసేయు జారకామినులకు
భోగబాహ్యమయ్యె పూచిన సంపెంగ
పొలుపు మధుకరాంగనలకు బోలె'
- మనుచరిత్ర. ప్రథమ.ఆ.ప.52

ప్రవరుడు స్త్రీలోలుడు కాడను విషయము ఆనాటి యువత కాదర్శప్రాయమై యుండవవలెనని భావము. ఎవరి ధర్మమును వారు నెరవేర్చుచు సుఖముగా నుండవలెనను సూచన మిందున్నది.

ప్రవరుడు, అతిధిగతన యింటికే తెంచిన సిద్ధుని సంభావించి ఆయన తన పాదములకు పూసిన లేపన సహాయమున హిమాలయమునకు పోయినాడు. అచటి మంచుకు పాదలేపము కరిగిపోగా ఇంటికి వచ్చుటకు దారికానక తిరుగాడుచు వరూధిని అను అప్సరస ఉన్న వనమునకు పోయినాడు. ఆమెను జూచి తన ఊరికి త్రోవను జెప్పమని అడుగగా ఆమె యితని అందమునకు మోహపడి తన్నను గ్రహింపుమన్నది. ప్రవరుడు నిరాకరించినాడు. ఆమె తనకున్న దివ్యమైన సంపద నంతయు నీతనియధీనము చేతున్ననది. ఎదుటి వారి సొమ్ము ఎల్లవారికి తీపి' అను లోక సామాన్య వాక్యమునకు ప్రవరుడు అపవాదముగాన ఆ సంపదను తిరస్కరించినాడు. తనంతతా వలచి వచ్చిన దివ్యాంగనను గూడ దిక్కరించిన ధీశాలియైనాడు.

లోకములో 'మంచివాడు' అని అనుకొనునట్లు కన్పించుట ప్రధానముగాదు. మంచివాడుగా మనవలెను. అవకాశము లేనప్పుడు అందరును పూజ్యులే, ఏకాంతము, ఉద్యానము, అందచందములున్నయువతి, సంపన్నురాలు, తనంతతావలచివచ్చినది. ఇట్టి సమయమున తన ధర్మమును కాపాడుకొనుచు, నిగ్రహమూని, తగదని నిరాకరించి వెడలగలిగిన వాడే నిజముగ గొప్పవాడు. 'కరగినను గాని పసిడికి కాంతిరాదు తరచినను గాని పాల చేకూరదువెన్న'

కావ్యమున

'శ్రీ వక్షోజకురంగనాభమెదపై జెన్నొంద విశ్వంభరా
దేవిన్ దత్కమలా సమీపమున బ్రీతిన్ నిల్పినాడో
యనం
గావందారు సనందనాధి నిజభక్త శ్రేణికిన్ దోచురా
జీవాక్షుండు కృతార్థు జేయు శుభ దృష్టిన్ గృష్ణరాయాధి
పున్ (మనుచరిత్ర.పీఠిక - 1పద్యం)

అనునది మొదటి పద్యము లక్ష్మీదేవి యలంకరించు కొనిన కస్తూరి ఆమెను కౌగలించుకొనినపుడు విష్ణువు హృదయమున నంటినది. అప్పుడు విష్ణువు భూదేవిని, లక్ష్మిని హృదయమున నిల్పి నట్లున్నదని భ్రాంతి మదలం కారమున పెద్దన రచించినాడు. ఇష్ట దేవతాస్తుతియందు విఘ్నేశ్వరుని గూర్చి.

అంకము జేరి శైలతనయాస్తన దుగ్ధములానువేళ బా
ల్యాంక విచేష్టతుండమున నవ్వలి చన్గబళింపబోయి
యా
వంక కుచంబుగానకహివల్ల భహారముగాంచి వేమ్మృణా
ళాంకురశంకనంటెడు గజాస్యునిగొల్తు నభీష్టసిద్ధికిన్
(మనుచరిత్ర పీఠిక - 4పద్యం)

గణపతి తల్లియైన పార్వతిచనుబాలుద్రావుచు తొండముచేత రెండవ స్థనమును గ్రహింపబోగా అచ్చట శివుని శరీర అర్థభాగముండుటచే సర్పము తగిలినది. దానిని తామరతూడుగా భ్రమించి గ్రహింప బోయినాడని భ్రాంతిమదలంకారమున చెప్పబడినది.

పై రెండు పద్యములందలి భ్రాంతిమదలంకారము కావ్యేతివృత్త సూచనకు చక్కగా అమరియున్నది.

''కన్యావరయతే రూపమ్'' అనునట్లు దేవకాంత వరూధిని మానవుడగు ప్రవరుని జూచి మోహించినది. అనగా తన స్థాయియు, ఎదుటివారిస్థాయియు గమనింప గలిగిన స్థితిలో లేదని అర్ధము. కేవలము రూపమునే గ్రహించి భ్రమ జెందినచో తాత్కాలిక సుఖము దక్కవచ్చు నేమోకాని యతి తీవ్ర పరిణామమునకు దారి తీయునని ఈ కథను సూచించుటకే భ్రాంతి మదలంకారమును హేతు గర్భితముగ పెద్దనవాడినాడు. కాంతా కనకములే శాశ్వతమునుకొని భ్రాంతిజెంది తమ వర్తనమును గడపి నచో సమాజపు కట్టుబాట్లు సడలి, వడలి జాతి నిర్వీర్యమై పోవును. తస్మాత్ జాగ్రత్త! అన్న విషయము ఇష్ట దేవతా స్తుతి యందలి రెండు పద్యములలో వర్ణించుట సమా జమునకు ఉపదేశము నిచ్చు సందేశము. కావుననే రాయలు ''హితుడవు'' అనియు, రచనా విధానమును దృష్టియందుంచుకొని 'చతురవచోనిధివి' అని ఆనం దమును గ్రహింపవలెనను కావ్య ప్రయోజనమును ద్దేశించియు సంబోధనము జరిగినది. రాయల మనస్సు లోని సామాజిక ప్రబోదము పెద్దన గ్రహించి కావ్యమును రచించుట చేతనే రాయలు పెద్దన ప్రతిభా పాటవములకు మెచ్చి 'ఎదురైనచో తన మద కరీంద్రము నిల్పి కేలూత యొసగి యెక్కించుకొన్నాడు. కోకట గ్రామాద్యనేకాగ్ర హారము లడిగిన సీమలయందు ఇచ్చినాడు. మను చరిత్రమందుకొనువేళ పురమేగ పల్లికిని తన కేలబట్టి యెత్తినాడు. బిరుదైన కవి గండ పెండేరమునకీవెతగుదని తానె పాదమున తొడిగినాడు, ఆంధ్రకవితాపితామహా! అల్లసాని పెద్దన కవీంద్ర అని సంభావించినాడు.

రాయలు ఆముక్తమాల్యదా రచనమున ఒక రాజును గూర్చి వర్ణించినాడు. రాజు పూర్ణిమనాటి రాత్రి వెన్నెల వేళలో అలంకరించుకొని భోగిని కడకుపోవు చుండగా దారిలో రాజు సంభాషితాలు చదువుచున్న బ్రాహ్మణుడి మాటలు విన్నాడు.

వినియెనెలల్చతుర్థ్యయిని వృష్టిదినాళికి, రాత్రికైదివం బున, జరకై వయస్సుననుబూని, పరంబునకిప్పుడు ద్యమం బనువుగ జేయగా వలయునంచు పురోహిత ధర్మమాత్మగిల్కొన నలవిప్రుడా ద్విజులలోన సుభాషిత మున్భరింపగన్.

- ఆముక్తమాల్యద ద్వితీయ. ఆ.76వ పద్యం

వర్షాకాలమునకు వలయు పదార్ధములు మిగిలిన ఎనిమిది నెలలలోను, రాత్రికై పగటియందును, వార్ధ క్యమునకై వయస్సు నందును, పరమునకై ఇహము నందును సంపాదింపవలెనని సారాంశము ఇది విన్నరాజు తాను చేయబోవు పనియు, దాని పర్యవసానమును ఆలోచించి వ్యర్థమని గ్రహించి వెనుదిరిగినాడు. రాజైనను యథేచ్ఛగా నియమములను వీడిసంచరించుట తగదన దీని భావము. యథారాజా తథాప్రజా! అనునట్లు పాలకుడే పాలితులకు అనుసరణీయుడుగదా! ''బ్రాహ్మణు డింద్రియవశగతి, జిహ్మాచరణైక నిపుణచిత్తజనిశితా, జిహ్మగముల పాలై చెడు బ్రహ్మానందాధి రాజ్యపద వీచ్యుతుడై,

బ్రహ్మజ్ఞానియగు బ్రాహ్మణుడు ఇంద్రియ వశము చేత స్త్రీలోలుడైనచో బ్రహ్మానందము నుండి దూరు డగును ధర్మములను, ఆచారములను, కట్టుబాట్లను సంరక్షించుచు సమాజమునకునే ఒడిదుడుకులు రాకుండా రక్షింప వలసిన భారము క్షత్రియునియందు న్నది. వీరిరువురును ఆదర్శవంతమైన జీవితములు గడపనిచో సమాజము వారిననుసరించి చెడిపోవునుకాన పెద్దన, రాయలు తమబాధ్యతలను గుర్తెరిగినవారై వానినే తమ కావ్యములందు నిక్షేపించుట స్తవనీయము.

**ముగింపు :**

సామాజిక స్పృహయందు ప్రధానపాత్రవహించు కాంతా కనకముల విషయమేకాక ఆనాటిభోగులైన ప్రజలు ఉపయోగించు వివిధరకములగు సుగంధ ద్రవ్యములు, సంపదలు, సంపన్నులతీరు, విహారములు, గార్హస్థ్యధర్మములు మొదలగునవి నాటి సామాజికస్థితిని తెలుపుచున్నవి. స్వరోచి వేటవర్ణనము రాయలసీమ యందలి గిరులవర్ణనమే, స్వరోచి రాక్షసునితో జేసిన యుద్ధము రాయలు శత్రువులపై జేసిన యుద్ధమే ఇట్లు ప్రధానముగా సామాజిక స్పృహ అనగా ప్రధానముగా సమాజమును మలుపుత్రిప్ప గల విషయములపై దృష్టి నుంచి రచింపబడిన ఈ మనుచరిత్రము శ్లాఘనీయము అట్టిరచనలనుప్రోత్సహించిన శ్రీకృష్ణదేవరాయలు ధన్యుడు నాడు రాజులకు, కవులకు సమాజములో ప్రధాన ప్రాత్ర ఉన్నది కాన సంఘసంస్కరణమునకై వారు చేసిన కృషి ప్రశంసనీయము.

**ఆంధార గ్రంథాలు :**

1. అల్లసాని పెద్దనమనుచరిత్రము
2. మను చరిత్రము- వావిళ్ళ రామస్వామి శాస్త్రులు
3. ఆముక్తమాల్యద- సౌందర్యలహరీ వ్యాఖ్యానం అభినవ భారతి- ఆచార్యతుమ్మపూడి కోటేశ్వరరావు.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# అంతులేని వ్యథలెన్నో 'అబలా' కవిత్వంలో

- డా॥. వి. శివనాగార్జున రెడ్డి , అధ్యాపకుడు, తెలుగు విభాగం, ఒంగోలు ట్రిపుల్ ఐటి., ఒంగోలు.

ఇక్కడ "అబల" అనడం కన్నా "సబల" లేక "శక్తివంత మైన స్త్రీల కవిత్వం" అనడంలో ఒక క్షణం కూడా ఆలోచించకుండా చెప్పేయొచ్చు. ఎందుకంటే తెలుగు సాహిత్యంలో ఎన్నో కవితోద్యమాలు వచ్చాయి. ఒకదాని తరువాత ఒకటి ఆధిపత్యంను చూపిస్తూ వచ్చాయి. అలా వచ్చి తడబడుతూ నిలబడి విప్లవంలా, ఉప్పెనలా వచ్చిన స్త్రీవాద కవిత్వం తన ఉనికిని చాటుకుంది.

తెలుగు సాహిత్యం క్రీ.శ. 11వ శతాబ్దాలోనే ప్రారంభ మైనప్పటికి స్త్రీల గొంతు వినబడడం క్రీ.శ. 20వ శతాబ్దం లోనే ప్రారంబమైంది. 15వ శతాబ్దంలో తాళ్ళపాక తిమ్మక్క నుంచి 19వ శతాబ్దిలో తరిగొండ వెంగమాంబ వరకు చెదురు మదురుగా కవయిత్రులు కనిపిస్తారు. మొల్ల, రంగాజమ్మ, ముద్దుపళని వంటివారు సాహిత్య చరిత్రలో విశిష్టస్థానం సంపాదించుకున్నారు. కాని వారు తమ సొంత మార్గాన్ని అన్వేషించే ప్రయత్నం చేయక సమకాలీకులైన పురుషుల కవిత్వ మార్గమే అనుసరించారు. అందువల్ల వారికి భక్తి, శృంగారం రెండే కవితావస్తువులయ్యాయి. అందులో ఆవేదనకాని, తిరుగుబాటుతనం కానీ, చైతన్యం కానీ ఎక్కడా అంతగా కన్పించకపోవచ్చు.

ఈ నేపథ్యంలో కాలగమనంలో స్త్రీలు పడుతున్న బాధలు వివక్ష. కష్టాలు గమనించిన కొంతమంది ఆధునిక స్త్రీలు పూర్వం ఉన్న ఉద్యమాల నుంచి స్ఫూర్తిని అందు కుని ప్రపంచాన్ని కొత్తచూపులో స్త్రీ దృక్పథం నుంచి దర్శిం చిన కవిత్వోద్యమం స్త్రీవాదం. 1975 తరువాత రూపు దిద్దుకుని 1985 నుంచి స్థిరపడి క్రమంగా అన్ని ప్రక్రియలకూ విస్తరించిన ఉద్యమం స్త్రీవాద కవిత్వో ద్యమం. దీనినే ఆంగ్లంలో "ఫెమినిజం" అని దీనికి సమా ర్థమే "స్త్రీవిముక్తి", "స్త్రీ స్వేచ్ఛా ఉద్యమం", "స్త్రీ విమోచ నోద్యమం" అనే పలురకాలుగా పిలుస్తున్నారు. ఎప్పుడైతే స్త్రీవాద సాహిత్యం ప్రధానంగా కవిత్వం ప్రభంజనంలా రావడం మొదలైందో అప్పుడే దీని మీద విమర్శలు బయలు దేరాయి.

స్త్రీవాదం వ్యక్తిగతమని సైద్ధాంతిక నేపథ్యంలేదని కొంతమంది మధ్యతరగతి స్త్రీల మనోభావాలకు ఇది ప్రతిఫలనమని, అసభ్యకరమైన పదజాలం వాడుతున్నా రనీ, సమాజాన్ని విచ్ఛిన్నకరమైన భావజాలంతో కలుషితం చేస్తున్నారనీ, పురుష ద్వేషం స్త్రీలలో పెరిగిపోతుందనీ, అది కుటుంబ వ్యవస్థను దెబ్బతీస్తుందని రకరకాలుగా విమర్శలు బయలుదేరాయి. ఒకసారి స్త్రీ వాదులు రాసిన ఆవేదన పూరిత మాటలు, ఆర్తనాద గీతాలు పరిశీలిస్తే.

మొదటి 1972లో "ఓల్గా" రాసిన ప్రతి స్త్రీ "ఒక నిర్మల కావాలి" అన్న కవితలో స్త్రీవాదం ప్రారంభమైందని చెప్ప వచ్చు. స్త్రీగా పుట్టడమే శాపమని భావించేలా ఈ పితృ స్వామ్య వ్యవస్థ చేస్తుంది కనుక తమ ఉనికే నిషిద్ధమని చెబుతూ "శ్రీమతి" ఈ కవిత రాసింది.

"నేనమ్మలో ఉన్నప్పుడు నేను కావాలని అమ్మ కోరు కుంటున్నట్లు నాన్నకు తెలియగానే ఈడ్చి చెంప పగల గొట్టిన నాన్న దెబ్బకి నేనెవరో నాకు తెలిసింది. నేనొక స్త్రీని - నేనొక నిషిద్ధ జీవిని. మొన్నటి దాకా నా నవ్వు నిషిద్ధం. నిన్న నా చదువు నిషిద్ధం. నేడు నా బ్రతుకూ నిషిద్ధమే"

పుట్టిన తరువాత ఆడపిల్ల వృద్ధాప్యం వచ్చేవరకు ఎలాంటి నియంత్రణలో, నిర్లక్ష్యంలో, చులకనలో బతుకు తుందో చెప్తుంది "రజియాబేగం"

"బాల్యంలో, చిన్నపిల్లవి నీకేం తెల్సు కూర్చో" అన్నారు యవ్వనంలో ఉడుకు రక్తం మంచీ చెడూ తెలీదు కూర్చో అన్నారు వృద్ధాప్యంలో, ముసల్దానివి ఇంకేం చేస్తావే కూర్చో అన్నారు అవకాశం రానందుకు కోపంగా లేదు నాకు. కూర్చొని కూర్చొని బద్దకం వచ్చినందుకు బాధగా ఉంది"

ఆడపిల్లకూ, మగపిల్లవాడికీ ఉన్న తేడాని చెబుతూ "శ్రీమతి" ఇలా రాశారు.

"చీర ఒక అంచును గుండెలపై పదిలంగా అమర్చు కున్నట్లు అమ్మ తమ్ముణ్ణి హృదయానికి హత్తుకుంటుంది. కాళ్లకు అడ్డుపడే అంచులా నన్ను మాటల్తో తన్నుతుంది" అని. ఇటువంటి వివక్ష వల్ల స్త్రీ పెద్దదైనా ఆమెను నిశ్శబ్దం, మౌనం ఆవరిస్తాయి.

"పాటిబండ్ల రజని" తన "స్వరస్థానం" కవితలో

"మౌనాన్ని ఆభరణంగా గుచ్చి అంగీకారంగా ముద్రించి మూగ కాదనేందుకు పెళ్ళి చూపుల్లో పేరు చెప్పించి, పెళ్ళయాక సమాధానాన్ని కూడా తలుపు చాటునే నిలబెట్టి"

అని స్త్రీ జీవితం పురుష స్వామ్యం చూపే వివక్ష వల్లా, నియంత్రణ వల్లా ఎలా నిశ్శబ్దమై పోయిందీ అని వర్ణిం చింది. కె. గీత "నేను రుతువునైన వేళ" అనే రచనలో రజస్వల అయినట్టి ఆడపిల్ల మనఃస్థితిని చిత్రించిన కవిత.

"నాలో నేనే ఘనంద్రవమయ్యా, మళ్ళీ గట్టిపడీ ముక్కలయ్యా నెలకోసారి చచ్చినట్టూ నన్ను నేను నెప్పిగా మార్చుకోవాల్సొచ్చే.... అని అప్పటి బాధను వర్ణించింది.

స్త్రీ శరీర హింసకు, మనస్సుకూ ఉన్న సన్నిహితమైన సంబంధాన్ని అబార్షన్ స్త్రీలలో కలిగించే ఆ వ్యక్తి వేదనను అద్భుతంగా చిత్రించిన కవిత "పాటిబండ్ల రజని" రాసిన "అబార్షన్ స్టేట్‌మెంట్"

"నాలోని అమ్మను పాతిపెట్టుకొని చెఱకు పిప్పినై పారి పోతూ కంసుడి కత్తిలాంటి ప్లాస్టిక్ బకెటే మింగిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ముద్దలాంటి నిన్ను చూసి మళ్ళీ నా పొత్తిళ్ళల్లో పొదువుకోవాలని అంటూ" అయ్యో పాలింకి పోవడాని కున్నట్లు మనసింకి పోవడానికే మాత్రలుంటే ఎంత బావుండు" అని అగాధమైన ఆర్తినీ, ఆవేదననూ కవితాత్మ కంగా వ్యక్తీకరిస్తుంది.

పెళ్ళంటే ఆడపిల్లకు శిక్ష అనే భావాన్ని ఎలా కలి గిస్తున్నామో అత్యద్భుతంగా చిత్రించిన సావిత్రి "బంది పోట్లు" కవిత స్త్రీవాద కవితాస్వభావాన్ని పూర్తిగా అంది పుచ్చుకున్న తొలి కవితగా విమర్శకులు భావిస్తారు ఈమె ఇలా చెపుతూంది.

"పాఠం ఒప్ప చెప్పకపోతే పెళ్ళి చేస్తానని పంతులు గారు అన్నప్పుడే భయం వేసింది, ఆఫీసులో నా మొగుడున్నాడు అవసరమొచ్చినా సెలవివ్వడని, అన్నయ్య అన్నప్పుడే అనుమానం వేసింది' వాడికేం మగమహారాజని ఆడామాగా వాగినప్పుడే అర్థమై పోయింది.'పెళ్ళంటే పెద్ద శిక్ష" అని మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడని మనం పాలిచ్చి పెంచిన జనంలో సగమే మమ్మల్ని విభజించి పాలిస్తాం దని"

వివాహం, దాంపత్యం అనే పదాలకున్న ఊహాజనిత మైన, ఆదర్శప్రాయమైన అర్థాలు. దాని చుట్టూ అల్లుకున్న విధ్యావరణం వాస్తవిక జీవితంలో ఎక్కడా సరిపోవలదని స్త్రీవాద కవిత్వం స్పష్టం చేసింది. పెళ్లి అయిన స్త్రీని పడ కింటికి, వంటింటికి వాడే వస్తువులా చూస్తున్నారని ఆవేదన చెందారు.

ఇంటి చాకిరీ స్త్రీ జీవితాన్ని ఎలా పరిమితం, సంకు చితం చేస్తుందో ఆమె అస్తిత్వాన్ని ఎలా హరిస్తుందో, వంటిల్లు చాకిరీతోనే తెల్లారిపోయిన అమ్మను తలుచు కుని "విమల" తన "వంటిల్లు" కవితలో అద్భుతంగా ఇలా వర్ణించింది.

"మా అమ్మ మా అమ్మమ్మా ఇంట్లో అమ్మలంతా ఇక్కడ స్త్రీ' లయ్యారట, భయం భయంగా నిశ్శబ్దంగా నిరాశగా మా అమ్మొక ప్రేతంలా తేలుతూ వుంటుందిక్కడ అసలు మా అమ్మే నడుస్తున్న వంటగదిలా ఉంటుంది. ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి అయినా చివరకు వంటింటి గిన్నెలన్నిటిపైనా మా నాన్న పేరే"

ఇక్కడ వంటింటి సంస్కృతి మీద ఒంటికాలిమీద లేచి కస్సుమన్నది స్త్రీవాదం.

అలాగే కాలు కదిపి ఇంటి బయటకు వెళ్ళిన స్త్రీలు అపరిచితులైన పురుషుల చూపులతో కూడా నిత్యం యుద్ధం చేయవలసిన పరిస్థితి ఎదురవుతూంది అంటూ "జయప్రభ" తన "చూపులు" కవితలో ఇలా అంటుంది.

"చూపులు సూదుల్లా వచ్చి మాంసపుముద్దలపై విచ్చలవిడిగా తిరుగుతూ ఉంటాయి. ఆ చూపుల్లో ఎప్పుడూ ఒక్కటే సంకేతం ఉంటుంది 'చొంగకార్చే కుక్క లాంటి ఆకలుంటుంది, వికృతమైన భల్లూకపు పట్టు లాంటి దేదో విడవక కలల్లో సైతం వెంటాడుతుంది చిక్కని ఈ అడవిలో"

అంటూ సాగి అప్పుడనుకుంటాను "కళ్ళకే కాదు ఈ దేశంలో ఆడదానికి వళ్ళంతా ముల్లుండే రోజు ఎప్పుడొస్తుందా" అనీ.

అలాగే సమాజంలో అన్ని వర్గాల పురుషులకు స్త్రీ ఎలా పెట్టుబడి అవుతుందో "మందవరపు హైమావతి" "నీలికవితలే రాస్తాము"లో ఇలా చెబుతొంది.

"కవికీ చిత్రకారుడికీ నా శరీరమే గదా వర్ణనీయ వస్తువు చలన చిత్రాలకు వ్యాపార ప్రకటనలకు పెట్టుబడి నా శరీరమే కదా!" అంటూ

వివాహానంతరం స్త్రీలు ఎన్ని రకాల అవతారాలు ఎత్తవలసి వస్తుందో చెప్తుంది 'మందవరపు హైమావతి'. ఇలా వర్ణిస్తూంది.

"కుక్కర్ విజిల్స్‌లోనే మనోజ్ఞ సంగీతం వింటాను పతిదేవుని టేబుల్‌పై కాఫీ కప్పుగా, మీల్స్ కారియర్‌గా, పిల్లల లంచ్ బాక్స్‌లుగా, బహు పాత్రాభినయ పోటిలో నా చేతుల కెప్పుడు ఫస్ట్ ప్రైజే"

అలాగే మాతృత్వంలోని ఆనందాన్ని అంగీకరిస్తూనే. దాని వెనక ఇమిడి ఉన్న శరీర హింసనూ, స్త్రీల నిర్ణయాలతో, అభిప్రాయాలతో ప్రమేయంలేని మాతృత్వ స్థితిని స్త్రీవాద కవయిత్రులు అద్భుతంగా చిత్రించారు. 'కొండెపూడి నిర్మల' "లేబర్ రూం" కవితలో

"లేబర్ రూంలో అడుగుపెడితే చాలు మీరంతా చెబుతున్న తెల్లచీర మల్లెపూలు పాలగ్లాసు వరసల్లో పరాధీనతా బానిస కన్నీరు ద్వీపాంతర వాసం కాళ్ళనలా ఎడం చేసి దీనంగా హీనంగా నీచాతి నీచంగా ఒక హింసాతల పరాకాష్ఠ కోసం ఎదురు చూడ్డమంటే రైలు పట్టాలమీద నాణెం విస్తరించిన బాధ"

పుట్టిన తరువాత, ఆడపిల్ల వృద్ధాప్యం వచ్చేవరకు ఎలాంటి నియంత్రణలో,నిర్లక్ష్యంలో చులకనలో బతుకుంతుందో చెప్తూంది.

"బాల్యంలో చిన్నపిల్లవి నీకేం తెల్సు కూర్చొ అన్నారు యవ్వనంలో ఉడుకురక్తం మంచీ చెడూ తెలీదూ కూర్చొ అన్నారువృద్ధాప్యంలో ముసల్దానివి ఇంకేం చేస్తావ్ కూర్చొ" అన్నారు.

అవకాశం రానందుకు కోపంగా లేదు నాకు కూర్చొని కూర్చొని బద్దకం వచ్చినందుకు బాధగా ఉంది. అని స్త్రీ స్థితిని వర్ణించింది.

ఈ విధంగా స్త్రీవాద కవితా ప్రస్థానంలో ప్రపంచాన్ని, జీవితాన్ని స్త్రీల కోణం నుంచి విశ్లేషించడంలో ఈ కవియిత్రులు సఫలమయ్యారు. స్త్రీవాదుల పోరాటం పురుషులపైన కాదనీ, పురుషాధిక్య సమాజంపైనేననీ తమ పాఠకులకూ విమర్శకులకు విడమర్చి చెప్పడంలో కృత కృత్యులవుతున్నారు. స్త్రీ పురుషుల మధ్య ఆధిపత్య, అధికార సంబంధాలు పోయి పరస్పరం గౌరవించుకునే, సమస్థాయి సంబంధాలు ఏర్పడాలన్నదే తమ లక్షమని, స్త్రీ అంటే అబల కాదు బలమైన శక్తి అని స్త్రీవాద కవిత్వం నిరూపించింది.

## సంప్రదింపు గ్రంథాలు :


1. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు - కె.కె. రంగనాథాచార్యులు (ఆంధ్రా సారస్వత పరిషత్)
2. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు - ఆవుల మంజులత (తెలుగు అకాడమి)
3. తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమి
4. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం - వెల్చేరు నారాయణరావు
5. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వానా శాస్త్రి

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# జీవనానుభూతుల కలబోత - అంతరంగ తరంగాలు

- డాక్టర్ వై. శ్రీలత, అధ్యాపకురాలు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బంటుమిల్లి, కృష్ణా జిల్లా.

సరస సదవధాన చక్రవర్తి డాక్టర్ ఆశావాది ప్రకాశరావు గారు ఉత్తమ అధ్యాపకులుగా, అవధానిగా, కవిగా, పండితులుగా సుప్రసిద్ధులు. అవధాన కిశోర, పండిత మిత్ర, అవధాన కోకిల, కళాతపస్వి, శారదాతనయ, అభినవ సాహితీ సోమయాజి వంటి ఎన్నో బిరుదుల్ని కైవసం చేసుకున్న నిరాడంబరత, మానవత్వం మూర్తీభవించిన విశిష్ట వ్యక్తి ఆశావాదిగారు.

వీరు పద్యవిద్యలోనేకాక, వచన రచనలో కూడా ప్రావీణ్యం కలవారని వీరు వ్రాసిన అంతరంగ తరంగాలు కవితల సంపుటిని చదివినవారికి తెలుస్తుంది. ఈ కవితా సంపుటిలో 72 కవితలున్నాయి. అవి దీర్ఘకవితలు, సాధారణ కవితలు, గేయ కవితలు, మినీ కవితలుగా ఆయా శీర్షికలతో విభజింపబడినవి. వీటిలో 'చీకటి కోణంలో' అనే కవిత ఆలీవర్ గోల్డ్‌స్మిత్ సిటీ నైట్ పీస్ ఆంగ్లకవితకు స్వేచ్ఛానువాదంగా చెప్పబడింది. ఇందులో మా గోపీనాథ్, నా సుందర్రాజు మరియు గౌడ్ దైవీయదాంపత్యం వంటి దీర్ఘ కవితలు ఆశావాదిగారు తమకత్యంత ప్రియమైన వ్యక్తుల వ్యక్తిత్వాలను శ్లాఘిస్తూ వ్రాసిన కవితలు.

1988లో ప్రథమ ముద్రణ పొందిన ఈ కవితల సంపుటి ఆశావాదిగారి ఆత్మీయ మిత్రులు శ్రీ ఆర్. రంగస్వామిగారికి అంకితమీయబడింది. ఇందులోని కవితలు అనేకం తెలుగు పత్రికల్లో ప్రచురించబడినవి. ఆకాశవాణిలో కూడా ప్రసారమైనవి. ఇందులోని చాలా కవితల్ని డాక్టర్ కమల్‌నాథ్ పంకజ్‌గారు హిందీ భాషలోనికి అనువదించడమేకాక, వివిధ హిందీ పత్రికల్లో కూడా ప్రచురించారు. ప్రముఖ సాహితీవేత్తలు శ్రీ ఆర్.యస్. సుదర్శనం, డాక్టర్ రేపూరి అనంత పద్మనాభరావు ప్రభృతులు ఈ సంపుటికి తమ అమూల్య అభిప్రాయాలు అందించారు.

ప్రధానంగా పద్యకవియైన ఆశావాదిగారు ఈ కవితల్లో భిన్న భిన్న ప్రక్రియలు ప్రదర్శించడం విశేషం. ఈ కవితలను పరిశీలిస్తే కవి ఆయా జీవిత దశల్లో రచించినట్లుగా తెలుస్తుంది. కవితలలో ఆశావాదిగారు తాము ఏం చెప్పదల్చుకున్నారో పాఠకులకు తెలియజేయడం కనిపిస్తుంది. అంతేగాక, ఒకసారి చదివాక, అందులో మరేదో అంతరార్థం ఉన్నట్లు పాఠకుడికి అనిపించడమే కాక, దాన్ని తెలుసుకోవాలనే తపన కలిగించి మరలా చదివింపజేయడం ఈ కవితల ప్రత్యేకత. ఆయా కాలాల్లో, ఆయా సందర్భాల్లో రాసినవి కనుక ఏకసూత్రత కనిపించదు. ఆ విధంగా రాయడానికిగల ప్రేరణాంశాలు అంతర్లీనంగా కవితల్లో దాగిఉంటాయి. వాటిని గమనించి కవితలతో జతపరిచి చదివినప్పుడు ఆ కవితా సౌందర్యం, మాధుర్యం, శిల్పం పాఠకుల ప్రశంసలందుకుంటాయి.

కొన్ని కవితల్లో అభివ్యక్తి, మరికొన్నింటిలో చక్కని అనుభూతి, ఇంకొన్నింటిలో ఆవేదన, ఆక్రోశం, శ్లేష, హాస్యం, వ్యంగ్యం, తాత్వికత, తిరుగుబాటు, విప్లవ భావాలు కనిపిస్తాయి. శబ్దంపై అధికారం, భావంలో నైశిత్యం, పదగుంఫనం ఉన్న రచయిత ఏది వ్రాసినా అది సహృదయ హృదయ రంజకంగా ఉంటుంది.

ఆశావాదిగారుఅలాంటి రచయిత అంటారు ముందు మాటల్లో డాక్టర్ రేపూరి అనంత పద్మనాభ రావుగారు. స్పందించిన సమయంలోనే సమాధి బద్ధులయ్యే కవులు అంటారు 'పుడమితల్లి పురిటినొప్పులు' కవితలో ఆశావాది గారు. ఈ కవితలన్నింటిలో స్పందించే ఆయన హృదయం కనిపిస్తుంది. సమాజంలోని కుతంత్రాన్ని, దుర్మార్గాన్ని ప్రస్తావిస్తూ..

పుడమితల్లి పురిటినొప్పులు తింటున్నది
నెలలు నిండినా నీళ్ళాడటం లేదు

అంటారు ఈ కవితలో. ఈ కవితా పంక్తులు ఆశావాది గారి అంతరంగ క్షోభకు నిదర్శనం.

కవితా శీర్షికల్లోకూడా ఆశావాదిగారి భావనా నైపుణ్యం, వ్యంగ్యం, శ్లేష కనిపిస్తాయి. ఉదాహరణకు రొయ్య మీసాలు, దీప వ్యధ, కాకిగోల మొదలైనవి.

'ముందుచూపు' కవితా ఖండికలో...

ఈ లోకంలో ప్రతి వెధవకూ ఉంది ముందుచూపు అందుకే అమాంతంగా రేప్పని ఈనాడే ముగిస్తున్నాడు అని శ్లేషని ప్రయోగించడం ద్వారా పాఠకునిలో గొప్ప ఆలోచనాతరంగం ఉవ్వెత్తున ఎగసిపడేలా చేస్తారు.

ముఖ్యంగా మినీ కవితలు వస్తు, భావవైవిధ్యం దృష్ట్యా పాఠకులను అమితంగా ఆకర్షిస్తాయి. తాత్వికత, వ్యంగ్యం, విప్లవ భావాలు ప్రధానంగా వీటిలో కనిపిస్తాయి.

'ప్రశ్న' అనే కవితలో నిన్నటి పీడకల వెక్కిరిస్తుంటే
రేపటి మధుర స్వప్నం ఆహ్వానిస్తోంటే
నేటిని మాత్రం విస్మరిస్తూ ఎటో పయనిస్తున్న ఓ బాటసారీ!

నీవు కాలాతీత వ్యక్తివా? అంటూ వర్తమానాన్ని జార విడుచుకుంటూ ఊహల్లో తేలుతూ భవిష్యత్తును పాడు చేసుకుంటున్న వారిని ఉద్దేశించి అంటూ జాగృత పరుస్తు న్నారు. కాలానికి అతీతంగా వ్యవహరించడానికి నువు కాలాతీత వ్యక్తివి కాదు కదా అంటారు.

'భిన్న గమనాలు' కవితా ఖండికలో రెండూ ఎంతో అవసరం మరువకయ్య ప్రకాశ్! అంటూ 'ప్రకాశ వచనాలు' కవితలో వేదాంతాన్ని వెల్లడిస్తారు. దేహాత్మలకు కావల సిందేమిటో సూటిగా చెబుతారు. 'బర్త్‌డే' కవితలో పాశ్చాత్య తరహాలో పుట్టిన రోజును వేడుకగా, ఆడం బరంగా జరుపుకోవడాన్ని నిరసిస్తూ అశాశ్వతమైన శరీర సౌందర్య స్పృహ కంటే, శాశ్వతమైన ఆదర్శాలు, చైతన్యం ఎంతో గొప్పవని, వాటిని ఆచరిస్తూ కలకాలం జీవించ వచ్చని అంటారు. జీవితానికి కావలసింది ఆడంబరం కాదు, నిరాడంబరత అని ఈ కవిత ద్వారా చెబుతారు.

'కొత్త నిర్వచనాలు' కవితలో నిజంగానే కొత్త నిర్వచనాలు కనిపిస్తాయి.

వెనుకబడిన వాడంటే ఎవరో కాదు
అమ్మాయిల వెంటపడే వాడు
తాడిత పీడితుడంటే ఎవరో కాదు
ప్రతిభ యుండీ గుర్తింపు లేని వాడు
ఉన్నది కాస్త ఊడగొట్టుకున్నవాడు
హరిజనుడంటే ఎవరో కాదు

మట్టిపాలౌతున్న మానవత్వము అంటూ తమ జీవితపు అనుభవాలను, వేదనానుభూతులను రంగరించి శక్తివంతంగా తమ గళాన్ని వినిపించారు ఈ కవితలో.

'దాస్యం వద్దు' కవితలో బడుగుల అణిచివేతను, బానిసత్వాన్ని ప్రశ్నిస్తూ ఈ దాస్యం ఇక వద్దని ప్రేరణ కలిగిస్తారు. 'మనుగడకర్థం' కవితలో అల్లరి పిడుగులకు సుద్దులు చెబుతూ, ఆవేశం కంటే ఆలోచన గొప్పదనీ, మానవత్వం పెంచుకొని మానవ మనుగడకు అర్థం చెప్పేలా జీవించమని జీవన విధానాన్ని, పరమార్థాన్ని బోధిస్తారు.

'సందేహం' కవితను పరిశీలించినప్పుడు

ఎడారిలో ఒంటరిగా చినిగిన ముతక చీర
అణచుకొంటున్న మానం బయటపడుతున్న దైన్యం
పొరుగు వాళ్ళ నవ్వులు లెక్కచేయని తపస్సు
వాగ్దానాల అద్దాల పగుళ్ళు అమ్మ శరీరం మీద నెత్తుటి మరకలు
ఏ వాన చినుకు కడిగేస్తుంది? ఏ పూల యెద తుడిచేస్తుంది?...

ఏ అమృత హస్తం సేద తీర్చుతుంది? ఏ అజ్ఞాత నేస్తం పలుకరిస్తుంది?.... అనే కవితా పంక్తులలో ఆశా వాదిగారిపై తిలక్ కవితా ప్రభావం కనిపిస్తుంది. ఈ కవితా పంక్తులు తిలక్ వ్రాసిన ఆ అవ్వే మరణిస్తే కవితను గుర్తుచేస్తాయి.

'కాకిగోల' కవితలో సమాజాన్ని చెట్టుతో పోల్చి, సమాజాన్ని కలుషితం చేసే రాజకీయ నాయకుల్ని కాకు లతో పోల్చి, బరితెగించిన కాకుల గోలల్ని ఓటనే రాయిని వాటంగా విసరి ఇకనైనా ఆపండి అంటూ వ్యంగ్యంగా జాగృత పరచారు కవి.

'హెచ్చరిక' అనే దీర్ఘకవితలో బడుగు వర్గాలను అణచేవారిని తరిమికొడదామని విప్లవగళాన్ని విని పించారు.

కవితల లో ఎదగాలి ఇది పురోగమనం

కవితలలో ఎద గాలి ఇది తిరోగమనం అని చెప్పడం ద్వారా యువకవులు ఎలా ఉండాలో దిశానిర్దేశం చేశారు.

'అంజలి' మినీ కవితలో...

పృథు యత్నంతో మానవత్వం ప్రకృతిని మించి పోవాలంటోంది

ప్రకృతియేమో అనుక్షణం మానవాళిని లొంగ దీసుకొంటుంది

ఈ సత్యం తెలిసిన నా హృది ప్రకృతినారాధించమం టోంది.. అంటూ ప్రకృతి ముందు మనిషి ఎప్పుడూ చిన్నవాడే అనే పరమసత్యాన్ని తెలుపుతారు. ప్రకృతిని ఆరాధిస్తే కాపాడుతుంది. ధ్వసంచేస్తే శపిస్తుంది. నిప్పులు కురిపిస్తుంది.

దేహపోషణకు అన్నం ఆత్మశుద్ధికి చింతన
సమాజం నుండి బహిష్కృతులై నిస్సహాయంగా నలిగి...
మేం విద్యావంతులం అవుతున్నాం...
మేం ఉద్యమ ముఖంగా నడుస్తున్నాం...

ఏనాటికైనా మీ తలలపై కూర్చుంటాం.... అంటూ ఆశావాదిగారు ఆశావహ దృక్పథాన్ని, అందమైన భవిష్యత్తును సాటివారికి కలగాలని అభిలషించారు.

ఈ విధంగా ఆశావాదిగారి ప్రతీ కవితలో ఒక వైవిధ్యం, జీవనానుభూతి, సామాజిక చైతన్యం పాఠకులను అలరిస్తూ ఉంటాయి.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# జానపద సాహిత్యంలో స్త్రీ

– దుండె రాజేశ్వరి, పరిశోధక విద్యార్థి, గిరిజన విజ్ఞానపీఠం, తెలుగు యూనివర్సిటీ, వరంగల్, తెలంగాణ.

తెలుగు జానపద వాజ్మయ ప్రాముఖ్యతను గురించి మొదటగా పరిశోధనలు చేసిన వారు డా॥ బి. రామరాజు గారు, డా॥ యస్వీ. జోగా రావు గారు, డా॥ ఆర్.వి.ఎస్. సుందరం గారు, డా॥ నాయని కృష్ణకుమారి గారు, డా॥ తంగిరాల సుబ్బారావు గారు మొదలగువాళ్ళు.

జానపద విజ్ఞానము మానవ సంస్కృతిలో ఒక భాగము. ఇది తెలిసి కాని, తెలియక కాని వారి నమ్మ కములలో, ఆచారములలో, సంప్రదాయములో మరియు వారు ఆచరించు ఆచరణలలో, మత విశ్వాసములలో, పురాగాథలలో మరియు సామాన్యులు అంగీకరించే కథలలో, లలిత కళలలో, చేతి పనులలో భద్రపరచబడి వుండి, ఒక వ్యక్తి యొక్క లేదా ఒక సమూహము యొక్క ఉత్సాహాన్ని, తెలివిని తెలియజేస్తుంది. ఎందుకంటే ఒక ప్రాచీన సంస్కృతిని, ప్రాచీన వాతావరణములో ముఖ్య మైన మూలసూత్రములను తెలుపుటకు ఆధారమైనది. ఇది శాస్త్రీయ సాహిత్యానికి, కళలకు సంబందించిన విషయాలను తెలియజేసే చట్రం లాగా కన్పిస్తుంది.

వ్యవసాయమే ప్రధానంగా కల కర్షకులు సేద్య క్షేత్రాలకు సమీపంలో తమ నివాసాలను ఏర్పరుచు కొన్నారు. అవే జానపదములు లేదా గ్రామములు. వానిలో నివసించేవారు జానపదులు. జానపదులు సృష్టించిన సాహిత్యమే జానపద సాహిత్యం.

జానపద సాహిత్యంలో స్త్రీల జీవితాలు, స్త్రీల ఆలోచనలు, అనుభూతులు, స్త్రీల సమస్యలు కన్పి స్తాయి. జానపద స్త్రీ తల్లిగా, భార్యగా, చెల్లిగా, కోడలిగా, ఆడపడుచుగా గడిపే జీవితం, ఎదుర్కొనే సమస్యలు, పరిష్కారాలు, పర్యవసనాలు జానపద సాహిత్యంలోని వివిధ ప్రక్రియలలో రూపుదిద్దుకుంటాయి.

రిచర్డ్ ఎం. డార్సన్ అనే పరిశోధకుడు జానపద విజ్ఞానాన్ని స్థూలంగా నాలుగు భాగాలుగా విభజించాడు. అవి (1) మౌఖిక జానపద విజ్ఞానం (2) సాంఘిక జానపద ఆచారాలు (3) జానపద వస్తు సంస్కృతి (4) జానపద కళలు . అలాగే జానపద వాజ్మయాన్ని శ్రీహరి ఆదిశేషువు గారు తొమ్మిది రీతులుగా విభజించారు. అవి (1) శృంగార రసాత్మక గేయాలు (2) వీర కథా వాజ్మయము (3) సాంఘిక కథా వాజ్మయము (4) కరుణ రసాత్మక వాజ్మయము (5) అద్భుత రస ప్రధాన కథా వాజ్మయము (6) స్త్రీల పాటలు (7) వేదాంత భక్తి రస ప్రధానమైన రచనలు (8) స్త్రీల, బాల బాలికల గేయము (9) ప్రకీర్ణములు.

## స్త్రీల పాటలు :

జానపద సాహిత్యంలో స్త్రీల పాటలకున్న ప్రాముఖ్యం ఎనలేనిది. స్త్రీలు లాలిపాటలు, జోల పాటలు, మంగళ హారతులు, తలుపు దగ్గర పాటలు, మేలుకొలుపు పాటలు, భక్తి పాటలు, పారమార్థికపు పాలు, పెండ్లి పాటలు, అప్పగింతల పాటలు, విసుర్రాత్రి పాటలు, గొబ్బిపాటలు, బతుకమ్మ పాటలు మొదలైనవి.

దేశంలో ఎన్నో నాగరికతలు వివిధ మతాలు, పరి పాలనలో మార్పులు, సాంఘిక వాతావరణంలో మార్పులు ఎన్నొ వచ్చినా జానపద స్త్రీలు ఆ ప్రభావానికి లోను గాకుండా వారి ఆచార సంప్రదాయాలను కాపాడుకుంటు న్నారు. సంస్కృతీ సంప్రదాయాలకు స్త్రీల పాటలు ఎంత గానో ఉపకరిస్తాయి. జానపదస్త్రీల మనస్తత్వాన్ని హృదయ భావుకతను వారి పాటలు వ్యక్తం చేస్తాయి.

జానపద స్త్రీలు పాడే పాటలలో మానవ జీవితంలోని వివిధ ఘట్టాలు వర్ణింపబడ్డాయి. బాల్యదశలో స్త్రీలు తమ బిడ్డలను రామునిగానో, కృష్ణునిగానో భావించుకొని రకరకాల లాలిపాటలు, జోలపాటలు పాడుతారు. బిడ్డ ఏడిస్తే లాలించడానికి పాడే పాటలను లాలి పాటలని, నిద్రబుచ్చడానికి పాడే పాటలను జోలపాటలని అంటారు. ఉదా నిద్రకు ఉపక్రమిస్తున్న తన బిడ్డను జోకొట్టుతూ

"జో అచ్యుతానంద జోజోముకుందా - రావే పరమానంద రామ గోవిందా జో ... జో..." అని పాడే పాట తెలుగు స్త్రీలందరికీ పరిచయము. తన బిడ్డ ఏడుపు చూడలేని స్త్రీ ఆ బిడ్డను ఊరడిస్తూ

ఏడవకు ఏడవకు వె(రినాయన్న
ఏడిస్తే నీ కండ్లు నీలాలు గారూ
నీలాలు గారితే నే చూడ లేను
పాలైన గారవే బంగారు కండ్ల" అని పాడుతుంది.

స్త్రీకి వివాహం అయిన తరువాత తల్లిదండ్రులు ఆమెను అత్తవారింటికి సాగనంపుతారు. తల్లి తన బిడ్డకు ఎన్నో బుద్ధులు నేర్పుతుంది. ఆ సందర్భంలో పాడేపాటలు ఎన్నో ఉన్నాయి.

ఉదా : అత్తా మామ పొట్టా పాన
వొద్దిక కల్గియుండు
పుట్టినింటికి కీర్తిని తెస్తే
మళ్ళీ నిన్ను తోలుకు వస్తు
అష్ట కంకణాల చేయి
అదిలించి నడువా బోకు
పక్క నున్న పరిటాకొంగూ
జారవిడిచి నడువా బోకు
పండుగ పది నాళ్ళున్న దనంగా
నాటికె తోలుక వస్తూ
మా యమ్మ లక్ష్మీ దేవి పోయి రావమ్మ
మా తల్లీ పార్వతిదేవి పోయి రావమ్మ
పలుమార్లు పలుదెచి నవ్వబోకమ్మ
అతనికాదని పూలు ముడువ బకమ్మ
మమ్ము రచ్చకు తేకు మముగన్న తల్లీ
మల్లపూలా చెండ్లు నీకు అంపెదమూ
మాయమ్మ లక్ష్మీదేవి పోయి రావమ్మ
మా తల్లి గౌరీదేవి పోయి రావమ్మ

ఈ విధంగా తల్లిదండ్రులు కొత్తగా పెండ్లయిన బిడ్డకు అత్తవారింట్లో ఎలా మెలగాలో చెపుతూ సాగనంపుతారు.

## జానపద కథల్లో స్త్రీ చిత్రణ :

జానపద కథలలో స్త్రీ ధీరవనితగా, సమయోచిత తెలివిని ప్రదర్శించేదిగా, కొన్ని సందర్భాలలో అబలగా, సంసారాన్ని చక్కదిద్దుకునే మహిళగా లోకాన్ని మేలు చేసే పరోపకారిగా కన్పిస్తుంది.

ఉదాహరణకు ఒక కథలో ఒక ఇద్దరు పిల్లల తల్లి అత్తవారింటి నుండి పుట్టింటికి బయలుదేరుతుంది. అడవి మధ్యలో బండి ఎడ్లుబెదిరి పారిపోతాయి. తల్లి పిల్లలతో ఒక చెట్టు క్రింద కూర్చుంటుంది. అంతలో పులి అక్కడకు వస్తుంది. తల్లి బెదరకుండా పిల్లలతో పులి వినేటట్లుగా మీరు ఆకలికి బాధ పడకండి. పులి రాగానే దాన్ని చంపి మాంసం వండిపెడతానని అంటుంది. పులి ఆ మాటలను విని పిల్లల తల్లి నిజంగానే తననుచంపేటట్లుగా వుందని భయపడి నక్కను తోడుగా వెంబడి పెట్టుకుని వస్తుంది. నక్కను చూచి పిల్లల తల్లి "ఓ నక్కా ! నేను రెండు పులులను చంపడానికి తీసుకొని రమ్మంటే ఒక్క పులినే తీసుకొని వచ్చావెందు"కని ప్రశ్నిస్తుంది. ఆ మాటలు విన్న పులి, నక్క కూడా తనను మోసం చేసిందని, పిల్లల తల్లి తనను చంపేస్తుందనే భయంతో పారిపోతుంది.

వేరొక కథలో మంత్రిని రాజు గుమ్మడి పండును పగలగొట్టకుండా, లోపల ఎన్ని గింజలున్నాయో చెప్ప మంటాడు. లేకుంటే తల తీసివేస్తానని బెదిరిస్తాడు. మంత్రి జవాబివ్వలేక చావు దగ్గరికి వచ్చిందని ఇంటికి వచ్చి ఏడుస్తాడు. అతని భార్య రాజ సభలో గుమ్మడి చెట్టు మొలిచిన రోజు, తీగ పొడవు, ఇంత వరకు చెట్టుకు కాచిన కాయలు, పూచిన పూవుల సంఖ్యను తెలిపితే గుమ్మడి కాయలోని గింజల సంఖ్యను తెలుపగలని అంటుంది. రాజు ఆమె తెలివికి, ప్రశ్నలకు తెల్లబోయి తన తెలివి తక్కువ తనానికి సిగ్గుపడుతాడు.

ఈ రెండు కథల్లోనూ స్త్రీలు సమయోచితంగా తమ తెలివినీ, ధైర్యాన్నీ ఉపయోగించి ఆపదనుండి తప్పించు కున్నారని తెలుస్తుంది.

## జానపద సామెతల్లో స్త్రీ పాత్ర చిత్రణ :

ఒక జాతి తరతరాల సామాజిక, చారిత్రక అనుభవా

లను అర్థం చేసుకోవడానికి సామెతలు మనకు ఉపకరిస్తాయి. ముఖ్యంగా పురుషస్వామ్య ప్రదానమైన మన సమాజంలో స్త్రీల పరిస్థితిని అర్థం చేసుకోవాలంటే, పురుష దృక్కోణంలో స్త్రీ ఏ విధంగా ఉంటుందో తెలుసు కోవడానికి సామెతలను ఆధారంగా తీసుకొని పరిశీలించవచ్చు.

తమ జన్మకు మూలకారణం స్త్రీయే అన్న సంగతి మరిచిపోయి స్త్రీ శిశువు జన్మించిందనగానే "తోకల వడ్లు గొంతులో పోసి చంపకూడదా" అని పల్లెల్లో ఆడపిల్లల మీద అసహ్యంతో ఉచిత సలహాలను వెనుకటి తరం వారు ఇచ్చేవారు. "అమ్మాయి పుట్టిందంటే ఆయువు సగం కుంగినట్టే" అని తల్లిదండ్రులు శోకాలు పెడుతుంటారు. సమాజంలో ఆడపిల్లలంటే ఉండే చులకన భావం, వారి పెళ్ళి, పెళ్ళి తర్వాత వారి జీవితం, ఇవన్నీ తల్లిదండ్రులకు సమస్యలే. అందుకనే ఆడపిల్ల అనగానే వారు ఆవేదనను భవిస్తారు.

సామెతలకు ఉండవలసిన లక్షణాలను ఈ విధంగా తెలిపాడు - (1) సంక్షిప్తంగా ఉండటం (2) స్పష్టంగా ఉండటం. (3) బహుళ ప్రచారంలో వుండటం (4) అలంకారికమై ఉండటం (5) ప్రాచీనత్వాన్ని కలిగి ఉండటం (6) పలువురి నోళ్ళలో నలిగినటువంటి ఒక నిజం.

దేశ చరిత్రకు, జాతి సంస్కృతికీ, మానవ నైజ స్వరూపానికీ అద్దం పడుతుంది సామెత. అయినా, ఒక్కొక్కసారి అనూచానంగా వస్తున్న ఆచార వ్యవహారా లను సైతం ధిక్కరిస్తుంది. సామెత. ప్రకృతి సహజమైన సత్యాన్ని చెప్పటంతో పాటు వికృత మానసిక తత్వాన్ని కూడా ఎత్తి చూపుతుంది. విమర్శించి వేళాకోళం ఆడుతుంది. వ్యవస్థలోని లోపాలను సవ్యాఖ్యానంగా నిరసిస్తుంది.

ఉదా : "చూలింత బాలింత సుఖము గోరితే
లేత మామిడి చెట్టు పూత గోరింది"

'మామిడి చెట్టు పూత" అనునది పలుకుబడి. బాలింతను లేత మామిడి చెట్టుతో పోల్చుట జానపదుల ప్రత్యేకత. ఏ విధంగానైతే పూత బట్టిన చెట్టు అందంగా కనిపించునో అట్లే సంతానవతియైన స్త్రీ జీవితం ధన్యమగునని భావం.

సామల దేశానికి నన్నియ్యి బోకవ్వ
నేను తినగ లేను సామల బువ్వ
బావల మీదికి నన్నియ్యి బోకవ్వ
బారిదొడ్ల పెండ నే దీయలేను
మరదుల మీదికి నన్నియ్యి బకవ్వ
మల్లె చెట్టుకు నీళ్ళు నే పొయలేను

కరువు ప్రాంతానికి తననివ్వకూడ దనుచు, బావా మరుదలు ఎక్కువగా ఉన్న ఇంట్లోకి తనను ఇవ్వ కూడదనీ, అట్లే పనులు ఎక్కువగా చేయవలసి వచ్చు ఇంటిలోకి తననివ్వకూడదని ఆమె తల్లితో చెప్పెను. తాను భర్తకు మాత్రమే సేవ చేసెదనని తెలుపుట వలన స్త్రీ మనస్తత్వాన్ని తెలుపుచున్నది.

సామెతలను పరిశీలిస్తే పశువులకు, పడతులకు పోలిక ఎక్కువగా కన్పిస్తుంది. అంటే పురుష ప్రధానమైన మన సమాజం దృష్టిలో వీరిరువురూ సమానమే అన్న భావజాల వ్యాప్తి చెంది వున్నట్లుగా గుర్తించాలి.

'గొడ్డు వచ్చిన వేళ బిడ్డ వచ్చిన వేళ"
'వంశమెరిగి వనితను వన్నెనెరిగి పశువులను కొనవలె"
'తల్లిని చూచి పిల్లను, పాడిని చూచి బర్రెను కొనాలి"
"చేతిలో గుర్రాన్ని ఇంట్లో పెళ్ళాన్ని నమ్మరాదు"
'ఆడది తిరిగి చెడితే గుర్రం తిరగక చెడుతుంది"

ఈ విధంగా జానపద సాహిత్యంలో స్త్రీ పాత్ర చిత్రణ వుంటుంది.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# వట్టికోట జైలు లోపల కథలు - ప్రజా రాజకీయాలు

- కల్లెబోయిన కుమారస్వామి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

వట్టికోట ఆళ్వారుస్వామి నల్లగొండ జిల్లాలోని నకిరేకల్ సమీపాన ల 'మాధవరం' అనే గ్రామలో 1 నవంబర్, 1915న నిరుపేద శ్రీ వైష్ణవ బ్రాహ్మణ దంపతులు శ్రీమతి సింహంద్రిమ్మకు, శ్రీమాన్ రామచంద్రా చార్యులకు జన్మించాడు. స్వయంకృషితో చదువుకొని విజ్ఞానవంతుడై గొప్ప రచయితగా సాహిత్యంలో స్థానం పొందాడు. అదే క్రమంలో ప్రజా ఉద్యమాల్లో పాల్గొని 'ప్రజల మనిషి'గా ఎదిగాడు వట్టికోట ఆళ్వారుస్వామి రచయితగా, ఉద్యమకారుడిగా సమానంగా కృషి చేశాడు. గ్రంథాలయోద్యమంలో పాల్గొన్నాడు. గ్రంథమాలను స్థాపించి సాహిత్యప్రచురణలు చేసి పాఠకులను పెంచాడు. సాహిత్యాసక్తిని కల్గించాడు. ఒక వంటల వాడుగా, హోటల్ సర్వర్‌గా, ప్రూప్ రీడర్‌గా, సామాన్యునిగా జీవితం ప్రారంభించిన వట్టికోట కమ్యూనిస్ట్ పార్టీలో సభ్యునిగా ఉద్యమకారునిగా గొప్ప సాహిత్య సృష్టికర్తగా రూపొందాడు. తెలంగాణలో ఆయన పాల్గొనని ఉద్యమం లేదు.

1943 ఆంధ్రప్రాంతంలో ఆరంభమైన అభ్యుదయ రచయితల సంఘం సమావేశాలకు తెలంగాణ నుంచి ఎకైక ప్రతినిధిగా వట్టికోట ఆళ్వారుస్వామి హాజరు అయ్యారు. కాంగ్రెలో కమ్యూనిస్ట్‌గా, కమ్యూనిస్ట్‌ల్లో కాంగ్రెస్ ఆలోచనాపరుడిగా సంఘ సంస్కరణకు పాటు పడే విమర్శకుడిగా, కార్యశీలిగా ఆళ్వారుస్వామి గుర్తింపు తెచ్చుకోన్నాడు. గ్రంథాలయోద్యమం, పత్రికోద్యమం, సత్యాగ్రహాల్లో విశిష్ఠ భూమిక పోషించాడు.

వట్టికోట గారు నిత్యం ప్రజల సమస్యలపై పోరాటాం చేసేవారు. నగర ప్రాంతంలో కార్మికలు సమస్యల పరిష్కారం కోసం వారు కృషి చేస్తూ వచ్చేవారు. 1944లో గుమస్తాల సంఘంను నెలకొల్పాడు. వెట్టి చాకిరీకి దగ్గరగా బతుకులులీడుస్తున్న కార్మికులకోసం వారానికికొక సెలవు దినాన్ని ఇతర రాయితీలను పోరాటం చేసి సాధించారు. వారి కోసం 'గుమాస్తా' పత్రికనునడిపాడు. 1946లో హైదరాబాదులోని రిక్షాలను నిజాం సర్కారు రద్దు చేయడానికి సిద్ధం అయింది. అది తెలిసిన వెంటనే రిక్షా కార్మికులందరిని ఏకం చేసి ప్రభుత్వ నిర్ణయానిన వెనక్కి తీసుకునే దాక విట్టికోట పోరాటంచేశాడు. రైల్వేశాఖ వారు తాత్కాలిక ఉద్యోగులను తీసివేసినపుడు ఆళ్వారుస్వామి వారితో కలిసి ఉద్యమం కొనసాగించారు.

1938 నుంచి 1961లో చనిపోయే నాటి వరకు తెలంగాణ చైతన్యానికి, పోరాటానికి అనునిత్యం పాటు బడ్డ స్వార్థత్యాగి ఆళ్వారుస్వామి ఆయన కథలు, నాటికలు, నవలలు రాశాడు. మొదటి నవల దేశోద్ధారక గ్రంథమాల తరపున 1955 జనవరిలో ప్రచురితమయింది. దాని పేరే ప్రజల మనిషి' ఈ పేరు సరిగ్గా సరిపోతుంది. ఈ నవలలో తెలంగాణ జనసామాన్యతో పాటు, సర్వ సామాన్యంగా అందరూ మాట్లాడే భాషను సంభాషణల్లో రాశాడు. 'గంగు' నవల 'ప్రజల మనిషికి' కొనసాగింపు. గంగు నవలలో కమ్యూనిస్టు పార్టీ తెచ్చిన చైతన్యం పోరాట స్ఫూర్తి వర్ణించబడినాయి.

వట్టికోట 1946-51లో జైలులో వున్నప్పుడు రచించిన కథలను 1952లో 'జైలు లోపల' పేరుతో దేశోద్ధారక గ్రంథమాల 13వ ప్రచురణగా అంటె జైలు ఉంచి విడుదల కాగానే గ్రంథమాలను పునరుద్దరించి దాని తరుపున ఈ కథల సంపుటిని ప్రచురించాడు. దీనిలో ఆరు కథలు ఉన్నాయి. ఇవి గాక సుజాత స్రవంతి, తెలుగుతల్లి మొదలైన పత్రికల్లో 'ధర్మారాజు' మొదలైన కలం పేర్లతో వట్టికోట వ్రాసిన కథలు 15 దొరుకుతున్నాయి.

వట్టికోట వారు ఎక్కడ ఉన్నా అక్కడి దుర్వ వ్యవస్థను బాగు చేయాలని తపన పడ్డాడు. జైలులో వున్న పరిస్థితులను చూసి స్పందించాడు. ఆయన జైలులో ఉన్న ఖైదీల జీవిత నేపథ్యం చేత చలించిపోయే వట్టికోట 'జైలు లోపల'

కథలను రచించాడు. ఈ కథలు నిజంగా జరిగిన సంఘటనలు నిజమైన జీవితాల చేత ప్రేరణను పొంది వ్రాసి కథలే. కొన్ని కథల్లో ఖైదీల సామాజిక జీవితం నేపథ్యం అయితే - కొన్ని కథల్లో రాజకీయ పరిణామాలు నేపథ్యంగా వున్నాయి.

ఈ కథానికల్లో జైలే కథా స్థలం. 1940-50 మధ్య కాలమే కథ కాలం. ఈ సమయంలో రెండవ ప్రపంచ యుద్ధం, నిజాం వ్యతిరేక పోరాటం రెండు ఉన్నాయి. జైలు పరిసరాలే కథానికలలోకి, జైలులో ఉన్న పాత్రలకీ విస్తరిస్తుంది. జైలు బయట వున్న పాత్రలను కూడ ప్రభావితం చేస్తుంది. కష్టజీవుల కోసం ఉద్యమకారుల కోసం, వర్గ సమాజం ఈ లోకంలో నిర్మించిన నరకం పేరే జైలు. జైలు ఒకపెద్ద తలకిందులవ్యవహారం. జైల్లో ఉండవలసిన నేరుస్తులంతా బయట స్వేచ్ఛా ప్రపంచలో వుంటారు. బయట ఉండవల్సిన మంచి వాళ్ళంతా జైలు లోపల ఉంటారు. నెహ్రూ గారు అన్నట్టు "మన దేశంలో జైళ్ళలో శిక్ష అనుభవిస్తున్న వారిలో నూటికి 85 మంది నేర ప్రవృత్తి గలవారు కాదు. తక్కిన 15 మంది కూడ స్వభావతః నేరగాండ్రు కారు. పరిస్థితులే వారినావిధంగా చేశాయి". ఐతే 'జైలు లోపల' కథల్లో జైల్లో ఉన్నవాళ్ళంతా అమాయకులే అని మనం నమ్మితే చాలు ఆళ్వారుస్వామి కథల ప్రయోజనం నేరవేరినట్లే.

'జైలు లోపల' కథల్లో మొదటి కథ 'పరిగె'. తెలంగాణ పల్లెలో సామాన్యుని జీవితం ఎంత దీనంగా వుండేదో ఈ కథ చెప్తున్నది. వెట్టిచాకిరి చేసే కింది కులాల వాళ్ళకు వాళ్ళ పొట్ట పోసుకోవటానికి సమయం ఉండేదికాదు. గ్రామంలోని దొరలకు, గ్రామాధికారులకు, దొరాలకు వచ్చే ప్రభుత్వోద్యుగులకు జీతబత్తాలు లేకుండా పనులు చేయాలి. ఈ కథలో మల్లయ్య ఖానాపురంలో వంతు మాదిగ, కూతుర్ని కని తల్లి చనిపోయింది. జీవితమంతా వెట్టిచాకిరి చేసి కండలు కరిగించిన తండ్రి మంచం పట్టాడు. ప్రేమతో పెంచి పెద్ద చేసిన చెల్లెలుకు తండ్రికి ఇంత తిండి పెట్టని స్తితిలో వున్నాడు మల్లయ్య ఒకరోజు మల్లయ్య వెట్టిచాకిరికి పోయి సాయంత్రం వచ్చాడు. ఆకలితో మలమలమాడుతున్న తండ్రికి, చెల్లెలుకు తినటానికి ఏమైనా గింజలు సంపాదించి తస్తానని బయలుదేరిన మల్లయ్య ఒక చెనులో పరిగె కర్రలను పోగు చేసుకొని కట్ట కట్టుకొని సంతోషంగా బయలు దేరుతాడు. ఇంతలో అజానుబాహువైన రైతు వచ్చి తన కల్లంలోంచి ధాన్యం కట్టలను దొంగిలించాడని పోలీసు పటేలుకు అప్పజెప్తాడు. చెల్లెలును పక్క గ్రామానికి వంతుకి పంపి పోలీసు పటేలు మల్లయ్యను పోలీసులకు అప్పజెప్పాడు. మల్లయ్యకు దొంగతనం నేరం క్రింద మూడు నెలలు జైలు శిక్ష పడుతుంది. జైలులో వున్నప్పుడు తండ్రి మరణించాడని చెల్లెలు ఊరు విడిచి ఎక్కడికో వెళ్ళిపోయిందని ఇల్లు పాడుపడిందని మల్లయ్యకు తెలుస్తుంది. ఆ వార్త విని మల్లయ్య గత్యంతరం లేక పెద్దగా ఏడుస్తాడు. తపిస్తాడు అది ఖైదీ మల్లయ్య జీవితం.

'పతితుని హృదయం' కథలో ఉరిశిక్ష నిషేధింపబడాలన్న విషయాన్ని వట్టికోట చర్చించాడు. ఒక ఖైదీ ఉరి తీయబడ్డాడని తెలిసిన గండయ్య చాలా చలించిపోతాడు. 'ఓ మనిషి ఇంకో మనిషి చేతులు కట్టి ఉరిపెట్టి వేలాడ దీస్తే చచ్చిందాక గుడ్లు మిటకరిస్తూ చూడటానికి అక్కడ నిలుచున్నవాండ్ల కేట్లా మనసొప్పిందో' నాకైతే అతని పీనిగెను చూడటానికి కూడ మనసొప్పలేదురా' అని గండయ్య విచలితుడవుతాడు. విద్య, విజ్ఞానం లేక వేరే పని చేయలేక నేరం చేసేవాళ్ళ పరిసరాల ప్రభావంతో నేరాలు చేస్తున్నారు. వాళ్ళను బాగు చేస్తే బాగు పడ్డారు కాని ఉరి తీయటమన్నది మానవత్వానికి విరుద్ధమని మట్టికోట అభిప్రాయం. ఆ రోజుల్లో ఒక వైపు నిజాం ప్రభుత్వంతో పోరాటంలో మునిగి తేలుతూ కూడా వట్టికోట పౌరహక్కులు, మానవ హక్కుల గురించి ఆలోచించాడు. ఉరిశిక్ష వుండకూడదని రద్దు కావాలని మానవతా దృక్పథంతో బాధపడ్డాడు.

'విధిలేక' కథలో నర్సయ్య పేదరికం, నిరుద్యోగం, నైరాశ్యంతో విధిలేక వేరే మార్గం లేక క్రమంగా దొంగ అవుతాడు. మూడు నెలల కఠిన శిక్ష పడుతుంది. బీద తనం, నిరాదరణ, నిరుద్యోగం, దుష్టసహవాసం, వీటి

ఒత్తిడి వల్ల నేను ఈ విధంగా అయ్యాను. నా వంటి వాళ్ళు తయారు కావటానికి కారణమైన దుష్ట శక్తుల గురించి ఆలోచించండి. దుష్ట జాడ్యమైన బీదతనం విషక్రిములను ఊరు పేరు లేకుండా చేయండి. చేయాల్సి కర్తవ్యం మీరు బాగా గుర్తించాలె. అని నర్సయ్య కాంగ్రెస్ వాదితో అంటాడు. ఎన్నికల్ల గెల్చి రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వం కర్తవ్యాన్ని వట్టికోట ఇక్కడ గుర్తు చేసాడు. బీదతనాన్ని తొలగించకపోతే నర్సయ్య లాంటి చీడ పురుగులు తయారవుతారు. నర్సయ్య జైలులో వుండగానే అతని భార్య ఆకలి బీదతనం భరించలేక లక్ష్మయ్య అనే దొంగను పెండ్లి చేసుకొని నర్సయ్య జీవితం నుంచి వెళ్ళిపోతుంది. ఆ విధంగా నర్సయ్య జీవితం మంట గలుస్తుంది. 'విధిలేక ! విధిలేక ! అంటూ జైలు గోడల మధ్య నర్సయ్య బుసకోడ్తూ వుండిపోతాడు.

'మా కంటే మీరేం తక్కువ' కథ చిన్నదే. కాని ఆ కథలో చెప్పిన విషయం ఆనాటి సమాజాన్ని విమర్శిస్తు న్నది. రంగడు, వెంకడు దొంగలు, వాళ్ళున్న జైలుకు ప్రభుత్వం చేత నియమింపబడిన జైలు విజిటర్‌గా ఇంద్రసేనారెడ్డి వస్తాడు. అతన్ని చూసి రంగడు, వెంకడు గుర్తుపట్తాడు 'మా రాజులు కష్టపడ్డందుకు గట్టెక్కిన్రు మేము వున్న చోటనే ఉన్నాం. పాపపు పుటకలు అంటాడు రంగడు. కొందరు 1948 సెప్టెంబర్ 17న పోలీస్ చర్యతో నిజాం లొంగుబాటు కావటంతో పోరాట విరమణ చేశారు. అటువంటి వారు ప్రభుత్వంలో ఉద్యోగాలు కూడా సంపా దించుకొని లౌక్యం పాటించరని ఈ ఇంద్రసేనారెడ్డి వృత్తాంతాన్ని బట్టి తెలుస్తుంది.

ఈ సంపుటిలో 'మెదడుకు మేత' కథ చాలా పెద్దది. ఈ కథలో వట్టికోట హిందూ ముస్లింల మధ్య కోట్లాటలు చెలరేగటానికి అసఖ్యతకు కారణాలను విశ్లేషించారు. ఒకటి హిందూ ముస్లింలలో వున్న విభిన్న ఆచారాలు అలవాట్లు వాళ్ళ మధ్య అసహనం కలగటానికి కారణాలు కాగా, వాళ్ళ వాళ్ళ మతసంప్రదాయాల విభిన్నత మరో కారణం అని ఈ రెండు విషయాల్లో ఇద్దరూ సహనం వహించి పరస్పరం గౌరవించుకోవటం చేత సఖ్యత సమకూడుతుందని కమ్యూనిస్టు భావాలు గల మోహన్ బాబు పాత్ర మూలంగా వట్టికోట చెప్పాడు. 'అవకాశమిస్తే' కథలో చాలా తెలికైన సంభాషణలతో హాస్యపూర్ణంగా నడిచింది. పాత్రలు గంభీరమైనవి కావు. సంభాషణాలు గంభీరంగా లేవు ఈ కథలో వట్టికోట ధ్వనింప చేసిన విషయాలు గంభీరమైనవి. పోరాటంలో పాల్గొన్న వాళ్ళు కొందరు ఎట్లా అన్ని విధాల లాభపడ్డారో చిత్రించాడు. మాములు కార్యకర్తలు ఎక్కడున్నా వాళ్ళు అక్కడే వుండి పోయారు. వాళ్ళను పట్టించుకోనేవాళ్ళు లేక పోయారు. ఇటువంటి సంఘటనలతోనేమో జైలు నుంచి విడుదల య్యాక 1951, 52ల్లో వట్టికోట రాజకీయాలకు విముఖుడ య్యాడు పార్టీకి దూరంగా వున్నాడు. వట్టికోట ఆళ్వారు స్వామి మొదట్లో రచించిన కథల కన్న 'జైలు లోపల' కథలు భాష శైలిలో, కథనం, కథన శిల్పంలో ఉత్కృష్ట మైనవి. అంటే ఆయన కథా రచనలో చేసి సాధన, కథన శిల్పంలోని ప్రస్థానం తెలుగు సాహిత్యంలో కొన్ని ఉత్తమ మైన, అపురూపమైన కథలను సృష్టించారు. అవి తెలుగు సాహిత్యంలో గౌరవాన్ని తెచ్చిపెట్టాయి.

వ్యవస్థతో రాజీపడి రాయదలచుకున్న వాళ్ళకు, దానితో సంఘర్షిస్తూ రాసిన వాళ్ళకు పొంతన వుండదు. నిరంతరం సంఘర్షణలో సంభవించిన అగ్ని పుంజాలే ఆళ్వారు రచనలు అని చెప్పవచ్చు. ఒక హోటల్ కార్మికుడు రచయిత కావటం ఆశ్చర్యం కాకపోవచ్చు. కాని రచయిత లనే ఆశ్చర్యపరిచే రచయిత కావటం మాత్రం అనుహ్యం. సాహిత్య సృజన అన్నది ఆళ్వారుకు పేరు తెచ్చి పెట్టే వ్యాపకం కాదు. ప్రజలు చైతన్యపరిచే వాహిక.

వట్టికోట నవలల్లోగాని, కథల్లోగాని వాస్తవికతకు తగిన సరళ సులభ భాషాశైలిని ప్రయోగించాడు. ఆయన వస్తువును ఎంత సరళంగా మన ముందుంచుతాడో శైలి కూడా సరళంగా వుంటుంది. నవలాకారునిగా, కథల రయితగా, వ్యాస రచయితగా, పత్రికా నిర్వాహకుడిగా, గ్రంథాలయ నిర్మాతగా తెలుగు సాహిత్యంలో చెరగని స్థానాన్ని సంపాదించుకున్నాడు. తన తరాన్ని తన తరువాతి తరాలనూ ప్రభావితం చేసిన తెలంగాణ విమోచనోద్యమ కథా రచయిత ఆళ్వార్‌స్వామి జీవితం, సాహిత్యం, వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకం, చిరస్మరణీయం.

**ఆధార గ్రంథాలు :**


1. తెలగాణ తొలి తరం కథలు - ముదిగంటి సుజాతరెడ్డి
2. తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర - తెలుగు అకాడమి
3. జైలు లోపల కథలు - వట్టికోట ఆళ్వారుస్వామి
4. తొమ్మిది పదుల 'తెలంగాణ కథ' - డా॥ కాలువ మల్లయ్య
5. నూట పదేళ్ళ తెలుగు కథ - విభిన్నధోరణులు
6. వట్టికోట ఆళ్వారుస్వామి రచనలు - ఒక పరిశీలన - అమ్మంగి వేణుగోపాల్
7. 20వ శతాబ్ది తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య ఎస్వీ రామారావు.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# ఆదూరి సత్యవతీ దేవి కవిత్వంలోని మధుర భక్తి

- మార్కాపురపు నిర్మల కుమారి, పరిశోధక విద్యార్థిని, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

"పాట నా పుట్టుక, కథ నా ఎదుగుదల, కవిత్వం నా చలనం" అని చెప్పుకున్న సత్యవతీ దేవి కవిత్వ రచనకు ప్రకృతే ప్రేరణ. గీత రచయిత్రిగా 13వ ఏటనే కలం చేపట్టారు. సుమారు 300 కు పైగా లలితా గీతాలు, భక్తి గీతాలు, దేశభక్తి గీతాలు, బాలల గీతాలు రచించారు. వెన్నెల్లో వేణుగానం, అంతరగాంధారం, ఒక వేణువు పలికింది, జల పాత గీతం, రెక్క ముడవని రాగం, వేయి రంగుల వెలుగు రాగం మొదలైనవి ఎన్నో కవితా సంకల నాలుగా వెలువరించాయి.

ఆంధ్ర సాహిత్యంలో భక్తి కవిత్వానికి అమిత ప్రాచుర్యం ఉంది. దివ్యమైన అనుభూతిగా అన్ని వర్గాల వారిని ఆకర్షిస్తుంది. భారతీయ వాగ్మయంలో 'భక్తి' ఒక రసంగా సంస్కృతాలంకారికుడైన రూపగోస్వామి చేత ప్రతిపాదించబడింది. "స్వాతస్మిన్ పరమ ప్రేమ రూపా" అని భక్తి నిర్వచించబడినది. భగవంతుని చేరుకోవడానికి భక్తుడు చేసే ప్రయత్నమే సాధన. ఇది అనేక రూపాలలో ఉంటుంది. దాస్య భక్తి, సఖ్య భక్తి, వ్యాత్సల్య భక్తి, మధుర భక్తి, మొదలైనవి భక్తికి రూపాంతరాలు.

భారతీయ సాహిత్యంలో మధుర భక్తి ఒక శాఖగా పూచి, కాచి, ఫలించింది. భాగవతం, శ్రీకృష్ణ కర్ణామృతం, గీతగోవిందం వంటి కృతులు సంస్కృత భాషలో మధుర భక్తి శాఖలో వెలసిన సుధాకళికలు. రవీంద్రుని భాను సింహ పదావళిలో, మీరాబాయి పదావళిలో, మహా రాష్ట్రుల అభంగ గీతాలలో ఈ మధుర భక్తితత్వమే కనిపిస్తుంది. ఆంగ్ల కాల్పనిక కవిత్వంలో కనిపించే మిస్టిసిజం మధుర భక్తి నిర్వచనానికి దగ్గరగా ఉంది. పరమాత్మలో లీనమయ్యే కాంక్షతో భక్తుడు తదన్వేషణ చేసి, భౌతిక ప్రపంచంలోని సమస్త పదార్థాలలోనూ పరమాత్మ స్వరూపాన్ని దర్శిస్తాడు.

తాత్వికాశీశ మధుర భక్తిభావవ్యంజకముగా "ఒకవేణువు పలికింది." అంతరగాంధారం' వెన్నెల్లో వేణుగానం' అనీ ఆదూరి సత్యవతీ దేవి తమ గేయ సంపుటులకు నామకరణం చేశారు. తాము వేణువు కావా లని ఆకాంక్షించారు.

'పాడరాదా పాట పదిలంగా నీ నోట'
'పాట వరమని మురిసి పాట సుఖమని తలచి'

అని పాట ప్రాశస్త్యాన్ని ప్రశంసిస్తారు. గానమే ఆనంద మనీ, సంగీత జ్ఞానమే బ్రహ్మానందమని ఆవిడ విశ్వాసం. వేణుగానం మీద ఆమెకున్న ఇష్టం మాటలకూ అందనిది ఈ పుస్తకం శీర్షికే "ఒక వేణువు పలికింది".

ఒక వేణువు పలికినది ఒక మనసుని ఊపినది.
ఒక ఆమని ఒదిగినది, ఒక పున్నమి విరిసినది.

"ఈ పాట నేర్చుకుందాం కార్యక్రమంలో ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం ద్వారా ప్రసారమైనది. ఇంకా ఎన్నో పాటలు ఆకాశవాణి ద్వారా ప్రజలలోకి ఇప్పటికే చేరాయి.

'వెన్నెల్లో వేణుగానం చల్లని యమునా పవనం
మెల్లనై వెల్లువై నా ఉల్లము రంజింపచేసే'

అని పరవశించే కృష్ణ శాస్త్రిగారి భక్తురాలికి అంతటా కృష్ణ దర్శనమే. మురళీగానమే తన ప్రాణంగా భావించే ఈమె మురళిపై మోహన రాగాలాపన మనసును, తనువును తెలియని హాయిలో ఊగిస్తుందంటూ.....

తన ఆలాపన అనే గీతంలో
ఒకపరి వెన్నెల మడుగుగా
ఒకపరి వేకువ తెమ్మెరగా

తరలి తరలి ఈ భువన భాండము సమ్మోహనముగా ఉంచేది అంటూ వేణుగానాన్ని రాగరంజితం చేశారు. చిరుగాలులు మొదలు హరివిల్లు వరకు ఆవిడ రసా స్వాదన చేస్తూ మనల్ని ఆ రస డోలలో ఊపుతారు. 'రస డోల' 'రసానందం' 'రాగరూపం' 'రాగధార' ఇత్యాది గీతాలన్నీ మనల్ని మబ్బు రెక్కలమీద ఊగించే రాగల హరులు.

"చిగురంతటి నీ ప్రేమ కొరకు
పడిపడి నీ వాకిటనే తిరిగెదను". ( విరహార్తిని)

భగవంతుని ఆదరణకై విరహాతురగా కనిపిస్తారు సత్యవతీదేవి.

'ఆత్మ భక్తి' 'పరమాత్మ ప్రకృతి' 'తెరతీయగరాదా' 'కృష్ణ పథం దొరకునా' 'ఈ పాటిసంపద' వంటి భక్తి గీతాలు తెలుగు భాషా వైభవాన్ని ప్రస్తుతించే 'మన తల్లి' వంటి దేశభక్తి గేయాలు కూడా ఇందులో చోటు చేసుకున్నాయి.

సత్యవతీదేవి గారి అంతర గాధారంలోని ఆద్యాత్మిక భక్తిగీతాలు లలిత గీతాలతో పాటు ప్రసిద్దాలై పలువురి ప్రశంసలకు పాత్రమయ్యాయి. దానికి ముఖ్య కారణం ఆమె కృష్ణ భక్తి. కృష్ణుని పంరగా ఆమె రచించిన సంగీత రూపకాలు అంతర గాంధారానికి అలంకారాలు.

నూట ఇరవై ఆధ్యాత్మిక భక్తిగీతాల సమాహారమీ అంతరగాంధారం. ఇది సత్యవతీదేవి హృదయాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించే కవితారసఝరి. సకల దేవతా స్తోత్ర రత్నావళి. జ్ఞానవైరాగ్యాల సంగమస్థలి.

తియ్యని సరళికి తేనెలు పూయగా హాయని ఆమని తలనే ఊచగా
తనువూ మననూ పరవశమై- పిల్లన గ్రోవికి వశమైపోవగా
మువ్వల మురళిని మోమున నిలిపి మోహన రాగం పలికించరా
నా జీవనగానం వినిపించరా.........

ఇలా కృష్ణుని పరంగా వచ్చిన గీతాలు మధురభక్తికి ఉదాహరణలు

గజముఖ స్తుతితో ప్రారంభమైన ఈ గీతాలహరి కృష్ణ లీలల సంగీత నృత్య రూపకంతో సమాప్తమై చదువరులను అనేక కోణాలలో ఆకర్షిస్తుంది. అర్చించని స్వామి లేడు. ఆరాధించని దేవత లేదు. ప్రత్యేకత ఏమిటంటే దైవ ప్రార్ధనలలో అరుదుగా అర్చించబడే పరమగురువు వ్యాసుడు, కలహభోజునుగా తప్ప కరుణామూర్తిగా పేరులేని దేవముని నారదుడు, ప్రత్యక్ష లక్ష్మి తులసి, దీప లక్ష్మి మొదలైన ఎందరెందరో దేవతలు ఈమె కవితామృత సరసిలో కొలువై ఉన్నారు.

రావనుకున్నాను.... వెలుగే లేదనుకున్నాను.
కన్నీరై కరిగి కరిగి చెరగ ఈ బ్రతుకు గడిపి
విలపించే వేళలో
ఒక కమ్మని స్వరము తాకెను ఒక వెన్నెల తునక వాలెను
నీవనుకున్నాను ..... ఆ వెలుగే నీదని విన్నాను.

ఇటువంటి గీతాలలో అభివ్యక్తమైన వీరి భక్తి భావ తరంగాలు ఫఠితల హృదయాలలో కూడా అతిలోకమైన ఆధ్యాత్మికమైన భావనలకు ఆలవాలాలు లేవు. గానమే ఆనందం సంగీత జ్ఞానమే బ్రహ్మానందం అని మనస్సులో పాడుకున్న గీతాలన్నీ ఆమె అనుభూతి స్పర్శలే కాంక్షా స్వప్నాలే.....

హరిహర తత్వాన్ని అలవోకగా శివరామ కృష్ణ శరణం అని స్మరించిన ఈమె అభినందనీయురాలు. ప్రాచీన అర్వాచీన కవులపై ఈమెకు గల భక్తి పలు చోట్ల దర్శనమిస్తుంది. మొల్ల, పోతన, కృష్ణ శాస్త్రి లాంటి సుతిమెత్తని భక్తిభావ కవుల ప్రభావం ఈమెపై ఉండటం వలన కూడా ఈ గీతాల సొబగు రెట్టింపైంది.

నా కవనములు నీవే .... నా గానములు నీవే...
నా లోపల నీవే...... నా ప్రాణములు నీవే ....
అని ఆత్మార్పణం చేసుకున్న ధన్య జీవి ఈమె.

ఏ భాగవత్ప్రార్ధనం చుసిన శబరి గానో, యశోద గానో, పోతన్న గానో, గోపిక గానో, త్యాగయ్య గానో, అన్నమయ్య గానో.... అంతెందుకు ప్రతి ఆర్తి గీతములోను.... ఆర్ద్ర గీతములోను.... భక్తిగీతంలోను.. అన్నింటా సత్య సాక్షాత్కారమే... ఏ జీవికైనా ఇంతకంటే ఉత్కృష్ట జీవన శైలి మరొకటి ఉండదు.

పదము, పాదము నిత్యమూ మదిలో
మెదిలిన కదలిన సామమే గానము
రామ పాదము సోకి అడవి
ఆమని పులకించి పూచె

శబరి నోటను కరగి కరగి
మునుల గుండెలో ఒదిగి నిండి
త్యాగరాజు రూపుదాల్చి
రాగరాజ్యము ముందు నిలిపిన

ఇలా రమ్యమైన రామనామాన్ని రాగరంజితంగా, రమణీయంగా, గాన యోగ్యంగా రచయిత్రి తీర్చిదిద్దారు.

శ్రీ కృష్ణుని పై అనురక్తితో ఆమె సమర్పించిన కవితా శీజలులు మూడు పదుల పైమాటే.... కృష్ణ శాస్త్రి గారికి ఈమె ఏకలవ్య శిష్యురాలని కృష్ణ తత్వనిరూపణములోను, అంచంచలమైన భక్తి భావ పరంపరలోనూ మనం గమనించగలుగుతాము.

కలువ కన్నుల కళ్ళు లేత నీలపు ఒళ్ళు
కరిమబ్బు శిగ మీద శశి రేఖ...
ఎంత అందమైన వర్ణనో...
పూల గంధము పున్నమి అందము దాగి ఉన్నవా
కమ్మని మురళిలో
కురిసే వెన్నెల విరిసే పూలు....
విసిరే గాలి నడిచే మబ్బు నీ నాదలహరిలో
లీనమయ్యేవేళ.... ఆనంద మోహన అంతటా నీవై

ఈ విశ్వమోహనమైన నీ 'పాదాలు' రసజ్ఞుల నలరించే కవితా సుగంధాలు, వెన్నెలజల్లులు. తానే యశోదయై సత్యవతి దేవి "పున్నమి వెన్నెల కందుకు పూల గంధాల స్నానం" చేయించారు. ఉయ్యాలలుపారు, లాలి పాడారు.

వెదురులో వేదం ..... ఊపిరిలో సామం
అరమోడ్పు కన్నులలో ఆ దేవ రహస్యాలు
స్థిర చిత్త మతులకైనా చెప్పగా సాధ్యాలా

అంటూ కృష్ణ తత్వాన్ని అందంగా అందించే ప్రయత్నం చేసారు.

ఆమె తిరిగి రాధగా గోపికగా మురిసారు. శ్రీకృష్ణునితో గోపబాలురు చల్దులారగించడానికి ఎఱ్ఱన, పోతన అద్భుతంగా సాంప్రదాయ సాహిత్యంలో వర్ణించారు. ఎన్నో జానపద గేయాలలో ఇవి చదువుతాము. సత్యవతి దేవి గారు అలతి అలతి మాటల్లో ఈ దృశ్యాన్ని వర్ణిస్తూ

ఎలంగిలన్నము తెచ్చి పెట్టిరి
యజ్ఞకర్తకు యాగభోక్తకు ..

అంటూ గొల్లలు మధ్య చల్దులారగిస్తున్న ఆ లీలా మానుష్య విగ్రహుని భక్తి పరాధీనతకు స్పష్టం చేసారు.

దయ, సత్యం, ప్రేమ, తపస్సులతో కూడిన జీవితాన్ని, దయయు, ధర్మమూ ఏక గుణమైన హృదయాన్ని తనకు సంపూర్ణంగా ప్రసాదించమని శ్రీనివాసుని అభ్యర్థించటం.

సిరులిమ్మని అడగను హరి హరి .... నీ
స్వరగాన లహరులే చాలుమరి అని ప్రార్థించటం
ఆమె ఆధ్యాత్మిక జీవన సరళికి నిదర్శనం.
ఎప్పుడైనా నీ పిలుపుగాని వినబడినా
భవదీయ చరణ యుగళి కనబడినా
వంగివాలి తొందరైతి అందుకొని మందమతినై
చిగురించిన కాలగతిన శిలయై పడి యుందునని
భయమొందితి స్వామీ తిరుమల గిరి స్వామి !

ఈ మధుర భక్తి గీతాలు సత్యవతీ దేవిగారి నిలువెత్తు భక్తిభావ గరిమకు ఎత్తిన పతాకలు.

నీ పెదవి చిగురాకుపై - పలుకు వేణువులో ఒలుకు మధురకథా గీతికనై... పరవశించాలని ఉవ్విళ్ళురిన సత్యవతి దేవి తమ అన్వేషణ ఫలించి ఆ మురళిలోలుని వేణుగానంలోని రాధయై సాయిజ్యం చెందారు.

'కృష్ణా! పిలుపులందుకున్న వెంటనే రావాలనే ఉంది'...... రావాలనే ఉంది అని పాడుకుంటూ ఆ కృష్ణుని పిలుపులకు బదులుపలికి స్వామి సన్నిధికి చేరుకున్నారు. మధురమైన భక్తిభావ తరంగాలలో పఠితలను మైమరపించారు.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# రాయలసీమ ఆధునిక కావ్యాలు - పరిశీలన

## (1951 నుండి 1980 వరకు)

- డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి , సహాయ ఆచార్యులు,
తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

- ఎమ్. రంగస్వామి, పరిశోధక విద్యార్థి,
తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

తెలుగు భాషలో సాహిత్యం 11వ శతాబ్దం నుండి వెలువడినట్లు చారిత్రకాధారాలున్నాయి. తెలుగులో వెలువడిన ప్రాచీన సాహిత్యమంతా పురాణాలు, ఇతిహాసాలు, ప్రబంధాలు, సంకీర్తనలు, శతకాలుగా వెలువడింది. ఇవన్నీ కూడా భారతీయ కుటుంబ వ్యవస్థను, ఆనాటి సంస్కృతిని, ఆచార వ్యవహారాలను, మతాల్లో ఉన్న నీతి సారాంశాన్ని వివరించాయి.

"ఆధునిక సాహిత్యం", "ఆధునిక కవిత్వం" అన్న మాటలు ఇరవయ్యవ శతాబ్దంలో వచ్చిన సాహిత్యాంశాలుగా గుర్తిస్తున్నాం. ఇరవయ్యవ శతాబ్దంలో వచ్చిన సాహిత్యం అంతా ఆధునిక సాహిత్యం కాదు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సంఘనటలపై స్పందిస్తూ, మానవ ప్రాధాన్యత ఉన్న సాహిత్యాన్ని ఆధునిక సాహిత్యం అంటాం. ఇది సామాన్య మానవుని మకుటధారుని చేసింది. సామాన్యుడి జీవితాన్ని వారి సుఖదుఃఖాలను, బాగోగులను పట్టించుకున్నది ఆధునిక కవిత్వం.

ఆధునిక సాహిత్యం అర్థం కావాలంటే ఆధునిక సమాజం అర్థం కావాలి. సమాజంపై అనేక అంశాలు ప్రభావం చూపాయి. విదేశీయులు వ్యాపారం కోసం మన దేశానికి వచ్చి, వాళ్ళ మతాన్ని, సంస్కృతిని, ఆంగ్ల విద్యను మనకు పరిచయం చేసిన తరువాత మన సమాజంలో, సంస్కృతిలో, ఆచార వ్యవహారాలలో, ఆలోచనా విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి.

ఈ క్రమంలో ఆంగ్ల విద్యా వ్యాప్తి వల్ల పాశ్చాత్య సాహిత్యంతో పరిచయం ఏర్పడింది. ఆధునిక ఆలోచనలతో మానవహిత కథావస్తువులతో కవిత్వం రాయడానికి తెలుగువారు పూనుకున్నారు. ఛందోబంధో బస్తులతో, సంస్కృత పదభూయిష్టంతో అంతవరకు పండితులు మాత్రమే చదివి అర్థం చేసుకొన్న సాహిత్యం, పామరులకు కూడా దగ్గరయింది.

ఆధునిక రాయలసీమ సాహిత్యంలో ప్రాంతీయ, అస్తిత్వం బహుశా రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ "పెనుగొండ" అన్న పాటతో 1956వ సంవత్సరం ప్రారంభమైంది.

ప్రాంతీయ అస్తిత్వం అంటే ఒక ప్రాంతపు నైసర్గిక స్వరూపం మాత్రమే కాదు, ఆ ప్రాంతపు భాష, చరిత్ర, సంస్కృతి, రాజకీయాలు మొత్తం కవిత్వంలో ప్రతిఫలిస్తే దానిని ప్రాంతీయ అస్తిత్వవాద కవిత్వం అంటాం.

ప్రాంతం వేరు, ప్రాంతీయత వేరు అంటారు గుడిపాటి. ఈ ప్రాంతీయతను మూడు లక్షణాలుగా అర్థం చేసుకోవచ్చు.

1) ఒక ప్రాంతపు స్థితిగతుల పట్ల స్పృహ కలిగి ఉండటం ప్రాంతీయత.
2) ఒక ప్రాంతపు పూర్వాపరాల చరిత్ర పట్ల చైతన్యం కలిగి ఉండటం ప్రాంతీయత.
3) ఒక ప్రాంతపు అణచివేతకు కారణమైన ఆధిపత్య శక్తులను ధిక్కరించగలగటం ప్రాంతీయత.

ఈ మూడు లక్షణాలను అనుసరించి రాయలసీమ కవిత్వాన్ని మూడు ధోరణులుగా చూపవచ్చు. అవి

1) రాయలసీమ స్వయం స్పృహ కవిత్వం
2) రాయలసీమ భావ చైతన్య కవిత్వం
3) రాయలసీమ ధిక్కార కవిత్వం

ఈ నేపథ్యంలో రాయలసీమలో 1951 నుండి 1980 వరకు సుమారు 150 పైచిలుకు కావ్యాలు వచ్చాయి. వ్యాస పరిధిని దృష్టిలో పెట్టుకొని కొన్ని కావ్యాలను మాత్రమే ప్రస్తావిస్తాం.

1) పెనగొండ గేయం, 2) పెనుగొండ లక్ష్మి, 3)మేఘదూతము, 4)తపోవనము, 5) రాయలసీమరైతు, 6) పెన్నేటిపాట, 7) రామిరెడ్డి కావ్యాలను పరామర్శిం చడం ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

**పెనుగొండ గేయం :**

నుగొండ కొండ - ఈ పెనుగొండ కొండ
చనిన నాళుల దెనుగు కత్తులు సానబెట్టిన బండ
॥ఈ॥

రంధ్రముల ప్రవహించు తురకల
రక్తధారలు త్రాగి త్రేచిన ఆంధ్రకన్నడ రాజ్యలక్ష్ముల
అరిది నీలపు దండ -
॥ఈ పెనుగొండ కొండ॥

వెరుపులెరుగని బిరుదు నడకల
విజయనగరపు రాచకొడుకులు
పొరల బోయగ కరుమ గట్టిన
పచ్చినెత్తురు కండ -
॥ఈ పెనుగొండ కొండ॥ అంటాడు.

అనంతకృష్ణశర్మ పెనుగొండలో పుట్టిపెరిగినవాడు. అతనికి జన్మస్థలం మీదున్న అభిమానం ఈ పాటలో స్పష్టంగా కనిపిస్తూ ఉంది. ఈయన అభిమానమంతా గతవైభవ కీర్తిగానమే. తళ్ళికోట యుద్ధంలో ఆళియ రామ రాయలు ఓడిపోయి చనిపోవడం, బ్రతికి ఉన్న అతని తమ్ముడు తిరుమల రాయలు విజయనగరాన్ని రక్షించే ప్రయత్నం చేయకుండా అపార ధన సంపదలతో పెను గొండకు పారిపోవడం, అప్పటి నుంచీ పెనుగొండ చరిత్ర అంతఃపుర కలహాలు, బంధుహత్యలుగా మిగిలపోవడం ఒక విషాదం.

**పెనుగొండ లక్ష్మి - పుట్టపర్తి నారాయణాచార్యులు:**

గతవైభవం వద్దనే ఆగిపోకుండా వర్తమాన దైన్యం దాకా తీసుకొని వచ్చిన కవి పుట్టపర్తి నారాయణాచార్యులు. పుట్టపర్తి కావ్యం "పెనుగొండ లక్ష్మి" గతవైభవంతోపాటు వర్తమానాన్ని చిత్రించింది. కానీ రాళ్ళపల్లిపాట పెనుగొండ గేయంలో ఇది కూడా బంగారు కాలం గతించి పోయిందన్న బెంగ, అది తిరిగి రావాలన్న కోరికను బలంగా విని పిస్తుంది. కానీ పుట్టపర్తి ఒక అడుగు ముందుకువేసి పెనుగొండ చరిత్రలోని చీకటి కోణాలను కూడా చిత్రిం చాడు. పెనుగొండ రాజులు ఒకర్నొకరు చంపుకోవడాన్ని ప్రస్తావిస్తూ "మసకపు పాముకాటువలె మత్సర మాత్మను చీల్చి వైచికై/ వసమొనరించుకున్న గరువమ్మున నన్నలు తమ్ములెల్ల/వెక్కసమున మొత్తులాడిరట.... అని బాధపడ్డాడు.

**మేఘదూతము : పుట్టపర్తి నారాయణాచార్యులు:**

పుట్టపర్తి "మేఘదూతము"లో మొట్టమొదటి సారిగా సమకాలీన రాయలసీమ జీవితానికి సంబంధించిన నెగటివ్ ప్రస్తావన బలంగా వినిపిస్తుంది. ధనిక వాదాన్ని తిరస్కరించినందుకు కారాగార వాసం అనుభవిస్తున్న ఒక రాజకీయ ఖైదీ శ్రీకాకుళంలో ఉన్న తన భార్యకు సందేశం పంపడం నిర్మాణ పథకమైతే, ఆంధ్రదేశాన్ని వర్ణించడం వస్తువు. మేఘుడు రాయలసీమ మీద ప్రయాణం చేస్తుంటే కనిపించిన జీవితాన్ని పుట్టపర్తి సహజంగా వర్ణించాడు. ఆ ప్రాంతాలలో చాకిరీ చేసినా కడుపు నింపని పేదల జీవితం కూడా కావ్యవస్తువైంది. మేఘుడు మరికాస్త ముందుకు వెళ్ళి రేనాటి మీదకు వచ్చినప్పుడు రాయలసీమ జీవితం యొక్క అసలు స్వరూపాన్ని పుట్టపర్తి చూపించాడు. రేనాడు నిజంగా రేనాడే అన్నాడు. ఇక్కడ బలంగా పాదుకొని ఉన్న ఫ్యూడలిజాన్ని ఇలా వర్ణించాడు.

"ప్రతిపల్లెలో నీకు
పాళెగానిది కోట
పాళెగాడైనట్టి రెడ్డీ - కనిపించు
ప్రజల బ్రతుకుల సౌకర్యమట్టే"

ఈ పాళెగాళ్ళే ఆధునిక ఫ్యాక్షనిస్టులు. ఫ్యాక్షన్ హింసనూ, కరువునూ చమత్కారంగా కలుపుతూ పుట్టపర్తి రేనాడును గురించి ఇలా అన్నాడు.

"పొడిచికొన నేలపై పడెడు రక్తమే కాని
అరుదుగా మేఘ జలమా నేలపై పడును"

రాయలసీమ రాజకీయ నాయకులను గురించి కూడా పుట్టపర్తి తీవ్ర మనస్తాపాన్ని వ్యక్తం చేశాడు.

"పదిమంది గూల్చి తన
కధికారమును గోరు
కపటులగు నాయకుల గుంపూ - గతిలేని
సత్కవుల కన్నీటి ముంపూ" అంటాడు.

అంతటితో ఆగకుండా రేనాటిలో ఆలస్యం చేయవద్దని మేఘునితో చెబుతూ ఆ ప్రాంతమంటే తనకున్న విరక్తిని వ్యక్తం చేశాడు కవి.

"గడచిపోయిన
గొప్పలను చెప్పుకొని గర్వపడువారె
మనము లేనట్టి ఈమాని బొమ్మకేమి" అంటూ పుట్టపర్తి సమకాలీన రాయలసీమ జీవితాన్ని మొదటి సారిగా అక్షర బద్ధం చేశాడు.

**తపోవనము : బెళ్ళూరి శ్రీనివాసమూర్తి :**

బెళ్ళూరి శ్రీనివాసమూర్తి 1954లో తపోవనము అన్న ఖండకావ్యాన్ని ప్రచురించాడు. అందులో సుకుమారమైన సంవేదన తెలిపే ఎన్నో ఖండికలున్నాయి. వాటిలో "గంజి కేంద్రము" అన్న ఖండిక ఆనాడు సంచలనం లేపింది. రాయలసీమకు 1948-1953 మధ్య వచ్చిన గంజి కరువు ఇరవయ్యవ శతాబ్దంలోనే అత్యంత దారుణమైందిగా రికార్డుల కెక్కింది.

ఆ కరువు కాలంలో తిండిలేని వారికోసం ప్రభుత్వం, రామక్రిష్ణ మిషన్ వంటి స్వచ్ఛంద సంస్థలూ, కమ్యూనిస్టు పార్టీ వంటి రాజకీయ పక్షాలు ఎన్నో గంజి కేంద్రాలను నడిపాయి. అవి లేకపోతే బహుశా కొన్ని వేలమంది ఆకలితో చనిపోయి ఉండేవారు. గంజి కరువును గురించి బెళ్ళూరి శ్రీనివాసమూర్తి రాసింది ఒక ఖండిక మాత్రమే. అయినా రాయలసీమ దుస్థితికి అది నిలువుటద్దం.

**రాయలసీమ రైతు ఖైరపురెడ్డి నారాయణరెడ్డి :**

కరువుపై ఒక సంపూర్ణమైన కావ్యాన్ని రాసిన గౌరవం ఖైరపురెడ్డి నారాయణరెడ్డికే దక్కుతుంది. రాయలసీమ రైతు అన్న కావ్యం 1976లో ప్రచురించబడిన పునాదిని కల్పించాడు. ఈ కావ్యంలో నాయకుడు మేఘుడు. నాయిక భూమి. రాయలసీమలో వీటి మధ్య ఉన్న సంబంధం మీద ప్రజా జీవితం ఆధారపడి ఉంటుంది. ఈ రెండి సంయోగవియోగాలే ప్రజల సుఖ దుఃఖాలకు ఆధారం.

కడప జిల్లా రాయచోటి తాలూకాలో బహుదానదీ తీరాన "పంచరత్నాలు"గా గుర్తింపు పొందిన ఐదు పల్లెల్లో ఒక పల్లె కావ్యస్థలం. ఆ పల్లెలోని ప్రజలకు "అనుపూర్వం బగు ధర్మవృత్తి" వ్యవసాయం. ఇంతలో భయంకరమైన కాటకం వచ్చింది.

రాయలసీమలో కరువు రావడానికి నారాయణరెడ్డి ఒక చమత్కారమైన కారణాన్ని సృష్టించాడు. రాయలసీమ ప్రజలు శ్రీశైల మల్లికార్జునుణ్ణీ, శ్రీనివాసుణ్ణీ, శివుణ్ణీ పూజించి, భోగాదిపతియైన ఇంద్రుణ్ణి మరచిపోయారట. అందుకు ఇంద్రుడు కోపించి ప్రతీకారం తీర్చుకోవాలను కొన్నాడట. మేఘాలను పిలిచి రాయలసీమ ప్రజలకు చిన్న చినుకైన పడకుండా చేయవలయునని ఆజ్ఞ యిచ్చాడని చెప్తాడు.

కరువు కాలంలో మానవ ప్రవర్తన, మానవ సంబంధాలు తలక్రిందులు కావడాన్ని నారాయణరెడ్డి స్పష్టంగా చిత్రించాడు. పదిమంది అతిథులు వచ్చినా సంతోషంగా భోజనం పెట్టే గృహస్తుడు, నేడు తప్పించుకొంటున్నాడని, భోజన సమయానికి అభాగ్యులొస్తే వారికి అన్నం పెట్టలేని సంసారి కలత చెందుతున్నాడని, తనతో పని ఉండి వచ్చే వారికి ఆకలి తీర్చే అలవాటు ఉన్న మర్యాదస్తుడు పక్కకు పోతున్నాడని చెప్తూ, నిత్యాన్నదానం చేస్తూ ఉండిన పుణ్యపురుషులకు కూడ పూట గడవడం కష్టమై పోయిందని వాపోతాడు.

కరువు కాలంలో స్త్రీల మనోవేధనను ఈ కావ్యం ఎంతో ఆర్ద్రంగా చిత్రించింది. వారు తరతరాలుగా సీకరించిన ఆభరణాలను దినవెచ్చాలు కోసం, వారి ఖర్చులకోసం, చేతప్పుల కోసం, తెగనమ్ముకోవలసి వచ్చిందంటాడు.

"కొప్పున ముడువంగ కుసుమముల్ కొనలేక
కులకాంత కుందిన గుండె నాకడు

కేశ సంస్కార తైలాశక శక్తయై
ఇల్లాలు నేడ్చిన నేడ్చెనొకయె
పసుపు కుంకుమ కొన పైకమ్ములేమికై
వల్లభ వగచిన వగచె నొకడు
గాజులు తొడుగుగా కాసులు లేనిదై
తెఱవచింతింప చింతించ నొకడు"

మంగళప్రదమైన సుమంగళీ చిహ్నాలను భార్యలు కొనలేక కరువు కాలంలో ఏడిస్తే, భర్తలు కూడా ఏడ్చారట. ఎంతో అనురాగంతో జీవించిన భార్యాభర్తల ప్రవర్తనలో కూడా కరువు ప్రవేశించడం, కలలో కూడా భర్తను నొప్పించని భార్యలు కూడా కరువు ప్రభావం చేత కటువుగా, తిరస్కారంగా భర్తలతో ప్రవర్తించడాన్ని గుర్తించాడు కవి. నారాయణరెడ్డి కరువు వర్ణన గుండెల్ని పిండేస్తూ సాగుతుంది. హృదయవిదారకంగా సాగిన ఈ కావ్యంలో చివర వాన వస్తుంది. పంట పొలాలూ రైతుల జీవితాలు మళ్ళీ చిగురిస్తాయి. కవిలోని ఆశావాహ దృక్పథం పాఠకుడికి ఊరట కలిగిస్తుంది.

## రామిరెడ్డి - కుంటిమద్ది శేషశర్మ :

కరువు ప్రసక్తి లేకపోయినా రాయలసీమ గ్రామాలలోని ఫ్యూడలిజంను గురించి చర్చించిన కావ్యం కుంటిమద్ది శేషశర్మ రాసిన "రామిరెడ్డి". రామిరెడ్డి కావ్యానికి అనంతపురం, కర్నూలు జిల్లాలోనికొన్ని ప్రదేశాలు మూలం. కర్నూలు ఆంధ్రకు రాజధానిగా ఉన్న కాలం అంటే 1953-56 మధ్యకాలంలో అనంతపురం జిల్లాలో పల్లె పట్టణం కాని ఊరు ఒకటుండేది. ఆ ఊళ్ళో ఒక దేవాలయం, ఆ దేవాలయానికి మడులు మాన్యాలు ఉన్నాయి. వాటిమీద వచ్చే ఆదాయాన్ని రామిరెడ్డి అనే ధర్మకర్త నిర్వహించేవాడు. "కరీంద్ర చర్విత కపిత్థా" కారముల్ మీరగా భోజనం చేస్తూ ఉంటాడు. అదే ఊళ్ళోనే ఆదిసెట్టి అనే వైశ్యవ్యాపారి ఉన్నాడు. అతనికి ముగ్గురు కొడుకులు. రెండవవాడు కర్నూలుకు చెందిన యువతిని పెళ్ళి చేసుకొని కాపురానికి తీసుకొని వస్తాడు. ఆమె అసాధారణమైన అందగత్తె. వన భోజన సమయంలో రామిరెడ్డి కన్ను ఆమె మీద పడుతుంది. ఆమెను అపహరించుకుపోయి తన పొలం వద్ద ఉన్న ఒక గదిలో బంధిస్తాడు. సెట్టి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు వచ్చి ఆమెను రక్షిస్తారు. రామిరెడ్డి జీతగాడుచెప్పిన సాక్ష్యంతో రామిరెడ్డికి శిక్ష పడుతుంది. రామిరెడ్డి చేయబోయిన దుష్కృత్యాన్ని తలచుకొని కవి ఇలా అంటాడు.

"రాజ్యపాలన దేవతారాధనముల
గవుల పోషణమున వాసిగన్న రెడ్డి
కులముచెడ బుట్టినాడు కర్కోటకుండు
తులసి వనమున గంజాయి మొలక వోలె" అనడంలో
అభ్యుదయ తత్వం కనిపిస్తుంది.

## పెన్నేటిపాట - విద్వాన్ విశ్వం :

ఎన్ని కావ్యాలు వచ్చినా జీవిత చిత్రణలో, భాషా ప్రయోగంలో, భావ వ్యక్తీకరణలో రాయలసీమకు ప్రాతినిథ్య కావ్యంగా నిలిచింది విద్వాన్ విశ్వం రాసిన "పెన్నేటి పాట". ఇది 'మహాప్రస్థానం'కు దీటైన కావ్యం. "పెన్నేటి పాట" రాయలసీమ గతవైభవ కీర్తి గానంతో ప్రారంభమవుతుంది. వర్తమాన విషాదాన్ని కళ్ళముందుంచుతుంది.

"అదే పెన్న అదే పెన్న
నిదానించి నడు
విచారించు వెదన్
వట్టి పిడారి తమ్ముడు"

అంటుంది ఒక కంఠం. మరొక కంఠం "ఏరు సరే నీరేది" అన్న ప్రశ్న వేస్తుంది.

ఏదీ నీరు? ఏదీ హెూరు?
ఏదీ నీటి జాలు!
ఇదే నీరు ఇదే హెూరు
ఇదే ఇసుక వాలు!

వాస్తవానికి రెండు కంఠాలు కవికి చెందినవే. సంభాషణా రూపంలో కావ్యాన్ని సాగించడానికి విశ్వం ఎంచుకున్న మార్గం పాఠకుణ్ణి ఆలోచింపచేస్తుంది. రాయలసీమ స్వభావంగా చిత్రించడంలో వైచిత్రి కనిపిస్తుంది.

కావ్యంలో ముఖ్యమైన పాత్ర రంగడు. పెన్నేటిపాటలో అతడే కావ్య నాయకుడు. అతని నాన్న నారపురెడ్డి

"పెద్దసంసారి". అందరికీ సహాయం చేసేవాడే. కరువు దెబ్బకు అలనాటి నారపురెడ్డి సంపద హారతి కర్పూరంలా కరిగిపోతుంది. తరువాత ఊరిపిల్లలు కూడా నారపురెడ్డిని గేలి చేస్తారు. వారి కొడుకు రంగారెడ్డి. సంపద, పలుకుబడి పోవడంతో రంగారెడ్డి రంగడయ్యాడు. రంగడు అతని భార్య గంగమ్మలు రెక్కల కష్టంతో కాలం వెళ్ళదీస్తుంటారు. శ్రమకు తగ్గ ఫలితం మాట అటుంచితే, మూడు పూటలా తినడానికే ఉండదు. పేద కుటుంబం నుంచి వచ్చిన గంగమ్మ కష్టపడి బాకీ తీర్చుకోవాలనీ, ఒక మట్టి మిద్దె కట్టుకోవాలనీ, ఒక పిల్లవాణ్ణికని భర్తను సంతోషపెట్టాలనీ కలలు గంటుంది. ఇంతలోనే అనారోగ్యం పాలవుతుంది. సంక్షిప్తంగా కథ ఇదే.

ఇంతటి దురవస్థకు కారణాలు అనేకం ఉన్నాయి. ముఖం చాటేసిన వాన, ప్రభుత్వవైఖరి, స్వీయ తప్పిదాలు ప్రధానంగా కనిపిస్తయి.

"వే యేండ్ల కొక్క వానగదా
అక్కడ యాత్ర యెట్లు గరికైనా పుట్టు
ఏ పాత చెట్లకు గాని చివురేవి
పచ్చను తాటల్ దీసినా చూడవే"

ఇది ప్రకృతి ఇచ్చిన శాపానికి పరాకాష్ట. ప్రభుత్వ నిర్వాకమూ లేకపోలేదు. విశ్వంగారి మాటల్లో చెప్పాలంటే

"సర్కారు సిబ్బంది సరిజేయుటకు కొంత
సాలు జమాబంది పాలు కొంత
పొరుగూరి మన్నీల సరఫరాకింత
ఆలేకార్ల లంచాలలోకి కొంత
పేట పెద్ద వకీలు పిళ్ళెకు కొంత
కాంపౌండరు మునుసామి పాలుకొంత
కోడెరెడ్లకు కొంత, గుజ్జాలకై కొంత
బగ్గీలకై కొంత, భటుల కింత....."

ఇలా "తిలాపాపం తలాకొంత"లా రైతు జీవితం నాశనం కావడానికి కారకులయ్యారు.

ఇందులో నారపురెడ్డి స్వీయతప్పిదం లేకపోలేదు. పేదవాళ్ళను ఊరడించడానికి ధాన్యమంతా ఖర్చు చేయడం ఒక ఎత్తైతే, గొప్పలకోసం అనాలోచితంగా ఖర్చు చేయడం మరొక ఎత్తు.

"నారపరెడ్డి - నారప్ప అయ్యాడు
ఊరి మోతుబరి - ఉప్పరి అయ్యాడు."

రైతు జీవితం మట్టి గొట్టుకు పోయింది. మరి పెన్నైనా బాగుందా? అంటే అదీ లేదు.

"అదేపెన్న అదేపెన్న - నిదానించినమ
విచారించు నెదన్ వట్టి - ఎడారి తమ్ముడు
.................."

ముత్యాలు పండిన నేల, కావ్యాలు జాలువారిన గడ్డ, భాష్యాల జల్లు కురిసిన ప్రాంతం పౌరుషాలు పొంగిన సీమ గతించిన కథలుగా మారిపోయాయి.

"......... వినిపింతు నింక
నేటి రాయలసీమ కన్నీటి పాట
కోటి గొంతుల కిన్నెర మీటు కొనుచు
కోటి గుండెల కంజరి కొట్టుకొనుచు" అంటాడు విశ్వం.

విశ్వం వినిపించిన వేదన గీతం ఈనాటికే సాహిత్య లోకంలో రింగుమని రోదిస్తూనే ఉంది.

పెన్నేటి పాటలో కన్నీటి సీమకనిపిస్తుంది. వందల కరువుల్ని చవిచూస్తున్న రాయలసీమలో కరువు అంతర్భాగమై పోగా, వల్లకాడుగ మారిన పెన్నా పరివాహక ప్రాంతంలో పుర్రెలుపండుతున్నాయి.

**ముగింపు :**

11వ శతాబ్దంలో వెలువడిన ప్రాచీన సాహిత్యం పండితులకు మాత్రమే అర్థమయ్యేవి. మతాల్లో ఉన్న నీతిసారాంశాన్ని వివరించాయి. 20వ శతాబ్దంలో వచ్చిన ఆధునిక కవిత్వం పామరులకు కూడా ధ్గరగయింది. సామాన్య మానవుని మకుటధారుని చేసినది ఆధునిక కవిత్వం.

ఆధునిక రాయలసీమ సాహిత్యంలో ప్రాంతీయ అస్థిత్వవాదం రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ "పెనుగొండ" అన్న పాటతో 1956లో ప్రారంభమయింది.

పెనుగొండ పాటలో గతవైభవ కీర్తిగానమే. తళ్ళికోట యుద్ధంలో ఆలియ రామరాయలు ఓడిపోవడం అతని

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35


తమ్ముడు అపార ధనసంపదలతో పారిపోవడం అప్పటి నుండి పెనుగొండ చరిత్ర అంతఃపుర కలహాలు, బంధు హత్యలుగా మిగిలిపోవడం ఒక విషాదం.

పెనుగొండలక్ష్మి కావ్యంలో పుట్టపర్తి నారాయణాచార్యులు పూర్వవైభవంతో పాటు వర్తమానాన్ని చిత్రించాడు.

పుట్టపర్తి 'మేఘదూతము'లో నెగటివ్ ప్రస్తావన బలంగా వినిపిస్తుంది. ధనికవాదాన్ని తిరస్కరించినందుకు కారాగారవాసం అనుభవిస్తున్న ఖైదీ శ్రీకాకుళంలో ఉన్న భార్యకు సందేశం పంపడం ద్వారా ఆంధ్రదేశాన్ని రాయలసీమ జీవితాన్ని పుట్టపర్తి సహజంగా వర్ణించాడు.

బెళ్ళూరి శ్రీనాసమూర్తి "గంజికేంద్రము" పెద్ద సంచలనాన్ని రేపింది. కరువుకాలంలో తిండిలేని వారి కోసం ప్రభుత్వం, రామక్రిష్ణమిషన్, కమ్యూనిస్టు పార్టీ వంటి రాజకీయ పక్షాలు ఎన్నో గంజికేంద్రాలను నడిపాయి. అవి లేకపోతే బహుశా కొన్ని వేలమంది చనిపోయి ఉండేవారు. కరువుపై సంపూర్ణమైన కావ్యం రాయలసీమరైతు, బయంకరమైన కరువు వచ్చింది, మానవ సంబంధాలు తలక్రిందులైనవి, నిత్యాన్నదానం చేసేవారికి కూడా పూట గడవడం కష్టమైంది. స్త్రీలు వారి ఆభరణాలను దారి ఖర్చుల కోసం చేతప్పుల కోసం తెగనమ్ముకోవలసి వచ్చిందంటాడు భైరపురెడ్డి నారాయణరెడ్డి.

రాయలసీమ గ్రామాలలోని ఫ్యూడలిజంను గురించి వచ్చిన కావ్యం కుంటిమద్ది శేషశర్మ రాసిన "రామిరెడ్డి" ఒక ఊళ్ళో దేవాలయానికి ధర్మకర్త రామిరెడ్డి దానిమీద వచ్చే ఆదాయాన్ని అంతా తినేస్తాడు. ఈ క్రమంలో ఒక వైశ్యయువతిని మోహించి అపహరించుకొని పోతాడు. సెట్టి ఫిర్యాదు చేయడం జీతగాడు చెప్పిన సాక్ష్యంతో రామిరెడ్డికి శిక్షపడుతుంది.

రాయలసీమ ప్రాతినిథ్య కావ్యం పెన్నేటిపాట. పెన్నానది ప్రవహించేటపుడు గ్రామాలు పచ్చగా పాడిపంటలతో తులతూగాయి. తరువాత వర్షాలు లేకపోవడం వలన పెన్నానది ఎండిపోవడం బాగా బ్రతికినసంసారాలు దివాలా తీయడం జరుగుతుంది. ఇలా ఆధునిక రాయలసీమ కవిత్వం కష్టాలు, కన్నీళ్ళు అధికంగా కనిపిస్తాయి.

**ఆధార గ్రంథాలు :**

1. రాయలసీమలో ఆధునిక సాహిత్యం - సామాజిక సాంస్కృతిక విశ్లేషణ-వల్లంపాటి వెంకటసుబ్బయ్య-2006
2. రాయలసీమ సమాజం - సాంఘిక సాహిత్యం - బండి నారాయణస్వామి - 2019
3. పెనుగొండ - రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ - 1956
4. పెనుగొండ లక్ష్మి - పుట్టపర్తి నారాయణాచార్యులు - 1962
5. మేఘదూతము - పుట్టపర్తి నారాయణాచార్యులు - 1963
6. తపోవనము - బెళ్ళూరి శ్రీనివాసమూర్తి - 1954
7. రాయలసీమ రైతు - భైరపురెడ్డి నారాయణరెడ్డి - 1976
8. రామిరెడ్డి - కుంటిమద్ది శేషశర్మ - 1964
9. పెన్నేటి పాట - విద్వాన్ విశ్వం - 1956

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# అడిగోపుల వెంకట రత్నం వచన కవిత్వం - మిథోపాయిల చిత్రణ

- ఎస్.వి.పద్మకుమారి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్నం.

భారతీయ చరిత్ర, సంస్కృతికి మూల హేతువులు రామాయణ, భారత, భాగవతాలు. వీటిలో రామాయణం కావ్యం, భారతం ఇతిహాసం, భాగవతం పురాణం. ఈ మూడు గ్రంథాలు భారతీయుల జీవితంతో పెనవేసు కున్నాయి. ప్రజలు నిత్యం ఏదోక సందర్భంలో వీటిలోని సంఘటనలను, సన్నివేశాలను తమ జీవితంతో అన్వ యించుకుంటుంటారు. అంత తీవ్ర స్థాయిలో అవి భారతీయులతో మమేకమై ముడివేసుకున్నాయి. జానపదులు, శిష్టులు కూడా ఇందులోని వస్తువును తీసికొని పాటలు కూర్చుకున్నారు, గ్రంథాలు రాసు కున్నారు, నేటికీ రాసుకుంటూనే ఉన్నారు. విభిన్న కోణాల్లో వ్యాఖ్యానాలు కూడా వస్తున్నాయి.

రామాయణ, భారత, భాగవతాలు ప్రాచీన సాహిత్యా లుగా పరిగణించబడుతున్నాయి. అయినా ఆధునిక కవులు, రచయితలు తమ రచనల్లో వీటిని ప్రస్తావిస్తూనే ఉన్నారు. ప్రాచీన సాహిత్యాన్ని నిరసించే అభ్యుదయ వాదులు, విప్లవ వాదులు కూడా తమ రచనల్లో వీటిని అక్కడక్కడ ఉటంకిస్తూనే ఉన్నారు. దీనికి నిదర్శనంగా శ్రీశ్రీ మహా ప్రస్థానాన్నే పేర్కొనవచ్చు. ఇందులో శ్రీశ్రీపలుచోట్ల పురాణాలను, పురాణ పాత్రలను ప్రస్తావిం చాడు. 'మహా ప్రస్థానం' గేయంలో శ్రీశ్రీ ఇలా అంటాడు.

హరోం! హరోం హర!

హర! హర! హర! హర! - అంటాడు. ఈ గేయంలో కవి హరిని స్మరించాడు. ఈ గేయంలోనే మరో చోట ధనంజయుని ప్రస్తావించాడు.

'అవతారం' అనే గేయంలో శ్రీశ్రీ ఇలా అంటాడు.

'యముని మహిషపు లోహ ఘంటలు
మబ్బు చాటున

ఖణేల్ మన్నాయి!' - అంటాడు. ఈ గేయంలో యమున్ని పేర్కొన్నాడు. స్వర్గ నరకాలు లేవని నమ్మే శ్రీశ్రీ కూడా అలా ప్రయోగించాడు. దీనిని బట్టి మన ప్రాచీన ఆర్ష గ్రంథాలు కవులపై ఎంతటి ప్రభావం చూపాయో స్పష్టమవుతున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేసినవారే ఆధునిక కాలంలో ఉత్తమ రచనలు చేయగలుగుతున్నారు.

ఆధునిక సాహిత్యానికి, కవులకు, రచయితలకు శ్రీశ్రీని మార్గదర్శకులుగా పేర్కొంటున్నారు. ఈయన బాటలోనే ఎందరో రచయితలు నడిచారు, నడుస్తున్నారు అలాంటి వారిలో ప్రముఖంగా చెప్పదగిన వచన కవి అడిగోపుల వెంకట రత్నం. ఆధునిక సాహిత్య లక్షణాలను అణువణువునా ఒంట పట్టించుకొని వచన కవిత్వం రాస్తున్న కవి వెంకటరత్నం. ఈయన కలం నుంచి దాదాపు మూడు వందలకుపైగా కవితలు వెలువడ్డాయి.వాటిల్లో అక్కడక్కడ రామాయణ, భారత, భాగవతాలను ప్రస్తావిం చాడు. ఆధునిక సాహిత్యంలో ఇలా ప్రాచీన సాహిత్య సంఘటనలు, సన్నివేశాలు ప్రస్తావించటాన్ని విమర్శకులు 'మిథోపాయి' అన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే పురాణే తిహాసాల ప్రస్తావనను, ప్రసక్తిని ఆధునిక కవిత్వంలో ఉ టంకిస్తూ వర్తమాన సామాజిక పరిస్థితులకు అన్వయించి చెప్పడాన్ని 'మిథోపాయి' అంటారు. మిః అంటే పురాణ గాథ అని అర్థం. దీనికి నిఘంటువులు పురాణం, పురాణ కథ అని Religious Legned, Fable అని అర్థాల నిస్తున్నాయి. ఈ వీప్ష్త్ర పదం నుంచి మిథోపాయి అనే ఆంగ్ల సమాసం ఏర్పడింది. ఇది ఇటీవల కాలంలో విస్తృ తంగా ప్రయోగించబడుతున్నది.

అడిగోపుల వెంకటరత్నం వచన కవితల్లో రామాయణ, భారత భాగవతాల్లోని వివిధ సంఘటనలు, సన్నివేశాలు సమయానుకూలంగా, సందర్భానుకూలంగా విరివిగా ప్రయోగించాడు. వాటిలో కొన్నింటిని ఈ వ్యాసంలో ప్రస్తా వించడం జరిగింది. వాటిలో ముందుగా రామాయణ సంఘటనలను పేర్కొనడం జరిగింది.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


రావణ వధానంతరం సీతతో కలసి శ్రీరాముడు అయోధ్యకు చేరుకుంటాడు. యథాపూర్వకంగా రాజ్య పాలన చేస్తుంటారు.ఒకసారి తన రాజ్య పాలన ఎలా ఉందో ప్రజలు ఏమనుకుంటున్నారో రహస్యంగా తెలుసుకొని రమ్మని భద్రుని పంపుతాడు. అతడు రాజ్యంలోని వివిధ ప్రాంతాలను తిరిగి రాముని పాలనపై ఏమనుకుంటున్నారో తెలుసుకొని వస్తాడు. ఆ సందర్భంలో శ్రీరామునితో ఇలా అంటాడు.

శ్లో॥ కీ దృశం హృదయే తస్య సీతా సంభోగజమ్ సుఖమ్।
అంకమారోప్య తు పురా రావణేన బలాద్ధృతామ్ ॥
లంకా మపి పురానీతామ్ అశోకవనికాం గతామ్ ।
రక్షసాం వశమాపన్నాం కథం రామో న కుత్సతే ॥
అస్మాక మపి దారేషు సహనీయం భవిష్యతి ।
యథాహి కురుతే రాజా ప్రజా తమను వర్తతే ॥
ఏవం బహువిధా వాచోవదంతి పురవాసినః ।
నగరేషు చ సర్వేషు రాజన్ జన పదేషు చ ॥
(శ్రీ మద్రామాయణము - ఉత్తరకాండము - సర్గ 43 - శ్లో 17-20)

సీతాదేవితో కూడి సుఖించుటకై శ్రీరాముని మనస్సు ఎట్లు ఇష్టపడుచున్నది? లోగడ రావణుడు ఆమెను బల వంతంగా అపహరించి, తన అంకమున చేర్చుకొని, లంకకు తీసికొని పోయెను. పిదప అతడు ఆమెను రాక్షసుల అదుపులో అశోక వనమునందుంచెను. ఎంతో కాలము పరుల పంచన ఉన్న తన భార్యను రాముడు ఎందుకు ఏవగించుకొనుట లేదు. ఇక మనము కూడా మన భార్యల యందు ఇట్టి సహనమునే చూపవలసి వచ్చును. రాజు మార్గమునే ప్రజలు అనుసరింతురు గదా! - అని ప్రజలనుకుంటున్నారని భద్రుడు రామునితో చెబుతాడు.

భద్రుని మాటలకు ఖిన్నుడైన రాముడు ఎంతగానో ఆవేదనచెందుతాడు. తన సోదరులను పిలిపించుకొని లోకుల అభిప్రాయాన్ని వెల్లడిస్తాడు. దీనిని తొలగించుకొనుటకు సీతను అరణ్యములో వదలి రమ్మని లక్ష్మణుని ఆదేశిస్తాడు.

శ్లో॥ శ్వస్త్వం ప్రభాతే సౌమిత్రే సుమంత్రాధిష్ఠితం రథమ్।
ఆరుహ్య సీతామ్ ఆరోప్య విషయాం తే సముత్సృజ॥
గంగా యాస్తు పరేపారే వాల్మీకేస్తు మహాత్మనః ।
ఆశ్రమో దివ్య సంకాశః తమసా తీర మాశ్రితః ॥
తత్రైనాం విజనే దేశే విసృజ్య రఘునందన ।
శీఘ్రమాగచ్ఛ భద్రం తే కురుష్వ వచనం మమ ॥
(శ్రీ మద్రామాయణము - ఉత్తరకాండము - సర్గ 45 - శ్లోకాలు 16-18)

సౌమిత్రీ! నీవు రేపు ప్రాతఃకాలమున సుమంత్రుడు సిద్ధ పఱచి తీసికొని వచ్చిన రథమునెక్కి, సీతాదేవిని గూడ అందు కూర్చుండ జేసి, ఆమెను కోసల రాజ్యము యొక్క పొలిమేరలలో విడిచి పెట్టి రమ్ము. గంగానది యొక్క ఆవలి తీరమునకు సమీపమున తమసానది కలదు. ఆనది యొడ్డున మహాత్ముడైన వాల్మీకి మహర్షి యొక్క దివ్యమైన ఆశ్రమము ఉంది. ఆ ఆశ్రమ సమీపమున గల నిర్జన ప్రదేశమునందు ఆమెను వదలి శీఘ్రముగా విచ్చేయుము అంటాడు. అన్న ఆజ్ఞను శిరసావహిస్తాడు లక్ష్మణుడు.

అడిగోపుల వెంకటరత్నం పై రెండు సంఘటనలను వస్తువుగా తీసికొని 'మన్ను మిన్ను ఏకమై' అన్న కవితలో ఇలా అంటాడు.

అడవిలో వదలి రమ్మన్న
అన్న రామన్న మాట విన్న
సీతమ్మ చూపు
యుగ యుగాల పారాయణం
ఇంటింటి రామాయణం - అంటాడు.

అన్న ఆనతి పాటిస్తూ లక్ష్మణుడు సుమంత్రుడు సిద్ధం చేసిన రథంలో సీతను తీసికెళ్ళి వాల్మీకి మహర్షి ఆశ్రమ సమీపంలో నిర్జన ప్రదేశంలో వదలి, తన అన్న ఆజ్ఞను తెలియజేస్తాడు. అపుడు సీత దుఃఖంతో కుమిలి పోతుంది. భర్త ఆజ్ఞను పాటిస్తుంది. నిండు గర్భంతో ఉన్నా ఓర్చుకుంటుంది. అయినా భర్తను కించిత్తు మాట నిందాపూర్వకంగా అనదు. ఈ సన్నివేశాన్ని తీసికున్న భారతీయులు, ఒక స్త్రీ భర్త వేధింపులకు లోనవుతుంటే,

ఆనాడు సీతమ్మ బాధలు భరించలేదా! ఆమెయే భరించినపుడు ఇక మనమెంత అని ఉటంకిస్తూ బాధితు రాండ్రను ఓదారుస్తుంటారు. దీనిని కవి యుగ యుగాల పారాయణంగా, ఇంటింటి రామాయణంగా పేర్కొన్నాడు. నాటినుంచి నేటి వరకు స్త్రీలు ఆత్మ విశ్వాసాన్ని కోల్పోవుటకు సీత పాత్రేనని స్త్రీవాదులు, విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.

రామాయణ సంఘటనలను కవి ఎలా ఉటంకించాడో అదేవిధంగా భారతంలోని ఘట్టాలను కూడా కవి అడిగోపుల వెంకటరత్నం చక్కగా ఉటంకిస్తూ కవితలు రాశాడు. ఒక రోజు సూర్యుడు తన కుమారుడైన కర్ణుని వద్దకు వచ్చి, ఇంద్రుడు మారు వేషంలో వచ్చి కవచ కుండలాలు దానంగా ఇవ్వమని కోరతాడని, వాటిని ఇవ్వ వద్దని హితబోధచేస్తాడు. అయినా తండ్రిమాట జవదాటి జన్మతో ప్రాప్తించిన కవచకుండలాలను దానం చేస్తాడు. దీని మూలంగా కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుని బాణాలు కర్ణుని శరీరంలో నాటుకుపోతాయి. తన రథం భూమిలో కూరుకు పోయిందని, దానిని పైకిలేపిన తరువాత యుద్ధం చేద్దామని కర్ణుడు కృష్ణార్జునులకు విజ్ఞప్తి చేస్తాడు. అయినా కృష్ణుని ఆజ్ఞతో అర్జునుడు బాణ ప్రయోగం చేస్తాడు.

తే॥ కామఁ బాసిన కమలంబు కరణిఁ బొలుచు
కర్ణుతల యిలఁ బడియు సుదీర్ణ కాంతి
నొప్పు నట్టయుఁ జూచి శల్యుండు సిడము
ద్రెస్సి మోడైన యరదంబు ద్రిప్పెనధిప
(శ్రీమదాంధ్ర మహాభారతము - కర్ణ పర్వము - తృతీయాశ్వాసము - పద్యం - 371)

అర్జునుని బాణాలకు కర్ణుని తల తెగిపడుతుంది. ఆదృశ్యాన్ని చూడలేక సూర్యుడు పడమర అస్తమిస్తాడంటాడు తిక్కన.

కర్ణుని మరణాన్ని ఆలంబనంగా తీసికొని అడిగోపుల వెంకటరత్నం 'కథ అడ్డం తిరిగింది' కవితలో ఇలా అంటాడు.

'పార్థుడి చేతిలో రాధేయుడు
అన్యాయంగా అసువులు బాసినన్ని గాయాలు
మరణించాక గాయ పరచటం
ఏ న్యాయ సూత్రమని అడగాలని వుంది' - అంటూ సూటిగా ప్రశ్నిస్తాడు కవి. నిరాయుధుడుగా వున్న కర్ణున్ని అర్జునుడు అన్యాయంగా చంపాడని లోకులు నేటికీ అనుకుంటూనే ఉన్నారు. ప్రజాకవి అయిన వెంకటరత్నం గారు ఆ విషయాన్ని నొక్కి చెబుతూ దానిని సమకాలీన పరిస్థితులకు అన్వయించి చెబుతున్నాడు.

రామాయణం, భారత వృత్తాలను వస్తువుగా చేసికొని వచన కవితలు రాసిన విధంగానే అడిగోపుల వెంకటరత్నం గారు భాగవతంలోని వివిధ ఘట్టాలను ఎంచుకుని వాటిని సమకాలీన పరిస్థితులకు అన్వయిస్తూ చక్కని సామాజిక స్పృహ కలిగిన కవితలు రాశాడు. వాటిలో ప్రధానంగా చెప్పదగినది వామనుని వృత్తాంతం. మహావిష్ణువు వామనావతారంలో యజ్ఞం చేస్తున్న బలిచక్రవర్తి వద్దకు వచ్చి తనకు మూడడుగుల మేర భూమి దానంగా ఇవ్వమంటాడు. కుల గురువు శుక్రాచార్యుడు వద్దని వారించినా వినకుండా బలి మూడడుగులు దానం చేస్తాడు. అపుడు వామనుడు ఒక అడుగుతో భూభాగాన్ని, ఇంకో అడుగుతో ఆకాశాన్ని ఆక్రమిస్తాడు. ఇక మూడో అడుగు ఎక్కడపెట్టాలంటాడు. అపుడు బలి ఆడిన నాట తప్పకూడదని తన తలపై పెట్టమంటాడు. వామనుడు తన విశ్వరూపాన్ని పెంచి బలి తలపై అడుగు పెట్టి పాతాళానికి తొక్కి వేస్తాడు.బలిచక్రవర్తి ఉదార దాన గుణాన్ని గూర్చి పోతన ఇలా అంటాడు.

ఆ॥ సూనృతంబుగాని సుడియదు నాజిహ్వ, బొంకఁజాల, నాకు బొంకు లేదు
నీ తృతీయపదము నిజము నా శిరమున, నెలవు సేసి పెట్టు నిర్మలాత్మ!
(పోతన భాగవతము - ఎనిమిదవ స్కంధము - 643 పద్యం)

ఓ పుణ్యాత్ముడా! నా నాలుక సత్యాన్నే పలుకుతుంది. దానికి తిరుగులేదు. అసత్యం పలుకదు. నాలో అసత్యం

అనేది లేదు. నీ మూడవ పాదాన్ని శాశ్వతంగా నాతలపై పెట్టు అంటాడు బలి. కవి అడిగోపుల వెంకటరత్నం అభిప్రాయం ప్రకారం వామనుడు అన్యాయంగా బలి చక్రవర్తిని బలి తీసికున్నాడంటాడు. ఇప్పటికే ఎందరో హేతువాదులు, తాత్వికులు, నాస్తికులు ఈ అభిప్రాయాన్నే నిర్భయంగా వెలిబుచ్చుతున్నారు. ఈ విషయాన్ని వెంకటరత్నంగారు 'రచ్చబండ' కవితలో ఇలా ప్రస్తావిస్తారు.

ఇప్పుడు ఎత్తు పెరిగిన రోడ్డు
రచ్చ బండ భుజం తాకింది
కాలు మోపితే
వామనుడి పాదం కింద
బలిచక్రవర్తిలా వుంది - అని చక్కని ఉపమానంతో సామాజిక పరిస్థితులను పోల్చిచెప్పాడు.

ఎత్తు పెరిగిన రోడ్డు రచ్చబండ భుజం తాకిందంటాడు. అది వామనుడి పాదం కింద ఉన్న బలి చక్రవర్తిలాగా ఉందంటాడు. నేటి రోడ్ల దుస్థితిని అలా పోల్చటానికి ఎంతో సామాజిక స్పృహ ఉన్న రచయితలకు మాత్రమే సాధ్యమవుతుంది. అలాంటి రచయిత అడిగోపుల వెంకటరత్నం. ఈయన ప్రాచీన సాహిత్యాన్ని ఔపోషణ పట్టినట్లు ఆయన మిథోపాయిల ప్రయోగాన్ని బట్టి తెలుస్తున్నది. ఒక సందర్భంలో శ్రీశ్రీకూడా తనకు ప్రాచీన సాహిత్యంపై బాగా పట్టు ఉండడంవల్లె ఆధునిక సాహిత్యాన్ని అద్భుతంగా రాయగలిగానన్నాడు. ఆ మహాకవిని వెంకటరత్నంగారు ఆదర్శంగా తీసికున్నాడని చెప్పవచ్చు. ఇలా వెంకటరత్నం తన కవితల్లో మిథోపాయిలు ప్రయోగించి, తనకు ప్రాచీన ఆధునిక సాహిత్యంపై పట్టు ఉందని నిరూపించుకున్నాడని చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. శ్రీ మదాంధ్ర మహా భారతము - కవిత్రయం
2. శ్రీ మద్వాల్మీకి రామాయణము - వాల్మీకి
3. శ్రీ మద్భాగవతము - పోతన
4. మహా ప్రస్థానం - శ్రీశ్రీ
5. లిఫ్‌కో డిక్షనరి (ఆంగ్లం)
6. అడిగోపుల వెంకటరత్నం - వచన కవిత సంపుటాలు.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# అన్నమయ్య సంకీర్తనలు - సమకాలీన సమాజం

- డా॥. ఎస్. యజ్ఞశేఖర్, శాఖాధిపతి, తెలుగు విభాగం, మద్రాసు క్రిష్టియన్ కళాశాల, చెన్నై, తమిళనాడు.

అన్నమయ్య సంకీర్తనల్లో సంఘజీవితానికి సంబంధించిన అంశాలు విశేషంగా కనిపిస్తున్నాయి. ఆనాటి సమాజంలో వర్ణాశ్రమ ధర్మాలు ప్రవర్తిల్లుతుండటంవల్ల అన్నమయ్యకు అన్ని రకాల ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. తన సాహిత్యాన్ని తన కోసం కాక ప్రజల పురోభివృద్ధికి పాటుపడే విధంగా తీర్చిదిద్దాడు. అన్నమయ్య సంకీర్తనల్లో విశేషమైన వస్తు వైవిధ్యం కనిపిస్తుంది. పల్లె ప్రాంతాల్లో నివసించే జానపదులకు సంబంధించిన విషయాలే కాక, కొండ కోనల్లో జీవనం సాగించే గిరిజనులకు సంబంధించిన విశేషాలు కూడా విస్తారంగా కనిపిస్తున్నాయి.

### రాజకీయ వ్యవస్థ :

అన్నమయ్య స్వతంత్ర జీవి. కనుక రాచరికాన్ని తీవ్రంగా నిరసించాడు. సాళువ నరసింగరాయలతో అన్నమయ్యకు మంచి స్నేహం. అన్నమయ్య రచనా ప్రాశస్త్యాన్ని విన్నాడు. రాజు ఆయన్ని ఆహ్వానించాడు. రాయల ఆస్థానానికి వెళ్ళాడు. వెంకన్నపై పాడాడు. రాజు ఆనందించి సన్మానించి పంపాడు. మరొకసారి ఆహ్వానించాడు. స్వామిపై పాడమన్నాడు. ఏమొకో చిగురుట ధరమున అని పాడాడు. తనపై పాడమన్నాడు. పాడనన్నాడు. రాజు కోపించి బంధించాడు. స్వామిపై పాడాడు. సంకెళ్లు తెగాయి. రాజు ఆశ్చర్యపోయాడు. అధికారం కోసం అందలం కోసం హత్యలకు వెనుకాడని రాజుల దుర్మార్గాల్ని సహించలేకపోయాడు. పదాలనే ఆయుధాలుగా చేసికొని ఖండించాడు.

### మతం :

మతం అంటే దైవ సంబంధమైన ఒక అభిప్రాయం. ఇది శాస్త్రోక్తంగా ఉంటుంది. మానవ జీవితంతో ముడిపడి ఉంటుంది. అన్నమయ్య కాలంలో ప్రజల్లో వైష్ణవం శైవం శాక్తేయం గాణాపత్యం సౌరం కాపాలికం అనే ఆరు మతాలున్నాయి.

గోడగడుగగ బోతేగొనదాకా రొంపే.....
వాడిక నారు మతాల వాడై తిరుగు కంటే...

(3 - 568)

అన్ని మతాలు, ఇన్ని వాదాలు వృథా అని విష్ణుమూర్తి సేవించి కడతేరమని అన్నమయ్య బోధించాడు. స్వామిని వేదాంతులు పరబ్రహ్మమని శైవులు శివుడని కాపాలికులు ఆది భైరవుడని శాక్తేయులు శక్తిరూపుడని భావించి పూజలు చేసే వారని (2 - 393) శాక్తేయమతస్థులైన ప్రజలు ఆనాడు జాతరలు జరిపేవారని అగ్నిగుండాల్లో దుమికే వారని జంతు బలులిచ్చి అవయవ నైవేద్యాలు ఇచ్చేవారని అయితే ఇలాంటివి అక్కరలేదని కేవలం ఆది దేవుడైన శ్రీహరికి మొక్కితేచాలని అన్నమయ్య బోధించినట్లు తెలుస్తోంది.

### విశ్వాసాలు :

కార్యకారణ వివక్షత లేకుండా ఓ విషయాన్ని నమ్మడాన్ని విశ్వాసం అంటారు. ఇవి ఆచారాలలాగే తరతరాలుగా వ్యక్తులకు సంఘానికి సంక్రమిస్తాయి. అన్నమయ్య కాలం నాడు ప్రజల్లో భూతాలపట్ల విశ్వాసమున్నట్లు...

భూతమై అడవిలో బొక్కుచుదా నుండక యీ
బూతు జన్మమేల మోచే బుచ్చిన ప్రాణి

(1 - 299)

అనే కీర్తనను బట్టి తెలుస్తోంది. భూతం పట్టిన వాళ్ళకు భూత వైద్యుని చేత మంత్రాలు వేయిస్తారు. బూటు మాటలతో తిట్టుతూ చింత బర్రలతో కొడతారు. నారాయణ నామాన్ని మంత్రించి పరుగులు తీస్తున్న ఈ జంతువుల భ్రమను పోగొట్టమని అన్నమయ్య స్వామిని ప్రార్థించాడట.

**ఆచారాలు :**

ఒక సంఘంలోని ప్రజలు తరతరాలుగా పాటించే పద్ధతుల్ని ఆచారాలని స్థూలంగా చెప్పవచ్చు. ప్రతి కులానికి మతానికి కొన్ని ప్రత్యేక ఆచారాలుంటాయి. సామాన్య ప్రజలు భక్తికన్నా ఆచారాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంటారు.

హరిభక్తి గలిగితే అన్నియు ముఖ్యముగాక
విరహాచారము లెల్ల వృధా వృధా (2 - 62)

అనే సంకీర్తనము బట్టి హరిభక్తి లేనప్పుడు ఆచారాలు వ్యర్ధమే అని అన్నమయ్య బోధించాడు.

**పండుగలు :**

తెలుగు ప్రజల జీవన విధానంలో పండుగలు పర్వాలు చాలా ముఖ్యమైనవి సంక్రాంతి పండుగ రోజున బాలికలు పాడే బాణిలో చిన్నికృష్ణుని చిలిపి చేష్టల్ని వర్ణించాడు.

కొలని దోపరికి గిబ్బిళ్ళోయదు
కులము స్వామికిని గొబ్బిళ్ళో (12 - 98)

అనే సంకీర్తనను బట్టి సంక్రాంతి పండుగ (2 - 250), (12 - 107) దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది (17 ్ర 184) వంటి పండుగల్ని ఆనాడు ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకునే వారని తెలుస్తోంది. వసంతోత్సవ జాతర పాటల్ని బట్టి ఆనాటి ప్రజలు ఫాల్గుణ పౌర్ణమినాడు కాముని పున్నమి లేక హోలీ పండుగ కూడా జరుపుకునే వారని తెలుస్తోంది.

**పర్వాలు :**

అవతార పురుషుల జన్మదినోత్సవాల్ని పర్వదినాలంటారు. వీటినే జయంతి ఉత్సవ దినాలని కూడా అంటారు. అన్నమయ్య సంకీర్తనల్లో నరసింహ శ్రీరామ శ్రీకృష్ణ హనుమ మొదలైన జయంతులు కనిపిస్తాయి.

నరులాలనేడువో నారసింహ జయంతి
సురలకు నానందమై శుభము లొసగెను (11 - 14)

**కులాల వృత్తులు :**

వ్యక్తులు చేసే పనులు. కులాల పేర్లు ఏర్పడ్డాయి. అన్నమయ్య కాలంలో అధిక సంఖ్యాక ప్రజలు వృత్తి జీవనులు. అన్నమయ్య సంకీర్తనల్లో బ్రాహ్మణ కాపు కుమ్మరి కమ్మరి గొల్ల వంటి కులాలు వారి వృత్తులు వైద్యం వర్తకం వంటి విషయాలు చెప్పాడు.

**వ్యవసాయ వృత్తి :**

వ్యవసాయవృత్తిలో పనుల్ని భక్తుల సత్కర్మలతో అన్వయించి చెప్పే సంకీర్తనలో పోడు నరకడం, పొలం దున్నడం వానపదనులో విత్తనాలు వేయడం కలుపు తీయడం వెలుగు (కంచె) పెట్టడం ఎరువులు వేయడం పండిన పంటల్ని అనుభవించడం అనేవి పేర్కొన్నాడు.

**గిరిజన సంస్కృతి :**

అన్నమయ్య సంకీర్తనల్లో సమకాలీన జానపద సంస్కృతితోపాటు గిరిజన విజ్ఞానం కూడా కన్పిస్తుంది. అన్నమయ్య రాయలసీమలోని వివిధ క్షేత్రాల్ని గ్రామాల్ని సందర్శించి సంకీర్తనలు రచించినట్లే అనంతపురం కర్నూలు జిల్లాల్లోని పర్వతారణ్య ప్రాంతాల్లో నివసించే బోయవాళ్ళను చెంచు వాళ్ళను కూడా కలుసుకున్నాడు. వారి వేషధారణ వారి ప్రవర్తన గుణగణాల్ని వృత్తిని బాగా పరిశీలించి వాటిని సంకీర్తనల్లో ప్రయోగించి తద్వారా విష్ణుమూర్తి అవతార విశేషాల్ని భక్తి జ్ఞానవిషయాల్ని గిరిజనులకు సుబోదకం చేశాడు.

పొడవైన వేషగారి బోయనాయుడు
విడువ కిందరిగాచు వెడబోయనాయుడు...

**సంఘ సంస్కరణ :**

నాటి సంఘాన్ని సంస్కరించటానికి అన్నమయ్య మొత్తవలసిన చోట మొత్తాడు. బుద్ధి చెప్పవలసిన చోట బుద్ధి చెప్పాడు. బుజ్జగించవలసినచోట బుజ్జగించాడు. మనిషిలోని రాయి తనాన్ని కరిగించే ప్రయత్నం చేశాడు. తన సాహిత్యంలో పేరుకు వేంకటేశ్వరుడు నాయకుడు గాని మొత్తం ప్రకృతిని ప్రపంచాన్ని మానవ సమాజాన్ని నాయకుని చేశాడు.

## కుటుంబ జీవితం :

ప్రాచీన కాలంలో వ్యష్టి కులాల కన్నా సమిష్టి లేదా ఉమ్మడి కుటుంబాలే ఎక్కువగా ఉండేవి. ఇందులో సుఖ శాంతులకన్నా కలతలే ఎక్కువగా వస్తుంటాయి. అన్నమయ్య ఆ బాధల్ని స్వయంగా కూడా అనుభ వించాడు.

అన్నలంటా దమ్ములంటా ఆండ్లంటా బిడ్డలంటా
వన్నెల నప్పులు గొన్నవారు వోవీరు (1 - 224)

## వివాహం :

అన్నమయ్య పద్మావతీ శ్రీనివాసుల్ని పెండ్లికూతురు, పెండ్లి కొడుకుగా చేసి వర్ణించిన సంకీర్తనల్లో వివాహ సంబంధమైన అంశాలు వ్యక్తమవుతున్నాయి.

పిడికిట తలంబ్రాల పెండ్లి కూతురు కొంత
పెడమరలి నవ్వీనె పెండ్లి కూతురు (12 - 185)

## ఆభరణాలు :

ఆనాడు అనేకాభరణాల్ని ధరించేవారు. ముత్యాల పేరులు బంగారు పరుపణులు, ఉంగరాలు, నీలపుకంట సరాలు పేర్కొనబడ్డాయి. ముత్యాల చెరగులు చేలం గట్టుకొన్నదని చెప్పాడు.

## లేపన తాంబూలాదులు :

స్త్రీ పురుష ప్రణయ జీవితంలో తాంబూలానికి అగ్రస్థానం వుంది. అన్ని పుణ్యకార్యాల్లో తాంబూలం ఉపయోగిస్తారు. విడెము, ఆకు మడుపు, కప్పురపు విడెము, మదరాగముల విడెము మొదలైనవి.

## నోములు :

ఇవి సౌశీల్య సంరక్షణ కోసం కుటుంబ సుఖశాంతుల కోసం కామిత ఫలిసిద్ధి కోసం తెలుగు స్త్రీలు నోములు ఆచరిస్తారు. వీటివల్ల మానసిక దృఢత్వం నియమ నిష్ఠలు పెంపొందుతాయి. అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో నాయిక పద్మావతి తన నాయకుడు శ్రీ వేంకటనాథుని పొందడం కోసం నోచిన నోములు...

భామనోచిన నోము సఫలముగాను
కామ తాపంబునకు కాండవము నెమో (12 - 127)

అనే సంకీర్తనలో పేర్కొన్నాడు.

## క్రీడా విశేషాలు :

అన్నమయ్య లోక వ్యవహారంలోని క్రీడా విశేషాల్ని పేర్కొంటూ తద్వారా విష్ణు భక్తిని అవతార విశేషాల్ని బోధించాడు. బాలల కోతి కొమ్మంచులాట ఆడేటప్పుడు చెట్టుకొమ్మంచున దాగివున్న బాలుని పట్టుకునేటప్పుడు.... అది గదిగో అనే మాటే ఉచ్చారణా వేగంలో ఆగ్గొగ్గో... గూగూను..కూగూగుగా మారిందని భావించవచ్చు.

చేరి అందాల మోతతో చెన్నకేశవా
ఈ రీతి మాడు పూరిలో నిట్లాడేవా (3 - 179)

అనే సంకీర్తనలో పిల్లదీపులాగ రాసక్రీడ దాగలి ముచ్చలాగ బండి విరిచాట వంటి ఆటలు పేర్కొన్నాడు.

## సంగీతం :

అన్నమయ్య సంకీర్తనలన్నీ లక్షణ బద్ధంగా రచింపబడి నవే. జానపద బాణీల్లోని సంకీర్తనలు పాడగల్గిన ప్రతి ఒక్కరూ పాడుకోడానికి యోగ్యంగా ఉన్నాయి. అన్న మయ్య జానపద బాణీల్లో రచించిన సంకీర్తనలు భూపాళం కేదారం గౌళ దేసాళం సామంతం భైరవి హిందోళ వసంతం ముఖారి శ్రీరాగం వసంతం లలిత సాళంగనాట మంగాళ కైశిక శంకరాభరణం దేవగాంధారి ధన్నాసి వంటి పెక్కు రాగాల్ని గిరిజన సంస్కృతికి సంబంధించిన సంకీర్తనలకు బౌళి కొండమలహరి సామంతం పాడి వంటి రాగాల్ని ఉపయోగపరిచాడు. కిన్నెర (12-245), దుందుభి (8-21), బుఱ్ఱట కొమ్ము (24-389), పిల్లనగ్రోవి (20-456), తుత్తురు కొమ్ము (12-96), దందె (29 - 356), భేరి (8 - 194), శంఖం (1 - 141), సింగినాదం (7 - 12) వంటివి.

## నాణాలు :

కాలక్రమంలో జన వ్యవహారంలో నాణేలు పేర్లు మారుతుంటాయి. అన్నమయ్య కాలంలో నాణేలకు రూక మాడ రవ్వ తారము కాసు అనే పేర్లు వుండేవి.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



రూకలై మాడలై రవ్వలై తిరిగీని - దాకొని వున్నచోట
దానుండ దదివో
ప్రకటించి కనకమే భ్రమయించీని (5 - 283)

రూక మాడ రవ్వ అనేవి బంగారు నాణేలని తారము అనేది వెండి నాణెమని కాసు అనేది రాగి నాణెమని తెలుస్తోంది.

**కొలతలు :**

వస్తు పరిమాణాన్ని తెలుపుతాయి. అన్నమయ్య జానపదుల వ్యవహారంలో పట్టెడేసి చేరడేసి బారడేసి మొదలైన అవయవ కొలతల్ని చిట్టిడేసి చిప్పడేసి చేటడేసి దుత్తడేసి పెట్టుడేసి గాదెడేసి మొదలైన వస్తువుల్ని నాయిక సౌందర్య వర్ణనకు చేష్టల వర్ణనకు సమన్వయించారు.

చేరడేసి కన్నులు పట్టెడేసి గుబ్బలు (29 - 27)
మాటలాడని గాదెడేసి నవ్వీనాపెచాటడేసి (13 - 153)

**సంతలు :**

ఆనాడు గ్రామాల్లో కొన్ని రోజులు సంతలు జరిగేవి. అక్కడ రకరకాల వస్తువుల్ని తెచ్చి అమ్మేవారు. గ్రామాల్లో దిన సంతలు మైల సంతలు (5 - 178) వుండేవని తెలుస్తోంది. కొలది పుణ్య పాపాలె కొంగు రొక్కములు వెట్టి.. (8 - 170)

**వంటకాలు :**

అన్నమయ్య కాలంనాటి ప్రజలు వండుకున్న రకరకాల వంటకాలు సంకీర్తనల్లో చెప్పబడ్డాయి. శ్రీకృష్ణజయంతి నాడు ఆ స్వామికి నైవేద్యాలు పెట్టినపుడు అడుకులు చక్కిలాలు ఆనవలు నురుగులు వడపప్పు మొదలుగా వాముల కొలదులు (10 - 27) వంటి వంటకాలు చెప్పబడ్డాయి. అప్పాలు వడలు ఆకాళ పాశాలు సద్యో ఘృతములు మిరియపు తాళింపు కూరలు దధ్యన్నాలు దుగ్ధాన్నాలు నానబియ్యాలు పరమాన్నాలు కుడుములు కంది కుడుములు పాలపొంగలి బియ్యాల పొంగలి వంటి వంటకలు పేర్కొన్నారు. సామెతలుగా ఉపమానాలుగా కొన్ని వంటకాలు ప్రయోగించబడ్డాయి. అట్టు పిండంటే నిప్పటి, పాలకుళ్ళాయను నీ వచ్చి నువ్వుల (27 - 340) నిగ్గులు పాలపొంగలి గాడట్టె (28 - 320).

ఈ విధంగా అన్నమయ్య సంకీర్తనల్లో సమకాలీన సమాజం ప్రతిబింబిస్తోంది. ఈ వ్యాస రచనకు ఆధార భూతములైన అన్నమయ్య సంకీర్తనలు, సముద్రాల లక్ష్మణయ్య, వేటూరి ఆనందమూర్తి వంటి పండితుల గ్రంథాలు నాకు తోడ్పడ్డాయి.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# 19 వ శతాబ్ది తెలంగాణాలోని సాంఘిక సాంస్కృతిక పరిస్థితులు

- డా॥. జి. కిషన్ ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

ఏ దేశ చరిత్ర అయినా ఆ దేశ భౌగోళిక పరిస్థితుల ననుసరించి ఉంటుంది. ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితుల ప్రభావము మానవ సంఘ పరిణామంపైన ప్రభావితమౌతాయి. ఒక జాతి ప్రజానీకము యొక్క సంపూర్ణ జీవిత చరిత్రను వారి 'సంస్కృతీ చరిత్ర' అనవచ్చు.

దక్కన్‌లో భాషా ప్రమేయంగా ఏర్పడిన ప్రదేశమే 'ఆంధ్రదేశము'. 'ఆంధ్ర' అనే పదానికి 'తెలుగు' అనే పదము కూడా వాడుకలో ఉంది. ఆంధ్రదేశాన్ని 'ఆంధ్ర మండలము, ఆంధ్రభూమి, ఆంధ్రావణి, త్రిళింగ, తెలంగాణా అనే వివిధ పేర్లతో పిలుస్తారు.

తెలంగాణా ప్రాంతము ఎత్తైన పీఠభూమి. వర్షపాతము తక్కువ పశ్చిమాన సహ్యాద్రిపర్వతాలు, తూర్పున మహేంద్ర పర్వతాలు ఋతుపవన ప్రసరముల కడ్డు తగిలి వర్షపాతాన్ని తగ్గిస్తున్నాయి. ఉత్తర దక్షిణముల యందు జీవనదులైన గోదావరి కృష్ణా నదులు పీఠభూమి యందు ప్రవహించుచుండుట చేత, ప్రవాహ వేశము చేత దేశము యొక్క సవ్య సంపదలకు అనుకూల పడుట లేదు. మిగిలిన నదులు కేవలము వర్షాధారమైనవి. తెలంగాణలో గుట్టలు అరణ్యాలు, ఇసుకనేల విస్తీర్ణము ఎక్కువనే చెప్పవచ్చు.

శాతవాహనుల కాలంనుండి అనేక రాజవంశ రాజులు ఈ ప్రాంతాన్ని పరిపాలిస్తూ వచ్చారు. దాదాపు మహమ్మదీయుల పాలన ప్రారంభమయ్యే వరకు ఈ ప్రాంతమంతా పాలకులది, ప్రజలది. ఒకే భాషా ఒకే సంస్కృతిగా నడుస్తూ వచ్చింది.

మొగలు చక్రవర్తి అయిన ఔరంగజేబు కృషి వలన (క్రీ.శ. 1687లో) గోల్కొండ రాజ్యము మొగలు భూభాగంలో విలీనమైంది. తత్ఫలితంగా సుల్తానుల ఆక్రమణలో గల ఆంధ్రప్రాంతము మొగలు సామ్రాజ్య అంతర్భాగమైంది.

ఔరంగజేబు చనిపోయిన తరువాత మొగలు సింహాసనాన్ని అధిష్టించిన పాలకులు బలహీనులైనారు. వారి రాష్ట్ర పాలకులు స్వతంత్రం ప్రకటించుకొని తమ స్వతంత్ర ప్రతిపత్తిని చాటుకొన్నారు. వారిలో దక్కన్ సుబేదారైన నిజా-ముల్-ముల్క్ ఒకడు. ఈ నిజాముల్ ముల్క్‌నకే ఆసప్‌జా అనే బిరుదు కలదు. దక్కన్‌లో మొగలు భూభాగము పొందిన అసఫ్ జా వారసులనే 'నిజాంలు' అని పిలుస్తారు. వీరి పాలననే నిజాం పాలన అని, అసఫ్ జా వంశీయుల పాలన అని పిలుస్తారు.

అసఫ్ జా వంశీయులు దాదాపు 200 సంవత్సరాలు తెలంగాణా ప్రాంతాన్ని పాలించారు. వీరి పాలన ప్రజా విరుద్ధంగా నిరంకుశంగా వుండేది. వీరి పాలనా కాలంలో దేశీయ సంస్థానాలు ఆర్థిక, వైజ్ఞానిక రంగాలలో వెనుకబడి వుండేవి. అసఫ్‌జా వంశీయులలో ఒకరిద్దరు సుల్తానులు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి విద్యా, ఆర్థికాభివృద్ధికి కృషిచేసారు.

## ఆసఫ్‌జాల పాలనలో దేశకాల పరిస్థితులు :

### సాంఘిక పరిస్థితులు :

అసఫ్‌జాల రాజ్యంలో ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలు వుండేవి. అందుచే వారి రాజ్యంలో ఆంధ్రులు, కన్నడులు, మహారాష్ట్రులు, స్థానిక ముస్లిములు వుండేవారు. వీరితో పాటు ఉద్యోగార్థమై వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ముస్లింలు కూడా వుండేవారు. నాటి జనసంఖ్యలో హిందువుల సంఖ్య ముస్లింల సంఖ్య కంటే మూడురెట్లు అధికంగా వుండేది. అసఫ్‌జా వంశీయుల పాలనా కాలంలో హిందూ-ముస్లిమ్‌ల మధ్య సమరసభావము నెలకొని వుండేది. అందుకు ప్రధానకారణం వర్ణ వివక్షత లేకుండా సమర్థులైన వారందరికి ఉద్యోగ అవకాశాలివ్వటమే. అనేకమంది హిందువులు అసఫ్‌జాల కొలువులో ఉన్నతోద్యోగాలను పొందారు.

**స్థానిక ప్రజల పరిస్థితి – ముల్కీనాన్ ముల్కీ వ్యవస్థ :**

అసఫ్‌జాహి వంశజులు సమర్థులైన వారిని వివిధ ప్రాంతాల నుండి పిలిపించి ఉద్యోగాలివ్వడంతో, ఉన్నత పదవులలో వున్న వారందరు స్థానికులైన ప్రజలు కారు. స్థానికులు వీరి పాలనలో ఎక్కువగా నష్టపోయారు. కాల క్రమేణ. ఉద్యోగ సంపాదన విషయాలలో స్థానికులు ఇతర ప్రాంతాలనుండి వచ్చువారి పోటీకి తట్టుకోలేక పోయారు. దాని ఫలితంగా స్థానికులలో నిరాశా నిస్పృహలు పెంపొంది మీర్ మహమ్మద్ అలీ కాలమున 'ముల్కి' (స్థానికులు) నాన్ ముల్కీ (స్థానికేతరులు) ఉద్యమం ప్రారంభమై అనేక సంఘర్షణలకు కారణమైంది. ఈ ముల్కీ ఉద్యమం నానాటికి తీవ్ర రూపము దాల్చుటతో చివరి నిజామైన 'ఉస్మానలీ' స్థానికులకే ఎక్కువ ఉద్యోగ అవకాశాలిచ్చాడు.

**నిజాంపాలనలో ఆంధ్రుల పరిస్థితి :**

నిజాం పాలనలో గల స్థానిక సంఖ్యా బలములో మహారాష్ట్రుల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. ఉన్నతోద్యోగాలన్ని మహారాష్ట్రులే పొందేవారు. నాటి కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలు, ప్రతి విషయములో మరట్వాడా ప్రాంతానికన్నా వెనుకబడి వుండేది. తెలంగాణ ప్రాంతంలో నివసించే తెలుగువారి పరిస్థితి దయనీయంగా ఉండేది వారి మంచి చెడులను పట్టించుకొను వారు కరువై, వారు నిర్లక్ష్యంగా చూడబడేవారు.

**భాషా విధానం :**

నిజాం పాలనలో అనేక ప్రాంత ప్రజలున్నప్పటకిని, ఆంధ్రుల సంఖ్యాబలమే ఎక్కువగా ఉండేది. నిజామ్‌లు అధిక సంఖ్యాకుల మాతృభాషలను చులకనచేసి, వాటిని నేలరాసి, అల్పసంఖ్యాకుల భాషలైన ఉర్దూ, పార్శీ భాషలకే ప్రాధాన్యతనిచ్చి వాటిని రాజ భాసలో తీర్చి దిద్దారు. వాటిని పాఠశాలలయందు నిర్భంధ పాఠ్యాంశాలుగా నిర్దేశించి వాటి ప్రగతికి కృషిచేశారు. నాడు పాఠశాలలందు 'ఉర్దూ' బోధనా భాషగా గౌరవ మర్యాదలను పొందుటచే స్థానిక భాషలు తమ ప్రాధాన్యతను కోల్పోయి చీకటి మరుగయ్యాయి.

**మతాంతర వివాహాలు :**

నిజాం పాలనలో వివిధ సంస్కృతులకు, చెందిన ప్రజలు నివసించుటచే వారిమధ్య సత్సంబంధములు పెంపొంది అనేక మతాంతర వివాహాలు జరిగాయి. హిందువులు ముస్లిమ్ స్త్రీలను, క్రైస్తవులు మహమ్మదీయులను చేసుకొన్న సంఘటనలు నిజామ్‌ల పాలనలో కోకొల్లలు.

**సామాన్య ప్రజల స్థితిగతులు :**

అసఫ్ జాహీ వంశీయుల పాలనలో సామాన్య ప్రజల పరిస్థితి అత్యంత హీనంగా ఉండేది. నాడు గ్రామాల యందు అక్రమదోపిడీలు, వివిధ రకాలైన వెట్టి చాకిరీ లుండేవి. గ్రామాధికారులైన పటేల్, పట్వారీల నుండి ప్రభువైన నిజాం వరకు ప్రజలను అనేక విధాలుగా దోచి వారి జీవనాన్ని దుర్భరం చేసేవారు. వారికి తోడు మధ్య వర్తులైన జాగీర్ధారులు జమీందారులు దేశ్‌ముఖ్‌లు మొదలైనవారు ప్రజలను నిలువున దోపిడీ చేసి నల్లులవలె వారి రక్తాన్ని పీల్చెడివారు. నాడు రోహిలుల (ఫకీరుల) ప్రభావము కూడా వుండేది. వీరిని అడ్డంగించు నాథుడు లేకపోవటంచే రోహిలులు గ్రామాలపై బడి ప్రజలను హింసించి దోచుకునేవారు.

నిజాం సంస్థానంలో అనేక మంది జమీందారులున్నా పరస్పర ద్వేషంతో కలహించుకొనుచు ప్రజీజీవనాన్ని నాశనం చేశారు. వీరి అక్రమ పాలనను ఎదిరించి పోరాడగల మనస్తత్వము నాటి ప్రజలలో లేదు. బాటసారులకు తగిన రక్షణ లేకుండేది. గ్రామాలలో దోపిడీ దొంగలు దాడులు జరిపి ప్రజలను దోచి చంపెడివారు. రాజ్యములో శాంతి భద్రతలు శూన్యమైనాయి.

**మత పరిస్థితులు :**

నిజాం రాజ్యంలో హిందువుల సంఖ్య ఎక్కువ. వీరితో పాటు ముస్లింలు చేప్పుకోదగిన వారు. ముస్లిమ్‌లలో సున్నీ, షియా, వాహబీల శాఖలవారు వుండేవారు. వీరేగాక నాటి సమాజంలో క్రైస్తవులు, ఆర్యసమాజంవారు వుండేవారు నిజాం పాలనలో వివిధ మతాలవారు మత సామ

రస్యముతో మెలంగుట గొప్ప విశేషము. నాటి నిజాములు మత విషయాల యందు ఏ జోక్యము కల్పించుకోలేదు.

నవాబ్ నిజామలీఖాన్' భద్రాచల శ్రీరామాలయానికి 40 వేల రూపాయలు ఆదాయము వచ్చు జాగీరును ఇచ్చి తన మత సహనాన్ని ప్రదర్శించుకొన్నాడు. అంతేగాక నిజాం నాసిరుద్దౌలా, భద్రాచల రాములవారికి ప్రతి శ్రీరామనవమికి కానుకలు పంపేవాడు. నాటి దివానులలో ప్రసిద్ధుడైన చందులాల్ శ్రీశైలం, అహక్షబిలం, తిరుపతి భద్రాచలము మొదలగు పుణ్యక్షేత్రాలకు మాన్యా లిచ్చాడు.

**అర్థిక పరిస్థితులు :**

నిజాం పాలనాకాలంలో ప్రజల ప్రధానవృత్తి, వ్యవసాయము. నాటి రైతులందరు నిరుపేదలు, జాగీర్థారుల దోపిడీల వలనను అతివృష్టి, అనావృష్టి, కరువు కాటకాల వలన రైతుల పరిస్థితి హీనంగా వుండేది. రైతులు ప్రభుత్వానికి ఎక్కువ పన్ను చెల్లించేవారు. నాటి తెలంగాణమున జాగీర్థారీ విధానము అమలునందుండేది. ఈ విధానములో పన్నుల భారము, వెట్టిచాకిరి, ఉద్యోగుల దురంతములు సంహింపరానివిగా వుండేవి. ప్రభుత్వము రైతు సమస్యలను పట్టించుకునేదికాదు. కరువు కాటక సమయాలందు ఎటువంటి నివారణ చర్యలు ప్రభుత్వం తీసుకోక పోవటముతో అనేకమంది రైతులు తమ పొలాలను వదలి వేరే ప్రాంతానికి జీవనభృతికై వెళ్ళేవారు.

**నైజాంపాలనలో జాగీర్థారులు :**

నాటి అత్యధిక భూభాగము జాగీర్దారుల యాజమాన్యమున గలదు. ఈ జాగీర్థారులు సర్వాధికారాలను కలిగి తమ జాగీర్లపై నిజాంవలె అధికారాన్ని చెలాయించెడివారు. (పోలీసు, న్యాయాధికారులు) జాగీరులందు భూమిపట్టా నిర్ణయింపబడలేదు. అందుచే రైతులకు భూమిపై పట్టాహక్కు వుండేదికాదు.జమీందారులు భోగలాలస జీవితాలకు అలవాటుపడి తమ జాగీరు గ్రామాలను దోచుకునేవారు. ప్రభుత్వ గ్రామలకంటే (ఖల్సా) జమీందారు గ్రామాలే ఎక్కువ పన్నును వసూలు చేసి జాగిరీ వాసుల జీవితాన్ని నరకప్రాయమొనర్చారు.

**నిజాం పాలనలో పరిశ్రమలు :**

నిజాం పాలనలో దేశీయ పరిశ్రమలకు పోషణకరువై అవి మూలబడిపోయాయి. నాడు రవాణా సౌకర్యాలు అభివృద్ధి చెందకపోవటంచే పరిశ్రమలు వృద్ధి చెందలేదు. దివాన్ సాలర్‌జంగ్ దేశీయ పరిశ్రమాభివృద్ధికి ఎక్కువ కృషి చేసాడు. ఔరంగాబాదు, గద్వాల సిద్ధిపేట, మొదలైన ప్రాంతాలలో సిల్కు, పట్టు పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. నిర్మల్, వరంగల్లు నందు దుప్పట్లు తివాచీల పరిశ్రమ పురోభివృద్ధిగాంచాయి. నిజాం పాలనా కాలంలో దేశంలో పంచదార, కాగితము, సిమెంటు అగ్గిపెట్టెల పరిశ్రమలు స్థాపించడంతో అనేకమందికి జీవనోపాధి లభించింది. దివాన్ సాలార్‌జంగ్ 'దేశీయ పరిశ్రమల ప్రదర్శనను' ఏర్పాటు చేసి అయా వస్తువుల ప్రాధాన్యతను ప్రజలకు తెలిపాడు. దాని ఫలితంగానే ఈ నాటికి హైదరబాద్ నగరాన ప్రతి సంవత్సరం 'అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన చోటు చేసుకొన్నది.

**తదితర పరిస్థితులు :**

నిజాంల పరిపాలనా కాలంలో అతివృష్ఠి, అనావృష్టి వలన ప్రజలు అనేక అవాంతరాలను గురియైనారు. నిజాములి కాలమున క్రీ.శ. 1777లో మూసీనది పొంగి ప్రజా జీవనానికి ఇబ్బందిని గురిచేసింది. సికిందర్ జా కాలములో, మీర్ మహబూబ్ అలీ పాలనా కాలములో తెలంగాణణా రాజ్యంలో అతివృష్టి, అనావృష్టిల ఫలితంగా క్షామ పరిస్థితులు ఏర్పడ్డాయి. క్రీ॥శ॥1908లో మూసీనది మళ్ళీ పొంగి అపార ధన, ప్రాణ నష్టాన్ని కలిగించాయి.

నిజాంల పాలనలో వ్యవసాయాభివృద్ధికి నాటి పాలకులు అనేక తటాకాలను, చెరువులను త్రవ్వించారు. మీర్ అలం ప్రజలకోరకు ఒక మంచినీటి తటాకాన్ని త్రవ్వించాడు. దీనినే నేడు 'మీర్ అలం తటాకము' అని పిలుస్తారు. ఉస్మానలీఖాన్ సేద్యాభివృద్ధికై గండిపేట చెరువు (ఉస్మాన్ సాగర్)ను త్రవ్వించి పట్టణానికి మంచి నీటి సౌకర్యాన్ని కల్పించాగడు. ఈయన వ్యవసాయాభివృద్ధికై 'నిజాం సాగర్' ను నిర్మించాడు. ఈ ప్రాజెక్టు క్రింద

వేలాది ఏకరాల భూమి సాగులోకి రావడంతో తెలంగాణా ప్రజల జీవనం కొంతవరకు మెరుగు పడ్డది.

ప్రారంభాన హైదరబాద్ సంస్థానంలో రవాణా సౌకర్యాలు లేకుండేవి. తరువాత సాలార్‌జంగ్ కృషి ఫలితంగా అనేక ప్రాంతాలలో రైలు మార్గాలు ఏర్పాడ్డాయి. 1868 లో నాటి నిజాం ప్రభుత్వం Publci Works Department ను ఏర్పరచి నైజాం ప్రాంతంలోని ముఖ్య జిల్లాలను కలుపుతూ అనేక రహదారి మార్గాలను నిర్మించింది.

నాటి నుండి నేటి వరకు ప్రభుత్వాలెన్ని మారినా ప్రజల జీవన విధానంలో ఎలాంటి మార్పు లేదు. ఎలాంటి అభివృద్ధి లేదు. ఇప్పుడోచ్చిన ఈ తెలంగాణ ప్రభుత్వమైన ప్రజల స్థితి గతులను అర్థం చేసుకొని మనరాష్ట్రాభివృద్ధికి తోడ్పడతారని ఆశిద్దాం. మొత్తం మీద 1801 నుండి 1899 అంటే 19వ శతాబ్దిలో కీర్తనలు, శతకాలు, యక్షగానాలు, ప్రబంధాలు, క్షేత్రమహాత్మ్యాలు మొదలైన వాటిపై సాహిత్య రచన జరగలేదనిపిస్తుంది. స్థానిక-స్థానికేతర అనే ఉద్యమ సమస్యలు 19వ శతాబ్దినుండే ఉన్నాయి. నేడు మనం ఏ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేస్తున్నామో ఇవన్నీ 19వ శతాబ్దిలోకూడా ఉన్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యల సాధనకు కృషి చేయాల్సిన బాధ్యత మనందరి మీద ఉన్నది.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# 'స్త్రీ' విద్యను కాంక్షించిన నవయుగ కవిచక్రవర్తి జాషువ

- డా॥ సంగుల సునీల్ కుమార్, సీనియర్ అకడమిక్ ఫెలో (ICHR), తెలుగు అధ్యయన శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

'బేటీ బచావో - బేటీ పడావో' లాంటి నినాదాలు భారత ప్రభుత్వం చేస్తున్నప్పటికి, నేటికీ స్త్రీలు అసమానతలకు, అన్యాయాలకు, అణచివేతకు గురవుతున్నారు. స్త్రీ విద్యాహక్కును ప్రాథమిక హక్కుగా; బాల, బాలికల నిర్భంద విద్యగా ప్రభుత్వం అమలు పరుస్తూ ఉంది. అయినా, నేటికి బాలుర విద్యారేటు(శాతం) తో పోలిస్తే బాలికల విద్యారేటు(శాతం) సగానికి మించలేదు. విద్యనభ్యసించే ముందు స్త్రీ దేవతామూర్తి సరస్వతీదేవిని ఆరాధిస్తూనే మనలో సగభాగమైన స్త్రీలకు విద్య అందకుండా చేస్తున్నాం.

స్త్రీలు ఎదుర్కొంటున్న బాధల్ని, కష్టాల్ని అనేక మంది కవులు, రచయితలు తమ రచనల్లో నిక్షిప్తం చేస్తూనే వస్తున్నారు. అయితే ఆ సమస్యల్ని ఎదుర్కొనే మానసిక ధైర్యం విద్య ద్వారానే స్త్రీలకు వస్తుందని గుర్తించిన కవులు కొందరే అలాంటి వారిలో గు|్రం జాషువా మొదటి వరుసలో ఉంటారు.

విద్యలేని వాడు వింత పశువు అనే సూక్తికి కొనసాగిస్తూ జాషువా విద్యలోనే స్వర్గం ఉందని చెప్పాడు. ప్రజల్ని అజ్ఞానంలోకి నెట్టివేసే మూఢ విశ్వాసాల కంటే, విజ్ఞానంతో ముందుకు నడిపించే విద్యా సముపార్జనే గొప్పదని జాషువ గుర్తించారు. 'చదివిన వాడు నరుడు, చదవని వాడు పశువు,

చదువులలో స్వర్గముందిరన్నా' అని పలికారు. గుడుల కంటే బడులు పెరగాల్సిన ఆవశ్యకతను తెలుపుతూ 'అంకమ్మ పూజకన్న, సరసోతి పూజమేలు, గుడిమాని బడులుగట్టుదమన్నా' అని విద్య అనే ఖండికదారా ప్రజలందరికి విద్య ఆవశ్యకతను తెలిపారు.

ఆధునిక కాలంలో విద్య ప్రజలను పీల్చి పిప్పి చేసే దురాచారాలను అడ్డుకట్టవేయలేక పోతుంది. అటువంటి విద్య ఎందుకని ప్రశ్నించారు జాషువా. విద్య మూఢుడైన పులి భుజించే భోజనంలా, మోసపు రాతలకు రక్షా బంధంగా మారిపోయిందని నిరసించాడు. అసలు మానవత్వం పెంపొందించలేని చదువులు ఎందుకు అని జాషువా తన గబ్బిలం ఖండకావ్యం ద్వారా ప్రశ్నించాడు.

జనులం బీలిచి పిప్పిజేసెడు దురాచారంబులన్ గాలమ
ట్టని విద్యాబలమేల? విద్యయన మౌఢ్యవ్యాఘ్రి
కింపైన భో
జనమా? మోసపువ్రాతకోతలకు రక్షాబంధమా
యెందుకీ
మనుజత్వంబు నొసంగలేని చదువుల్ మైరేయపుం
మైకముల్

(గబ్బిలం, పుట.53)

జాషువ చిన్నతనం నుంచి సమాజపోకడలను చవి చూసినవారే. సమాజంలో అసమానతలను ఎదుర్కొంటున్న వారు ప్రధానంగా స్త్రీలు. తరువాత దళితులు. దళితులపట్ల వివక్షను స్వయంగా అనుభవించిన జాషువ తమతో అసమానతులను ఎదుర్కొంటున్న స్త్రీల పక్షాన తన వంతు గళం వినిపించారు. స్త్రీకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అవసరమని తన 'కొత్త లోకం'లో "స్త్రీకి మారు సమాన గౌరవ విభూతిన్ గాంతకుం గూర్పుమా" అని అభ్యర్థిస్తాడు. "నారిలేని ఇల్లు నారలేని విల్లు" అనే విషయాన్ని ముసాఫరులు అనే కావ్యంద్వారా, "ఆడుతెగ లేకున్న మగతెగకు పుట్టగతి లేదని", "ఆడుదిలేకుండిన నీరేడు జగంబులకు శోభయే లేదు" అనే మాటల ద్వారా ప్రజలలో చైతన్యం కల్గించారు. జాషువ అనాథ, ముంతాజ్‌మహల్, స్వయంవరం మొదలైన కావ్యాల ద్వారా స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎత్తి చూపారు. మూఢనమ్మకాలనుండి, దురాచారాల నుండి స్త్రీ బయటపడాలంటే స్త్రీకి విద్య అవసరం అని వాపోయారు.

ప్రాచీనకాలంలో చాలా మంది స్త్రీలకు విద్య అనవసర మని భావించేవారు. స్త్రీలు కేవలం ఇంటికే పరిమితమవ్వాలనేవారు. స్త్రీలు విద్య నేర్చుకుంటే సమాజం చడిపోతుందని నమ్మేవారు. ఇలా స్త్రీలు ఎన్నోయేళ్ళగా చదువుకి దూరమైనారు. జాషువా స్త్రీల హృదయాలు మల్లెతీగవలె నిష్కళంకమైనవని; వారు చదువుకోడానికి అర్హులని, జ్ఞానదేవతకు వారు రత్నాగారాలవంటివారని ఈ కింది పద్యం ద్వారా కొనియాడాడు.

ముకురంబుల్ బలె నిష్కళంకములు మీ పూతాంత రంగాలు, వి
ద్యకు యోగ్యంబులు, జ్ఞానదేవతకు రత్నాగారముల్ సుమ్ము, బా
లికలారా! కరుణాసముద్రులయనల్పీ భూతదానాభ్రగం
గకు కేల్మోడిచి సేకరింపుడు జగత్కల్యాణసౌశీల్యమున్

(అభినందన మణిహారము, పుట.223)

భారతీయ సంస్కృతిలో వేల సంవత్సరాలుగా శూద్రులతోపాటు స్త్రీజాతి మొత్తానికి విద్య నిషేధింపబడింది. వారి చదువు భారతీయ సంస్కృతికే భంగం కలుగుతుందని భ్రమింపజేసి వారి శ్రమను దోపిడీచేశారని జాషువా క్రింది పద్యం ద్వారా వాపోయారు.

భారతదేశ సంస్కృతికి భంగము వాటిలునంచు విద్యకున్
దూరముజేసి మీబ్రదుకు దోపిడిచేయుటచేత లక్ష్యమున్
జేరక యన్యఖండముల శేముషికిన్ గను లప్పగించి ని
ట్టూరుపుల న్నిగడ్తురు సహోదరి! నేటి స్వతంత్ర మానవుల్

(వంచిత - 184)

ఆధునిక స్త్రీలను చైతన్యవంతులను చేస్తూ జాషువా మగవాళ్ళ నెత్తిన కొమ్ములేవి లేవని, వారు స్త్రీల కన్నా ఎందులోనూ గొప్పవారు కాదని మేల్కొల్పారు. స్వార్థ పూరితమై సంఘం స్త్రీలచే దాస్యం చేయించుకోటానికి వారికి విద్యా స్పర్శలేకుండా చేశారని బావించారు. ఇప్పటికైన స్త్రీలు చైతన్యవంతులై మూఢాచారమైన పరదా పద్ధతిని దాటి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను అనుభవించాలని ప్రబోధించారు.

పురుషుల్ నెత్తిని కొమ్ము నిక్కిన మహాత్ముల్ గారు నీకన్న సుం
దరి! స్వార్థాత్మకమైన సంఘము నినున్ శాసించి యాజన్మ దు
స్తర దాస్యంబున గట్టివైచినది విద్యాస్పర్శ లేకుండగా
పరదా దాటి స్వతంత్రవీధుల పదాబ్జంబూని క్రీడింపుమీ!

(ప్రబోధము - 131)

చదువుకున్న అమ్మాయిలు తమ దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తారు. వారు పురుషుల భారం పంచుకోవచ్చు. బాలికలు బాగా చదువుకున్నప్పుడు, చిన్నతనంలో వివాహం చేసుకోవాల్సిన అవసరం లేనప్పుడు, వారు సమాజంలో రచయితలు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, వైద్యులు, రాజకీయ నాయకులు, శాస్త్రవేత్తలుగా దేశాభివృద్ధిలో పాటుపడగలరు. అలాంటి విద్యావంతురాలైన స్త్రీ తోడుగా రాకున్న దేశం ఎదగలేదని జాషువా బావించారు.

ఎన్నేండ్లాయెనొ పూరుషుం డొక డసాహిత్యాంబు పూరంబులో
దున్నంబోలి చరింపసాగి? పెడబుద్ధుల్ దప్పి పోలేదు గ
ర్వోన్నత్యంబు నశించలే దబల విద్యాపూర్ణయై తోడు రా
కున్నన్ దేశము నిద్ర మేలుకొనునే యుత్పుల్ల కంజేక్షణా!

(ప్రబోధము - 131)

పూర్వం కొద్దోగొప్పో చదివే స్త్రీల విద్యా విధానంలో సతీ అనసూయ, సీత వంటి పతివ్రతా పరమైన కథలు చదివించేవారు. అంతేకాక ఇంటిని చక్కబెట్టుకునే జ్ఞానాన్ని మాత్రమే అందించేవారు. భర్తకు సేవలు చేస్తూ, భర్త మాట మీర కూడదని, భర్తే దైవంగా భావించాలని సంప్రదాయ కావ్యాలు స్త్రీలను అంతవరకు మాత్రమే పరిమితం చేశాయి. అలాంటి చదువుల వలన స్త్రీలు

బానిసలుగానే మిగిలిపోయారు. అటువంటి చదువులను త్యజించాలని జాషువ ఆశిస్తున్నారు.

స్త్రీలను పుట్టు బానిసలజేసిన సంస్కృతి చెప్ప వారి గ్రం
థాలు పఠించి నాటకశతంబుల నారసి బండవారి యా
శాలత లెండియున్న జలజాక్షికి నీకొకరీతిగా యప
థ్యాలయి గోచరించగల వద్యతనార్యకవి ప్రబోధముల్
(వంచిత - 182)

నేటి సమాజంలో స్త్రీలపై జరుగుతున్న అన్యాయాలను జాషువా ఖండించారు. స్త్రీలు విద్యావంతులై సమాజ శక్తులను ఎదిరించి పోరాడాలని హితవు పలికారు. సమాజంలో ఉన్న పరదా పద్ధతి, బాల్యవివాహాలు, అసమానతలు ఎదుర్కోవాలని కాంక్షించిన జాషువా స్త్రీలు అబలలు కాదనే బిరుదు పోగొట్టుకొని స్త్రీలు సబలలు అనే హక్కును సాధించాలని జాషువా కోరుకున్నారు.

అబలయన్న బిరుదు మంటించి కాంతల
స్వీయశక్తు లదిమి చిదిమినారు
సబలయన్న బిరుదు సాధించి హక్కులు
గడనచేసికొమ్ము కష్టచరిత
(వంచిత - 185)

స్త్రీని బలం లేనిదిగా, సుకుమారమైనదిగా చిత్రించిన కారణంగా వారికున్న స్వీయ బలాన్ని పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ కోల్పోతూ వస్తుంది. కోల్పోతున్న ప్రతిసారీ సామాజికంగా, రాజకీయంగా తన బలాన్ని చాటుతూనే ఉంది. ఇదే విషయాన్ని కవి ఇక్కడ చెప్పారు.

విద్యావంతులైన బాలికలు తమ పిల్లల భవిష్యత్తు పెంచుకోవడంద్వారా తమ దేశపు భవిష్యత్తు ప్రకాశవంతం చేయగలరు. విద్య మహిళలకు ఆలోచనా స్వేచ్ఛను ఇస్తుంది. ఆమె దృక్పథాన్ని విస్తృతపరుస్తుంది. ఆమె విధులు మరియు బాధ్యతలను గురించి ఆమె తెలుసుకుంటుంది. బాలికల విద్య సమాజంలో భారీ విప్లవాన్ని తేస్తుందని, పురుషులతో సమభాగమైన మాహిళలకు విద్య లేకపోవడం సమాజంలో శక్తివంతమైన భాగాన్ని బలహీన వరుస్తుందని చాటిచెప్పాల్సిన బాధ్యత నవ భారతీయులమైన మనపై ఉంది.

సాంఘికంగా కొందరు సంఘ సంస్కర్తలు స్త్రీ విద్య విషయంపై ప్రజలను చైతన్య పరిచే ప్రయత్నంచేశారు. సాహిత్య పరంగా కందుకూరి, గురజాడ, జాషువా లాంటి కవులు దీన్ని కొనసాగించారు. కుల వివక్ష ఎదుర్కొంటున్న దళితుల పక్షాన బలమైన గొంతు వినిపించిన జాషువా విద్యవిషయంలోనూ లింగ వివక్ష ఎదుర్కొంటున్న స్త్రీ పక్షాన కూడా అదే స్థాయిలో ప్రాతినిధ్యం వహించారు.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# కవిత్వంలో జీవిత విలువలు

- కె. వెంకట రమణ, స్కూల్ అసిస్టెంట్ తెలుగు, ఎ.కోడూరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కె.కోటపాడు మండలం, విశాఖపట్నం జిల్లా.

ఆధునిక కాలానికి తగ్గట్లు అందరినీ ఆకట్టుకునే ఆధునిక లఘు కవితా రూపాలు ఎన్నో! ఇవి పొడవును బట్టి పొట్టివే; అయినా గట్టివి. పొట్టివాడు గట్టివాడు అంటుంటారుకదా...అలా! ఉరుకులు పరుగులతో నవనాగరిక సమాజంలో జీవిస్తున్నవారెవ్వరూ ఇప్పుడు సాంస్కృతిక, కళావిషయాలకు పెద్దగా సమయాన్ని వెచ్చించడానికి ఇష్టపడడంలేదు. విలువైన కాలాన్ని ప్రతి ఒక్కరు వృథాబుచ్చకుండా సద్వినియోగం చేసుకోవడం మంచిదేకదా అని అందరూ అనుకోవచ్చు. పసలేని టీ.వీ.సీరియళ్ళకు అతుక్కుపోతూ...పనికిమాలిన సినిమా లకు బలిఅవుతూ రోజుకు ఎంతసమయాన్ని దుర్వి నియోగం చేస్తున్నారో ఆలోచిస్తే అర్థమవుతుంది!

"నేను ఇవ్వాళ ఒక మంచి కథ చదివాను, ఒక మంచి నవల...కనీసం ఒక మంచి కవిత చదివాను" అని చెప్పే వారే కరువయ్యారు. మానవీయవిలువల్ని, చైతన్యపరిచే, ఆలోచింపజేసే సాహిత్యానికి ఆధునిక మనిషి దూరమై పోతున్నాడు. కొత్త అభిరుచులు ఏర్పరుచుకుంటున్నాడు. ఆరువందల పేజీల నవలను చదివే ఓపిక, కనీసం ఎని మిదిపేజీల కథను చదివే తీరిక నేటి మనిషికిలేనంత బిజీగా ఉన్నట్లు వ్యవహరిస్తున్నాడు. ఎవరు ఎలా వ్యవహరించినా ఒక మంచి మాటకు, ఒక మంచి భావా నికి తల ఊపే తడి ఆరిపోలేదు ఈతరం మనిషే అయినా! కాకుంటే అతని చెవికి ఆమంచి మాట చేరు కోవడానికి మార్గమే తెలియడంలా!!

ఆధునిక కవులు లఘుకవితా ప్రక్రియల్లో (నిడివి రీత్యా పొట్టికవితలు) అణుబాంబులా అద్భుతమైన భావాలను వ్యక్తీకరించారు. పాఠకులను ఆలోచింప జేస్తున్నారు...ఆనందింపజేస్తున్నారు. ఇటువంటి కొన్ని కవితల్లో జీవిత విలువల్ని ఎలా కవిత్వీకరించి చెప్పారో ఈ వ్యాసంలో ప్రస్తావిస్తాను.

మగబిడ్డకావాలి అంటూ తల్లిదండ్రులు ఆశపడు తుంటారు. తల్లిదండ్రుల ప్రేమను గుర్తించక నేటి సంస్కృతికి అలవాటైన పిల్లలు, వారి తల్లిదండ్రులను ఎలా చూస్తున్నారో గమనిస్తున్నాం. కనీ,పెంచిన తల్లిమీదే చెయ్యెత్తడానికి వెనుకాడడంలేదు. అందుకే జనార్ధన్ మహర్షి అనే కవి-

"కడుపులో బిడ్డ తిరగబడ్డాడు
పెద్దాపరేషన్...
కోలుకోవడానికి
రెండేళ్ళు పట్టింది.
ఇరవైరెండేళ్ళ తర్వాత
మళ్ళీ తిరగబడ్డాడు
ఇంకేం కోలుకుంటుంది" అని నేటి పుత్రరత్నాలగూర్చి అంటాడు. కనడమంటే తల్లి మరో జన్మ ఎత్తినట్లు. కాన్పు సమయాన కడుపులో బిడ్డ అడ్డం తిరిగితే తల్లికీ, బిడ్డకూ ప్రమాదం గనుక డాక్టర్లు పెద్దాపరేషన్ చేసి ఇరువురిని రక్షిస్తారు. పెద్దాపరేషన్ కారణంగా ఆ తల్లి శారీరకంగా కోలుకోవడానికి రెండేళ్ళు పడుతుంది. పుట్టిన పిల్లవాడు పెరిగి ఇరవైరెండేళ్ళ వయసుకు ఎదిగాక తల్లిపై మళ్ళీ తిరగబడ్డాడు. ఇలా తిరగబడితే ఇక ఆతల్లి ఏం కోలు కుంటుంది. మానసికంగా తల్లి కోలుకోవడానికి తన జీవితకాలం కూడా సరిపోదు.నేటి విషసంస్కృతి నేర్పిన పాఠమే ఈ తిరుగుబాటు. 'తిరగబడ్డాడు'అనే పద ప్రయోగంతో గొప్పభావాన్ని కవి అభివ్యక్తీకరించాడు.

వయసు పైబడిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో చక్కగా చూసుకోవాల్సింది పోయి వృద్ధాశ్రమాల్లో పడేస్తు న్నారు. డాలర్లు విసిరేసి గొప్పగా పోషిస్తున్నట్లు చెప్పు కుంటున్నారు. అందుకే-

"అతనోగొప్ప దానశీలి
వృద్ధాశ్రమానికి

అమ్మా నాన్నల్ని
దానం చేశాడు" అని కవయిత్రి శ్రీమతి కోపూరి పుష్పాదేవి అంటుంది. వ్యంగ్యాన్ని అస్త్రంగా చేసుకుని అటువంటి సంతానానికి చురక వేసింది.

ప్రేమించే తల్లిదండ్రులు వృద్ధులయ్యాక, వారిపిల్లలు పెరిగి పెద్దయ్యాక వారి తల్లిదండ్రుల ఆకలిదప్పికలు - అవసరాలగూర్చి పట్టించుకుంటున్నారా? ఆలోచించండి! ఇటువంటి వారిని ఉద్దేశించే "కొడుకు" అనే తన కవితలో కవయిత్రి జి.తులసి-

"నిన్న
అన్నం తినడానికి
ఏడిపించాడు.
ఇప్పుడు
అన్నం పెట్టడానికి
ఏడిపిస్తున్నాడు" అని అంటుంది. తల్లి బిడ్డని చంక నెత్తుకుని అన్నపెడుతుంటే ముఖం అటూ ఇటూ తిప్పుతూ తల్లిని ముప్పతిప్పలు పెడుతున్నా ఆ తల్లి విసుగుచెందక "చందమామరావే...జాబిల్లి రావే.."అంటూ జాబిలిని చూపిస్తూ, మాయబుచ్చుతూ, గోరుముద్దలు తినిపిస్తూ బిడ్డ ఆకలిని తీరుస్తుంది. అదీ తల్లిప్రేమ! ఆ పిల్లవాడే పెరిగి పెద్దయ్యాక, పెళ్ళాయ్యాక, పెళ్ళాం వచ్చాక... ఆ పిల్లాడితల్లి ముసలిదయ్యాక, ఆమె శరీరంలో సత్తువపోయాక, అటువంటి తల్లిని తన పిల్లలా చూసుకోవాల్సిన ఆ కొడుకుకి తన తల్లి ఆకలి దప్పికలకు సంబంధించిన ఆలోచనే ఉండదు. వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ తన బాధ్యతగా ఎందరు భావిస్తున్నారు, ఆచరిస్తున్నారు?! ఇన్ని విషయాలను కవయిత్రి ఎంతోచక్కగా, గొప్పగా తక్కువ అక్షరాలలో కవిత్వంగా అభివ్యక్తీకరించింది. అల్పాక్షరాలలో అనల్పార్థమంటే ఇదే! అంటే తక్కువ అక్షరాలలో విస్తృతమైన భావాన్ని చెప్పడం.

అదేవిధంగా డా॥తలతోటి పృథ్వీరాజ్ అనే కవి

"కొరివిపెట్టును సుతులు
కూడుపెట్టు కూతులు
ఆడబిడ్డలె మేలు
ఓ కూనలమ్మ" అని కూనలమ్మ పదం ద్వారా కొడుకు కంటే కూతురేనయం. కంటే కూతురునే కనాలి అని ఉద్బోధించారు.

తల్లిదండ్రులలో తల్లికుండే ప్రాధాన్యత-ప్రత్యేకత తండ్రికి ఈదేశంలో ఇవ్వడంలేదనే చెప్పాలి. అందుకే విదేశీయులు మదర్స్‌డేనేగాక, ఫాదర్స్‌డేనుకూడా వేడుకగా జరుపుకుంటారు. తల్లిని ప్రేమకు ప్రతిరూపంగానూ, తండ్రిని బాధ్యతకు ప్రతీకగాను భారతీయులు భావిస్తుంటారు. కట్టుకున్న నేరానికి, కన్ననేరానికి మా పోషణబాధ్యత నీ అన్నట్లు భార్యా, బిడ్డలు భావిస్తున్నట్లు అనిపిస్తోంది. కుటుంబ సభ్యులపట్ల కనిపించే ప్రేమ తల్లిదైతే, కుటుంబ పెద్దగా బాధ్యతమాటు కనిపించని అపరిమిత ప్రేమ తండ్రిది.

బిడ్డలు ప్రయోజకులు కాకున్నా కడవరకు... ప్రాణాలున్నవరకు బిడ్డల ఆలనాపాలనలో అలుపూ సొలుపులేకుండా అవిశ్రాంతంగా పరితపించేవాడు తండ్రి అని చెప్పుకోవాలి. కనుకనే పనసకర్ల ప్రకాష్ అనే కవి-

"తొమ్మిది నెలలే...
మోసింది అమ్మ
పాతికేళ్ళుగా
మోస్తూనే ఉన్నాడింకా నాన్న"అని నానీగా అంటాడు.

చచ్చిపోయాక పున్నామ నరకాన్ని తప్పించి స్వర్గానికి చేర్చేవాడు కుమారుడని మనకున్న పిచ్చినమ్మకాలలో ఇదొకటి. కొడుకు పెరిగి పెద్దయ్యాకగాని తల్లిదండ్రుల అనుభవానికిరాదు కొడకంటే ఏమిటో...అందుకే- డా॥జి.వి. పూర్ణచంద్ అనే కవి "పున్నామ నరకం" అనే తన మినీ కవితలో-

"చచ్చాక వచ్చే
నరకం తప్పించుకోడానికి
కూతురొద్దని కోరుకుంటే-
పుట్టిన ఆ నా కొడుకు
బతికుండగానే
నరకం చూపిస్తున్నాడు" అని అంటాడు. చచ్చాక వచ్చే నరకం మాటేమిటోగాని బతికుండగానే కన్నవాళ్ళకు నరకం

చూపించే కొడుకులున్నారంటే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. అందుకే "ఆ నా కొడుకు' అనే పదంలో కొడుకు పట్ల ఏర్పడ్డ విముఖతను ధ్వన్యార్థంలో తీవ్రతను వ్యక్తీకరించడంకోసం కవి ఆ పదాన్ని ప్రయోగించాడు.

జీవితం అనిర్వచనీచమైనది. ఆర్థికంగా, సామాజికంగా, వైజ్ఞానికంగా ఎవరైనా...ఎలాంటివారైనా కొన్ని ఉద్వేగాలకు అతీతంగా జీవితాన్ని దాటుకొని వెళ్ళలేరు. జీవితసత్యాన్ని తెలుసుకున్నావారెవరూ కష్టాలకూ, కన్నీళ్ళకు వెరవరు. అందుకే కవి వసీరా "జీవితం" అనే తన కవితలో-

"కాళ్లు తడవకుండా
సముద్రాన్ని దాటగల మేథావియైనా
కళ్ళు తడవకుండా
జీవితాన్ని దాటలేడు" అని అంటాడు. కనుకనే జీవితంలో ఎన్ని ఎదురైనా ఎదుర్కునే మనోధైర్యం అలవర్చుకోవాలి. అందుకు లోకంలో అనేకమైనవి స్ఫూర్తిగా, ఆదర్శంగా ఉన్నాయి. ఒడ్డును ముద్దాడాలన్నట్లుగా, ఆకాశంలో జాబిలిని అందుకోవాలన్నట్లుగా కెరటం ప్రయత్నిస్తూ చతికిలపడుతుంది. పడిన ప్రతీసారి లేచి ప్రయత్నిస్తుందేగాని ప్రయత్నం విరమించుకోదు. విరామెరుగక పరిశ్రమిస్తుంది. ఈ సన్నివేశాన్ని చూసే కవి ఆచార్య భావన్ "కెరటం" అనే తన కవితలో-

"కెరటం నా ఆదర్శం
లేచి పడినందుకు కాదు
పడినా లేచినందుకు" అని అంటాడు. ప్రయత్నంలో పడినా లేచి మర్లా ప్రయత్నించే కెరటం తత్వాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి. జీవితంలో ఎదురయ్యే కొన్నింటికి నిరుత్సాహపడి,నిరాశ చెందకూడదు. మనిషి చైతన్యశీలి. మనిషి ప్రయత్నిస్తే సాధించలేనిది లేదనే ఆత్మవిశ్వాసంతో ప్రతి అపజయాన్ని ఎదుర్కునే ప్రయత్నం చేయాలి.

ఎంతచదివినా, ఎంతనేర్చినా, ఎన్ని అనుభవాని కొచ్చినా జీవితంలో ఊహించనివి అనేకం జరుగుతుంటాయి. రోజూ ఒక పాఠంలా...గుణపాఠంలా నేర్చుకుంటూనే ఉంటాం జీవితాంతం. అందుకే- మళ్ళ జ్యోతిర్మయి అనే కవయిత్రి-

"రోజు
ఒక పాఠం
జీవితకాలం
కోర్సు-" అని రెక్కలు కవితగా చెబుతుంది.

ప్రతి మనిషి జీవితంలో ఎన్నో నేర్చుకోవాలి. ఆత్మవిశ్వాసమే సరిపోదు; ఓర్పు,నేర్పుకూడా ఉండాలి. తాబేలు - కుందేలు కథ అందరికీ తెలిసిందే! ఆ కథనుంచి మనం తెలుసుకోవాల్సిన జీవిత సత్యాన్ని కవి నడిమెట్ల యెల్లప్ప-

"ఓపికతో
నెగ్గడం నేర్చుకో
ఓడింది కుందేలు
తాబేలుకాదు"అని నానీతో చెబుతాడు. కనుక అన్ని విషయాలలో మితిమీరిన ఆత్మవిశ్వాసం, గర్వం పనికిరాదు. ప్రతిదాని గర్వాన్ని అణిచే మరొకటి ఉందని గ్రహించినవాడే ఉత్తముడు. కనుకనే కవి దుగ్గిరాల సోమేశ్వరరావు

"చెదలంటదని
నిప్పుకు గర్వం
నీటి చుక్కపడిందా
మటుమాయం సర్వం" అని నానీతో ఉపదేశించాడు. అదేవిధంగా స్నేహానికి సంబంధించి కూడా ప్రాచీన, ఆధునిక కవిత్వంలో కూడా ఎందరో ఉత్తమోత్తమమైన పద్యాలు, కవితలు రాసిన కవులున్నారు. ఆదునిక లఘు కవితల్లో కూడా రాసిన కవులు అనేకులు. ఒక వ్యక్తియొక్క స్నేహం స్వార్థమైనదా, నిస్వార్థమైనదా అని తెలుసుకోడానికి మనకు తెలియజెప్పేవి కష్టాలుకూడా. అందుకే-

"నేను
కష్టాల్లో ఉన్నాను
ఈ దెబ్బతో
మిత్రులెవరో తేలిపోతుంది" అని కవి డా॥మసన చెన్నప్ప మానవ స్వభావాన్ని సిద్ధాంతీకరించాడు.

ఇలా అనేకమంది కవులు జీవిత విలువల్ని ఎంతో ప్రతిభావంతంగా చిన్న చిన్న కవితల్లో చాటి చెప్పారు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1) వెయ్యినూట పదహార్లు-మినీకవితా సంకలనం-డా॥ రావి రంగారావు
2) వెన్నముద్దలు-మినీ కవితలు-జనార్ధన్ మహర్షి
3) గోదారి కెరటాలు-నానీలు-పనసకర్ల ప్రకాష్
4) ముంబాయి ముత్యాలు -నానీలు- నడిమెట్ల యెల్లప్ప
5) హృదయనాదాలు నానీలు-దుగ్గిరాల సోమేశ్వరరావు
6) పుష్పరాగాలు నానీలు-కోపూరి పుష్పాదేవి.
7) డా॥తలతోటి పృథ్విరాజ్ కూనలమ్మ పదాలు (అముద్రితం)

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# గాంధీమార్గం - ఖద్దరు ధారణ

- డా॥. వై.వి.సి.హెచ్. లీల పద్మజ, విభాగాధిపతి, తెలుగు విభాగం, రాజ ఆర్.ఎస్.ఆర్.కె. రంగారావు కాలేజ్, బొబ్బిలి, విజయనగరం జిల్లా.

## గురుదేవుడు రవీంద్రుడు - గాంధీని మహాత్మానికి సంబోధించినందుకు ఇచ్చిన వివరణ :

ఎవరి ఆత్మ అయితే విముక్తి చెంది అన్ని ఆత్మల లోనూ దర్శనమిస్తుందో ఆ ఆత్మ కలిగిన వాడే మహాత్ముడు. గాంధీజీ కార్యకలాపాలు ఒక మతం కోసం కులం కోసం, ఒక జాతి కోసం కాదు సకల మానవాళి కోసం అందుకే అతడు మహాత్ముడు. వేళ్ళన్నీ వున్న బిగించిన పిడికిలి వంటివారు. శక్తులన్నీ వున్నా శాంతి, సత్యం, అహింసలతోనే పోరాడి గెలుపొందిన ధీశాలి.

భారతదేశ స్వాంతంత్ర్యోద్యమంలో ప్రధాన నేత గాంధీజీ నిర్మాణాత్మక కార్యక్రమాలతో ముడిపడివున్నవి రాట్నం, (ఖద్దరు), పతాకం వీటిని త్రిపుటిగా భావించారు. చేతిలో రాట్నం, నోటిలో రాట్నం పాటలు ఏ ఇంట చూసినా ఏ దేశాభిమాని నోటవిన్నా ఆనాడు వినిపించేవి ర్నాటం పాటలు ఖద్దరుధారణ గురించే. ఆంగ్లేయుల నెదిరించడానికి ముందుగా గాంధీ తన దేశంలోని లోపాలేమిటో తెలుసుకొని వాటిని సరిదిద్దుకొనే ప్రయత్నం చేశాడు. ఆ లోపాల్లో ప్రధానమైనవి. విదేశీ వస్త్రధారణ, మద్యపానం, అంటరాని తనం, కులమత విభేదాలు మొనవాటిగా గుర్తించాడు. అందుకే వాటిని సరిదిద్ద ప్రయత్నించాడు. లఘు పరిశ్రమలను, కుటీర పరిశ్రమలను మనం నష్టపరచుకొనే ప్రమాదం వచ్చింది. దాన్ని నివారించే నిర్మాణాత్మక కార్యక్రమాన్ని గాంధీ చేపట్టారు. ఆయన నిర్మాణాత్మక కార్యక్రమాలు 3 రకాలు - 1) ఖద్దరు (ఆర్థికం), 2) అస్పృశ్యతా నివారణం సాంఘికం, 3) మద్యపాన నిషేదం - నైతికం - అని భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు పేర్కొన్నారు. స్వాతంత్ర్యోద్యమ భావాల్ని దేశం నలుమూలకీ చేరేటట్లు చేసినవి రాట్నం, ఖద్దరు, జెండాలే అని చెప్పవచ్చు.

ఒక దేశం సాంఘికంగా గాని మత విషయకంగా గాని, రాజకీయంగా గాని అలజడి పాలైనపుడు మనుష్యుల హృదయాలు ఒక విధంగా కలత చెందుతాయి. ఆ కలత చిత్రకారుల చిత్రాకారుల చిత్రాలలోనూ, కవుల గ్రంథాల లోనూ ప్రతిబింబిస్తూ వుంటుంది అన్న కురుగంటి మాటలు కవికి సంఘానికివున్న అనుబంధాన్ని తెలియ చేస్తున్నాయి. కనుకనే ఆనాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులకనుకూలంగా స్పందించిన నేతలకు కవులు కవయిత్రులూ కూడా తమ హృదయాలను జత కలిపి భావాంబర వీధిలో వినుతించారు, విమర్శించారు.

రాట్నం, పతాకం, ఖద్దరు ఉద్యమాన్ని నడిపించిన సాధనాలు. రాట్నం పై నూలు వడకడం, ఖద్దరు వస్త్రాల్ని ధరించడం, జాతీయ పతాకాన్ని పట్టడం, స్వాతంత్ర్య సమరయోధుల నిత్యకృత్యాలు. రాట్నంలోని రకాలను శ్రీ బారు గోవిందరావు గారు స్వాతంత్ర్య సమరయోధులు చెప్పారు.

గాంధీ స్వయంగా రాట్నం తిప్పగా ఆయన పై పూజ్యభావంతో ఎందరో ఆయనను అనుసరించారు. భారతనారి - శ్రీమతి పైడిమర్రి సీతాదేవి గృహలక్ష్మీ 1931 నవంబర్‌లో ఆమె ఇట్లా ఈ భావాన్ని వ్యక్తీకరించారు.

"ఈదరిద్రనారాయణులే విధాన
గోట్లకొలదిగ గూడును గుడ్డలేక
పొందు వంతపు నీవెంతో కుందికుంది
రాట్నమొసగితి తన్ని వారణముగాను" అటూ ఆమె గాంధీగారి అంతర్యాన్ని ఆవిష్కరించారు. గాంధీ గారి పై భక్తి అంటే వాళ్ళు రాట్నం తిప్పడమే అనుకొన్నారు. కనుక మనం గాంధీగారిని స్మరించుకోవడం అంటే రాట్నం ప్రస్తుతి, ఖద్దరు ధారణ అనేవి దారులే అవుతాయి.

ర్నాటం వడుకుతూ స్త్రీల నోటి వెంట వచ్చిన రాట్నం గురించి ఎక్కువగా పాటల రూపంలోనే వున్నాయి.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

అందునా కొన్ని మంగళహారతి పాటలుగా కూడా వున్నాయి. ఖద్దరు తిరిగిన చోట కరువు వుండదనే నమ్మకం ప్రజలలో గాంధీ తీసుకువచ్చారు. ఆర్థికంగా ప్రజలు బలపడేటట్లు చేశారు. ఖాదీ పరిశ్రమ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన తీరులో చీరలు నేసే మన జాతి జనులు వారి పని తనానికి తగిన ఆదరణ లేని స్థితిలో చతికిల బడ్డినారు. గాంధీజీ వారికి చేయుతనిచ్చి ఖద్దరు ధారణ గూర్చిన అవగాహన కల్పించడంతో దేవుణ్ణి పూజించడానికి పువ్వులు ఎలాగో గాంధీ గారి బాట నడవ డానికి ఖద్దరుధారణ అలాటిదని నాడు ఎందరో శ్రీమంతులు కూడ భావించారు. అందులో తన భర్తతో విదేశాలకు వెళ్ళడం కూడా మానుకొని తన ఒంటి పైన గలను కూడా స్వదేశీ ఉద్యమానికిచ్చేసి ఖద్దరును ధరించిన మాగంటి అన్నపూర్ణమ్మగారు గుర్తుంచుకోదగిన స్త్రీ మూర్తి ఆమె. త్యాగానికి, ఉన్నతత్వానికి నిలువెత్తు రూపం ఆమె. ఆమెను కూడ కవయిత్రులు కవిత్వీకరిం చారు. ద్రోణంరాజు లక్ష్మీ బాయమ్మగారు "శ్రీదేవి అన్న పూర్ణా స్మృతి" - అనే పెద్ద ఖండికలో "కనుగొన" దేశ సేవకయి గాంధి మహాత్ముడు ఖాది దీక్ష పై కొనవడి కార్యరంగమునకున్ దిగెనెన్న డొనాడె భర్తతో డనమెరికాకు బోవుట చటాలున మాని మహాత్మునాజ్ఞ పై కొనిదిగి కార్య భూమికిన కుంఠిత సేవయొ నర్చి మించితా" అని కొనియాడారు. ఇలా స్త్రీ లోకానికి తలమానికలుగా ఈమె దువ్వూరి సుబ్బమ్మ గారి లాంటి వారెందరో ఆనాడు వున్నారు.

రాట్న మహిమ పేరిట కృష్ణాపత్రికలో చెల్లెలా అన్న సంబోధనలతో వచ్చిన కవిత్వంలో రాట్న మనేది కోర్కెలను తీర్చే కామధేనువు వంటిదని కవయిత్రి భావించారు.

1932 సెప్టెంబరు గృహలక్ష్మీలో రాటము వలదనుచు గాంధి రయమున బలికెన్ అని సమస్యా పూరణం ఇస్తే దానికి అప్పట్లో సుమారు 34 మంది కవయిత్రులు సమస్యా పూరణం చేశారు. ఇది పతాక స్థాయిగా చెప్ప వచ్చు. ఉదా ఒక పద్యం :

నేటి వరకు రాటములే
మోటగు వస్త్రములె దేశ మోక్షకరములై
కాటకము బాపవే ఆ
రాటము వలదనుచు గాంధిరయమున బలికెన్.

శ్రీమతి కల్పటపు రుక్మిణిమ్మగారు రాట్నం పాటలు శీర్షికలతో

రాటమొడకలేను ఓ అత్తగారు
రాణంచు చీరనే కట్టగాను కట్టుతాను
రాటము ఒడకరమ్మ ఓ అమ్మలారా
గాంధీకి జయమనుచు దారము తీయరే
ఏకులరాటమ్మా ఇంటికందము
మహాత్మాగాంధీ ప్రజల కందమ్మ

1931 నుండి 1933 వరకు గృహలక్ష్మీ పత్రికకు శ్రీమతి ఇనగంటి రత్నమ్మగారు తాను సేకరించారు. అందులో కూడా సందేశాలు, నీతులు మొనవి వున్నాయి. అదొక ప్రత్యేక వ్యాసం అవుతుంది. ఉదా॥ మాత్రం ఒక పద్యం

పాపకర్ముని చేను యేమిమి బండు
పటుగురాళ్ళు బండు పల్లేరు బండు
రాటాలమోతమ్మ రవ్వల మోత
కనకసిరి గొల్లారి కవ్వాల మోత.

## కనుపర్తి వరలక్ష్మమ్మ గారి మంగళ హారతి పాటలో ర్నాటం, ఖద్దరు ప్రశస్తి :

ఆనాడు మహిళలు తరచుగా పేరంటాలలో కలిసే వారు గనుక ఆ సందర్భంలో వాళ్ళు పాడుకొనే మంగళ హారతి పాటల ద్వారా దీని వ్యాప్తి జరగడం సులభం అని కవయిత్రి దీన్ని ఎంచుకొని వుండవచ్చు. శ్రీమతి కనుపర్తి వరలక్ష్మీ గారి 'రాట్న ప్రశస్తి' అనే శీర్షికతో వ్రాసిన మంగళహారతి పాటలో రాట్నాన్ని భాగ్యలక్ష్మిగా, కదురుతల్లిగా ఆదిశక్తిగా, నూలు తల్లిగా వరప్రదాయినిగా దేశ సంపదను పెంపొందించే వరప్రదాయినిగా ఆమె కీర్తించారు. ఉద్యమానికి మాత్రమే సాధనం కాకుండా సామాజిక, ఆర్థిక స్థితి గతుల్ని మెరుగుపరచే మూల స్థంభంగా చెప్పిన తీరు చూడండి. 'రాట్నలక్ష్మికి మంగ

ళంమా రాజ్యలక్ష్మికి మంగళం పాలబోలిన నూలు నొసగే భాగ్యలక్ష్మికి మంగళం.

సిరులు తొలకెడు దివ్య వేళల
కఱవు ఱిమెడి కటిక వేళల
కన్న బిడ్డల కాచిప్రోచినకదురు తల్లికి మంగళం
దండి భారత భాగ్య సంపద పిండి
పీల్చిన యంత్రరక్కసి
మదమడంచగనుదయ మందిన ఆదిశక్తికి మంగళం.
ప్రతీచ్య దేశ ప్రజలు వారలు పారుటాకులు గట్టునాటికె
మేలి వలువల చెలువు జూపిన నూలు తల్లికి మంగళం.
జారిపోయిన దేశగరిమము మీరిపోయిన దేశ సంపద
తిరిగి చేర్పగతరలి వచ్చిన వరప్రదాయికి మంగళం

అంటు చెప్పిన ఈమెలోని దేశభక్తి గరిమ ఎంతటిది కాకపోతే ఈ భావజాలం, ఈ పదజాలం వస్తుంది చెప్పండి?

ఈమె తరువాత ఎక్కువ పాటల్ని రాసి ఆనాడు కొన్ని పాటల్ని సేకరించి తమ సంపాదకత్వంలో గృహలక్ష్మి పత్రికలో ప్రచురించారు శ్రీమతి ఇనుగంటి రత్నమ్మ గారు, శ్రీమతి కల్పటపు రుక్మిణమ్మగారు, శ్రీమతి చింతామణి భట్టు పద్మావతి మొదలగు కవయిత్రులు రాట్నపు పాటలు వెలయించారు.

శ్రీమతి పైడమర్రి సీతాదేవిగారు భారతనారి అనే శీర్షికతో రాసిన కవిత్వంలో రాట్నలక్ష్మిని సేవించమని ఇలా చెప్పారు.

దీనయైయేడ్చుచున్నది దేశమాత
కానరోయమ్మ యాపెదే కష్టచరిత
రాట్నలక్ష్మిని సేవించి రమణనొప్పి
ముదము గూర్చుడుయామెకు ముదితలార !

శ్రీమతి యెర్నేని శేషమాంబగారు

ఖద్దరే పరమార్ధ ఘన మార్గంబని నీకు గాంధిదేవుడు బల్కెగద
మనసా ! కాయ కష్టము కోర్చి, ఘనమును గోరక !
కరుణతో బాదలన్ గను మనసా

అంటూ గాంధీ గారిని దేవుడిగా అభివర్ణిస్తూ ఆయన మాటను శిరసా వహించమనెను.

శ్రీమతి తల్లా ప్రగడ విశ్వసుందరమ్మ గారు ఖద్దరు ధారణను గూర్చి

ఖద్దరెంతో ప్రీతిగట్టుమా
మొద్దు దనుచు మూతి ముడవక .......
కన్నతల్లి సేవజేయుమా

అంటూ హెచ్చరించారు.

ఖద్దరును ధఱించడమంటే కన్నతల్లి వంటి భారత భూమిని సేవించడమనే ఈమె భావంహృద్యంగా వుంది.

ఉద్బోధ అనే కవితలో ఖద్దరును మాత్రమే ధరించమనే ప్రబోధం

నీ రమణీయ జీవిత వినిర్మల భోగము లెల్ల వీడగా
గోరగ లేదు ప్రాణముల కుంఠిత యుద్ధమునన్ త్యజింపగా
గోరగ లేదు బీదలకు గూడొస గంగ జాలు ఖద్దరున్
ధారణ మింతజేయు మన దర్కము జేసెదవేల సోదరీ!,

అంటూ ఖద్దరు ధారణ కార్యక్రమ విధింపు బీదలకు జీవనోపాధి కల్గించే సాధనమని చెప్పారు. పైగా ఇది మహాత్ముని ఆనతిగా గైకొనమంటూ

అంత మహాత్ముడా వయసునందటు గ్రీష్మము నందు నాంధ్రదే
శాంతము దాక నీకు నయి యట్టి ప్రచారము చేసిపోయెనీ
కెంతటి రాతి గుండె కలదె ధరియింపవు ఖద్దరెప్డునీ
వింత తెరంగుమాని కనవే కరణీయుము వేగ సోదరీ!

అన్నారీ విడ

రాట్న ఆవశ్యకతను చెబుతూ ఈమె

దిన దినమున దరిద్ర దశ తీవ్రత దాల్చుచు దేశ నాశ భీ
తిని జనియింప జేసెడిని తీరిక గల్గిన వేళలందుజు
మ్మని మధుర స్వరంబులొలయన్ భవదీయ కరాంగుళీ విచా
లనమున శోభలొల్కగను రాట్నము త్రిపగరాదె సోదరీ అన్నారు.

స్వదేశీ భావంతో ప్రజలు ఉద్యమోన్ముఖులు కావడానికి ఉద్యమంలో భాగస్వాములు కావడానికి రాట్నం సహాయంతో వడికిన నూలునే వస్త్రంగా ధరించడంలో విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్దేశం నెరవేరింది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాంధీజీ పిలుపు నందుకొని నేరుగా ప్రత్యక్షంగా ఉద్యమంలో పాల్గొని కారాగారాలకు వెళ్ళిన వారి విలువ ఎంతో అంతే విలువ తాము గాంధీ గారి పిలుపు నందుకొని ఇళ్ళల్లోనే రాట్నం పై ఖద్దరు వస్త్రాల్ని తయారు చేసి తాము ధరించి, ఇతరుకు ఇచ్చిన వారికీ దక్కుతుంది.

ఖద్దరు ధరించమని చెప్పడంలో కూడా గాంధీ ఒక ధర్మాన్ని అనుసరించారు. ప్రతి భారతీయుడు ప్రతి కాంగ్రెస్‌వాది ఖాదీ వ్యాప్తికై కృషి చేయవలెనని నేను కోరుచున్నాను. ఖాదీ ఆర్థిక స్వాతంత్ర్యమునకు, సాంఘిక సమానత్వమునకు చిహ్నము'' అని ఆయనే స్వయంగా చెప్పారు. ఖద్దరుధారణ వల్ల తరతమ భేదంలేని సమభావాన్ని పొందాతనం, ఆత్మీయతా భావాల్ని, స్వేచ్ఛాను భూతిని వారు భావించారు.

దాస్యాంధకారంబుతఱిమి వేయుటకునై
ఖద్దరు దీక్షతో గట్టరమ్మ అంటూ
ఒక సీస పద్యంలో శ్రీమతి దేవులపల్లి సత్యవతమ్మ పేర్కొన్నారు.

ఇలా ఎందరో ఖద్దరు ధారణ పై సాహిత్యాన్ని, కవిత్వాన్ని వెలయించారు. పేరు పేరునా వారందరికీ నమస్సులు అందులో పద్యాలు, గేయాలు, పాటలు, కీర్తనలు వంటి ఎన్నో ప్రక్రియలలో ఖద్దరును కదా వస్తువుగా చెప్పారు. మనం ఇక్కడ కొంతవరకే స్థాలీపులాక న్యాయంగా చెప్పకున్నాం. ఒక్క మాటలో చెప్పాలంటే గాంధేయ కవిత్వం అంటే ఖద్దరు, రాట్నం మొ॥నవి అని వార్యం. గాంధీ మహాత్ముడు అనే మహోదధిలో సంగమించిన నదులు ఆనాటి ఉద్యమ వస్తువులు, సంఘటనలు. కనుక వాటిని కీర్తించడం పరోక్షంగా గాంధీని కీర్తించడమే అవుతుంది. స్వాతంత్ర్యోద్యమ అనే నాణానికి బాపూజీ బొమ్మ అయితే ఇతర నాయకులు, సంఘటనలు, వస్తువులూ బొరుసులౌతాయి. నాణానికి రెండూ అవసరమేగా....

॥ శుభం భూయాత్ ॥

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# జానపద కళలు - మాతంగి సాంప్రదాయం

– పి. ఉషారాణి, అధ్యాపకురాలు, తెలుగు విభాగం, యస్.జి.వి.ఓరియంటల్ కళాశాల, తిమ్మసముద్రం.

ఆంధ్రదేశపు గ్రామీణ ప్రాంతాల్లో ఆనాదిగా వస్తున్న సాంప్రదాయం మాతంగి సాంప్రదాయం. ఇది సాంఘ దురాచారాల్లో ఒకటైనా కొందరు దీనిని పవిత్ర భావంగా భావించి అనేకమైన గ్రామదేవతలకు కొలుపులలో పాల్గొంటూ ఆ కొలుపులకు ప్రధాన భూమికగా నిలుస్తు న్నారు.

ఆంధ్రరాష్ట్రంలో మాతంగి, జోగిని, దేవదాసి, బసివి అనేవి అతి ప్రాచీనకాలం నుండి కనబడుతున్నవి. ఇది ఒక దురాచారమైన వ్యవస్థ. దానిని శ్రీనాథుడు క్రీడాభి రామము నందు ఇలా పేర్కొన్నాడు...

అకలంకస్థితిగోరి కొల్చెదరు బ్రహ్మానందభావంబునన్
సకలానందమయైన మాతయగుచున్ సంతోష చిత్తంబునన్
తకదుందుమ్ములు తాళముల్, జవనికల్ తందా నలమ్మయ్యకు
న్నేకవీరమ్మకు మాహురమ్మకు నధోహ్రీంకార మధ్యాత్మకున్ - 132

ప్రాచీనకాలం నుండి వైదిక దేవాలయాల్లో దేవదాసి వ్యవస్థ ఉండేది. ఈ దేవాలయాల్లో ప్రతిరోజు నాట్యం చేసేది వాళ్ళే. అక్కడ ఉన్న పూజారులకు సంతోషాన్ని కలిగించుటం వీళ్ళ ప్రధాన కర్తవ్యం. అంటే పూజారులు వారితో కామవాంఛ తీర్చుకొనేవాళ్ళు.

ఈ దేవదాసీలు దేవాలయ ధర్మకర్తలుగా ఉన్న జమీందారుల పోషణలో ఉండేవారు. వారితో కూడా శారీరక సంబంధం కలిగి ఉండేవాళ్ళు ఈ దేవదాసీలు. మరికొందరు జమీందార్లు వీళ్ల తమ ఉంపుడుగత్తెలుగా ఉంచుకొనేవాళ్ళు. ఈ ధర్మకర్తలు వారికి కన్నెరికం చేసి ఆనాటి నుండి ఆ గుడికి అంకితం అయ్యేవారు.

అదే పద్ధతిలో శైవ సాంప్రదాయంలో బసివిరాంఢ్రని, వైష్ణవ సాంప్రదాయంలో దేవదాసీలని గ్రామ దేవతల వ్యవస్థలో జోగినిలు, మాతంగీలని పిలిచేవారు. జోగి నులు, మాతంగీలుగా మార్చబడు బాలికలందరూ దళితులలోని మాదిగ కులం నుండి వచ్చినవారే. ఈ మాదిగ కులం వాళ్ళు తమ బాలికలను మాతంగిగా మార్చడం ఆ కుటుంబం అదృష్టంగా భావిస్తారు. ఈ దళిత జాతిలో కొందరు తమ మొదటి సంతానాన్ని గ్రామ దేవతకు అంకితమిస్తారు. అలా అంకితం ఇవ్వబడిన వాళ్ళందరూ మాతంగులు గానే పరిగణించబడతారు. మాతంగి వ్యవస్థలో పెళ్ళిళ్ళు ఉండవు. పెళ్లి వీరికి నిషేదం. మాదిగ కుటుంబాల్లో ఈ వ్యవస్థ వంశపారం పర్యంగా వస్తుంది. తమ సంతానంలోని మొదటి ఆడ బిడ్డను ఇలా మాతంగిగా మారుస్తారు.

### మాతంగిగా మార్చుట :

దళిత జాతిలోని ఒక వర్గమైన మాదిగ కులం నుండి తీసుకురాబడిన బాలికను ఏదో ఒక గ్రామదేవతకు అంకితమిస్తారు. గ్రామంలోని ఒక వ్యక్తి చేత ఆ బాలికకు కన్నెరికం చేయించి తాళి కట్టిస్తారు. దానిని 'మాతా కళ్యాణం' అంటారు. ఆ రాత్రికి ఆ బాలిక ఆ వ్యక్తికి శారీ రక సౌఖ్యాన్ని అందించాలి. ఆ తర్వాత ఆ గ్రామంలో ఏ పెద్ద పిలిచినా కాదనకుండా వారికి తన శారీరక సౌఖ్యాన్ని అందించాలి. మాతకళ్యాణం జరిగిన తర్వాత కొలుపుల్లో ఏమేమి చేయాలో ఆ కార్యక్రమాలన్నింటిని నేర్పుతారు. ఆ గ్రామంలో జరిగే గ్రామదేవత కొలుపుల్లో తప్పనిసరిగా ఈ మాతంగి పాల్గొనాలి. ఆ గ్రామమందే కాక సమీప గ్రామాల్లో జరిగే గ్రామదేవత కొలుపుల్లో కూడా ఈ మాతంగిని తీసుకెళ్ళతారు.

కొలుపులు ఒకరోజు, మూడు రోజులు, ఐదు రోజు లుగా నిర్వహిస్తారు. కొలుపులు జరుగు రోజులను బట్టి వీరికి డబ్బులు చెల్లిస్తారు. కొలుపులకు వెళ్ళునపుడు అక్కడ కొలుపులు నిర్వహించు వ్యక్తికి కూడా ఆ మాతంగి శారీరక సుఖాన్ని అందించి ఆనందాన్ని కలిగించాలి.

## మాతంగుల ఆచారవ్యవహారాలు :

దళిత జాతిలో మాదిగ కులంలో కొన్ని కుటుంబాల్లో అనాదిగా వస్తున్న ఈ వ్యవస్థను వంశపారంపర్య ఆచారంగా భావిస్తూ తమ సంతానం మొదటి ఆడ సంతానాన్ని చిన్న వయసులోనే మాతంగిగా మారుస్తారు. మాతంగి గా మార్చిన రోజున గ్రామ పెద్ద ఏదో ఒక గ్రామదేవత ఎదుట తాళి కట్టి మాత కళ్యాణం చేస్తారు. ఆనాటి నుండి ఆ గ్రామదేవతకు అంకిత మవుతుంది. వీరికి పెళ్ళి నిషేధమైనా, పిల్లలను కనవచ్చు. వీరిని 'మాతా పిల్లలని', 'దేవుని బిడ్డ'లని పిలుస్తారు. మాతంగులు కొలువులో మాత్రమే పాల్గొంటారు. వీళ్ళు కొలుపుల్లో పాల్గొని ప్రారంభించడానికి 'మాత మైలు' జరపటం అంటారు.

ఒకరోజు కొలుపు ఐతే సాయంత్రం వీళ్ళ చిందు ప్రారంభమవుతుంది. మూడురోజుల కొలువు ఐతే రెండవరోజు నుండే మాతంగి ఉంటుంది. ఐదు రోజుల కొలుపులైతే రెండవరోజు నుండే అక్కడ ఉండి దేవతా కార్యక్రమాలు నిర్వహిస్తారు. కొలుపు ప్రారంభానికి ముందు మాతంగి గ్రామ పెద్దల ఇళ్ళకు వెళ్ళిరావాలి. వెళ్ళినప్పుడు పెద్దలు ఎవరైనా కోరితే కాదనకుండా ఆ రాత్రికి వారికి శారీరక సౌఖ్యాన్ని అందించాలి.

సాధారణంగా గ్రామాల్లో పోలేరమ్మ, అంకమ్మ, ఎల్లమ్మ, గంగమ్మ కొలుపులు జరుపుతారు. ఈ కొలుపులను గూర్చి తిక్కన మహాకవి భారతం నందలి మౌసలి పర్వంలో ఇలా పేర్కొంటాడు -

జాతర సేయగ వలయుసర్వజనంబులు నంబురాశికిన్
బ్రాతిగ భక్తి తోడనని బంధువుకెల్లను చెప్పి కోట వి
ఖ్యాతగ నప్డుచాటుటకు నర్హుని బాచిన ఘంటికాశ్వనో
పేతముకాక వాడెలిమి పెద్ద వలుంగున చాటే నెల్లడన్

(మౌసలి పర్వం 1- 4)

16వ శతాబ్దానికి చెందిన తెనాలి రామకృష్ణుడు కూడా ఆనాటి గ్రామసీమల్లో నిర్వహించు గ్రామదేవతల జాతరలను గూర్చి తన పాండురంగమహాత్మ్యములో -

క॥ అత్తరి దన్నగరీపతి, జాతర సాటించె బశు
విసరమనితర సా
ధ్యాతత వాతామయని, ర్ఘాతాహతి దూలగాలి
గంగలకెల్లన్

(పాండురంగ మహాత్మ్యము ; 3-73)

గ్రామాల్లో ఏదైనా ఆరిష్టం జరిగినప్పుడు, వర్షాలు లేనప్పుడు, మశూచి, కలరా వంటి వ్యాధులు సోకినపుడు కొలుపులు చేసేందుకు ప్రజలు ముందుకు వస్తారు. సాధారణంగా ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో ఈ కొలుపులు చేస్తారు. ఈ కొలుపుల్లో తాగడం, చిందులు వేయడం, పరిపాడిగా ఉంటుంది. బ్రాంది, సారా, కల్లు త్రాగి అక్కడి వారిని కాలితో తన్నుతూ, వారిపై ఉమ్మి వేస్తే వారికి శుభం జరుగుతుందని వారి నమ్మకం, మాతంగి చేత తన్నించుకోవడానికి, ఉమ్మి వేయించుకోవడానికి పోటీలు పడుతుంటారు.

పోలేరమ్మ జాతర్లలో కొన్నిచోట్ల సిడిమాను ఊరేగిస్తారు. సిడిమానుకు ముందు మాతంగి నడుస్తూ వుంటే మిగిలిన వారు ఎగురుతుంటారు. దీన్ని తెనాలి రామకృష్ణుడు తన పాండురంగమహాత్మ్యములో ఇలా -

అంబోధరము క్రిందనసియాడు నైరావతియు దోలె
సిడిప్రేలె దెరవయోర్తు
బెందమ్మి కొలన రంజిల్లు నంచయు బోలె నిప్పుటేట
జరించె నెలత యోర్తు
తొలినంజయొఓడ వర్తిలు జక్కవయు బోలె
నీగెబందిరిగుండ నింతియోర్తు
జలనీలిపై నెక్కు కలువ మొుగ్గయుబోలె
ననటాకునర్తించె నతివ యోర్తు

తే॥ కాంత యొక్కర్తు మూపునంగండలిచ్చెమారుగాలిచ్చె
నొకసుధామధురవాణి
లలన యొక్కుర్తు నోరితాళంబు లిచ్చెశక్తి జాతర
సద్భక్తి శక్తులెసగ

(పాండురంగ మహాత్మ్యము ; 3-77)

జాతరలో ఒకరు ముద్రగడ్డ పట్టుకొని ముందు వెళ్తుంటే కొంతమంది వేపమండలు కట్టుకొని మాతంగితో కలసి

ఎగురుతుంటారు. మాతంగి చేతిలో వేపమండలు పట్టుకొని చిందులు వేస్తుంది.

**కొలుపులు విధానం :**

కొలుపులకు ముందు రోజు ధర్మకర్తల ఇంటి నుండి ముద్రగడ్డ ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారి గుడికి చేరుస్తారు. కొలుపు ముందుగా కొమ్ముునాదంతో ప్రారంభ మవుతుంది. కొమ్ముువారు కూడా ప్రత్యేకంగా ఉండారు. మొదటి రోజు సద్ది పెడతారు. రెండవరోజు కుభం వండిపోస్తారు. మూడవరోజు మాతంగితో కలిసి ముందుగా జమ్మిచెట్టు వద్దకు వెళ్ళి వచ్చి ఊరేగింపుగా బయల్దేరతారు. ఊరేగింపులో ముందుగా ముద్రగడ్డ పట్టుకొని వెళ్తూ ఉంటే కొందరు వీర త్రాళ్లతో కొట్టు కొనుచూ ప్రదర్శనలిస్తారు. బవినీడి వారు జమిలిక, పంబ వాయిస్తూ వుంటే మాతంగి ఆ మోతకు తగినట్లుగా చిందులు వేస్తుంది. బవినీడు వారు మధ్యలో అమ్మవారి కథ చెప్తుంటారు. గుడి దగ్గరికి వెళ్ళి ముగ్గువేసి అమ్మవారి కథను చెప్తారు. వేకువ జాముకు ఊరేగింపు గుడి దగ్గరకి వస్తుంది. అప్పుడు అమ్మవారికి బలులు ఇచ్చి పొంగలి పెట్టుకుంటారు.

**మాతంగి ధరించే వస్తువులు :**

1. బుట్ట
2. జోగిని కర్ర
3. గవ్వలదండ
4. గజ్జెలు

దేవర ఇంటి నుండి తెచ్చిన గవ్వలు, శిలలు మాతంగి బుట్టలో వేస్తారు. ఈ రీతిగా మాతంగి కొలుపుల్లో పాల్గొనుట వల్ల ఆ గ్రామానికి శుభం జరుగుతుందని గ్రామస్థుల నమ్మకం.

సాధారణంగా గ్రామాల్లో ఈ కొలుపులు వెనుకబడిన కులాల వాళ్లు నిర్వహిస్తుంటారు. గ్రామ దేవతల పూజా కార్యక్రమాల్లో కుమ్మరులు ప్రముఖ పాత్ర వహిస్తారు. కొలుపులు నిర్వహించే వాళ్లు - గొల్లలు, వడ్డెరలు, రజ కులు. గొల్లలు ఈ కొలుపుల్లో వీరతాళ్ళతో కొట్టుకుంటూ ప్రదర్శనలిస్తారు. కొలుపుల సాయంత్రపు వేళలో బవినీడు వారు అమ్మవారి కథను ఎంతో నేర్పుతో చెప్తారు. కథ కుడు చేతిలో కత్తి, డాలు ధరించి కథ చెప్తుండగా కొందరు పూనకంవచ్చి ఎగురుతుంటారు. వాళ్ళపై పసుపు నీళ్ళ చల్లి సాంబ్రాణి పొగ వేస్తారు. ఈ విధంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ కొలుపులు నిర్వహిస్తారు.

ఇది అశ్లీల నృత్యమని, సాంఘీక దురాచారమని, నీచమైన వ్యవస్థని తెలిసి కూడా గ్రామీణులు ఈ మాతంగి చిందులకు ఎక్కువగా ప్రాముఖ్యాన్ని ఇస్తారు. భర్త లేకుండా పిల్లల్ని కనే ఈ సంస్కృతిని నిషేదించాలి. ప్రభుత్వం ఈ మాతంగి వ్యవస్థను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినా ఇంకా ఈ దురాచారం గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతూనే వుంది.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# సాంస్కృతిక వైతాళికుడు - కందుకూరి

- ఆచార్య ఎం. రామనాథంనాయుడు, తెలుగు విభాగం, కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, బెంగుళూరు.

ఆధునికాంధ్ర సాహిత్య వైతాళికులలో అగ్రశ్రేణికి చెందినవాడు కందుకూరి వీరేశలింగం పంతులు గారు. సాంస్కృతిక వికాసానికి, సారస్వత విస్తృతికి సంకేతంగా నిలిచిన నవ్యాంధ్ర సాహిత్య యుగకర్త. ప్రజల్లో సాంఘికంగా, సాహిత్యంగా వినూతన జాగృతిని కలిగించిన మొదటి వైతాళికుడు. తెలుగునాట సంఘ సంస్కరణకు సాహిత్యమనే ఆయుధాన్ని ప్రయోగించి సారస్వత లోకాన్ని మేల్కొలిపి ఆధునికాంధ్ర సాహిత్యాన్ని నూతన మార్గంలో నడిపించిన మూల పురుషుడు.

తొలి తరానికి చెందిన ఆధునిక యుగకర్తలలో పంతులు గారికి ఎంతో ప్రత్యేకత వుంది. సాంఘిక విప్లవానికి సాహిత్యాన్ని ఆధారం చేసుకున్నాడు. సాహిత్య విప్లవానికి సాంఘిక విప్లవాన్ని నేపథ్యంగా చేసుకున్నాడు. సమాజానికి సాహిత్యాన్ని, సాహిత్యానికి సమాజాన్ని పరస్పర ఆధారితాలుగా చేసి వాటి వికాసానికి విశేష కృషి చేశాడు. అనేక పత్రికలను నిర్వహించి పత్రికా రంగంలో కూడా చెరగని ముద్ర వేశాడు. స్త్రీ విద్య, వితంతు పునర్వివాహం మొదలైన అంశాల ద్వారా స్త్రీ జనోద్ధరణకు అమితమైన సేవ చేశాడు. కుల, మత, వివక్ష లేకుండా అన్ని కులాల వారిని, అన్ని మతాల వారిని ఆదరించిన మానవతావాది. తన యావదాస్తిని, యావత్ శక్తిని సంఘ సంస్కరణకు వినియోగించిన మహోన్నత వ్యక్తి. అతను సామాన్య వ్యక్తి కాదు. ఒక మహా సంస్థ.

సంఘంలోని దురాచారాలను ఖండించుటలోనూ, దోషమని తోచిన దానికి నిర్భయరా ప్రశ్నించడంలో పంతులుగారి ధైర్యం అనన్యసామాన్యమైంది. పలుకుబడి గల పెద్దల దుశ్చర్యలను ఎండగట్టే ప్రహసనాలను నిర్భయంగా, నిర్మొహమాటంగా రచించాడు. సంఘ సంస్కరణాన్ని దృష్టిలో పెట్టుకుని వివేకవర్ధిని, చింతామణి, సతీహితబోధిని, సత్యసంవర్ధని, సత్యవాది మొదలైన పత్రికలను స్థాపించి నడిపాడు. ఇవి తెలుగు భాషాభివృద్ధికి, సంఘ సంస్కరణాభిలాషకు ఎంతో తోడ్పడ్డాయి.

### మూఢ నమ్మకాలు :

పంతులు గారి కాలంలో మూఢ నమ్మకాలను ప్రబలంగా పాటించేవారు. ప్రయాణానికి మూహూర్తం, ఇల్లు కట్టడానికి మంచి దినం, క్షౌరం చేయించుకోవడానికి మంచివారం, చివరకు ఎవరింట ఏ వస్తువుపోయినా, ఏ పశువు తప్పిపోయినా సిద్ధాంతి దగ్గర శాస్త్రం చూపించే వారు.

పంతులుగారి ఇంటి ఆవరణలోని అరటిచెట్టుకు అరటిగెల మధ్యలో చొచ్చుకు వచ్చింది. అలాగే తన ఇంటి దూలానికి తేనెపట్టు పట్టింది. ఇవి అరిష్టం అని బంధుమిత్రులు సలహాలిచ్చారు. కొత్తగా ఉద్యోగంలో చేరడానికి మంచిరోజు, సమయం చూసుకోమన్నారు. ఆయన దృష్టిలో అన్నీ మంచి రోజులే. అందుకని తాను అమావాస్య రోజున ఉద్యోగంలో చేరి మూఢ నమ్మకాలను నమ్మవద్దని తెలియజెప్పాడు. అలాగే సుముహూర్తాలు పెట్టుకుని, జన్మపత్రాల ప్రకారం దీర్ఘాయుస్సుగల వరులను పెట్టుకుని వివాహ కార్యాలు జరిపేటప్పుడు వివాహితలలో లక్షలకొద్దీ బాల వితంతువులేల వున్నారని సమాజాన్ని నిలదీశాడు.

ఆ కాలంలో భూతాలు, దెయ్యాల మీద విశ్వాసం అధికంగా వుండేది. ఎవ్వరికి ఏ వ్యాధి సోకినా భూత వైద్యుని దగ్గరికో లేక సోదె చెప్పేవారి ఇంటికో వెళ్ళి తమ వ్యాధిని నయం చేయమనేవారు. ఇలాంటి మూఢ నమ్మకాలను, విశ్వాసాలను ఖండించాడు పంతులు గారు.

రాగిని, బంగారం చేసిస్తామనే మంత్రగాళ్ళు కూడా ఎక్కువగా వుండేవాళ్ళు. దురాశ గలవాళ్ళు అలాంటి మంత్రగాళ్ళను ఇంటిలో వుంచుకుని, పూజ చేయించే వాళ్ళు. మంత్రగాళ్ళు ఒక గదిలో దేవతని పెట్టి, ఆ

దేవతకు ఇంట్లోని బంగారం అంతా అలంకరించాలని చెప్పి, అలంకరించాక నాలుగైదు రోజులుండి, నమ్మకం కలిగించి, ఒకనాటి రాత్రి బంగారం అంతా మూట గట్టుకుని పారిపోయేవారు.

చాదస్తపు స్త్రీలు కూడా ఎక్కువే. నేను రోజుకు రెండు వందల స్నానాలు చేస్తాను. ఈ రోజు ఇప్పటికి పద స్నానాలు చేశాను. తెల్లవారి దొడ్లోకెళ్ళగా కాలికింద గుడ్డు తగిలింది. మా కోడలి పైట తగిలినట్టు అనుమానం వచ్చింది. నీళ్ళు తెస్తుంటే బట్టలుతికే వాళ్ళు నీళ్ళు తగిలాయనిపించింది. గోదావరి ఒడ్డుకు వచ్చేటప్పుడు నీళ్ళలో కాలికేదో తగిలిందనిపించింది. బిందెత్తుకుని సగం దూరం వచ్చేసరికి ఇరవై గజాల దూరంలో చండాలుడు కన్పించాడు. వాడిని చెడామడా తిట్టి మళ్ళీ గోదావరి కెళ్ళి నీళ్ళు తెచ్చుకునే సరికి ఇంతవేళ అయింది. ప్రతిసారి స్నానం చేశామని ఇప్పటికి ఎన్ని స్నానాలయ్యాయె లెక్క పెట్టావా? అని ఎదురింటామెను ప్రశ్నించింది.

బంధువులు మరణ సమయంలోనైనా తోడుగా వుంది శవాన్ని మోసేదిపోయి, ప్రేత పత్నుల నగలను అమ్మి, ఆ డబ్బును పనికిమాలిన వారికిచ్చి, అపవిత్రులచేత మోయించుట అనేది అవశ్య సంస్కరణీయమైన దురా చారం వుండేది.

19వ శతాబ్దపు చివరి రోజులలో పంతులు గారు సంఘ సంస్కరణ ఉద్యమాన్ని ప్రారంభించారు. 20వ శతాబ్దంలో అది మరింత విజృంభించింది. రఘుపతి వేంకటరత్నం నాయుడు ఈ ఉద్యమంలో బాగా తోడ్ప డ్డాడు.

పంతులుగారు 1880లో బాల్య వివాహాలు, కన్యా శుల్కం మొదలైన దురాచారాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ''బ్రహ్మ వివాహము'' అనే ప్రహసనాన్ని రచించాడు. దీన్నే ''పెద్దయ్య గారి పెండ్లి పుస్తకం'' అని పిలిచేవారు. ఇందులో గ్రామ్యభాషను వాడడం వల్ల సామాన్య ప్రజలు వీధి అరుగుల మీద గుంపులు గుంపులుగా కూర్చుని ఎగబడి చదివి ఆనందించారు. వినోదం మాత్రమేకాక అతి బాల్య వివాహాలవల్ల కలిగే అనర్థాలను చూపడం, మత మౌఢ్యాన్ని, సనాత దురాచారాలను ఖండించడం, మహిళా స్వేచ్ఛను, స్త్రీ పునర్వివాహాన్ని ప్రబోధించడం విశేషం. పంతులు గారు తన భాషను సులభతరం చేసి, సూటిగా తన భావాలను వ్యక్తీకరించి, తన లక్ష్యాన్ని భాష ద్వారా సాధించాడు.

న్యాయాధికారుల దుశ్చర్యలను ఖండిస్తూ ''వ్యవహార ధర్మబోధిని'' అనే ప్రహసనం రచించి రాజమండ్రిలో పిఠాపురం మహారాజావారి బాలికా పాఠశాలలో ప్రదర్శింప జేశారు. దీన్ని 'ప్లీడరు నాటకం' అని పిలిచేవారు. సాంఘిక చైతన్యాన్ని కలిగించి, మహత్తరమైన ప్రయోజనాన్ని సాధించిన నాటకం ఇది. ఇది వ్యవహారభాషలో వుండడం విశేషం. ప్రదర్శన భాగ్యం పొందిన ప్రథమాంధ్ర ఆధునిక సాంఘిక రూపకం.

'ప్రహసనం' అనే ప్రక్రియను మొదట తెలుగు భాషలోకి ప్రవేశపెట్టింది పంతులు గారు. దశవిధ రూపకాల్లో ప్రహసనం ఒకటి. సమాజంలోని వివిధ పరి స్థితులను హాస్య ధోరణిలో, హేళనాత్మకంగా చిత్రించడం ప్రహసనంలోని ముఖ్య లక్షణం.

## స్త్రీ విద్య :

వీరేశలింగం పంతులు 1874 నుంచే స్త్రీ విద్యను సమర్థిస్తూ అనేక వ్యాసాలు రాశాడు. ఆనాడు విద్యా గంధమే ఎరుగని మూఢ వనితలు మాట్లాడుకునే మాటలు.

- పూజారి పాపమ్మ చెంపకొప్పు పెట్టుకున్నది
- కరణం పెండ్లాం ఎంత ఒయ్యారంగా నడుస్తుందో చూచారా!
- అయ్యగారి రామమ్మకు ఏమి గర్వమో మనుషులతో మాట్లాడనే మాట్లాడదు.
- పుల్లమ్మ పట్టపగలే మగనితో మాట్లాడునట.
- కనకమ్మది కొంచెం మెల్లకన్ను సుమీ!
- కరణం వారి సీతమ్మకు నగలే లేవట.

సవతుల పోట్లాట, మాఱు తల్లుల దుర్మార్గం, మగల అనాదరణ వంటివి తప్ప మరేమీ మాట్లాడరు. స్త్రీలు అనుభవించే దురవస్థలను చూచిన పంతులు గారు

స్త్రీలకు ముఖ్యంగా విద్య నేర్పించాలని, వారిని అభివృద్ధి పథంలో నడిపించాలని భావించాడు. ఇందుకోసం సనాతనవాదులతో పత్రికా యుద్ధం చేశాడు. స్త్రీ విద్య కోసం పంతులు గారు పత్రికలలో చేసిన యుద్ధం వ్యర్ధం కాలేదు. పైగా అది ఫలోన్ముఖమై ధవళేశ్వరంలో 1874లో సమావేశమై స్త్రీలకు విద్య అవశ్యకమని తీర్మానించాడు. వెనువెంటనే చందాలు పోగు చేసి, అదే సంవత్సరం సెప్టెంబరులో స్థానికులు ఒక సంఘంగా ఏర్పడి బాలికా పాఠశాలను ప్రారంభించారు. ఇన్నీసుపేట బాలికా పాఠశాలను పంతులే స్థాపించాడు.

స్త్రీల స్థితి బాగుపడితేనే దేశపు స్థితి బాగుపడుతుందని పంతులు గారు భావించాడు. విద్య లేనందువల్లే స్త్రీలు దెయ్యాలు, భూతాలు వంటి మూఢ నమ్మకాల వల్ల అనారోగ్యం పాలవుతున్నారని గమనించి ఆయన విద్యను బోధించే అధ్యాపకుడిగాను, విద్యాదాత గాను కావాలనుకున్నాడు.

నాడు సంఘంలో అతి వృద్ధ వివాహాలు ప్రబలి వుండేవి. దాని ద్వారా అమాయకపు బాలికలు వితంతువులు కావడం పంతులు గారిని కలచి వేసింది.

"పుట్టినప్పటి నుండి ఎంతో ప్రేమగా పెంచి, ప్రాణాలన్నీ వారిపైనే పెట్టుకుని, భర్త పోయాడన్న వార్త వినగానే సమస్త అలంకారం తీసేసి, విరూపిని చేసి, ముసుగువేసి, మూల కూర్చోబెట్టి, చచ్చియూ చావకుండా... దుఃఖిస్తుంటే తల్లిదండ్రులకెట్టు మనసొప్పుచున్నదని" వాపోయాడు.

మొదట వితంతు పునర్వివాహం వైపు సమాజాన్ని నడిపించాలనుకున్నాడు. రాజమహేంద్రవరంలో సభలు నిర్వహించాడు. సంప్రదాయవాదులు, ఛాందసవాదులు ప్రతిఘటించారు. పంతులుగారిని వ్యక్తిగతంగా నిందించారు. బెదిరించారు. పత్రికల ద్వారా హెచ్చరించారు. దేనికీ భయపడలేదు ఆయన. తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, ఎవరికీ తలొగ్గలేదు. మహిళలకు విద్య ద్వారా జ్ఞానాన్ని పెంచి, దీన స్త్రీలను ఉద్ధరించి, వితంతు వివాహాలను జరిపించి, సమాజంలో నూతన చైతన్యం తీసుకురావడానికి ఎంతో శ్రమించాడు.

స్త్రీలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని కూడా కలిగించాలని ప్రకృతి శాస్త్ర విషయాలైన సూక్ష్మవస్తు దర్శక యంత్రం, మంచుగడ్డ, అగ్నిపర్వతం, జ్యోతిష్యశాస్త్రం వంటి శాస్త్ర విషయాలను స్త్రీల కోసమే ప్రత్యేకంగా స్థాపించిన "సతీహిత బోధిని" మాసపత్రికలో ప్రచురించాడు. అంతేగాక వాళ్ళు చదువుకుని ఆనందించిన వచన ప్రబంధాలు దేహ, గేహ శుభ్రతలకు సంబంధించిన విషయాలు, నీతి కథలు, పాటలు, పద్యాలు ఉత్తమ స్త్రీ చరిత్రలు అనేకం రాశాడు.

వాటిలో ప్రధానమైనవి సత్యవతి, చంద్రమతి, సుమిత్ర చరిత్రలు, సతీమణి విజయం, కళావతి పరిణయం, భానుమతీ కల్యాణం, పద్మినీ ప్రభాకరం మొదలైనవి. పుస్తకాలు చదవాలనే ఆసక్తి కలగాలంటే కథకు మించిన ప్రక్రియ లేదని గ్రహించిన పంతులు గారు స్త్రీల కోసం అనేక కథలు రాశాడు. ఇలా జీవితాంతం స్త్రీ సంక్షేమంకోసం, స్త్రీ విద్యకోసం పాటుపడిన మహావ్యక్తి, సంఘ సంస్కర్త కందుకూరి. స్త్రీ జాతి మొత్తానికి ప్రాతఃస్మరణీయుడు.

సమాజంలో మతం పేరిట జరుగుతున్న దుర్నీతిని, అన్యాయ, అక్రమాలను తొలగించాలని భావించాడు. వీటిని తొలగించాలంటే సమాజంలో నీతి నియమాలను పెంపొందించాలి. దీనికి ఒక బలమైన మాధ్యమం అవసరమని గుర్తించాడు. మానవుల నడవడికలు, సద్గుణాల గురించి వ్యాసాలు రాశాడు. వాటి గురించి అనేక ఉపన్యాసాలిచ్చాడు. ప్రజలలో మతాన్ని గురించిన భావాలలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నించి, ఆనాటికే వంగ దేశంలో ప్రబలంగా వున్న బ్రహ్మ సమాజం వైపు తన మొగ్గు చూపాడు.

ఆనాడు ప్రభుత్వ ఉద్యోగులలో వున్న లంచగొండితనాన్ని అరికట్టేందుకు తన శాయిశక్తులా ప్రయత్నించాడు. సామాన్యులతో అహంభావంగా నడుచుకోవడాన్ని సహించలేదు. వేశ్యావృత్తిని నిరుత్సాహపరచి, దానికి వ్యతిరేకంగా ప్రచారం చేశాడు. ధనవంతుల పెళ్ళిళ్ళలోనూ, అధికారుల ఇళ్ళలోనూ జరిగే మేజువాణీ, వ్యభిచారం

వంటి సాంఘిక దురాచారాన్ని ఎండగట్టాడు. సంగీతం, నాట్యం నేర్పే వేశ్యా పాఠశాలలో రాజమండ్రిలో వెలి శాయంటే వ్యభిచారం ఎంతగా పెరిగి వుండేదో అర్థం అవుతుంది.

"లంచముల తగవన్న రాజకీయోద్యోగలకు కోపము వేశ్యాంగన సంగమమే కాదన్న శృంగార నాయకులకు కోపము పూర్వాచారములు మార్చుకోవలెనన్న పామర జనులకు కోపము నీతిమాలిన బాహ్య వేషములు మత విరుద్ధములన్న ఆచార్య పురుషులకు కోపము" అని పంతులు గారు తన స్వీయచరిత్రలో రాసుకున్నారు.

సమాజంలోని దుర్మార్గులను సన్మార్గంలోనికి మరల్చగలిగారు పంతులు గారు. మారనివాళ్ళు మట్టిలో కలిసిపోయారు. "పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుటకలతో గాని పోవు" అన్న సామెత వుంది కదా! వీరేశలింగం గారు అక్రమాలను, అవినీతిని సహించలేదు. ధర్మంకోసం గురువుతోనూ, సత్యం కోసం శిష్యునితోనూ పోరాడగల సమర్థుడు. అధర్మం జరిగితే హితులు, మిత్రులు అని కూడా చూడడు. స్వలాభం కోసం ఎవరి దగ్గరా చేయి చాచలేదు. ఎవరి ముందర తల దించలేదు. అందుకే ప్రభుత్వం వారు గౌరవంగా "రావు బహద్దూరు" బిరుదు నిచ్చి సత్కరించింది.

వీరేశలింగం పంతులు గారు స్త్రీ విద్య కోసం, వితంతు పునర్వివాహాల కోసం చేసిన పోరాటాలు, నిర్వహించిన ఉద్యమాలు, సాధించిన సత్కార్యాలు, రచించిన రచనలు, స్థాపించిన సంస్థలు, వాటికి కూర్చిన ఆస్థులు, నడిపిన పత్రికలు అన్నీ ఇన్నీ కాదు. ఇన్ని సాధించాలంటే ఎవరి తరమూ కాదు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన పంతులు గారు స్త్రీ జనోద్ధరణకోసం, సంఘ సంస్కరణ కోసం తెలుగు సాహిత్యాన్ని చక్కగా ఉపయోగించుకుని తన లక్ష్యాలను సాధించాడు.

వీరేశలింగం గారు క్రీ.శ. 1848వ ఏట జన్మించారు. పుట్టీ పుట్టగానే దగ్గు, మశూచి వంటి వ్యాధులు సోకి బలహీనులడయ్యాడు. నాలుగేళ్ళ వయస్సులో తండ్రి చనిపోయాడు. పెదనాన్నగారి దగ్గర పెరిగాడు. ప్రాథమిక విద్య అనంతరం ఆంగ్లం, గణితం నేర్చుకున్నాడు. రఘు వంశం చదువుకున్నాడు. ఇంట్లో వున్న తాళపత్ర గ్రంథాలను చదవడం వల్ల భారతీయ సంస్కృతి పట్ల, ఋషుల పట్ల అభిమానం పెరిగింది. తాను కూడా మహర్షుల్లాగా తపస్సు చేయాలని, మహిమలు సంపాదించాలని చిన్న మెదడుకు అనిపించేది. దుర్బల శరీరుడై ఆటపాటలకు నోచుకోకుండా పంజరంలో చిలుకలా బాల్యాన్ని గడిపాడు.

తన తాత గారిది జమీందారీ కుటుంబం. పాడి పంటలకు కొదువ లేదు. దాతృత్వాన్ని తక్కువ లేదు. తాత మరణంతో కుటుంబం తలకిందులైంది. చిన్ననాట వసుచరిత్రను పుస్తక విక్రయశాలలో చదువుకున్నాడు. ఉద్యోగానికి కావలసిన శిక్షణ పొందాడు. 13వ ఏటనే రాజ్యలక్ష్మితో వివాహం అయింది. వీరికి సంతానం కలుగ లేదు.

పంజరం నుండి బయట పడి సమాజంలో అడుగు పెట్టగానే తల తరిగింది. ఆనాడు సంఘంలో పెద్దలకొక చట్టం, పేదలకొక చట్టంష్ట్ర; కార్యాలయాలన్నింటిలో లంచగొండితనం ఎక్కువగా వుండేది. బాల్య వివాహాలు సర్వసాధారణం, వితంతు పునర్వివాహాలోచన రావడం నేరం, స్త్రీలది బానిస జీవితం, ఉంపుడుకత్తె గౌరవానికి, మగతనానికి చిహ్నం. మతాధిపతులు, మత ప్రతినిధుల దురాగాతాలకు అంతు వుండేది కాదు. ప్రజల ప్రవర్తనల్లో మూర్ఖత్వం వెల్లివిరిసేది. మొత్తానికి సమాజమంతా మూఢ విశ్వాసాల పుట్ట. ఇలాంటి సమాజాన్ని మార్చాలని కంకణం కట్టుకుని ఎన్నో కష్టనష్టాలను అనుభవించాడు.

ఆరుద్ర గారు "అదేం చిత్రమోగాని తాను శారీరకంగా దుర్బలురైనా జాతిని బలిష్టం చేసి, దేశాభివృద్ధిని, భాషాభి వృద్ధిని సాధించిన మనోబలభీములతో పంతులు గారు ప్రథములు" అని అన్నారు.

అలాగే కట్టమంచి రామలింగారెడ్డి గారు "నిర్భయంగా, నిస్సంకోచంగా సమాజంలోని దోషాల్ని నిర్మొహమాటంగా, పెద్ద మనుషులుగా చెలామణి అడుచుండిన వారి లోపాల్ని బహిరంగ పరచి దురాచారకాననాన్ని ఖండించిన

పంతులు గారికి 'స్మృతి చిహ్నం' కాగలిగినది 'కల్తి' గాని 'కలం' కాదన్న యదార్థాన్ని తెలియజేశారు.

రావుబహుదూరు, దక్షిణ హిందూ దేశ విద్యా సాగరుడు, అభినవ తిక్కన, గద్య తిక్కన వంటి బిరుదులు పొందిన పంతులు గారు చివరి దశలో సహపంక్తి భోజనాలు కూడా చేశాడు. అలాగే గ్రాంధిక వాదానికి మూల విరాట్టుగా వుండిన ఆయన గిడుగు రామ్మూర్తి వ్యావహారిక భాషా వాదంలో వున్న హేతువుల్ని మనసారా అంగీకరించారు. వర్తమాన వ్యవహారకాంధ్ర భాషా ప్రవర్తక సమాజాన్ని స్థాపించి, దానికి అధ్యక్షులుగా కూడా వ్యవహరించారు.

పంతులు గారు సాంస్కృతిక వైతాళికుడుగా పేరు గాంచి, సంఘసేవకు తన కాలాన్ని, ధనాన్ని, జ్ఞానాన్ని మొత్తం దేహాన్ని అర్పించిన త్యాగశీలి. ఇతను నవ సమాజ స్థాపకుడు, ఆధునిక యుగకర్త, సంఘ సంస్కర్త, హేతువాది, సాహితీమూర్తి. ఇలాంటి మహామహుడి గురించి, బహుముఖ సాహితీ ప్రతిభాశాలి గురించి మననం చేసుకోవడం ఆనందదాయకం.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య సమీక్ష, రెండవ భాగం, జి. నాగయ్య.
2. తెలుగు సాహిత్య చరిత్ర, ద్వానా శాస్త్రి.
3. తెలుగు సాహిత్య చరిత్ర, వెలమల సిమ్మన్న.
4. సమగ్ర ఆంధ్ర సాహిత్యం, నాల్గవ సంపుటి, ఆరుద్ర.
5. తెలుగు (40 సం॥ల భాషా సాహిత్యాల ప్రత్యేక సంచిక) తెలుగు అకాడమి.
6. తెలుగు భాష; సాహిత్యం - సమాజం, చిన్నం పబ్లికేషన్స్, నెల్లూరు.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# విశ్వనాథ నవలల్లో 'యోగం - సామాజిక స్పృహ'

- ఆతుకూరి వేంకటేశ్వర్లు (యోగి), ఆంధ్రోపన్యాసకులు, వి.టి.జె.యం & ఐ.వి.టి.ఆర్. డిగ్రీ కళాశాల, మంగళగిరి, గుంటూరు.

తెలుగు నవలా రచయితలలో విశ్వనాథ వారిది విశిష్ట స్థానం. ఆయన వ్యక్తిత్వం ప్రాచీన విధానాలకు, ఆచారాలకు కట్టుబడి ఉంది. ఆయన మనస్తత్వం సమాజ హితంగా ఉంటుంది. ఈ రెండు ఆయన రచనలలో కనిపిస్తాయి.

భాషలోను, భావంలోను ప్రాచీనంగా కనబడే విశ్వనాథలో ఒక ఆధునికుడు ఉన్నాడు.ఆ ఆధునికతే ఆయన రచనల్ని ఆధునికులు చదివేటట్లు చేసింది. ఆయన శైలి కదలని రాతి రథంలాగా ఉంటుంది. కాని, చదివిన వారిని కదిలించి తీరుతుంది. అది ఆయన ప్రత్యేకత.

ఆయన నవలల్లో లోకవ్యవహారాలు, శాస్త్ర వ్యవహారాలు ఎన్నో ఉంటాయి. ఆయనే ఒక చోట 'నా కవిత్వం అంతా నా జీవితంలోని అనుభవాల మయం. లోక వ్యక్తిని కావ్య వ్యక్తినయ్యాను' అంటారు.

విశ్వనాథ వారు బాల్యంలోనే యోగ విద్యను అభ్యసించారు. ఆ ప్రభావం ఆయన రచనలలో కనిపిస్తుంది. విశ్వనాథ వారు సామాజిక స్పృహ కలిగిన రచయిత. అందుచేత ఆయన రచనలలో ప్రతిఫలించే 'యోగం' కూడా సామాజిక ప్రయోజనాన్ని సాధిస్తూ సాగింది.

## యోగం - సమానత్వం :

యోగ సిద్ధాంతమే సమత్వ భావంతో ఏర్పడింది. 'సమత్వం యోగముచ్యతే' అని ఒక యోగ నిర్వచనం. అంటే మనస్సు సమత్వ భావంలో స్థిరంగా ఉండటమే యోగం. మానవ మనస్తత్వం ద్వంద్వాల మధ్య ఘర్షణకు లోనౌతూ ఉంటుంది.

శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, మానావమానాల వంటి ఎన్నో ద్వంద్వాలు ఈ ప్రకృతిలో ఉన్నాయి. ఈ ద్వంద్వాలను అధిగమించటమే ద్వంద్వాతీతస్థితి. అదే యోగసిద్ధి. ఇటువంటి యోగసిద్ధి సమాజంలోని అన్ని సమస్యలకు పరిష్కారం. ఈ నేపథ్యంలోనే యోగ ప్రస్తావన విశ్వనాథ నవలల్లో కనిపిస్తుంది.

ఇదే సమానత్వ భావన విశ్వనాథ వారి స్త్రీ-పురుష పాత్రలలోను కనిపిస్తుంది. ఆయన ఆధునికతను ఖండించలేదు. ఆధునికత పేరుతో వచ్చిన విచ్చలవిడి పరిస్థితులను ఖండించారు. భారతీయ ధర్మ వ్యతిరేకతను ఖండించారు. 'సంఘంలో కానీ, మతంలో కానీ, మరొక దారిలో కానీ మీరెన్ని మార్పులయినా తేవచ్చును. ఇంద్రియ నిగ్రహము, మనో నిగ్రహము తద్వారా భక్తియో జ్ఞానమో కలుగుటకు వీలుపడెనేని మీరు తెచ్చిన మార్పు శిరోగ్రాహ్యము' అంటారు విశ్వనాథ. మార్పు అనేది మనస్సును ఉన్నత స్థితికి తీసుకెళ్ళాలే కాని భ్రష్టు పట్టించకూడదు. ఇదే వారి నిశ్చితాభిప్రాయం.

## విశ్వనాథ నవలలు - యోగం - సమాజం - సమానత్వం :

నవలల్లో యోగాంశ ప్రస్తావన చేసిన ప్రతి సందర్భంలోను విశ్వనాథ సమాజ ప్రయోజనాన్ని ఆశించారు. మచ్చుకు కొన్ని నవలలను పరిశీలిద్దాం.

**1) వేయి పడగలు** : ఈ నవలకు పెట్టిన పేరులోనే యోగం వుంది. వేయి పడగలనేది బహుముఖాలుగా విస్తరించిన భారతీయ ధర్మానికి ప్రతీక. ఆదిశేషుడే వేయిపడగల నాగు. ఆదిశేషుడు కాలానికి గుర్తు. సర్పం కుండలినీ శక్తికి సంకేతం. కుండలినీ జాగరణ యోగ సాధనలో కీలకమైన పరిణామం. ఆ విధంగా 'వేయి పడగలు' పేరులోనే యోగ సంకేతం ఉంది.

ఈ నవలలో ధర్మారావుకు గిరికకు మధ్య జరిగిన సంభాషణలో యోగసంబంధమైన చర్చ కనిపిస్తుంది. 'భక్తియోగులకు కృష్ణస్వామి సులభుడు. జ్ఞానయోగులకు శివుడు సేవనీయుడు' అని ధర్మారావు చెప్పగా గిరిక "సేవనీయుడువందువేమి? సులభుడు కాదా!' అనగా ధర్మారావు 'తల్లీ జ్ఞానయోగము సులభము కాదు' అంటాడు.

భక్తి-జ్ఞానయోగాలు సమాజంలో బహుళ ప్రాచుర్యాన్ని పొంది ఉన్నాయి. ఇవి మానవునికి రెండు కళ్ళవంటివి.

భక్తుడు జ్ఞానిగాను, జ్ఞాని భక్తుడిగాను, పరివర్తన చెందితే యోగం పరిపూర్ణమౌతుంది. యోగులు రాగద్వేషాలు లేని నిర్మలాంతఃకరణం కలిగి ఉంటారు. అందుచేత సమాజం శాంతి సౌఖ్యాలతో వర్ధిల్లుతుంది. ఈ విధంగా యోగం ద్వారా సామాజిక ప్రయోజనాన్ని విశ్వనాథ సాధించారు.

వేయిపడగలు నవలలోనే నేటి సామాజిక సమస్యలకు యోగపరమైన పరిష్కారాలను సూచించారు. సమకాలీన సమాజంలో 'ఘర్షణ' ప్రధాన సమస్య. బడికి వెళ్ళే బాలల నుండి బరువు బాధ్యతలను మోసే సంసారి వరకు అందరూ జీవితంలో ఘర్షణ పడుతున్నారు. ఈ ఘర్షణకు పరిష్కారంగా యోగాన్ని సూచించారు. ఈ నవలలో హరప్పనాయుడు జమిందారుగారి కుమారుడు. ఆయన వేణుగోపాలస్వామి వారి ఉత్సవాలను జరిపించి తాను జీవితంలో ఏమి సాధించాలని అనుకున్నారో దాన్ని సాధించి భయం, ఆందోళన లేని ప్రశాంత స్థితిలో దేహత్యాగం చేశారు. 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన' అనే గీతాకారుని నిష్కామ కర్మయోగాన్ని ఆయన అభ్యసించారు. నిర్లక్ష్యానికి గురైన సంప్రదాయాలను పునరుద్ధరించిన చిన్న జమిందారు హరప్పనాయుడు ప్రశాంతంగా కార్యాన్ని నిర్వహిస్తాడు. నేటి యువతీ యువకులకు ఆయన ఆదర్శం.

**తెఱచి రాజు :**

ఈ నవలలో స్పర్శ యోగాన్ని విశ్వనాథ ప్రవేశపెట్టారు. ఇది కూడా సామాజికస్పృహతో చేసినదే. ఆంగ్లేయుల రాకతో మన దేశంలో యువతీయువకుల మధ్య ఉండవలసిన దూరం తగ్గిపోతూ, భారతీయ మూలాలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. దానిని ఈ నవలలోని 'వాసంతి' పాత్ర ద్వారా పవిత్ర భావన ఎలా ఉండాలో సూచన చేశారు. వాసంతి విలక్షణమైన స్పర్శజ్ఞానం కలిగిన బాలిక. ఎవరిలోనైతే కాముక ప్రవృత్తి ఉంటుందో వారి స్పర్శ ఆమెకు అసౌఖ్యంగా ఉంటుంది. శరీరం ఆ స్పర్శను తిరస్కరిస్తుంది. ఈ లక్షణం ఆమెను పవిత్రంగా ఉంచుతుంది. స్త్రీ-పురుషుల మధ్య పవిత్రబంధం ఉండాలేగాని, అది కామప్రధానమైనది కారాదని ఆయన అభిప్రాయం. ఈ స్పర్శను యోగంగా తీర్చి ఒక సామాజిక ప్రయోజనాన్ని సాధించారు.

**వేదవతి :**

ప్రాచీన విద్యల ద్వారా ఆధునిక సమాజం ప్రయోజనాన్ని పొందవచ్చుననే విషయాన్ని తెలుపుతున్న నవల 'వేదవతి'. ఈ నవలలో వేదవతి అచేతనంగా ఉంటుంది. ఆమెకు వేదాన్ని వినిపించినప్పుడు ఉత్సాహంగా ఉంటుంది. అంటే వేదపఠనం ద్వారా వినిపించే ధ్వని ఆమెలో చైతన్యాన్ని నింపుతుంది. ఇక్కడ నాదయోగాన్ని వివరించారు. స్వరం మానవుని సర్వావయవాలను చైతన్యం చేయగలదు. ఆరోగ్య భాగ్యాన్ని మనశ్శాంతిని సాధించటానికి స్వరం ఒక చికిత్స అని అది మనస్సును నిర్మలం చేసే యోగమని విశ్వనాథ ఈ నవలలో వర్ణిస్తారు.

దీనిని బట్టి విశ్వనాథ వారు తమ నవలల్లో నేటి సామాజిక అవసరాలను యోగసంబంధ విషయాల ద్వారా ఎలా తీర్చవచ్చునో సూచించారు. విశ్వనాథను గురించి శ్రీశ్రీ చెప్పిన మాటల్లోను 'యోగం' ఉండటం విశేషం. ఆ మాటలు

'మాటలాడే వెన్నెముక
పాటపాడే సుషుమ్న
నిన్నటి నన్నయభట్టు
ఈనాటి కవిసమ్రాట్టు' ఇందులోని సుషుమ్న శబ్దం యోగసంబంధమైనదే కదా!

**ఆధారగ్రంథాలు :**

1. వేయి పడగలు (నవల) - విశ్వనాథ సత్యనారాయణ
2. తెఱచిరాజు (నవల) - విశ్వనాథ సత్యనారాయణ
3. వేదవతి (నవల) - విశ్వనాథ సత్యనారాయణ
4. భగవద్గీత - గీతాప్రెస్
5. యోగ దర్శనం - శ్రీ రామకృష్ణ మఠం
6. ఆత్మకథ - విశ్వనాథ సత్యనారాయణ
7. కవ్యృద్ధ విశ్వనాథ - శ్రీశ్రీ - సింగంపల్లి అశోక్ కుమార్

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# ఆంధ్రమహాభారతంలో ధర్మవ్యాధుని ధర్మోపదేశం

- డా॥ నూనావత్ రాంబాబు, సీనియర్ ఫెలో
సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఫర్ స్టడీస్ ఇన్ క్లాసికల్ తెలుగు,
సి.ఐ.ఐ.యల్. మైసూర్, కర్నాటక.

- డా॥ లింగాల మంగమ్మ, పోస్టు-డాక్టొరల్ ఫెలో,
తెలుగుశాఖ, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం,
హైదరాబాదు.

ఆంధ్రమహాభారతంలోని అరణ్యపర్వంలోని పంచమాశ్వాసంలో "ధర్మవ్యాధుని" వృత్తాంతం వర్ణించబడింది. "ధర్మవ్యాధుడు మిథిలానగర నివాసి. అతడు సత్యవాది. జితేంద్రియుడు. అహింసాపరుడు. మాతాపితృభక్తుడు. ధర్మజ్ఞుడు. వర్ణాశ్రమ ధర్మాన్ని పాటించేవాడు. తపోధనుడు, బ్రాహ్మణుడు అయిన కౌశికుడు ధర్మవ్యాధుని వల్ల సకల ధర్మాల్ని, అహింస స్వరూపాన్ని, జీవలక్షణాల్ని సంపూర్ణంగా తెలుసుకొని తన జన్మ ధన్యమైందని ధర్మవ్యాధున్ని కొనియాడాడు". మనిషి గొప్పతనానికి గుణం ముఖ్యమని కులం ప్రధానం కాదని ధర్మవ్యాధుని వృంత్తాంతం ద్వారా ఎఱ్ఱన లోకానికి తెలియజేశారు. అటువంటి ధర్మవ్యాధుని ధర్మోపదేశాన్ని మార్కడేయ మహర్షి ధర్మరాజుకి తెలియజేసిన విధానాన్ని వివరించడం ఈ పత్ర ఉద్దేశం.

## ధర్మవ్యాధోపాఖ్యానం :

ధర్మరాజు మార్కండేయ మహర్షిని, ఓ మార్కండేయ మహర్షీ! గొప్ప పతివ్రతల మాహాత్మ్యాలను వినాలని ఉంది. అంతేకాకుండా తల్లిదండ్రులలో ఎవరు అధికులో కూడా చెప్పమని అడుగుతాడు. అందుకుగాను మార్కండేయ మహర్షి, ధర్మరాజా! తల్లి, పిల్లల్ని తొమ్మిది నెలలు మోసి చివరకు ప్రాణాల్ని కూడా పణంగా పెట్టి పిల్లల్ని కంటుంది. అలాగే తండ్రి కూడా మంచి పుత్రుడు కలగాలని ధర్మకార్యాలు, నోములు, వ్రతాలు చేస్తాడు. తల్లిదండ్రులు కొడుకు తమను ప్రేమతో చూసుకునేవాడై ఉండాలని కోరుకుంటాడు. అందువల్ల తల్లిదండ్రుల కోరికను నెరవేర్చువాడే నిజమైన పుత్రుడవుతాడు. అటువంటి కుమారుడే ధర్మాన్ని, కీర్తిని సంపాదించ గలుగుతాడు. అతడు ఉత్తమ లోకాల్ని కూడా పొందుతాడు.

## పతివ్రతా మాహాత్మ్యం :

ధర్మరాజా! భర్తకు ప్రేమతో సేవలు చేసే పతివ్రతలకు భర్తచేసే యజ్ఞాలు, దానాలు, తపస్సుల వల్ల కలిగే పుణ్యం లభిస్తుంది. ఈ సందర్భంలో నీకో పతివ్రత కథ చెప్తాను విను. కౌశికుడనే వాడొక గొప్ప వేదపండితుడు. గొప్ప తపశ్శాలి. ఒక రోజున ఓ చెట్టు కింద కూర్చుని వేదాధ్యయనం చేస్తుండగా ఆ కొమ్మపై ఉన్న కొంగ వేసిన రెట్ట మహర్షిపైన పడింది. అప్పుడా మహర్షి ఆ కొంగను ఆగ్రహంతో చూశాడు. వెంటనే ఆ కొంగ చచ్చి కింద పడింది. కౌశికుడు కొంగను చూసి "అయ్యో! నా ఆగ్రహం వల్ల ఈ కొంగ ప్రాణం పోగొట్టుకుందిగదా! నేను దయ లేని వాడినై పోయానని" ఎంతగానో కుమిలిపోయాడు.

మిట్ట మధ్యాహ్నం అయింది. భిక్షా పాత్ర తీసుకొని సమీపాన ఉన్న గ్రామానికి పోయి పవిత్రులైన బ్రాహ్మణుల ఇళ్ళముందు నిలబడి "భిక్షాం దేహి" అని యాచిస్తూ ఉండేవాడు. ఆ రోజున ఓ ఇల్లాలు కౌశికుడికి భిక్ష తెచ్చేందుకు ఇంట్లోకి వెళ్ళింది. ఇంతలో ఆమె భర్త బాగా అలసిపోయి వచ్చి భోజనం పెట్టమని అడిగాడు. ఆమె వెంటనే భర్తకు భోజనం పెట్టి, ఆయనకు సపర్యలు చేసి భిక్షతో బయటకు వచ్చింది. కౌశికుడు ఆమెతో కోపంగా ఇలా అన్నాడు.

ఏమమ్మా! నీవు భిక్ష తెస్తాను ఉండమన్నావు. నేను నీ గుమ్మం ముందు ఎంతసేపు పడిగాపులు కాచుకొని కూర్చోవాలి? నువ్వు లేదంటే మరో ఇంటికి పోయే వాడివి గదా! యాచకుడే గదా అని నన్నింత తీవ్రంగా అవమానించావని కౌశికుడు అంటాడు. అయ్యా! నా భర్త ఆకలితో ఇంటికి వచ్చాడు. నేను ఆయనకు అన్నం పెట్టి, సేవలు చేసి వస్తున్నాను. కొంచెం ఆలస్యం అయిన మాట నిజమే.

మీరు ఆగ్రహించకండి. ఓర్పు వహించండి అని గృహిణి చెప్తుంది. అంతేగాక ఆమె ఇంకా ఇలా అంటుంది. నా దృష్టిలో భర్తయే నాకు గొప్ప దేవుడు. త్రికరణశుద్ధిగా నా భర్త శ్రేయస్సునే కోరుకుంటాను. ఆ విధంగానే ఆచరిస్తాను. ఎంత ఆలోచించినా ఇంతకన్నా గొప్ప ధర్మం నాకు మరొకటి కనిపించడం లేదు. అయితే నువ్వు మాత్రం చాలా కోప స్వభావం గలవాడవని నాకు తెలుసు. నీ కోపం వల్లనే కదా పాపమా కొంగ చనిపోయింది. నా పాతివ్రత్య మహిమచేత నేనీ విషయాన్ని తెలుసుకున్నాను.

ఓ మహర్షీ! ధర్మం చాలా క్లిష్టమైంది. బయటకు చూసేందుకు అన్నీ ధర్మాలుగానే కనిపిస్తాయి. వేదాధ్య యనం ఒక్కటే ఉత్కృష్టమైందని నువ్వు అనుకుంటు న్నావు. కానీ ధర్మ సూక్ష్మాల్ని నువ్వెరుగవు.నువ్వు ధర్మ సూక్ష్మాలు తెలుసుకోవాలనుకుంటే మిథిలానగరానికి వెళ్ళు. అక్కడ ధర్మవ్యాధుడనే బోయవాడున్నాడు. అతడు జితేంద్రియుడు. మాతా, పితృ భక్తిగలవాడు. ధర్మ సూక్ష్మాలెరిగినవాడు. అతడు నీ సందేహాలన్నీ తీర్చి నీకు విచక్షణా జ్ఞానాన్ని బోధిస్తాడు. కనుక నన్ను అనుగ్రహించు. నేను స్త్రీని, అజ్ఞానిని. నాలాంటి వారు చేసిన దోషాల్ని మీరు క్షమించాలి అంటుంది. ఆమె మాటలు విన్న కౌశి కుడు, అమ్మా! నువ్వు కేవలం ఒక స్త్రీవి మాత్రమే కాదు. గొప్ప కర్మ యోగినివి. నీ మూలంగా నాకు జ్ఞానోదయం అయింది. నీ ఆదేశం ప్రకారం మిథిలానగరానికి వెళ్ళి ధర్మవ్యాధుని కలుసుకుంటాను అని అంటాడు.

**కౌశికుడు ధర్మవ్యాధుని వద్దకు పోవడం :**

కౌశికుడు ఆ గృహిణి దగ్గర సెలవు తీసుకొని మిథిలానగరానికి పోయి ధర్మవ్యాధున్ని అతని దుకా ణంలో కలిశాడు. అతడి అంగడి అంతా కిక్కిరిసి ఉంది. అదో కసాయి దుకాణం మాంసాన్ని ముక్కలుగా చేసి అమ్ముతున్నాడు. అక్కడంతా దుర్వాసనతో నిండివుంది. కౌశికుడు అక్కడ నిలవలేక కొంచెం దూరంగా పోయి నిలబడ్డాడు. కౌశికుడనే మహర్షి తన కోసమే వచ్చాడని ధర్మవ్యాధుడు తన మనశ్శక్తి చేత తెలుసుకున్నాడు. ధర్మవ్యాధుడు కౌశికుడి వద్దకు వెళ్ళి ఇలా అన్నాడు.

ఓ మహర్షి! నువ్వు ఆ మహా పతివ్రత పంపగా నన్ను చూడటానికి వచ్చావు. మీరు మా ఇంటికి రండి. అక్కడ కూర్చుని మాట్లాడుకోవడానికి వీలుగా ఉంటుందని ధర్మవ్యాధుడు చెప్తాడు. కౌశికుడు రెండోసారి ఆశ్చర్య పోయాడు. మొదటిసారి ఆ పతివ్రత మాటలకు, రెండో సారి తాను పెదవి విప్పకుండానే ధర్మవ్యాధుడు తనను గూర్చి మాట్లాడిన మాటలు. ఇలా ఆలోచిస్తూనే కౌశికుడు ధర్మవ్యాధుడి ఇంటికి చేరుకున్నాడు. ధర్మవ్యాధుడు కౌశికుడికి అతిథి సత్కారాలు చేసి ఆదరించాడు.

ఓ పుణ్యాత్ముడా! ధర్మవ్యాధుడా! నువ్వు ధర్మ మార్గాలన్నీ బాగా తెలిసినవాడవు. మరి జీవహింసను బతుకుతెరువుగా ఎందుకు ఎంచుకున్నావు! నువ్వు చేస్తున్న ఈ భయంకరమైన వ్యాపారం నా మనస్సును కలచివేస్తుందని కౌశికుడంటాడు.

మహర్షీ! అందరికీ అన్ని ధర్మాలు కుదరవు. ఎవరి చిత్త వృత్తికి తగిన ధర్మాన్ని వారు ఆచరిస్తారు. బ్రాహ్మణు లకు తపస్సు, వేదాధ్యయనం, పరిశుభ్రతను పాటిం చడం, ఇంద్రియనిగ్రహం కలిగి ఉండటం, జ్ఞానాన్ని సంపాదించడం వంటివి ధర్మాలు. క్షత్రియులు పాటిం చాల్సిన ధర్మాలు దుష్టుల్ని శిక్షించడం, సాధువుల్ని రక్షిం చడం, ప్రజారంజకంగా పాలించడం ధర్మాలు. వైశ్యులు ఆచరించదగిన ధర్మాలు పరిచర్య అలాగే వ్యాధులు (బోయవారు) నేర్వదగిన ధర్మం మాంస విక్రయం. మాంస విక్రయిస్తూ జీవించడం మాకు వంశ పారంపర్యంగా వస్తున్న ధర్మం. ఇది మిథిలానగరం. దేశానికి ప్రభువు జనకమహారాజు. ఆయన ఏలుబడిలో ఉన్న ప్రజలంతా ఎవరి వృత్తులు వాళ్ళు చేసుకుంటూ జీవించాలి. ఇది ఆయన శాసనం. ఆయన కొడుకైనా ఆయన శాసనాన్ని ధిక్కరిస్తే శిక్షార్హుడే అవుతాడు. కావున నా కులవృత్తి అయిన మాంస విక్రయాన్ని వదిలి వేరొక వృత్తిని చేపట్ట లేను. చూసే వాళ్ళకీ వృత్తి బాధాకరంగా కనిపించవచ్చు. కానీ ఎవరో మృగాల్ని చంపి తెచ్చిన మాంసాన్ని కొద్ది లాభా నికి అమ్ముకొని ఆ వచ్చిన ఆదాయంతో జీవనం చేస్తాం. అలా సంపాదించిన ధనంతో నాకు మనశ్శాంతి కలుగు తోంది. అదే నా పరమార్థం అంటాడు ధర్మవ్యాధుడు. నేను తక్కువ కులంలో పుట్టినా కూడా ఉత్తమ ప్రమాణా

లతో కూడిన శీలాన్ని ఆచరిస్తున్నానంటాడు ధర్మవ్యాధుడు.

## ధర్మవ్యాధుడి ధర్మోపదేశం :

ఓ మహర్షీ! దయాభావం అన్నింటికన్నా గొప్పది. తన కులానికి సంబంధించిన ధర్మాన్ని తప్పక ఆచరించాలి. సహనంతో వ్యవహరించాలి. ఇంద్రియాల్ని ప్రయత్నం చేత నిగ్రహించాలి. త్యాగానికి మించిన లక్షణం మరొకటి ఉండదని మన పూర్వీకులే సిద్ధాంతం చేశారు. త్యాగాన్ని అభ్యాసం చేసినవాడికి అసాధ్యమైనదేదీ ఉండదు. సిద్ధార్థుడు బుద్ధుడైనదీ, రాముడు దేవుడైనదీ త్యాగంవల్లనే. మంచి వాళ్ళనెప్పుడూ గౌరవించాలి. ఒకవేళ ఎన్ని ప్రలోభాలు ఎదురైనా ధర్మమార్గాన్ని విడువరాదు. కోరికల్ని జయించాలి. అపకారం చేసిన వాళ్ళకు కూడా ఉపకారం చేసి పంపాలి. బుద్ధిమంతులైనవారు ధర్మమార్గాన్ని విడువ కూడదు. తెలిసో తెలియకో పాపం చేస్తే, చిత్తశుద్ధితో పాశ్చాత్తాప పడిన వాడికి సగంపాపం నశిస్తుంది. ఓ మహర్షీ! పాపలన్నింటికీ నికృష్టమైనవి కోపం, లోభం. ఈ రెండింటినీ జయించినవాడు ధర్మాత్ములలో గొప్పవాడవుతాడు.

మహాత్మా! శిష్టాచారాలేవో చెప్పమని ధర్మవ్యాధున్ని కౌశిక మహర్షి అడుగుతాడు. దానికిగాను ధర్మవ్యాధుడు మహానుభావా! ఎన్నో గొప్పగొప్ప గుణాలు కనిపిస్తేగాని శిష్టాచారం సమకూరదు. శిష్టాచారాన్ని సాధించినవాడు ఈ కింది గుణాలన్నింటినీ పొందినవాడవుతాడు.

ధనసహాయం చెయ్యడం, సత్యమే మాట్లాడటం, ఇంద్రియాల్ని మనస్సును నిగ్రహించడం, దుర్మార్గుల్ని నిగ్రహించి లోక కల్యాణానికి పాటుపడటం, కపటంలేని శీలాన్ని కలిగివుండటం, కామక్రోధ, లోభ మోహ, మద మాత్సర్యాలను నిగ్రహించడం, తల్లి, తండ్రి, గురువులను గౌరవించడం, శాంతస్వభావాన్ని అలవర్చుకోవడం, ఎల్లప్పుడూ సంతోషంతోను, తృప్తితోను బతకడం, వేదాధ్యయనం చెయ్యడం, కపటం లేకుండా జీవించడం, వినయం కలిగి వుండటం, ఎట్టి పరిస్థితుల్లోను నీచత్వానికి దిగజారకపోవడం, నాస్తికులకు, పాషండులకు దూరంగా ఉండటం, శీలాన్ని కాపాడుకోవడం, తీర్థయాత్రలు చెయ్యడం, భూతదయ కలిగి వుండటం, మితభాషణం, హితభాషణం కలిగివుండడం.

పుణ్యాత్ముడైన ఓ కౌశికమునీ! అసూయ లేకుండా సత్ప్రవర్తనతో ప్రవర్తించిన వాడి సంతోషానికి అంతే వుండదు. కాబట్టి నీ ప్రవర్తనను శిష్టాచారములతో సరిదిద్దుకో, గురువుకు సపర్యలు చెయ్యి. ఆ విధంగా సంపాదించిన జ్ఞానం వల్ల మోహమనే సముద్రాన్ని దాటగలుగుతావు. కామక్రోధాలనే మొసళ్ళు, ఇంద్రియార్థాలనే సముద్రాన్ని దాటేందుకు ధైర్యం అనే ఓడను ఆశ్రయించు. అప్పుడు నువ్వు తప్పక ధన్యుడవు కాగలవు. సత్యం, అహింసలు దానికి ఉనికిపట్టు. అప్పుడు మనస్సు నిర్మలమైన ధర్మానికి ఆటపట్టవుతుంది. కౌశిక మహర్షీ! ధర్మాలన్నింట్లోకీ అహింస గొప్పది. ఆ అహింస సత్యాన్ని అంటి పెట్టుకొని ఉంటే అటువంటి సత్యమే శిష్టాచారాలన్నింట్లోకి గొప్పదని పెద్దలంటారు.

## కౌశికునికి అహింసా స్వరూపాన్ని తెలియజేయడం:

ఓ కౌశిక మహర్షీ! నువ్వు మొదట్లో నన్నో ప్రశ్న వేశావు. మాంసం అమ్ముకొని జీవించడం హింసకాదా! అని నీకిప్పుడు అహింసా స్వరూపం ఎలాంటిదో చెప్తాను. విను, ఏదిహింస? ఏది అహింస? అని విడదీసిచెప్పడం చాలా కష్టం.

జనశ్రుతిలో మనం తరచుగా వినేదీ, పెద్దలు చెప్పేదీ కర్మ సిద్ధాంతం. ప్రాణులు నశించడానికి మూలకారణం ఆయా ప్రాణులు చేసుకున్న కర్మఫలమే. చంపేవాడు కేవలం నిమిత్త మాత్రుడే. అదీ కాకుండా, ఫలాలు, ధాన్యాలు, కందమూలాలు మొదలైనవన్నీ కూడా జంతువులకు ఆహారంగా బ్రహ్మదేవుడు ఏర్పాటు చేశాడని వేదాలు చెప్తున్నాయి. అటువంటి వేద ప్రమాణాల్ని కాదనలేం గదా! పుణ్యాత్ముడైన ఓ కౌశిక మునీ! ఉశీనరుడి పుత్రుడైన శిబిచక్రవర్తి తన శరీరంలోని మాంసాన్ని కోసి ఇంద్రుడికి, అగ్నిహోత్రుడికీ ఇవ్వలేదా? అటువంటి శిబిచక్రవర్తికి పుణ్యం లభించలేదా? రంతిదేవుడనే మహారాజు పూర్వం వెయ్యి సంవత్సరాల పాటు ప్రతిదినం రెండువేల ఆవుల్ని వధించి సంతర్పణ చెయ్యలేదా? ఆ మహానుభావుడికేమైనా పాపం చుట్టుకుందా? వేద వేదాంగ పారంగతులైన బ్రాహ్మణోత్తములు యజ్ఞయాగాల్లో పశువుల్ని

సంహరించలేదా? వాళ్ళకు మాత్రం పుణ్యలోకాలు లభించ లేదా? అగ్నులు మాంసాహారాన్ని విపరీతంగా కోరేవని వేదాలు ఘోషించడం లేదా? అందుచేత మాంసాహారం కేవలం హింస అని అనడానికి వీల్లేదు.

పండితోత్తమా! రైతు నాగలితో భూమిని దున్నేటప్పుడు అనేక జీవరాసులు చస్తున్నాయి. మనం నడిచేటప్పుడు కూడా క్రిమికీటకాలు చస్తూనే ఉంటాయి. అంతేకాదు పంచభూతాల్లో కూడా అనేక లక్షల జీవరాసులున్నాయి. మనంచేసే పనులన్నింట్లోను అంతో ఇంతో హింస తప్పదు. అరణ్యాల్లో కందమూలాలు తింటూ నివసించే తపస్వుల్ని కూడా అహింసావాదులని చెప్పలేం. ఈ లోకంలో హింస చెయ్యని వారు ఒకడైనా ఉండడు. అయితే వీలైనంత వరకు హింస చెయ్యకుండా జీవన యాత్ర సాగించాలి. ప్రాణికోటికి కీడు చేసే సత్యం అసత్యంతో సమానం. ప్రాణరక్షణ కోసం, వివాహం జరిపించడానికి చెప్పే అసత్యం సత్యం కన్నా విలువైనది. ఇవన్నీ ధర్మసూక్ష్మాలే సుమా!

కులవృత్తి తనకు ఇష్టం ఉన్నా లేకపోయినా అటువంటి కులవృత్తిని వద్దని వేరొక వృత్తిని చేపట్టరాదని పెద్దలు శాసించారు. అటువంటి కులవృత్తి దైవమే ఏర్పాటు చేశాడని భావించుకోవాలి. కర్మఫలం అనుభవించకుండా ఎంతటివాడైనా తప్పించుకోలేదు.

## కౌశికునికి జీవలక్షణాల్ని తెలియజేయడం :

జీవుడు శాశ్వతంగా ఉండేవాడు. పాపరహితుడు. అతడు చేసిన కర్మల వల్ల అశాశ్వతమైన శరీరాన్ని పొందు తాడు. మరణించగానే దేహం నశిస్తుంది గానీ జీవుడు నశించడు. ఈ జీవుడు తాను చేసిన కర్మ ఫలాలను అను భవించేందుకు యోగ్యమైన మరొక శరీరాన్ని ధరిస్తాడు. శాశ్వతమైన పుణ్యకార్యాలు చేస్తే దేవలోకంలో జన్మిస్తాడు. పాపపుణ్యాలు కలగాపులగంగా ఉంటే మానవ జన్మ లభిస్తుంది. కేవలం పాపాలే చేస్తే జంతువులుగాను, క్రిమికీటకాలుగాను పుడతారు. కనుక ఎప్పుడూ పాపపు పనుల జోలికి పోకుండా, అసూయ, అహంకారాలు లేనివాడైతే అభివృద్ధి సాధిస్తాడు. మంచి పనులు చేయగా చేయగా దానిలో రుచి కలుగుతుంది. ఆ విధంగా ధర్మాల్ని ఆచరిస్తూ ఉండటం వల్ల మనస్సు నిర్మలమవుతుంది. చిత్తం ప్రశాంతిని పొందడం చేత ఇంద్రియ సుఖాల వ్యర్థమైనవన్న జ్ఞానం కలుగుతుంది.

సుఖాలవైపు మొగ్గుచూపిన మనిషి కోరికలకు బానిసవు తాడు. కోరికలే చాలాకాలం అలవాటైతే లోభం ఏర్పడు తుంది. లోభి నిర్దయుడవుతాడు. నిర్దయ గర్వాన్ని పెంచి పోషిస్తుంది. గర్వం వల్ల పెద్దలు చెప్పే ధర్మాన్ని వినడు. పాపకార్యాలపైన ఆసక్తి పెరుగుతుంది. దాంతో చెడు స్నేహాలు ఏర్పడతాయి. అందువల్ల మనస్సు, మాట, చేతలు ఒకదానికొకటి పొంతన లేకుండా పని చేస్తాయి. దాంతో ఇహానికీ, పరానికీ కూడా చెడినవాడవుతాడు. కాబట్టి విషయ భోగాల నుండి మనస్సు దూరంగా ఉండాలంటే సాధువులతో సహవాసం చెయ్యాలి. నాబోటి వారు చెప్పదగింది కాదు. అయినా అడిగావు కాబట్టి, బ్రాహ్మణోత్తములకు ఆధ్యాత్మిక తత్త్వకోవిదులకు వినయంగా నమస్కరించి బ్రహ్మజ్ఞానాన్ని గురించి నాకు తెలిసినంత వరకు వివరిస్తానంటాడు ధర్మవ్యాధుడు.

## ధర్మవ్యాధుడు బ్రహ్మజ్ఞానాన్ని తెల్పడం :

బ్రహ్మజ్ఞానం గురించి ధర్మవ్యాధుడు ఇలా చెప్తాడు. గొప్ప ఆత్మగల కౌశికమహర్షీ! ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, భూమి పంచభూతాలు. వీటి గుణాల్ని చెప్తాను విను. ఆకాశానికి గుణం శబ్దం, వాయువుకు గుణం స్పర్శ, అగ్నికి గుణం రూపం, నీటికి గుణం రసం, భూమికి గుణం గంధం. ఈ భూతాలన్నీ పుట్టేటప్పుడు ఒకదానిలో నుండి ఒకటి పుట్టుకొస్తాయి. అనగా ఆకాశంలో నుండి వాయువు, వాయువులో నుండి అగ్ని, అగ్నిలో నుండి నీరు, నీటిలో నుండి భూమి పుడ్తాయి. అలాగే ఇవి లభించేటప్పుడు అనులోమ క్రమంలో లభిస్తాయి. అనగా భూమి నీటిలో లయిస్తుంది. వాయువు ఆకాశంలో లయిస్తుంది.

ఇంద్రియాలు ఐదు. ఇవి చెవి, చర్మం, కన్ను, నాలుక, ముక్కు వీటి తన్మాత్రలు ఈ క్రమంలో ఉంటాయి. చెవికి తన్మాత్ర శబ్దం, చర్మానికి తన్మాత్ర స్పర్శ, కన్నుకు తన్మాత్ర రూపం, నాలుకకు తన్మాత్ర రసం, ముక్కు తన్మాత్ర గంధం. ఈ భూత ప్రపంచమంతా 'అవ్యక్తం' అనే

తత్త్వంలో ఉదయించి, మళ్ళీ అవ్యక్తంలోనే లయిస్తుంది. బ్రహ్మ విద్యా ప్రపంచం అనగా వేదాంత జ్ఞాన విస్తారం. ఇందులో సృష్టికి ఆద్యప్రకృతి అయిన మూలపదార్థాన్ని గురించి ఒక్కొక్క మతం ఒక్కొక్క సిద్ధాంతాన్ని నెల కొల్పింది.

ఇంద్రియాలు శబ్దం, రూపం, గంధం మొదలైన భోగ సాధనాల్లో చిక్కుకొని ఇష్టానుసారంగా ప్రవర్తిస్తూ ఉం టాయి. బుద్ధిమంతుడైన వాడు తపస్సు చేసి జ్ఞానాన్ని ఆర్జించి ఇంద్రియాల్ని నిగ్రహించాలి.అటువంటి మహాను భావుడు సర్వభూతాలలోను తనను తెలుసుకుంటాడు. తనయందు అన్ని భూతాల్ని తెలుసుకోగలుగుతాడు. తపస్సుపట్ల మనస్సు నిశ్చలమైన యోగి ఇంకా కోరు కోవడానికేముంటుంది? ఇంద్రియాల్ని నిగ్రహించినవానికి స్వర్గం, ఇంద్రియాల్ని నిగ్రహించలేని వారికి నరకం ప్రాప్తిస్తుంది. ఈ దేహమే ఒక రథం. ఇంద్రియాలే ఆ రథానికి పూన్చిన గుర్రాలు. ఆత్మయే ఆ గుర్రాల్ని అదుపులో ఉంచే గొప్ప సారథి. నిశ్చల చిత్తం అనే పగ్గాల్ని చేతబూని గుర్రాల్ని ఎవడు అదుపులో పెట్టుకుంటాడే అలాంటివాడే ధీరుడు. అటువంటి క్షేమమైన మార్గంలో ప్రయాణం చెయ్యగలుగుతాడు. ఇంద్రియాలు ఆకర్షిం చిన చోటుకు మనస్సు పరుగుతు తీస్తూ ఉంటుంది. ఆ వేగాన్ని అదుపులో పెట్టకపోతే, నడి సముద్రంలో పెనుతుపానుకి మునిగిపోయే ఓడవలె, బుద్ధి పెడ మార్గాన పోతుంది. ఐదు ఇంద్రియాల్ని తన వశం చేసు కున్నవాడే జ్ఞానయోగి. అలాంటివాడు దేవతలు, ఋషుల చేత పూజించబడతాడు.

**కౌశికునికి త్రిగుణాలు గురించి చెప్పడం :**

ఓ కౌశిక మునీ! తమోగుణం ఈ మూడు గుణాల్లోనూ హేయమైంది. అనాకారిగా ఉండే రూపం, నిద్రమత్తులో ఉండటం, హీనత్వం, సహనం లేకపోవడం అనేవి తమో గుణ లక్షణాలు. రజోగుణం సత్త్వ తమోగుణాల మిశ్రమం. దురాశ, పిసినిగొట్టుతనం, జడత్వం, దురహంకారం రజోగుణ లక్షణాలు. సత్త్వగుణం జ్ఞానంతో కూడుకున్నది. ఆపదలొచ్చినా చలించని మనస్తత్వం, మానసిక సంతృప్తి, జాలి, సంతోషం, తెలివితేటలు మొదలైనవి సత్త్వగుణానికి లక్షణాలు. సత్త్వగుణం కలవాడు ఈ జన్మలో బీదవాడైనా మరుసటి జన్మలో వైశ్యుడై పుడ్తాడు. ఆపై జన్మలో క్షత్రియుడు, బ్రాహ్మణుడుగా పుట్టి అటు పిమ్మట జన్మ రాహిత్యాన్ని పొందగలడు అని ధర్మవ్యాధుడు చెప్తాడు. ఓ ధర్మవ్యాధుడా! నీవలన ఇప్పటికే అనేక విషయాలు తెలుసుకున్నాను. మానవ శరీరంలో ధాతువుల వలన అగ్ని ఎలా ప్రజ్వరిల్లుతుందే చెప్పమని కౌశికుడు అడి గాడు.

అందుకుగాను ధర్మవ్యాధుడు ఇలా తెలియజెప్పాడు. పంచప్రాణాలు 1.ప్రాణం 2.అపానం 3.ఉదానం 4.వ్యానం 5.సమానం. ఇవన్నీ వాయువు రూపంలో ఉం టాయి. ఆత్మాగ్ని నాభి నుండి శిరస్సు వరకు వ్యాపించి ఉంటుంది. ప్రాణుడు అనే వాయువు ఈ అగ్ని మధ్య శిరస్సులో సంచరిస్తూ ఉంటుంది. అతడే అన్ని భూతా లకూ జీవత్వాన్ని ప్రసాదిస్తాడు. అపానుడు ప్రాణికి తోడుగా ఉంటూ ఎల్లప్పుడూ అగ్నిని ప్రజ్వరిల్లజేస్తూ ఉ ంటాడు. ఈ అపానుడే ముడ్డి, పొత్తి కడుపుల మధ్యన అగ్నిని ప్రజ్వరిల్లజేస్తూ ఉంటాడు. అతడి సాయంతోనే మలమూత్రాలు విసర్జించబడతాయి. ఉదానుడు అనే వాయువు కంఠంలో ఉంటూ కర్మ తంత్రాన్నంతా నడి పిస్తూ ఉంటాడు. వ్యానుడు అనే వాయువు శరీరంలోని వివిధ అవయవాల్ని ఒక దానితో మరొకటి కలసి ఉండే (జాయింట్) ప్రదేశాల్లో ఉంటుంది.

సమానుడు అనే వాయువు నాభి ప్రదేశంలో ఉండి తిన్న ఆహార పదార్థాల్ని జీర్ణమయ్యేట్లు చేసి శరీరంలోని ధాతువులు వృద్ధి అయ్యేట్లు చేస్తుంది. ఈ సమానుడే ఆత్మాగ్నికి ప్రాణాపానాలకు తోడై సహకరిస్తాడు. కౌశికుడా! పంచప్రాణాల్నిగాని, ఆత్మాగ్నిగాని యోగదర్శనం వలన మాత్రమే తెలుసుకోగలుగుతాడు. వేరే మార్గాంతరం లేదు. నిష్ణాతులైన ఋషులు ఆత్మను మూర్ధ ప్రదేశంలో ధరిస్తారు. ప్రాణుడు, అపానుడు అనబడే వాయువులతో కలసిమెలసి నడయాడే అగ్నినే జీవాత్మ అంటారు. ఈ జీవాత్మ నీటిలో తడిసిపోని తామరాకువలె, దేహంలో నిర్లిప్తుడై ఉంటాడు. ఆ జీవాత్మయే పరమాత్మ. అచేతన మైన దేహానికి చైతన్యాన్నిచ్చేది ఈ జీవాత్మయే. అతడు

ముల్లోకాలను సృష్టించగల సమర్థుడు. అనేక నామ రూపాలతో విలసిల్లుతూ జగత్తులో అంతర్లీనమై ఉన్న ఏకత్వాన్ని సూక్ష్మదృష్టితో దర్శించగల జ్ఞానులు అద్వైతునిగాను, శాశ్వతుడుగాను, భూతాత్మునిగాను గుర్తిస్తారు.

జ్ఞానాన్ని ఆర్జించిన మహానుభావుడు మంచి పనులలో గానీ, చెడు పనులలోగానీ నిర్లిప్తుడుగా ఉం టాడు. సుఖదు:ఖాల్లాంటి ద్వంద్వాలకు అతీతుడు. అట్టి మహాను భావుడు చెయ్యాల్సిన కర్తవ్యాలిలా ఉంటాయి. ప్రతిదినం అతడు యోగసాధన చేస్తూ మితాహారియై, ఇంద్రియాల్ని నిగ్రహించి, ఆత్మలో పరమాత్మను దర్శించి గాలిలేని చోట వెలిగే జ్యోతిలా నిశ్చలుడై ప్రకాశిస్తాడు.

ఓ కౌశికమునీ! కామక్రోధాలను పూర్తిగా విడిచిపెట్టాలి. మనస్సు పరిపక్వమైన వారికిది ఒక్కటే ఉత్తమమైన మార్గం. మానవుడు విడవకుండా కర్మల్ని చేస్తూనే ఉం డాలి. అయితే కర్మఫలాన్ని మాత్రం కోరుకోరాదు. అయితే విధి విరామం లేకుండా కర్మల్లోనే మునిగి ఉండటం మంచిదికాదు. జ్ఞానాన్ని ఆర్జించిన బ్రాహ్మణుడు కర్మల్ని భగవదర్పణ బుద్ధితోనే చేస్తూ వేదాంతిగా బతకాలి. ఓ కౌశికుడా! నువ్వడిగి విషయాలన్నింటినీ నాకు తెలిసి నంత వరకు చెప్పాను. ఇంకేమైనా అడగాలనుకుంటు న్నావా? అని ధర్మవ్యాధుడు అడగగానే కౌశిక మహర్షి నువ్వు చెప్పిన విషయాల వల్ల ఆధ్యాత్మికంగా మేలుకోగలి గాను. నువ్వు అన్ని విషయాలు తెలిసిన సర్వజ్ఞుడవని తెలుసుకున్నానని అంటాడు.

## ధర్మవ్యాధుడు కౌశికమహర్షిని తల్లిదండ్రుల వద్దకు తీసుకువెళ్ళడం :

ధర్మవ్యాధడు కౌశిక మహర్షిని తల్లిదండ్రులున్న గదిలోకి తీసుకొనివెళ్ళాడు. గదికి నాలుగు వైపులా వసారాలుండి గాలి వెలుతురు పుష్కలంగా వస్తుంది. తల్లిదండ్రులు తృప్తిగా భోజనం చేసి విశ్రమించి ఉన్నారు. ధర్మవ్యాధుడు వారివద్దకు పోయి తల్లిదండ్రులకు నమ స్కరించి వాళ్ళ యోగక్షేమాల్ని విచారించాడు. అప్పుడతడి తల్లిందండ్రులు ఇలా అన్నారు.

## ధర్మవ్యాధుడి తల్లిదండ్రులు :

కుమారా! నీవంటి కుమారుడుండగా మాకేమి లోటు ఉంటుంది? నువ్వు ధర్మమూర్తివి. నువ్వు రక్షిస్తున్న ధర్మమే నిన్ను రక్షిస్తుంది. నువ్వు చిరకాలం సుఖసంతోషా లతో వర్ధిల్లుతావు. నువ్వు నిజంగా దేవతల్లో ఎంచదగిన వాడవు. త్రికరణశుద్ధితో మమ్మల్నిద్దర్నీ ఆరాధిస్తున్నావు. తల్లిదండ్రుల్ని ఆరాధించిన వారిలో ముందు నీ పేరు చెప్పాలి. తర్వాతే పరశురామున్ని చెప్పాలి.

ఓ కౌశికుడా! నేను తల్లిదండ్రులకు సేవలు చెయ్యడం వల్లనే నాకీ జ్ఞానం కలిగింది. లోకంలో కోరికలు కోరేందుకు దేవతల్ని పూజిస్తారు. నాకు మాత్రం తల్లి దండ్రులే ప్రత్యక్ష దైవాలు. వీరే నా పాలిట దేవతలు. నేను, నా భార్య, పిల్లలు ప్రేమతో వారిద్దరికీ సేవలు చేస్తూ ఉంటాం. 'వీరి సేవయే మాకు యజ్ఞంతో సమానం. అదే వేదం. అదే మా వ్రతం' అన్న భావన లోతుగా నాటుకు పోయింది. పుణ్యం కోరే గృహస్థుడు, తల్లి దండ్రుల్ని, గురువును, అగ్నిని, ఆత్మ అనే అయిదుగుర్ని అర్చించి సంతోషపెట్టాలి. అట్టి గృహస్థుడే ధర్మాత్ముడు.

ఓ కౌశిక మహర్షీ! నీ తల్లిదండ్రులు కడు ముసలివారు. వారికి నువ్వు ఒక్కడివే కుమారుడవు. వాళ్ళు నీ మీదే ఆశలు పెట్టుకొన్నారు. నువ్వు వారిని వదిలి పెట్టావు. వదిలి పెట్టి వెళ్ళేముందు వారి అనుమతి తీసుకోలేదు. వేదాధ్యయనం చేసి, జ్ఞానాన్ని సంపాదించి తరించాలను కున్నావు. కానీ కఠినమైన నీ ప్రవర్తన వలన ఏడ్చి ఏడ్చి వారు గ్రుడ్డి వారయ్యారు. ఇకమీదట అయినా వారికి సేవలు చేస్తూ వారి శోకాగ్నిని చల్లార్చు. నీ చదువుగానీ, పుణ్యంకోసం నువ్వు పడ్డ శ్రమగానీ తల్లిదండ్రులకు సేవలు చెయ్యకపోతే వ్యర్థమవుతాయి. నేను చెప్పినట్లు నడుచుకో. నీకు మేలు జరుగుతుందంటాడు ధర్మ వ్యాధుడు.

కౌశికమహర్షి ధర్మవ్యాధుడితో ఓ ధర్మవ్యాధుడా! నువ్వు చెప్పిన మాటలన్నీ యదార్థాలే. నాకు మేలు చేకూర్చేవే. నువ్వు చెప్పిన విధంగానే నడచుకుంటాను. నా తల్లిదండ్రులకు సేవలు చేసి జన్మధన్యం చేసుకుం టాడు. నీతో స్నేహం నా అదృష్టంగా భావిస్తాను. నా మనస్సెంతో సంతోషంగా ఉంది. నువ్వే నా పాలిట భగవంతుడవు. మంచి గుణాలకు నెలవైన ఓ ధర్మ

వ్యాధుడా! నిన్ను గురించి ఆలోచిస్తుంటే నాకు చాలా ఆశ్చర్యం వేస్తుంది. ఇంతటి జ్ఞానివి నువ్వు. ఏ కారణంచేత శూద్రజన్మను పొందావు? అనగానే ధర్మవ్యాధుడు తన పూర్వజన్మ వృత్తాంతం ఇలా చెప్పాడు.

ప్రజలచేత కీర్తించబడిన ఓ కౌశికమునీ! నేను పూర్వ జన్మలో ఒక బ్రాహ్మణుడను. వేదవాదాంగాలన్నీ నేర్చాను. ఒక రోజున నేను కూడా మహారాజుతోపాటు వేటకు వెళ్ళాను. రాజుతో స్నేహం ఏర్పడటం వల్ల విలువిద్య కూడా నేర్చుకున్నాను. నేను కూడా అనేక జంతువుల్ని చంపాను. పొరపాటున ఒక బాణంపోయి గడ్డిచాటున తపస్సు చేసుకుంటున్న ముని కుమారుడికి తగిలి బాధతో గిలగిలా కొట్టుకుంటున్నాడు. నేనప్పుడా బ్రాహ్మణుని వద్దకుపోయి ఓదార్పు మాటలు చెప్పాను. అయినా ఆ ముని కోపించి "నువ్వు బ్రాహ్మణుడవై పుట్టి కూడా హింసాకృత్యాలకు పూనుకున్నావు. కాబట్టి నువ్వు వచ్చే జన్మలో శూద్రుడవై జన్మించు. బోయవాడివై బ్రతుకు" అని శపించాడు. 'నా శాపానికి తిరుగుండదు. శూద్రుకుడా జన్మించినా నీ ధర్మం, పరిజ్ఞానం, పూర్వజన్మ స్మృతులు గలవాడవవుతావు. అటు తర్వాత జన్మలో తిరిగి బ్రాహ్మణుడిగా జన్మించగలవు" అని అన్నాడు ఆ బ్రాహ్మణుడు.

కౌశిక మహర్షి, ఓ ధర్మవ్యాధుడా! నువ్వు పుణ్య పురుషుడవు. నీ జీవితం ధన్యమైంది. ఎన్నడూ ధర్మాన్ని విడువనివాడవు. నీ చరిత్ర వల్ల ధర్మం విస్తరిస్తుంది. నీకు ఎల్లపుడూ మేలు కలగాలని కోరుకుంటున్నాను. నిన్ను కలుసుకోవడం వల్ల నా జన్మ ధన్యమైంది. నీ మూలంగా ధర్మ సూక్ష్మాలను తెలుసుకొన్నాను. నాకు జ్ఞానభిక్ష పెట్టావు. నాకు సెలవు ఇప్పించి అనుగ్రహించు. వెళ్ళి వస్తాను. కౌశికముని ధర్మవ్యాధునికి ప్రదక్షిణ నమస్కారం చేసి తన ఆశ్రమానికి వెళ్ళాడు.

ఓ ధర్మరాజా! నువ్వడిగిన ప్రశ్నలు 1.పతివ్రతా మహిమ 2.తల్లిదండ్రుల సేవావిశేషం 3.తక్కువ కులంలో పుట్టినవాడు ధర్మాత్ముడై వెలుగొందే విధానం గురించి నీకు వివరంగా చెప్పడం జరిగిందని మార్కండేయ మహర్షి చెప్పారు.

**ముగింపు :**

ఆంధ్రమహాభారతంలో ధర్మవ్యాధుని వృత్తాంతాన్ని వివరిస్తూ ధర్మవ్యాధుడు తన కులాచారాన్ని అనుసరించి మాంస విక్రయం చేసేవాడని వర్ణించాడు. కౌశికుడనే బ్రాహ్మణుడు పతివ్రత సలహాపై మిథిలానగరానికి వెళ్లి ధర్మవ్యాధుని ఇంటి జాడ తెలుసుకొని వెళ్ళి అచట ముందట నల్ప మృగమాంస ఖండంబులం గడింబ చరించి యమ్ముచున్న వానిని ననవరత విక్రయాగత జన సమావృతునక్కిరాతుం చూచాడట (ఆంధ్రమహాభారతం అరణ్య. 5-27). కౌశికుడు ధర్మవ్యాధునితో సంభాషిస్తూ జీవహింస చేయడం ధర్మం కాదుకదా అని ప్రశ్నించగా అపుడు ధర్మవ్యాధుడు కౌశికునితో..రాజులకు దండ నీతియు..... పరమ ధర్మం బయి చెల్లునట్లుగా మాకును మృగయోపజీవనంబు పరమ ధర్మంబు విశేషించి యిది వంశ క్రమాగతంబయిన యాచారంబు (ఆంధ్రమహాభారతం అరణ్య 5-32)అని సమాధానం చెబుతాడు. రాజులకు దండనీతి కుల ధర్మమయినట్లుగా బోయలకు వంశపారంపర్యంగా లభించే ఆచారం మాంస విక్రయమని భావం.

ఈ విధంగా కౌశికుడు ధర్మవ్యాధుడు వద్దకు వెళ్లడం, ధర్మవ్యాధుడు ధర్మోపదేశం చేయడం, అహింసా స్వరూపం తెలియజేయడం, జీవలక్షణాల్ని చెప్పడం, అంతేగాక బ్రహ్మజ్ఞానాన్ని, త్రిగుణాలు గురించి కూడా చెప్పడం, కౌశికున్ని ధర్మవ్యాధుడు అతని తల్లిదండ్రులకు వద్దకు తీసుకెళ్ళి అతని పూర్వజన్మ గురించి చెప్పడం వంటి వాటిని ఎఱ్ఱాప్రగడ ఆంధ్రమహాభారతం అరణ్యపర్వం పంచమాశ్వాసంలో తెలియజేశారు.

# నేను తోలు మల్లయ్య కొడుకుని కథ ... ఒక పరిశీలన

– నోముల రాజు, పరిశోధక విద్యార్థి, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, జానపద గిరిజన పీఠం, ఓరుగల్లు, వరంగల్, తెలంగాణ.

సమాజానికి హితాన్ని కల్గించేదే సాహిత్యము. కాబట్టి, సాహిత్య ప్రక్రియలలో భాగంగా దళిత సాహిత్యం ఉంది. అందులో భాగంగానే దళితుల జీవన సంస్కృతిపై రాసిన కథలె దళిత కథలు. ఈ దళిత సామాజిక వర్గంలో పుట్టినదే నేటి మన ఈ కథకురాలు యం.ఎస్.కె. కృష్ణజ్యోతి. కథా రచయిత్రి తండ్రి గారు శ్రీ కృష్ణమూర్తి గారు.తల్లి సాయినందిని గారు. ప్రస్తుతం రచయిత్రి నెల్లూరు జిల్లా కావలి మండలంలో బయోసైన్సు టీచర్‌గా పనిచేస్తుంది. ఈమె ఎక్కువగా సామజిక అంశాలమీద, దిగువతరగతి జీవితాంశాల పైన కథలు రాశారు. కథా రచయిత్రి జాతీయస్థాయిలో అనేక సందర్భాలలో 22 కథలు రాశారు. అందులో ఒకటి" నేను తోలుమల్లయ్య కొడుకుని కథ.

ప్రాచీన కాలంలో కథ అనగా కల్పన కల్గినదని చెప్పే వారు. కాని, నేటి ప్రాచిన కాలంలో సమాజ స్థితిగతులను తెల్పుతున్నాయి. "కథ"ను గురించి శ్రీపాదసుబ్రహ్మణ్య శాస్త్రి ఈవిధంగా అంటారు. "ఒక" చిన్న కథ మనిషి జీవితంలో రసవత్తరమైన ఒక ఘట్టాన్ని జటిలమైన ఒక అనుభూతిని హృదయం మీద అచ్చు గుద్దుతుంది అంటారు.

రచయిత్రి "నేను తోలు మల్లయ్య కొడుకుని" అను కథలో మారయ్య అను మాదిగను కులవృత్తిలో భాగంగా పాత్రను ఇచ్చి ఇలా చెప్పింది. ఆదివారమున మాకు "పెద్దకుర (గొడ్డు కూర)" పండుగ అని వారం రోజులు ఉండో లేకో కష్టపడి సంపాదించిన దానితో ఈ రోజు కడుపు నిండా తృప్తిగ బువ్వ తింటం అని చెపుతుంది పాత్ర ద్వారా రచయిత్రి. ఆదివారం పెద్దకూర తిని నాటు సారత్రాగడం అంటే పండుగలా ఉందంది. దానిని బట్టి మాదిగలది కాయకష్టం చేసుకుని వారానికి ఒక్కసారైన గొడ్డు మాంసం తినడం ఆనాటి వాళ్ళ సామాజిక జీవి తంలో పండుగని అర్థమవుతుంది.

అదేవిధంగా గొడ్డుకూర తినడం ప్రపంచ మానవ సంస్కృతిలో భాగంగా మాదిగలలో కొనసాగుతుందని, అది వారికి" మంచి పౌష్టికాహారం" అని మాకు తెలియక పోయేది అని (కంచె ఐలయ్య) వివరించారు ఆ రోజోల్లో.[2] అంతేగాక మాదిగలు గోమాంసంతో తయారుచేసే వివిధ రకాల వంటలున్నాయి.

మారయ్య ఇంకా సోమవారం నుండి శనివారం వరకు చెప్పులు కుట్టుకుని జీవించడమే. అందుకని అతడు దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. అదెలా ఉందంటే భూమిపై రెండు గోనెసంచులు, సుత్తి, ఆరె, దారం, బంక, నాలుగు జతల పాత చెప్పులు వేసుకొని, ఆపైన రక్షణగా పాలిథీన్ కవరు బరిగెలకు కట్టుకొని పని చేస్తాడు. ఆర్భాటాలు ఏమి లేని దారిద్ర్య జీవనాన్ని అతని పని ప్రతిబింబిస్తుంది. ఆలా నలభై ఏళ్ళుగ అలవాటు పడి నాడు మారయ్య. ఆ ఊర్లోకి ఎన్‌టిఆర్, చంద్రబాబు లాంటి వాళ్ళు వచ్చినపుడు జనం ఇరగబడి చూడడానికి ఎల్లిన ఇతను మాత్రం తన పనిని దైవంగా నమ్ముకుని ఒక అడుగు కూడ పక్కకు జరిగింది లేదనేది రచయిత్రి మారయ్యా పాత్రద్వార తెలిపింది. సినిమాలు నడుచు గృహసమీపమున రాత్రి రెండవ చిత్రం విడుదలైనంత వరకు ఉంటేగాని ఆదివారం తృప్తిగా తినలేడు. అందుకని ఆ సమయం దాక వేచి ఉండేది. కాని ఇప్పుడు పెళ్లయింది,అదే విధంగా చెప్పులు తెగితే కుట్టించుకునే వారు లేనందున మారయ్య తొందరగానే ఇంటికి పోయేవాడని తెలుస్తోంది.

రచయిత్రి ఈనాడు మనుషులు ఎన్నిరకాలుగా పాద రక్షలు వాడుతున్నారో తెలుపుతున్నారు. అవి నాలుగు రకాలు (1) వాకింగ్ కు (2) ఇంట్లో తిరగడానికి (3) ఆటలకోసం (4) దారెంట పోవుటకు అను విధాలుగా వున్నాయి అని తెలిపింది. అదేవిధంగా వేసుకొనే శరీర

వస్త్రాల రంగులను బట్టి చెప్పులు మార్చడం, అది కాస్త జీర్ణం కాకముందే పారేయడం చేస్తున్నారు. పాతకాలంలో లాగ ఈ రోజు నడవడమనేదే లేదు కనుక చెప్పు తెగదు. దాన్ని కుట్టరు అని వివరించారు. కాని, మారయ్య కుటుంబం మాత్రం పెరుగుతుంది, వయస్సు పెరుగుతుంది, అలాగే నిరుద్యోగం కాలం పెరిగి ఆదాయం తగ్గుతుందని రచయిత్రి మారయ్య పాత్ర ద్వార వివరించారు.

మారయ్య ప్రతి దినం దుకాణం తెరుస్తూనే ఎదురుగ ఉన్న ముస్లిం మహిళ షబానా కిరాణా దుకాణం వైపు చుసేటువంటివాడు. ఆలాగే ఆమె కూడా అతనిని చూసేదని, ఒకవేళ అతను షాపుకు రాకున్న, ఆలస్యంగా వచ్చిన అతనికై ఆతురతగా వెదకిచూసేదని, దాని ద్వార మొదటగా అనచబడ్డ వాల్ల బతుకుల మనుసులు తెలియకనే అల్లుకున్నది అని తెలుస్తోంది. షబానా బతుకులేక ఎదో కొట్టు నడిపిస్తుంటే మగాళ్ళు దుకాణం వంకగా వచ్చి ఆమెను పిచ్చి చూపులు చుసేటీవంటివారు. బురక చాటులో ఉండాల్సిన ఈమె బతుకు పోరు చేస్తు వచ్చినవారిని ఏ మాత్రం కన్నెత్తి చూడనే చూడలేదు ఒక్క మారయ్యను తప్ప.

ఆలాంటి సమయంలో మారయ్యకు కూడ ఆమెపై మనసు ఉండేది. కాని పెళ్లి చేసుకొనే ధైర్యం చేయలేదు. కారణం ముస్లింలకు హిందువు మారయ్యకు మతగోడలు పడగొట్టే ధైర్యం ఆ రోజుల్లో చేయలేక పోయేవారని తెలుస్తోంది. కాని వాళ్ళు ఎప్పుడు చూపులతో పలకరించుకొని, క్షేమాలు కోరుకొనే వారుగ ఉండేవారు. అంతేగాక ముస్లిం, మాదిగల ఆహారం పద్దతులు కొన్ని కలిసి ఉండడంచే మారయ్య శరీరం కానీ, అతని అభిరుచులుగాని షబానాకు ఇష్టంగా ఉండేదని తెలుస్తోంది. అలా బతుకేపోరైన జీవితంలో షబానకు కల్సివచ్చినవి ఏమిలెక పెండ్లికాకుండానే ముసల్ది అయిపోయిందని రచయిత వివరించింది అంతేగాక ఈమె తీరు చుస్తే ఆ జాతిని తిస్కెల్లి ఏ పాడుబడ్డ బావిలో పారవేశినట్లుగా ఆనాటి పరిసస్థితులకు బింబంగా వివరించారు. అందుకని మారయ్యకు ఇష్టమైన షబానా రాత్రివేళ భార్యకు బదులు షబానే కనబడుతుందని వివరించింది.

కొంత సమీపంలో జగ్గయ్య అనే పంతులు నీలం రంగు అంగివేసుకొని మన కథానాయకుడు మారయ్య దగ్గరకు నడుస్తూ వస్తుంటాడు. ఇతను బయటకి అంగేసుకొని తెల్లగ,హుందాగా కనబడతాడు. ఇంటికేల్తే అంగివిప్పి అర్ధ నగ్నంగ ఉంటాడు అని అర్థం. ఇక్కడ మారయ్య మాత్రం ఎప్పుడు గదే చాలి చాలని అర్ధనగ్న దుస్తులు ధరిస్తాడని వివరించింది. అయితే వీరిద్దరు చిన్నప్పటి నుండి స్నేహితులు, నాలుగవ తరగతి దాక కలసి చదువుకున్నోల్లు. పంతులు చెంపలుజారి, మెడసన్నబడి వంగినట్లు కానబడ్డడు. కాని గొడ్డుకూర తిన్న మారయ్య మాత్రం గట్టిగ ఉన్నాడని ఇందు వర్ణించింది.

పైన చెప్పినట్లు నడుస్తు వచ్చిన పంతులు తన దంటగాడు అయిన మారయ్య వద్ద చిన్న చెక్క బల్ల మీద కూర్చొని కుశల ప్రశ్నలు వేసుకుంటారు. ఆలాగే వారి చిన్ననాటి గుర్తులు గుర్తువచ్చి మారయ్యకు అప్పటి వృత్తిలో భాగమైన తోలు, తోలు సంబందిత పనులన్ని ఆకర్షించి అదొక గొప్ప దానిని నేర్చుకుంటుండగ, బడికి రావాలని జగ్గయ్య వేడుకున్న విధం వివరించారు. ఒకరోజు అలసిపోయేవరకు ఆడుకుని ఇంటికి వస్తున్న సమయంలో దళిత స్నేహితుడైన మారయ్య తన మిత్రుడు బ్రాహ్మణ జగ్గయ్యను నీళ్ళు ఇయ్యమని అడగగా చిన్నతనం నుండి కపటం లేని ఆ జగ్గయ్య వాళ్ళు నిత్యం వాడుకునేన చెంబుతో నీల్లియ్యగ, మారయ్య తాగుతుండగా జగ్గయ్యతండ్రి పెద్దపంతులు వచ్చి ఎవ్వని కొడుకువురా నీవు? అని అహంకారంగ అడగగా మారయ్య నేను తోలు మల్లయ్య కొడుకుని అని సమాధానం ఇయ్యగ, ఐతే నువ్వు చెంబు పట్టుకొని మీ ఇంటికి పో. ఇటువైపు రాకు అంటు తన కొడుకైన జగ్గయ్యను లోనికి లాక్కెల్తాడు. అయితే దీనిని బట్టి అప్పటి కాలంలో బ్రాహ్మణులు మాదిగలను (ఆహారపానీయాలు) అంటనిచ్చేది కాదని తెలుస్తోంది.

ఆ చెంబుని పట్టుకొని, ఓ అపురూప వస్తువుని మెచ్చుకొని ఇచ్చినట్లుగ ఆనందిస్తూ, దళిత మారయ్య బాలుడు ఇంటికి వస్తాడు. అది చుసిన వాళ్ళ అవ్వ ఎక్కడిది బిడ్డ ఈ చెంబు? ఎన్నడు చూసి ఎరుగదు కనుక ఆతురత పడ్తు అడుగుతుంది. దానికి అతడు నాకు పెద్దపంతులిచ్చాడు అన్నాడు. దానికి వాళ్ళ అమ్మేమో దీన్ని ఎందుకు తెచ్చినావు? వాళ్ళు నిన్ను తిట్టార? కొట్టార బిడ్డ ! అని అడగగ లేదు అని ఇతను సమాధానం ఇచ్చాడు. ఆయన మంచోడు కాబట్టి వదిలాడు. వేరేవారైతే చెంబును ముట్టుకుంటే ఏమి చేసేవారో అని భయపడుతుంది. బిడ్డ! నీకు దాహమైతె ఉన్న వారి ఇండ్లలో దోసిటితో నీళ్ళు త్రాగాలి అని వాళ్ళ అమ్మ చెప్పింది. దీనిని బట్టి ఆ రోజుల్లో అస్పృశ్యత బూతం ఎక్కువగా ఉండేదని చెప్పవచ్చును.

ఇలాగే ఒక పాలెంలో పనికి పోయిన కాడ మారయ్య కులంకాని ఇంట్లో పనిచేస్తూ చేతులుకడుక్కొని దండెం పైనున్న వారి తువ్వలకు తుడ్చుకోగా ఇంటి ఆవిడా దానిని నువ్వేతీసుకుపో. ఇక మాకొద్దు అనగ మారయ్య కు అప్పటికి మతి చెదిరింది. అంటే మొన్నటి చెంబు, నేటి తువ్వాలతో చూసినట్లయితే అవి రెండు నా జీవితాన్ని ఎగతాళి చేస్తూ, వాటికున్న విలువలు మాకు లేవాయనే అని దుఖించాడని అర్థం. అంతేగాక ఒక ప్రత్యేక విషయం ఏంటంటే ఆరోజులలో చర్చిలలో తిండి కాడ సమానం చేపట్టినను ఇంటికాడ తేడాలే చూపించే వారని తెలిసింది. అలాగే మారయ్య తండ్రి అతనికి ఈ విదంగా చెప్తున్నారు. తోలుతో ముడి పడిన మన జీవితం ఆ తోలే మనల్ని తినేస్తుంది. కావున ఆ తోలుపనిమాని చెప్పులు కుట్టుకో అని చెప్తాడు. ఆ తోలుతో పని చెయ్యడమంటే ప్రమాద మైనదే అని అర్థం అయిన మాదిగలు సమాజానికి సేవ చేస్తూ వచ్చిన, ఇచ్చిన పైకంతోనే ఆకాలంలో జీవించే వారని తెలుస్తోంది. అదంత వారి ఇద్దరి మద్య చిన్న నాటి జ్ఞాపకాలే.

మారయ్య తన దగ్గరికి వచ్చిన జగయ్య పంతుల్ని మీ పిల్లలు ఎలా ఉన్నారు అడిగారు. ఎందుకంటే ఆ నాడు ఒకరింటికి ఒకరు పోయేవరుకాదని తెలుస్తోంది. అప్పుడు మారయ్య ప్రశ్నకు బదులుగా ఈనాటి నా పిల్లలు అటు పూజలు చేయడానికి రాదు, ఇటు జాబులు రావు. అలాగని ఏ పని చేయడానికి రాదు అని చెప్పాడు. ఏదైనా పని కావాలని తిరుగుతున్నారు. అది విన్న మారయ్య మాత్రం వెంటనే మా లాంటి వాళ్ళని నేలకు తొక్కినా పాపం అనుభవిస్తున్నరేమో? అని నవ్వుతూనే చురకలు పెట్టాడు మారయ్య. ఇది రచయిత్రి వేసిన ఒక గొప్ప ప్రయోగమే.

ఆ తరువాత మారయ్య అన్న మాటలకు బ్రాహ్మణ జగ్గయ్య మాత్రం పాత కాలం నాడు గొడ్డు కాసుకొని గొడ్డు మాంసం తింటు బతికామట. క్రమంగా రాజుల్ని, రాజ్యల్ని ఏలామట. కాని ఇప్పుడు మీ వంతు కావచ్చు అని జగ్గయ్య (పాత్ర) చేత పలికించిన ఒక గొప్ప శుభా సుచికమే మాదిగలది.

మిత్రుడు జగ్గయ్య మారయ్యని మరి నీవెప్పుడు ఏళ్తావు రాజ్యాన్ని అని అనగా ముందైతే మా మనవడికి జ్వరం వచ్చింది డబ్బులయితే అప్పుగా ఇవ్వు అని అంటాడు. పైసలు తిసుకుంటునే ఆ రాజ్యాలు మకొచ్చి నట్లయితే మనుషుల మనసులలో ఇది స్వార్థపు దయ్యాలు వస్తాయేమో? అవి రాకుండా అందరిని సమానంగా చూసుకొనే ధర్మ పాలనా చేస్తే చాలు అందరు చేసే సమాన పనికి సమాన కూలి ఇయ్యాలని మారయ్య పాత్ర ద్వార సమ సమాజ స్థాపనకు అంకురం వేసింది రచయిత్రి. అట్లాగే అన్ని కులాలకు పని దొరకాలే, ఆడ-మగలకు సమాన పనికి సమానంగా కూలి ఇయ్యాలి, అదే విదంగ చెప్పులు చేసి పానాలు రక్షించే నన్ను, సుదూలేసె వైద్యులను ఒక్కటిగ చూసే రోజు రావాలని కోరుకుంటాన్నా అని గొప్పగా పాత్ర ద్వార చెప్పింది రచయిత్రి.

ఇద్దరు మిత్రులు చెప్పుల దుకాణం కాడ అట్లా మాటలాడుకుంటుండగ మారయ్య పెద్ద కొడుకు కొండయ్య కొంత మందిని వేనుకెసుకొని సమసమాజ స్థాపన కావాలని, దళితులు వృద్ధిలోకి రావాలని,

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జైకొట్టుకుంటూ మందికి ముందే నడిచి వస్తు అయ్యా నువ్వు కూడ రా అంటాడు. అప్పుడు మారయ్య నేను ఈ ఇంత పని వదిలి వస్తే తినడానికి కూడుగూడ దొరకదు. మీరైతే పదండి అంటాడు. వాడు నా కొడుకు వాడు అందరి ఇండ్లల్ల తిరుగుతాడు, తింటాడు. కాని, వాడు ఇంకా ఏమాత్రం ఆర్థికంగా లేడు. పోరాటలంటు మంచి మంచి వారితో తిరిగినా వాడి బతుకు సక్క బడ్తలేదు. దళితులను మిగితా వారు వాడుకొనే తీరు, అలాగే వారు ఎంత చేసిన ఆర్థికంగా ఏ మాత్రం అభివ ృద్ధి లేదని మారయ్య అంటాడు. ఇక చిన్న కొడుకు కుమ్మరి పిల్ల గాండ్లతో చేరి ఆటో నడ్పుతాడు. వానికి గా పని తప్పితే ఇంకా ఏమి రాదు. ఇక పొతే పాత కాలమే నయము, ఇప్పుడు జనాలు ఎక్కువైన్రు. మంచితనం, మానవత్వం లేవు, స్వార్థము పెరిగి పాలకులు సహితము వయసు పిల్లలకి పనిని కల్పించి వారిలోని చురుకుతనానికి నైపుణ్యాన్ని కల్పించి దేశాభివృద్ధికి తోడ్పాటు చేసేవారు ఎవరు లేరని వాపోయాడు. దీనిని బట్టి నిరోద్యోగిత ఆనాడూ అలాగే ఉంది. అప్పటి నుండి నేటి దాక మానవ సామాజిక రీతిని, పాలకుల పాలనను రచయిత్రి చూపించింది.

అలాగా మాట్లాడు కుంటుండగా పంతులా నేను ఇంటికి పోవాలె. మా కూతురు ముగ్గురు బిడ్డల తల్లి. ఆమెకు మా అల్లుడు ఎదో చికాకుతో కొట్టి పంపాడు. నేను ఇంటికి వెళ్లాలి. మా అల్లుడు ఎక్కడ ఎ సమస్య జరిగిన నా బిడ్డనె కొడుతాడు. ఎందుకంటె సమాజంలో బలవంతుడి చేతిలో బలహీనుడు (దళితుడు) ఎప్పుడు, ఎల్లప్పుడు అనచబడుతున్నాడు. అలాగే అణచబడ్డ దళితునికంటే ఆడదే హీనం. కాబట్టి వాళ్ళు నా బిడ్డను కొట్టి చంపుతున్నారు. అంటే సమాజంలో అనచబడ్డది దళితుడే అయిన వనికంటే హినమైనది ఆడదే అని రచయిత్రి వివరించింది అంతే గాక ముఖ్యంగ స్త్రీలను, స్త్రీలతోపాటు దళితులను అభివ ృద్ధిచేయాల్సిన అవసరం ఉందని రచయిత్రి తెల్పుతుంది. దానికి మూలమైన ఈ సమస్యలకు కారణాలను కూకటివ్రేళ్ళతో పీకాలని కోరుకుంటుంది రచయిత్రి.

మారయ్య తన కూతురికి వెంకటలక్ష్మి అని పేరు పెట్టగ పెళ్లి తరువాత అల్లుడు ఆమెకు ఎలిజబెత్ అని పేరు మార్చాడు అంటే స్త్రీలకు తన పేరు మీద కూడ హక్కు లేదని రచయిత్రి చెప్పుట ద్వార తెలుస్తోంది మారయ్య తన కూతురు గురించి ఇలా అంటున్నాడు. మాతమ్మకు మొక్కే నా బిడ్డ ఇప్పుడు మేరికి మొక్కుతుంది. ఏందీ బిడ్డ అంటే దేవులే వచ్చిన నేను మారనునాన. దేవుడు అనే వాడు ఒక్కడే కాకపోతే వాళ్ళను వేరు వేరుగా చుసేటోళ్ళు బాగ కడుపు నిండ తిని పని లేక ఖాలిగా ఉన్నవాళ్లు మాత్రమే అంటారని కూతురు చెబుతుంది. అంటే రచయిత్రి మారయ్య కూతురు చేత దేవుడికి, మతం మత్తులో ఉన్నోడికి, మానవత్వం మరిచిన వాడికి కళ్ళు తెరిపిస్తుంది. ఇందులో ముఖ్యాంశం ఏంటంటే మాదిగల కులదైవం మాతంగి అని తెలుస్తోంది.

మారయ్య ఇంటికెళ్ళి నేలపై ఒళ్ళువాల్చుకొని జరిగిన అనుభవ తాలూకు వాటిని గుర్తు చేసుకోంటు ఈ సమస్యలన్నింటికీ ఎదో ఒక శక్తి అడ్డగిస్తుంది అని అది ఏంటని? దాన్ని ఎలా కూలదోయాలి? అని ఆలోచిస్తూనే మారయ్య తన మనవరాలిని (బిడ్డ బిడ్డని) పిల్చి ఇలా అంటాడు. అమ్మ! సమాజంలో మనుషులు కలవకుండా అడ్డంగ ఒక మందపాటి ఉక్కుగోడ కట్టాలనుకో. దాన్ని ఎలా కూలగొట్టాలే బిడ్డ! అంటాడు తాత. ఆ మాటకి తొమ్మిది చదివే తన మనవరాలు తాత దీనికి గోడ కింద బాగ వేడి పెడితేనే అది కరిగిపోతుంది. కాక పొతే తాతా ! మంట మములూగా పెట్టొద్దు అని అంటుంది. అంటే దాన్ని బట్టి మనం కూడ ఈ కుల, మత, వర్గ, లింగ భేదాలు అనే గోడను సమూలంగ కూల్చాలంటే చాల శ్రమ చేయల్సి ఉంటుందని మనవరాలి చేత రచయిత్రి తాతకు బోధ పడేలా చెప్పించింది.

అప్పుడె వర్షం పడుతుంటె అందరు కంకులు కాల్చుకొని తింటూ, చలిపోవడానికి ఒళ్ళు కాపుకుంటుండగా అక్కడే ఉన్న మారయ్య మాత్రం ఈ చలి పోవడానికే ఇంత వేడి కావాల్సివస్తే, ఈ దుర్మార్గపు

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 భావవీణ UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

(అసమాజాన్ని) అడ్డు గోడలను కాల్చి, కూల్చడానికి ఎంత వేడి పెట్టాలి అని మాదిగ మారయ్య తాత చేత (మనసులో) రచయిత్రి ఎం.ఎస్.కె. కృష్ణ జ్యోతి అనుకుని ఈ కథ సందర్భంలో చక్కగ చెప్పింది.

**ఉపయుక్త గ్రంథాలు:**


1. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా. నా. శాస్త్రి
2. నేను హిందువునెట్లయిత - ప్రొఫెసర్ కంచే ఐలయ్య
3. మాదిగల సంక్షిప్త చరిత్ర - తాల్లపల్లి మనోహర్
4. ప్రాచిన మాదిగ శాస్త్రజ్ఞలు - ఆచార్య - ఎన్. కనకరత్నం

BHAVAVEENA
Vol. 17, Issue. 1(1), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# చిత్తూరు జిల్లా కథా సాహిత్యం - పీడిత కులదోపిడి

**- యం. రాజేష్‌బాబు,** పరిశోధక విద్యార్థి, తెలుగు & అనువాద అధ్యయనశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

భారతీయ కులవ్యవస్థ అసమానత్వాన్ని ప్రబోధిస్తుంది. పై మెట్టువారు అధికార పక్షంగానూ, వారి క్రిందివారు బానిసలుగానూ జీవించాలని చిత్రీకరించింది. ఇలా ప్రతీ దశలోనూ అధికార పక్షంవారు వారి క్రింది వారిని దోచుకుంటూ దోపిడీలకు గురి చేస్తున్నారు. ఈ నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో అట్టడుగున జీవిస్తున్నవారు దళితులు. వీరు ఆధిపత్యకుల అధికారులకు, ఆధిపత్యాలకు, అవమానాలకూ, దాడులకూ, హత్యలకు, అత్యాచారాలకూ, అంటరానితనాలకు, దోపిడీలకూ గురవుతున్నారు. నేటి ఆధునిక సమాజంలో కూడా మారని దళితుల జీవితాలను చిత్తూరుజిల్లా రచయితలు సృజించారనే కథా సాహిత్యాన్ని పరిశోధిస్తే ముందుగా

పులికంటి కృష్ణారెడ్డి రచించిన 'కోటిగాడు స్వతంత్రుడు' కథలో రెండు అగ్రవర్ణాల, అగ్రకూలల చేతుల్లో ఆటబొమ్మగా మారలేక పల్లె ఒదిలి పట్నం పోయి అక్కడ జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించినందుకు ఆయా వృత్తుల నుండి తనను వెళ్ళ గొడుతుంటే మరో పని, మరో పని చేసుకుంటూ జీవిస్తున్నాడు కోటిగాడు. తప్పును తప్పు అని చెప్పినందుకు అందరి ముందు పిచ్చివాడిలా మిగిలిపోయిన ఒక పేద దళితుని జీవితం సమాజంలో ఎలాంటి పరిణామాలకు లోనుకావాల్సి వస్తుందో తెలియజేసిన కథ.

ఈ కథలో కోటిగాడు రిక్షా తొక్కుతూ జీవనం సాగిస్తుంటాడు. ప్రభుత్వ పథకం ప్రకారం రిక్షా కార్మికులు, కొత్త రిక్షా కొనుక్కోవడానికి మనిషికి ఐదు వందలరూపాయలు అప్పుగా మంజూరు చేసింది. ఆ డబ్బును తాము తీసుకోవడానికి మధ్యవర్తులకు రెండు వందలు ఇవ్వాల్సి వస్తుంది. దీనిని ప్రశ్నించినందుకు అగ్రకులస్తులు, మధ్యవర్తులు అన్న మాటలు "ఒరే కోటయ్యా" ఆ మాట కొస్తే ఈ అయిదొందల్లో పెద్దభాగం నీదేరా పిచ్చోడా నువ్విచ్చే బోడి యిన్నూరుకింక ఇరవై మంది మొగుళ్ళుండారు. తెలిసిందా? అంతేరా అంతే! పాపమని పాతకోకిస్తే ఇంటెనక్కుపోయి మూరేసకుణ్ణిందంట నీలాంటి ఒకామె అన్నట్లుంది నా యవ్వారం? తేరా తే!" అంటూ పేదల బలహీనతలపై వేటేసి కాజేసే మధ్యవర్తుల విషయంలో న్యాయన్యాయాలు ఏమయ్యాయని అంతర్లీనంగా ప్రశ్నించాడు రచయిత. ఆ బాధ దిగమింగలేక ఇచ్చిన డబ్బుతో సారా తాగి గాంధీ ముందు నిలబడి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టింది పేదదళిత వర్గాలకు కాదని మధ్యవర్తులకు, దోపిడీదారులకంటూ గాంధీని ప్రశ్నిస్తాడు కోటిగాడు. హోటల్లో పని చేశాడు. అన్నంలో సున్నం నీళ్ళు కలుపుతుంటే ప్రశ్నించినందుకు గెంటివేయపడ్డాడు. భవనాల నిర్మాణంలో పని చేశాడు. పదిమూటల ఇసుకకు ఒక సిమెంటు మూట కలుపుతున్నారని నిజం చెప్పినందుకు ఆరుమూటల ఇసుకకు ఒక మూట సిమెంటు కలుపుతున్నామని కాంట్రాక్టర్ చెప్పిన అపద్దాన్ని ఖండించినందుకు అక్కడ నుండి వెలివేయపడ్డాడు కోటిగాడు. లంచాలతో అన్యాయం అందలమెక్కుతూనే ఉంది. వాస్తవాలతో న్యాయం మరింత లోతుల్లోకి కూరుకుపోతూనే ఉంది అనే వాస్తవాలను కోటిగాడి పాత్ర ద్వారా రచయిత సమాజానికి అందించారు.

ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది విచ్చలవిడిగా అన్యాయం జేయటానికి, పేదల్ని దోచుకోవడానికి, తెల్లదొరల పెత్తనం పోయి నల్లదొరల పెత్తనం వచ్చి పేద దళితుల మీద అగ్రవర్ణాధిపత్యం చెలాయించటానికా ఈ స్వాతంత్ర్యం అనే ప్రశ్న కోటిగాడితో వేయిస్తాడు రచయిత తన మాట్లో గమనిస్తే "నువ్వే జెప్పు సావీ! ఇదేవన్నా బాగుండాదంటావా? అప్పు తీసిస్తానన్రి, కొత్త రిచ్చా కొనుక్కోవచ్చని ఆశ చూపెట్రి. నా బతుకు నాదిగా సొతంత్రంగా బతకదావనుకుంటి, ఇట్టిచ్చినట్లచ్చి

పెరుక్కుంటారా? నువ్వేగదా! సావీ! వాళ్ళకు స్వాతంత్రం యిచ్చింది! ఇందుకే నా సావీ సొతంత్రం యిచ్చింది! అని మహాత్మగాంధీని కోటి ప్రశ్నిస్తాడు. అంతేకాకుండా మహాత్మగాంధీ పుట్టినరోజున మాంసం, మద్యాపాన నిషేదాలు పేరుకు మాత్రంగానే నేటికీ సాగుతున్నాయి. గాంధీ విగ్రహాల వద్ద వెలసిన బెల్టుషాపులకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వాలను కూడా కోటి ప్రవర్తన ప్రశ్నిస్తుంది. నిజాయితీగా బతకటానికి ఈ దేశంలో స్వతంత్ర్యం లేదని కోటి పాత్ర ద్వారా సమాజానికి అందించారు రచయిత. ఈ కోవకు చెందిన మరో కథ...

మహేంద్ర రచించిన 'పాడి ఆవు' కథలో దళితుల కొరకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను కేవలం వారి పేర్లకు మాత్రమే అంకితమై, వాటి ప్రయోజనాలు మాత్రం అగ్రకులస్తులు పొందటం ఏంటని ప్రశ్నించిన ప్రభుత్వానికి బాధితుడితోనే తప్పుడు సాక్ష్యం చెప్పించి తాము తప్పించు కొని దళితులను దోచుకుంటున్న విధానాన్ని ఈ కథలో తెలియజేశారు రచయిత. ఈ కథలో నీలాసిన్న మునెప్ప దళితుడు ఇతన్ని అందరూ మునిగాడు అనే పిలుస్తారు. ఇతని కుటుంబాన్నంతా కూడా మునిగాడి కుటుంబం గానే పరిగణిస్తారు. ఇతని అసలు పేరు కూడా ఊర్లో ఎవరికీ తెలీదు. అంటే ఆధిపత్య భావజాల ప్రాబల్యంలో ఒక దళితుడు అత్యంత కనీస స్థాయి నుండి అత్యంత స్థాయి వరకు ప్రతీ మెట్టులోనూ అవమానాలకు, ఆధి పత్యాలకు దోపిడీలకు గురి అవుతున్నారనే వాస్తవం ఈ కథలో చోటు చేసుకుంది.

దళితులు తరతరాలుగా ఆధిపత్యాల ఉచ్చుల్లో చిక్కుకుపోయారు. బైటికి రావాలని ఉన్నా తమ పేదరికం కారణంగా రాలేకపోతున్నారు. తాతముత్తాతల కాలం నుండి పెత్తనానికి, ఆధిపత్యాలకి లొంగి పూటగడుపు కుంటున్నందుకు కృతజ్ఞతల కారణంగా కూడా వాటిని ప్రశ్నించ లేకపోతున్నారు. ఇత్యాది కారణాల వల్ల అగ్ర కులాధిపత్య భావజాలాన్ని గుర్తించలేక, గుర్తించినా ప్రశ్నించలేక, ప్రశ్నించినా, ఎదుర్కొలేక, ఎదుర్కొన్నా గెలవలేమన్న కారణాలు కూడా దళితులను ఈ సమాజం వెనక్కు నెడుతోంది. ఆధిపత్య ఉచ్చుల్ని మరింత గట్టిగా పెనవేసుకుపోతున్నది.

ఇవేకాక ప్రభుత్వం దళితుల కొరకు కల్పించే సదు పాయాలు, పథకాలు కూడా పేరుకు గణంగా ఉన్న, అందులోని లోపాలు మాత్రం వాటిని పొందిన వారికే తెలుస్తుంది. అందుకు ఉదాహరణగా చెప్పుకోవాల్సి వస్తే ప్రస్తుత కాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన 'స్వచ్ఛ భారత్' ఈ పేరుతో గ్రామగ్రామాల్లో కూడా మరుగుదొడ్లు కట్టించారు. ప్రజల ఆరోగ్యం కాపాడాలనే ఉద్దేశ్యం ఇందులో ప్రధానాంశం. అలాగే స్త్రీల గౌరవం కాపాడటం మరో ప్రధానాంశం ఈ పథకం కారణంగా దేశమంతా కూడా పరిశుభ్రంగా ఉంటుందని, అందుకు సామాన్యు లతో పాటు ప్రధానులు, అధికారులు కూడా పొరకపట్టి రోడ్లపైకి వచ్చారు. చాలా ప్రాచూర్యం పొందింది. అయితే మరుగుదొడ్లు కట్టారే కానీ వాటికి సరిపడే నీటిసౌకర్యాలు కల్పించలేకపోవటం కారణంగా ఆ మరుగుదొడ్లు నేడు పశువుల మేత వేసుకోవడానికి, పనికిరాని సామాన్లు వేసుకొని తాళం వేసుకోవడానికే పరిమితమయ్యాయి. ఇలాంటి పథకాలు చాలానే వచ్చాయి. భూమి లేని వారికి ట్రాక్టర్ కొనడానికి అప్పులివ్వడం సబ్సిడీలు ఇవ్వడం వాటిని పొందటం కోసం అప్పులు చేసుకోవడం, ట్రాక్టర్ వచ్చింది కనుక భూమి కొనాలనుకోవటం, భూమికొనటం కోసం ట్రాక్టర్ తాకట్టు పెట్టడం ఇలా చివరికి అతి సామాన్యున్ని మరింత అప్పుల్లో కూరుకుపోయేలా చేసే పథకాలు ప్రభుత్వం సృష్టించింది.

సరిగ్గా ఇలాంటి పథకం కారణంగానే తాను బతకటా నికే పనిలేక, పని చేసినా తగిన ప్రతిఫలనం అందక నానా అగచాట్లు పడుతున్న సీలా చిన్న మునెప్ప (మునిగాడు)కు ప్రభుత్వం ఒక పాడి ఆవును అది కూడా మంచి సీమావును ఇతని పేర ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ సీమావుకు ఎండ తగలకూడదు కనుక రేకులు, ఫ్యాను, గడ్డి సమయానికి అనుకూలంగా ఉండాలి అప్పుడు మాత్రమే ఆ ఆవు ఇంటినంతా పోషించగలదు. దాన్ని పోషించే శక్తి లేకపోవటంతో భయపడి ఆ ఆవును

ఆ ఊరి పినపెద్ద తీసుకున్నా మారుమాట మాట్లాడలేదు. వెనుతిరగలేదు, ఎదురు ప్రశ్నించలేదు. ఆ లోపాన్ని మునెప్ప మాటల్లోనే గమనిస్తే "సీమావంటే ఎట్టాంటిది? మామూలు నాటుగొడ్డు కాదు. దేవతా పసరం దాని కోసరమని పినపెద్ద మా ఊరి భజన గుడిని మించిపోయే టట్టుగా సిమెంటు రేకులు తెప్పించి మూడంకణాల కొట్టం వేయ్యించేనుండాడు. నా పూరి కొంపకు దాన్ని తోలుకబోతే దాన్ని ఇంట్లో కట్టేసి మేము సెట్టుకింద సంసారం పెట్టు కోవాల్సిందే. మా పల్లెలో అమాసకు పున్నవకూ కూడా ఒంటి మీద నీళ్ళు పోసుకోనోళ్ళు వుండారు. ఆ యావుకు తెల్లారిజాల పొద్దు ఎక్కకముందే పంపుసెట్టు కింద అరగంట అభిషేకం సెయించాల. మామూలు వరి కసువు నది మూసూడదు. దానికని మా పినపెద్ద మిట్టకయ్యల్లో సర్కారు గడ్డి ఏపించేసినాడు. దానికి మామూలు వరి తవుడు, సెనిగిపిండి సాలక ఏందేందో మూటకు మూటలుగా దెచ్చి దొంతులకింద పరిపించేసుండాడు. అటువంటి ఆవును దెచ్చి మా యింట్లో కట్టేసి మేపుకోమని చెప్పేదానికి ఆ మనిషికి నోరెట్టా ఆడిందో ఏవో ఆదేముడికే తెలియాలి" అని ఆ పథకం కు కావాల్సిన సౌకర్యాలేవీ కల్పించక కేవలం ఆవును మాత్రం తోలిస్తే దానిని మేపలేమనే ఉద్దేశ్యం ఇందులో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఇలాంటి పథకాల కారణంగా ఉన్న వాళ్ళు మరింత ఉన్నవాళ్ళుగా, లేనివాళ్ళు మరింత లేని వాళ్ళుగా తయారవుతారే కానీ అతిసామాన్యుడికి, ఆ పథకందారునికి న్యాయం జరగదని తెలియజేయటం ఒక ఎత్తు అయితే అగ్రకులాధిపత్యం సామాన్యుల అవకాశా లను అందిపుచ్చుకొని జీవిస్తున్నదే కాక అందులో వారికి భాగం ఇవ్వకపోగ తిరిగి వారిపైనే పెత్తనం చెలాయిస్తున్న విధానాన్ని వ్యతిరేకించటం మరో ఎత్తు. ఆ ఊరి పినపెద్ద మునెప్ప పేరు మీద వచ్చిన ఆవును అక్రమంగా తీసుకొని తనకే మీ ఇవ్వకుండా తానే జీవిస్తున్నాడని ప్రభుత్వం తెలుసుకొని ప్రశ్నించటానికి వస్తే ఆ అగ్రకులాధిపత్యం ఆ సామాన్యుని గొంతును నొక్కేసిన వైనాన్ని చిత్రించారు. ఈ వైనాన్ని మునెప్ప మాట్లో చూస్తే "నేనేం జెప్తాను సామీ నువ్వేం చెప్పమంటే ఆ మాటే జెప్తా నేనుగానీ, మా నాయనగానీ మా తాతగానీ నువ్వు కాల్తో సెప్పిన పని సేత్తో చేసుకొని పోయే వాళ్ళము నీ పేరు చెప్పుకొని గంజి తాగేవోళ్ళము నీ చెప్పులు మోసుకొని బతికే వోళ్ళము అంతేగానీ నీ మాట మీరేవోళ్ళముగాము అంటి ఆ మాటకు పినపెద్ద మునిగాడికి "ఒరే మునిగా! నీ సంగతి నాకు తెల్దా" అని వచ్చిన ఆఫీసర్ల కాడనే నెట్ల మసులు కోవాల్నో వాళ్ళతో ఏ పెహారంగా మాట్లాడాల్నో నాకు చిలక్కు చెప్పినట్లు జెప్పె అన్న మాటల్ని గమనిస్తే ఒక దళితున్ని గుర్తించలేని స్థితిలో నెట్టి వేయబడ్డారు. తను జరిగింది అన్యాయమని, నిజం చెప్తే తనకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వ ఉద్యోగులు ఎంత చెప్పినా వాటికి కావాల్సి సౌకర్యాలు, పెత్తందార్లకు భయపడి నిజం చెప్పకుండా పినపెద్దను కాపాడతాడు మునెప్ప. తాను తప్పు చేశానన్న ప్రాయశ్చిత్తంతో కుమిలిపోతాడు. ఈ విధంగా ఎవ్వరు ఏ తప్పు చేసినా వాటి పర్యవసానం చివరగా అనుభవించేది మాత్రం దళితుడేనన్న విషయాన్ని ఈ కథలో తెలియజేశారు రచయిత. ఇలాంటి మరో కథ...

కలువకొలను సదానంద రచించిన 'బంగారు పిడకలు' కథలో అగ్రకులాధిపత్యం బాధితకుల స్త్రీ యొక్క శ్రమను దోచుకోవటం ప్రధాన వస్తువు. ఈ కథలో బంగారక్క మంగపతి ఇంట్లో పాలేరుపని చేసుకుంటూ బతుకుతూ ఉంటుంది. ఎంత శ్రమ చేసినా ఆమెకు కడుపునిండా తిండి కూడా పెట్టరు. అంతేందుకు మంగపతి ఇంట్లో ఉండే పెంపుడు కుక్కకు ఇచ్చే విలువ కూడా బంగా రక్కకు లేదు. ఈమె కొడుకు ఓబులేసు ఇతని తండ్రి చనిపోవటంతో మంగపతి ఇంట్లో పని చేసి కొడుకు చదువు పూర్తి చేయిస్తుంది. చదువు పూర్తికాగానే ఆ ఊరి స్కూల్లోనే ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించాడు. కనుక తల్లిని ఆ ఇంట్లో పని మానేయమన్నాడు. అదేసంగతి ఆ ఇంట్లో చెబితే మంగపతి భార్య తనను మానేయనివ్వలేదు. దానికి తోడు ఓబులేసుకు మేనమామ కూతురితో వివాహం జరిగింది. అత్తాకోడళ్లకు సరిపోక పోవటం వల్ల ఆమె ఆ ఇంట్లో పని చేస్తూనే ఉంది. వారి

దుర్మార్గాన్ని కొడుకు కనుక్కున్నా లాభం లేకపోయింది. బంగారక్కకు జబ్బు చేసింది. వారం రోజులైనా ఆమెను ఆ ఇంట్లో వాళ్ళు పట్టించుకోలేదు. బాలేదని కొడుకుకు కబురు చేశారు. తల్లిని తీసుకెళ్ళి వైద్యం చేయించాడు. ఆమె ఆరోగ్యవంతురాలిగా తయారు కావటానికి తన కోడలు చేసిన సేవే కారణమని కోడలిపైన గౌరవంతో పాటు ప్రేమకూడా కలిగింది. కొడుకుకు తన అనారోగ్యం కారణంగా ఎంత ఖర్చు అయ్యిందో ఏమోనని కోడలిని అడగగానే అప్పు చేశాడని చెబుతుంది కోడలు. దానికి మంగపతి గొడ్ల చావిట్లో పిడకల గంపలో డుబ్బుదాచాను వెళ్ళి తీసుకో అని బంగారక్క చెప్పటంతో కోడలు వెళ్తుంది విషయం చెబుతుంది. అప్పటికే ఆ మంగపతి ఇంట్లో రైడ్ జరుగుతూ ఉంటుంది. ఈమె చెప్పిన విషయం విని ఎంత సోదా చేసినా ఏమి దొరక్క తిరిగి వెళ్తున్న పోలీసులు గొడ్ల చావిట్లో సోదా చేశారు. అక్కడ బంగారు, వెండి, ఆస్తిపత్రాలు దొరికి అంతా పోగొట్టు కుంటారు. ఈ విషయం తెలియక బంగారక్క పశువులను చూడటానికి వెళ్తుంది. అంతా నీవల్లే జరిగిందని అందరూ ఆమెను నానా మాటలు మాట్లాడతారు. బంగారక్క కొడుకు అమ్మ చేసిన పనికి మెచ్చుకుంటాడు. అమ్మకు మరో ఆవును తెచ్చి ఇస్తాడు. ఆ ఆవు పేడతో పిడకలు తయారు చేస్తుంది. ఆ మాలపల్లెలో బంగారక్క పిడకలను బంగారు పిడకలుగా భావిస్తారు. అన్నింటికన్నా బంగారక్క తన ఇంట్లో మహారాణిలా విలువైన వ్యక్తిగా గౌరవ మర్యాదలు అందుకుంటుంది.

ఈ విధంగా దళితులు తమ ఆధిపత్యాలను ఎదు రించకుండా నానా అగచాట్లు పడుతూ శ్రమించినా అందని ప్రతిఫలం కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. అగ్రకుల అహంకారం ఎలాంటిదో తమ ఆస్తులు పోగొట్టుకోవడానికి ఏ మాత్రం కారణం దళితులు కాకపోయినా వారిపైకే వెళ్ళి వారిని హింసించటం నేటికీ జరుగుతూనే ఉంది. రచయిత ఈ కథలో దళితులకు అవైర్‌నెస్ కల్పించక చేసిన తప్పుకు ప్రకృతే శిక్ష విధిస్తుందని ఈ కథలో తెలిపారు. బంగారక్క చెప్పటం, కోడలు వెళ్ళి వారికి చెప్పటం ఆ సమయానికే పోలీసులు రైడ్ చేయటం ఈ పర్యవసానాలన్నీ రచయిత ఉద్దేశాన్ని తెలియజేశాయి.

ఇలాంటి దుర్మార్గపు పరిస్థితుల్లో దళితులు, అవమానా లను, దాడులను, హత్యాకాండలను సహించి తలవంచు కొని బతకలేక మనిషితనం కోసం తలెత్తితే ఎదురయ్యే ధారుణమైన దాడుల్లో చావలేక, చావు బతుకుల పెనుగులాటలో కుళ్ళిపోతున్నది దళితుల జీవనం.

BHAVAVEENA
VOL. 17, ISSUE. 1(1), JANUARY - 2020.
ISSN NO. : 2456-4702 - RNI NO. APTEL/2003/12253
భావవీణ
UGC care - Journal -
Arts and Humanities Sl. No. : 35

# తెలంగాణ దళిత జనబాంధవుడు - భాగ్యరెడ్డి వర్మ

**డా. మఠపతి మాంతయ్య,** అసిస్టెంట్ ప్రొఫెసర్(తెలుగు),
డాక్టర్ బి.ఆర్.ఆర్. కళాశాల, జడ్చర్ల, తెలంగాణ.

## 1. ఉపోద్ఘాతం :-

తెలంగాణలో దళిత ఉద్యమానికి పునాది వేసిన మహా సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ (1888 మే 22 -- 1939 ఫిబ్రవరి 18). నిజాం పాలనలో అంటరానితనం, కుల వివక్ష, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన ఆయనను "తెలంగాణ దళిత ఉద్యమ వైతాళికుడు", "ఆది హిందూ ఉద్యమ పితామహుడు" అని పిలుస్తారు.

## 2. జననం, బాల్యం :-

భాగ్యరెడ్డి వర్మ అసలు పేరు మాదరి భాగయ్య.
1888 మే 22న హైదరాబాద్‌లో మాల కుటుంబంలో మాదరి వెంకయ్య--రంగమాంబ దంపతులకు జన్మించారు.
బాల్యం నుంచే కుల వివక్ష, అంటరానితనం వంటి సామాజిక దురాచారాలను సమీపంగా చూసి, వాటిపై పోరాడాలనే సంకల్పం బలపడింది.

## 3. దళితుల అభ్యున్నతి కి చేసిన కృషి :-

దళితుల అభ్యున్నతి కోసం భాగ్యరెడ్డి వర్మ (1888--1939) చేసిన సేవలు అనేక రంగాల్లో విస్తరించి ఉన్నాయి. ఆయన జీవితమంతా దళితుల విద్య, సామాజిక గౌరవం, ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేశారు

### 3.1. విద్యా రంగంలో :-

1910లో దళిత పిల్లల కోసం విద్యాబోధన ప్రారంభించారు.
హైదరాబాద్ సంస్థానంలో 26 నుంచి 40 వరకు దళిత పాఠశాలలను స్థాపించారు.
1906--1933 మధ్య కాలంలో 26 దళిత బాలికల పాఠశాలలు నడిపారు.
స్వంత వనరులతో దళితులకు ఉచిత విద్య అందించారు.

### 3.2. సంస్థల స్థాపన :-

జగన్ మిత్ర మండలి (1906) -- దళితుల సంఘటిత ఉద్యమానికి మొదటి సంస్థ.
మన్య సంఘం (1911) -- దళిత చైతన్యం కోసం.
ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ (1924) -- దళితుల సామాజిక సంస్కరణ కోసం.
ధర్మ ప్రచారిణి సభ, అహింస సమాజ్, జీవరక్ష జ్ఞాన ప్రచార మండలి, స్వస్తి దళ్, సంఘ సంస్కరణ నాటక మండలి, రాజా రామ్ మోహన్ రాయ్ లైబ్రరీ వంటి అనేక స్వచ్ఛంద సంస్థలు నడిపారు.

### 3.3. సామాజిక సంస్కరణలు :-

అంటరానితనానికి వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం.
దేవదాసి, జోగిని, బాసవి పద్ధతుల నిర్మూలన కోసం పోరాడి, నిజాం ప్రభుత్వం వాటిని నేరంగా ప్రకటించేలా చేశారు.
బాల్య వివాహాలు, మద్యపానం, జంతు బలులు, అంధవిశ్వాసాలకు వ్యతిరేకంగా ప్రచారం.
సహ పంక్తి భోజనాలు (అంతర్ కుల భోజనాలు) నిర్వహించి కుల వివక్షను ఛేదించారు.

### 3.4. ఆది హిందూ ఉద్యమం :-

1912లో హైదరాబాద్ సంస్థానంలో ఆది హిందూ ఉద్యమాన్ని ప్రారంభించారు.
దళితులే ఈ దేశాన్ని పాలించిన మూల నివాసులు, ఆది హిందువులు అని చాటి, ఆత్మగౌరవం పెంచారు.
1921లో మొదటి ఆది హిందూ సదస్సు హైదరాబాద్లో నిర్వహించారు.
బౌద్ధ జయంతి వేడుకలు (1913--1938) నిర్వహించి

దళితులలో ఐక్యత పెంచారు.

### 3.5. సాంస్కృతిక ఉద్యమాలు:-

హరికథ కార్యక్రమాలు, నాటకాలు ద్వారా దళిత చైతన్యం ప్రచారం.

పాత్రికేయుడిగా, రచయితగా దళిత సమస్యలపై రాశారు.

### 3.6. జాతీయ స్థాయి ప్రభావం:-

బాబా సాహెబ్ అంబేద్కర్తో కలసి ఉద్యమాల్లో పాల్గొన్నారు.

మహాత్మా గాంధీచే గౌరవింపబడ్డారు.

ఆర్య సమాజం వర్మ అనే బిరుదును ఇచ్చి గౌరవించింది.

తెలంగాణ దళిత జనబాంధవుడు భాగ్యరెడ్డి వర్మ దళిత స్త్రీల అభ్యున్నతి కోసం చేసిన సేవలు:- భాగ్యరెడ్డి వర్మ దళితులకు సంక్షేమానికి చేసిన సేవ

చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడ్డాయి. ఆయన దళిత స్త్రీల విద్య, గౌరవం, హక్కుల కోసం అనేక సంస్కరణలు చేపట్టారు.

### 4.1.దళిత బాలికల విద్య:-

పాఠశాలల స్థాపన

1906--1933 మధ్య కాలంలో 26 దళిత బాలికల పాఠశాలలను హైదరాబాద్ సంస్థానంలో స్థాపించారు.

1910 నుంచి దళిత వాడల్లో (ఇసామియా బజార్, బొగ్గులకుంట వంటి ప్రాంతాల్లో) తెలుగు మాధ్యమ పాఠశాలలు ప్రారంభించారు.

కాలక్రమేణా ఈ పాఠశాలల సంఖ్య 21 నుంచి 25 కేంద్రాల వరకు పెరిగి, 2000 నుంచి 2500 మంది విద్యార్థులు చదువుకునేలా చేశారు.

భాగ్య మెమోరియల్ గర్ల్స్ హై స్కూల్ (1913) -- ఎసామియా బజార్, కోటి, హైదరాబాద్లో స్థాపించిన ఈ పాఠశాల ఇప్పటికీ పనిచేస్తోంది.

విద్యపై ఆయన దృక్పథం

"దళిత స్త్రీల విద్యే సముదాయ అభ్యున్నతికి కీలకం" అని భావించి, అనేక పాఠశాలలను బాలికల విద్య కోసమే ప్రత్యేకంగా కేటాయించారు.

ఆనాటి నిజాం పాలనలో దళిత స్త్రీలకు విద్య అందని పరిస్థితిలో, ఉచిత విద్య అందించి వేలాది మంది దళిత బాలికలను చదువుకునేలా చేశారు.

జోగిని, దేవదాసి పద్ధతుల నిర్మూలన

పోరాటం

జోగిని, దేవదాసి, బాసవి పద్ధతుల నిర్మూలన కోసం అలుపెరుగని పోరాటం చేశారు.

ఈ పద్ధతుల వల్ల దళిత స్త్రీలు లైంగిక దోపిడీకి, సామాజిక అవమానానికి గురవుతున్నారని గుర్తించి, వాటి నిర్మూలన కోసం ప్రచారం చేశారు.

ఆయన ప్రయత్నాల ఫలితంగా నిజాం ప్రభుత్వం జోగిని, దేవదాసి పద్ధతులను నేరంగా ప్రకటించింది.

ప్రభావం

వేలాది మంది దళిత యువతులు ఈ దురాచారాల నుంచి విముక్తి పొందారు.

దళిత స్త్రీలకు సామాజిక గౌరవం, మానవ హక్కులు లభించాయి.

సామాజిక సంస్కరణలు

### 4.2.దురాచారాల నిర్మూలన:-

బాల్య వివాహాలు నిషేధించడానికి ప్రచారం చేశారు.

మద్యపానం వ్యతిరేక ఉద్యమం (వఎజూవతీఖఅషివ ఎశీజవఎవత్) నడిపారు.

అంధవిశ్వాసాలు, జంతు బలులు వంటి దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడారు.

సహ పంక్తి భోజనాలు

అంతర్ కుల సహ పంక్తి భోజనాలు నిర్వహించి, దళిత స్త్రీలు ఇతర కులాల వారితో కలిసి భోజనం చేసే హక్కు సాధించారు.

ఇది దళిత స్త్రీల సామాజిక గౌరవానికి, సమానత్వానికి ప్రతీక.

### 4.3.మహిళా సంఘాలు:-

ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ (1924) ద్వారా దళిత

స్త్రీల సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారు.

లేడీ హైదరి క్లబ్, ఆంధ్ర యువతి మండలి, సోదరి సొసైటీ, ఆంధ్ర మహిళా సభ వంటి మహిళా సంఘాలతో కలసి పనిచేశారు.

ఈ సంస్థలు దళిత స్త్రీల చైతన్యం, విద్య, హక్కుల కోసం కృషి చేశాయి

## 5.ముగింపు:-

తెలంగాణ దళిత జనబాంధవుడు భాగ్యరెడ్డి వర్మ (1888––1939) జీవితం దళితుల అభ్యున్నతి కోసం అంకితమైన ఆదర్శ గాథ. అంటరాని కుటుంబంలో జన్మించి, స్వయంకృషితో చదువుకుని, సమాజంలోని అన్యాయాలను ఎదిరించి, దళితుల కోసం విద్య, సామాజిక గౌరవం, ఆర్థిక స్వావలంబన సాధించడానికి కృషి చేశారు.

ఆయన స్థాపించిన జగన్ మిత్ర మండలి, ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ వంటి సంస్థలు, 40 దళిత పాఠశాలలు, అంటరానితనం, జోగిని పద్ధతి వ్యతిరేక పోరాటాలు తెలంగాణ దళిత చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడ్డాయి. బాబా సాహెబ్ అంబేద్కర్, మహాత్మా గాంధీ వంటి జాతీయ నాయకులచే గౌరవింపబడిన భాగ్యరెడ్డి వర్మ, తెలంగాణ దళితోద్యమానికి మార్గదర్శిగా నిలిచారు.

"దళిత వైతాళికుడు", "దళిత జనబాంధవుడు", "తెలంగాణ దళితోద్యమ పితామహుడు" అనే బిరుదులతో చరిత్రలో నిలిచిపోయిన భాగ్యరెడ్డి వర్మ జయంతి మే 22ను తెలంగాణలో దళిత చైతన్య దినంగా పాటిస్తూ, ఆయన ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకువెళ్తోంది.

"సమాజంలో అణగద్రొక్కబడిన వారికి విద్య, గౌరవం, స్వాభిమానం ఇవ్వడమే నిజమైన సేవ" --- ఈ సూక్తి భాగ్యరెడ్డి వర్మ జీవిత తత్వాన్ని ప్రతిబింబిస్తుంది.

## ఆధార గ్రంథాలు:-

1.భాగ్యోదయం... ఎం.బి. గౌతమ్ (భాగ్యరెడ్డి వర్మ కుమారుడు)

2.ఆధ్యుడు–ఆరాధ్యుడు: భాగ్యరెడ్డి వర్మ........ యగటి చిన్నారావు

3.దళిత స్ట్రగిల్ ఫర్ ఐడెంటిటీ: ఆంధ్రా అండ్ హైదరాబాద్–1900–1940......యగటి చిన్నారావు

4.డాల్ మూవ్‌మెంట్ ఇన్ ఇండియా అండ్ ఇట్స్ లీడర్స్ (1857–1956)........ ఆర్.కె. క్షీర్‌సాగర్

5.ఎమర్జెన్స్ ఆఫ్ దళిత మూవ్‌మెంట్స్ ఇన్ ఆంధ్రా అండ్ డా. బి.ఆర్. అంబేద్కర్స్ ఇన్‌ఫ్లుయెన్స్.......... కె. గంగయ్య

6. భాగ్యరెడ్డి వర్మ తెలుగు వికీపీడియా

7. తెలుగు వికీపీడియా

★★★

భావవీణ

BHAVA VEENA

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

Journal of Literary, Culture & Language Study

సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

January (1) 2020


























































Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002.
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.